www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 25-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 | సంచిక (Issue) : 297 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, హేమంతఋతువు, పుష్యమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి రా. 8.32 తదుపరి ద్వాదశి; నక్షత్రం: అనూరాధ ఉ. 7.08 తదుపరి జ్యేష్ఠ; వర్జ్యం: మ.1.02-2.43; దుర్ముహూర్తం: ఉ.6.52-8.21; అమృతఘడియలు: రా.11.09-12.50; రాహుకాలం: ఉ.9.00-10.30; సూర్యోదయం: 6.52; సూర్యాస్తమయం: 6.02 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

చెపాక్‌లోనూ చెక్ పెట్టాలని..

ఆత్మవిశ్వాసంతో టీమిండియా
నేడు ఇంగ్లండ్‌తో రెండో టీ20

రాత్రి 7 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..



హార్దిక్

చెన్నై: ఐదు టీ20ల సిరీస్‌కు అదిరే ఆరంభాన్నిచ్చిన భారత జట్టు ఇప్పుడు మరో విజయంపై దృష్టి సారించింది. చెన్నై వేదికగా శనివారం ఇంగ్లండ్‌తో రెండో టీ20 ఆడనుంది. ముందుగా బౌలింగ్.. ఆ తర్వాత బ్యాటింగ్‌లోనూ చెలరేగిన భారత్ పర్యాటక ఇంగ్లండ్‌ను తొలి మ్యాచ్‌లో బెంబేలెత్తించింది. కెప్టెన్ జోస్ బట్లర్ మినహా మరెవరూ భారత బౌలర్లను దీటుగా ఆడలేకపోవడంతో 132 పరుగులకే పరిమితం కావాల్సి వచ్చింది. సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో ఉన్న భారత్ అదే జోరును చెపాక్‌లోనూ చూపాలనుకుంటోంది. మరోవైపు సిరీస్‌ను సమం చేసేందుకు బట్లర్ సేన సమాయత్తమవుతోంది. అందుకు వారి బ్యాటర్లు స్థాయికి తగ్గట్టు రాణించాల్సి ఉంది. స్థానిక మైదానంలో కేవలం రెండు అంతర్జాతీయ టీ20 మ్యాచ్‌లు జరగ్గా వాటిల్లోనూ చివరి బంతికే ఫలితాలు తేలడం విశేషం.

అభిషేక్ అనుమానమే: శుక్రవారంనాటి నెట్ ప్రాక్టీస్‌లో ఓపెనర్ అభిషేక్ శర్మ కుడి చీలమండ బెణకడంతో తీవ్రంగా ఇబ్బందిపడ్డాడు. నొప్పితో బయటికి వెళ్లిన అభిషేక్ మళ్లీ ప్రాక్టీస్‌కు రాలేదు. ఒకవేళ అభిషేక్ ఆడకపోతే సంజూకు తోడుగా తిలక్‌వర్మ లేదా ధ్రువ్ జురెల్ దిగే అవకాశముంది.



అభిషేక్

షమి పరిస్థితేంటి?: తొలి టీ20లో షమి కచ్చితంగా ఆడతాడని భావించినా అలా జరగలేదు. పిచ్ స్పిన్‌కు అనుకూలించనుందని షమిని పక్కనబెట్టారన్న కథనాలు వినిపించాయి. మరోవైపు టీమ్ మేనేజ్‌మెంట్ అతడి ఫిట్‌నెస్‌ను మరింత క్షుణ్ణంగా పరిశీలించాలనుకుని తొలి టీ20కి దూరంగా ఉంచిందని చెబుతున్నారు. అయితే చాంపియన్స్ ట్రోఫీని దృష్టిలో ఉంచుకుని షమి మ్యాచ్ ఫిట్‌నెస్‌ను వీలైనంత త్వరగా పరీక్షించాల్సిన అవసరముంది. ఈనేపథ్యంలో చెపాక్‌లో అతడిని ఆడించే అవకాశాల్లేకపోలేదు. అయితే తొలి మ్యాచ్‌లో షమి లేకున్నా మరో పేసర్ అర్ష్‌దీప్, స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి ఇంగ్లండ్‌ను దెబ్బతీశారు. బ్యాటింగ్‌లో అభిషేక్-శాంసన్ మెరుపు ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. షమి తుది జట్టులో ఉంటే నితీశ్ బెంచీకే పరిమితమవుతాడు. బ్యాటింగ్ బలంగా ఉండాలని భావిస్తే స్పిన్నర్ బిష్ణోయ్‌ను తప్పిస్తారు.

అట్కిన్సన్‌పై వేటు: భారత్‌తో రెండో టీ20కి ఇంగ్లండ్ 12 మంది ఆటగాళ్లను ప్రకటించింది. అట్కిన్సన్ స్థానంలో బ్రైడన్ కార్స్‌ను తీసుకున్నారు. అలాగే బేథెల్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. బేథెల్ ఆడకపోతే జేమీ స్మిత్ టీ20ల్లో అరంగేట్రం చేయగలడు. పేసర్లు ఆర్చర్, ఉడ్, కార్స్ ఈసారి భారత్‌ను ఇబ్బందిపెట్టాలనుకుంటున్నారు.

జట్లు

భారత్ (అంచనా): అభిషేక్/జురెల్, శాంసన్, తిలక్ వర్మ, సూర్యకుమార్ (కెప్టెన్), హార్దిక్, రింకూ సింగ్, అక్షర్, నితీశ్, అర్ష్‌దీప్, బిష్ణోయ్/షమి, వరుణ్ చక్రవర్తి.

ఇంగ్లండ్(తుది జట్టు): డకెట్, సాల్ట్, బట్లర్ (కెప్టెన్), బ్రూక్, లివింగ్‌స్టోన్, బెథెల్/స్మిత్, ఒవెర్టన్, కార్స్, ఆర్చర్, రషీద్, ఉడ్.

పిచ్..గతేడాది ఐపీఎల్‌లో ఈ వేదికపై తొలి ఇన్నింగ్స్ సగటు స్కోరు 170. జరిగిన 9 మ్యాచ్‌ల్లో ఆరు సార్లు ఛేజింగ్ జట్లే నెగ్గాయి. ఇక్కడ మంచు ప్రభావం ఎక్కువే కాబట్టి టాస్ గెలిచిన జట్టు ఫీల్డింగ్ వైపు మొగ్గు చూపవచ్చు. అయితే 2024 లీగ్‌లో స్పిన్ కన్నా పేసర్లు ఎక్కువగా లాభపడడంతో రెండు జట్లు దీనికి తగ్గట్టుగానే బరిలోకి దిగే అవకాశం ఉంది.



వీరూ జోడీ విడిపోనుందా?

న్యూఢిల్లీ: టీమిండియా మాజీ డాషింగ్ ఓపెనర్ వీరేంద్ర సెహ్వాగ్ దంపతులు విడిపోనున్నారట. త్వరలో విడాకులు తీసుకోనున్నట్టు ఇరువురి సన్నిహిత వర్గాలు వెల్లడించాయి. ఈ దంపతులు ఇప్పటికే వేర్వేరుగా నివసిస్తున్నట్టు సమాచారం. 2004లో సెహ్వాగ్-ఆర్తికి వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు ఆర్యవీర్, వేదాంత్ ఉన్నారు. గత దీపావళి వేడుకలకు సంబంధించిన ఫొటోలను సెహ్వాగ్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. అందులో వీరూ, అతడి తల్లి, ఇద్దరు కుమారులే ఉండడంతో..సెహ్వాగ్ దంపతులు విడిపోనున్నారన్న వార్తలొచ్చాయి.. దానికితోడు వీరూ, ఆర్తి ఇన్‌స్టాలో పరస్పరం అన్‌ఫాలో చేసుకోవడం..ఆ వార్తలకు బలం చేకూర్చింది.

ఐసీసీ టెస్ట్ డ్రీమ్ టీమ్‌లో.. బుమ్రా, జడేజా, జైస్వాల్

దుబాయ్: ఐసీసీ టెస్ట్ టీమ్ ఆఫ్ ద ఇయర్-2024లో ముగ్గురు భారత ఆటగాళ్లు బుమ్రా, జడేజా, యశస్వీ జైస్వాల్‌కు చోటు దక్కింది. ఆస్ట్రేలియా నుంచి కెప్టెన్‌గా కమిన్స్ ఒక్కడినే ఎంపిక చేయగా.. ఇంగ్లండ్ నుంచి నలుగురు, న్యూజిలాండ్ నుంచి ఇద్దరు, శ్రీలంక నుంచి ఒక్కరికి ఈ డ్రీమ్ టీమ్‌లో స్థానం లభించింది.

వన్డేల్లో మంధాన, దీప్తికి..: మహిళల వన్డే టీమ్ ఆఫ్ ద ఇయర్- 2024లో భారత ప్లేయర్లు స్మృతి మంధాన, దీప్తి శర్మలకు చోటు లభించింది. దక్షిణాఫ్రికా క్రీడాకారిణి లారా వోల్వార్ట్‌ను సారథిగా ఎంపిక చేశారు. ఇక పురుషుల వన్డే టీమ్ ఆఫ్ ద ఇయర్ ఎంపిక అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. ఈ డ్రీమ్ టీమ్‌లో భారత్, ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా జట్ల నుంచి ఒక్కరికి కూడా చోటు దక్కకపోవడం గమనార్హం. కానీ, ఉపఖండ జట్లు పాకిస్థాన్, శ్రీలంక, అఫ్ఘానిస్థాన్ ఆటగాళ్లే 10 స్థానాలు దక్కించుకోవడం విశేషం.

ఖేలో ఇండియా గేమ్స్‌లో నయనకు స్వర్ణం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): ఖేలో ఇండియా శీతాకాల క్రీడల్లో హైదరాబాద్ స్కేటర్ తాళ్ళూరి నయన శ్రీ పసిడి పతకంతో మెరిసింది. శుక్రవారం లద్దాఖ్‌లో జరిగిన ఈ పోటీల్లో 15 ఏళ్ల నయన స్పీడ్ స్కేటింగ్ 500 మీటర్ల విభాగంలో 1 నిమిషం 1.35 సెకన్లలో రేసును పూర్తి చేసి అగ్రస్థానంలో నిలిచింది.



అయ్యో.. జొకో

- తిరగబెట్టిన గాయం
- సెమీస్‌నుంచి అర్ధంతర నిష్క్రమణ
- ఫైనల్లో జ్వెరేవ్
- సిన్నర్‌తో అమీతుమీ

ఆస్ట్రేలియన్ ఓపెన్

ఎన్నాళ్లనుంచో ఊరిస్తున్న 25 గ్రాండ్‌స్లామ్‌ల అరుదైన రికార్డుకు చేరువయ్యాడు. మరో రెండు మ్యాచ్‌లు గెలిస్తే చరిత్ర సృష్టిస్తాడు. ఈసారి టోర్నమెంట్లో అద్భుతంగా ఆడాడు. ఈ క్రమంలో కొన్ని నాలుగు సెట్ల పోరాటాలూ చేశాడు. టైటిల్ హాట్ ఫేవరెట్, యువ సంచలనం కార్లోస్ అల్కారజ్‌ను చిత్తు చేయడంతో అతడిపై అంచనాలు రెట్టింపయ్యాయి. కానీ గాయం దెబ్బ కొట్టింది. సెమీఫైనల్ మధ్యలో వైదొలగాల్సిన పరిస్థితి కల్పించింది. దాంతో దిగ్గజ ఆటగాడు నొవాక్ జొకోవిచ్ టెన్నిస్‌లో అరుదైన అధ్యాయాన్ని తన పేరిట లిఖించుకొనే అవకాశం కోసం మరికొంత సమయం వేచి చూడక తప్పదు.

మెల్‌బోర్న్: అల్కారజ్‌తో క్వార్టర్‌ఫైనల్లో అయిన గాయం జొకోవిచ్‌కు చేటు చేసింది. ఆ గాయం వల్లే క్వార్టర్స్ తర్వాత జొకో ప్రాక్టీస్ చేయలేదు. దాంతో అతడు సెమీఫైనల్ ఆడతాడా..లేదా..అనే అనుమానాలూ రేకెత్తాయి. చివరకు అదే నిజమైంది. రెండో సీడ్ అలెగ్జాండర్ జ్వెరేవ్ (జర్మనీ)తో శుక్రవారం జరిగిన ఆస్ట్రేలియన్ ఓపెన్ సెమీస్‌లో 6-7 (7)తో తొలి సెట్ కోల్పోయిన దశలో ఎడమ కాలి గాయంతో ఏడో సీడ్ జొకోవిచ్ మ్యాచ్ నుంచి వైదొలిగాడు. దాంతో ఫైనల్‌కు చేరిన జ్వెరేవ్ డిఫెండింగ్ చాంపియన్ జానిక్ సిన్నర్‌తో టైటిల్ పోరుకు సిద్ధమయ్యాడు. మరో సెమీఫైనల్లో టాప్ సీడ్ సిన్నర్ (ఇటలీ) 7-6 (2), 6-2, 6-2తో 21వ సీడ్ బెన్ షెల్టన్ (అమెరికా)పై గెలుపొందాడు.



సిన్నర్



జ్వెరేవ్

గాయం తీవ్రమై..

అల్కారజ్‌తో మంగళవారం జరిగిన నాలుగు సెట్ల క్వార్టర్‌ఫైనల్ సందర్భంగా 37 ఏళ్ల జొకో ఎడమ కాలికి గాయమైంది. తొలి సెట్ అనంతరం మెడికల్ టైమౌట్ తీసుకున్న నొవాక్ కాలికి పట్టీ వేసుకొని ఆటలో కొనసాగాడు. రెండో సెట్లో నొప్పితో బాగా ఇబ్బందిపడ్డాడు. ఇక.. జ్వెరేవ్‌తో సెమీస్ తొలి సెట్ 81 నిమిషాలపాటు పోటాపోటీగా సాగింది. ఫలితంగా సెట్ టైబ్రేకర్‌కు దారితీయగా.. అందులోనూ జొకో, జ్వెరేవ్ ఒక్కో పాయింట్ కోసం తీవ్రంగా పోరాడారు. ఎట్టకేలకు జ్వెరేవ్ సెట్‌ను దక్కించుకున్నాడు. ఈ సమయంలో నొప్పి భరించలేని స్థాయికి చేరడంతో మ్యాచ్ నుంచి విరమించుకుంటున్నట్టు రెఫరీకి జొకో తెలిపాడు. సెమీఫైనల్ నుంచి వైదొలగకుంటే కెరీర్‌లో 100వ టైటిల్‌ను ఈ గ్రాండ్‌స్లామ్‌లోనే సాధించే అవకాశం ఉండేది. టెన్నిస్ చరిత్రలో ఇప్పటి వరకు రోజర్ ఫెడరర్ (102) మాత్రమే సెంచరీ టైటిళ్ల ఫీట్ సాధించాడు.

సిన్నర్..తడబాటుకు లోనై..: రెండో సెమీఫైనల్లో సిన్నర్‌కు తొలిసెట్‌లో షెల్టన్ గట్టి పోటీ ఇచ్చాడు. 6-5తో షెల్టన్ సెట్ పాయింట్‌పై నిలిచిన వేళ..ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసిన సిన్నర్ సెట్‌ను టైబ్రేక్‌కు మళ్లించాడు. ఆ సెట్‌ను నెగ్గిన జానిక్ తదుపరి రెండు సెట్లను ఏకపక్షం చేసి మ్యాచ్ గెలుపొందాడు.

నేడు మహిళల ఫైనల్
సబలెంక × కీస్
(మ.2 గం.నుంచి)
సోనీ నెట్‌వర్క్‌లో..



హైదరాబాద్ 565
హిమాచల్ 33/1

హైదరాబాద్: బ్యాటర్లు రాణించడంతో.. గ్రూప్-బిలో హిమాచల్‌తో రంజీ మ్యాచ్‌లో హైదరాబాద్ భారీ స్కోరు చేసింది. ఆటకు రెండో రోజైన శుక్రవారం ఓవర్‌నైట్ స్కోరు 291/2తో తొలి ఇన్నింగ్స్‌ను కొనసాగించిన హైదరాబాద్ 565 పరుగులకు ఆలౌటైంది. తన్మయ్ అగర్వాల్ (177), హిమతేజ (76), నిషాంత్ (71) రాణించారు. ఆకాష్ 4 వికెట్లు పడగొట్టాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ బరిలోకి దిగిన హిమాచల్ 33/1 స్కోరు చేసింది. శుభమ్ అరోరా (21), అంకిత్ (5) క్రీజులో ఉన్నారు.

జడ్డూ హిట్.. రోహిత్ ఫ్లాప్



జడేజా (12 వికెట్లు)

పంత్, జైస్వాల్ కూడా విఫలం ● రంజీ ట్రోఫీ

ముంబై: రంజీల్లో బరిలోకి దిగిన టీమిండియా స్టార్ ప్లేయర్లలో జడేజా ఒక్కడే అంచనాలను అందుకొన్నాడు. రెండు ఇన్నింగ్స్‌లో కలిపి జడ్డూ (5/66, 7/38) మొత్తం 12 వికెట్లు పడగొట్టి సౌరాష్ట్ర విజయంలో కీలకపాత్ర పోషించాడు. ఢిల్లీతో మ్యాచ్‌లో సౌరాష్ట్ర 10 వికెట్లతో విజయం సాధించింది. పంత్ (17)ను జడ్డూ అవుట్ చేశాడు. కాగా రోహిత్‌శర్మ మళ్లీ విఫలమయ్యాడు. రెండో ఇన్నింగ్స్‌లో హిట్‌మ్యాన్ 35 బంతుల్లో 28 పరుగులతో మెరుగ్గానే ఆరంభించాడు. గాడిలో పడుతున్నాడనుకొనేలోపే క్యాచవుటయ్యాడు. దీంతో ముంబై రెండోరోజు ఆట ఆఖరికి రెండో ఇన్నింగ్స్‌లో 274/7 స్కోరు చేసింది. జైస్వాల్ (26), శ్రేయాస్ అయ్యర్ (17) కూడా భారీ స్కోర్లు చేయలేక పోయారు. శార్దూల్ ఠాకూర్ (113 బ్యాటింగ్) అజేయ శతకంతో క్రీజులో ఉన్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో ముంబై 120, జమ్మూ కశ్మీర్ 206 పరుగులు చేశాయి.

బిజినెస్



ప్రపంచంలోనే అతిపెద్ద డేటా సెంటర్!

3 గిగావాట్ల సామర్థ్యం.. రూ.2.58 లక్షల కోట్ల పెట్టుబడులు
గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో ఏర్పాటుకు రిలయన్స్ ప్రణాళిక

న్యూఢిల్లీ: భారత కుబేరుడు ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ (ఆర్ఐఎల్) మరో ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టేందుకు సిద్ధమవుతున్నట్లు తెలిసింది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో కృత్రిమ మేధ (ఏఐ) సామర్థ్యాలతో కూడిన మెగా డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు బ్లూంబర్గ్ కథనం పేర్కొంది. ప్రస్తుతం దేశంలోని డేటా సెంటర్ల మొత్తం సామర్థ్యం ఒక గిగావాట్ లోపే. రిలయన్స్ ఏకంగా 3 గిగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేయనున్నట్లు సమాచారం. ఈ ప్రాజెక్టు వ్యయం 2,000-3,000 కోట్ల డాలర్ల (రూ.1.72-2.58 లక్షల కోట్లు) స్థాయిలో ఉండవచ్చని అంచనా. అంతే కాదు, సామర్థ్యం పరంగా, ప్రపంచంలో ఇదే అతిపెద్ద డేటా సెంటర్ కానుంది. జామ్‌నగర్‌లో రిలయన్స్‌కు చెందిన ఆయిల్ రిఫైనరీ ప్రాజెక్టు ప్రపంచంలోనే అతిపెద్దది. త్వరలో ప్రాంతం మరో భారీ కేంద్రానికి వేదిక కాబోతోందన్నమాట.

ఎన్‌విడియా భాగస్వామ్యంతో ఏర్పాటు

రిలయన్స్ ఏర్పాటు చేయబోయే భారీ డేటా సెంటర్‌కు అమెరికన్ టెక్ దిగ్గజం ఎన్‌విడియా తన అత్యాధునిక బ్లాక్‌వెల్ ఏఐ చిప్‌లను సమకూర్చనుంది. ఇందుకోసం ఎన్‌విడియాతో ఆర్ఐఎల్ గత ఏడాది అక్టోబరులోనే ఒప్పందం కుదుర్చుకుంది.

బంగారం @ రూ.83,000

సరికొత్త రికార్డు స్థాయికి ధర.. వరుసగా 8వ రోజూ పైపైకి..

న్యూఢిల్లీ: పసిడి వరుసగా ఎనిమిదో రోజూ ఎగబాకి సరికొత్త జీవితకాల రికార్డు గరిష్ఠానికి చేరుకుంది. ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం..ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర శుక్రవారం రూ.200 పెరిగి రూ.83,100కు చేరింది. బంగారం రూ.83,000 దాటడం ఇదే తొలిసారి. 99.5 స్వచ్ఛత లోహం రేటు కూడా రూ.200 పెరుగుదలతో రూ.82,700కు ఎగబాకింది. వెండి సైతం కిలో రూ.500 పెరుగుదలతో రూ.94,000 ధర పలికింది. కాగా, ముంబై స్పాట్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం రూ.80,348, 99.5 శాతం ప్యూర్ గోల్డ్ రేటు రూ.80,026కు చేరింది. కిలో వెండి రూ.91,211గా నమోదైంది. హైదరాబాద్ మార్కెట్ విషయానికొస్తే, 24 క్యారెట్ల గోల్డ్ రూ.82,420కి, 22 క్యారెట్ల రేటు రూ.75,550కి పెరగగా.. కిలో వెండి రూ.1.05 లక్షలకు ఎగబాకింది.



అంతర్జాతీయ అనిశ్చితులే కారణం..

అమెరికా కొత్త అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు, వాణిజ్య విధానాల కారణంగా అంతర్జాతీయ మార్కెట్లో అనిశ్చితి పెరిగింది. ఇలాంటి అనిశ్చిత పరిస్థితుల్లో భద్రమైన పెట్టుబడి సాధనంగా పేరున్న పసిడికి మళ్లీ డిమాండ్ పెరిగిందని బులియన్ విశ్లేషకులు వెల్లడించారు. దాంతో దేశీయంగానూ ఈ విలువైన లోహం ధరలు కొండెక్కుతున్నాయని వారన్నారు. అంతర్జాతీయ కమోడిటీ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) పసిడి రేటు ఒక దశలో 15.50 డాలర్లు (0.56 శాతం) పెరిగి 2,780.50 డాలర్లకు చేరింది. వెండి సైతం 1.53 శాతం ఎగబాకి 31.32 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఈ ఏడాదిలో 3,000 డాలర్లకు ఔన్స్ గోల్డ్!

ప్రామాణిక వడ్డీ రేట్లపై అమెరికా సెంట్రల్ బ్యాంకైన ఫెడరల్ రిజర్వ్ నిర్ణయంతో పాటు వచ్చే నెల 1న కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టనున్న బడ్జెట్ నిర్ణయాలు పసిడి ధరల భవిష్యత్ గమనాన్ని నిర్దేశించనున్నాయని ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ, కరెన్సీ విభాగ రీసెర్చ్ అనలిస్ట్ జతిన్ త్రివేది అన్నారు. అంతర్జాతీయ మార్కెట్లో వాణిజ్యపరమైన అనిశ్చితులు కొనసాగితే ఈ ఏడాదిలోనే ఔన్స్ గోల్డ్ 3,000 డాలర్ల స్థాయికి చేరుకోవచ్చని బులియన్ వర్గాలు అభిప్రాయపడ్డాయి.

ఆర్థిక శాఖలో హల్వా వేడుక

న్యూఢిల్లీ: కేంద్ర బడ్జెట్ 2025-26 రూపకల్పన తుది దశకు చేరుకుంది. ఈ సందర్భంగా ఆర్థిక శాఖ కార్యాలయం (నార్త్ బ్లాక్)లో బడ్జెట్ కాపీలను ముద్రించే బేస్‌మెంట్‌లో శుక్రవారం హల్వా వేడుక జరిగింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, సహాయ మంత్రి పంకజ్ చౌదరి, ఆర్థిక కార్యదర్శి తుహిన్ కాంత పాండే, ఆర్థిక వ్యవహారాల కార్యదర్శి అజయ్ సేథ్‌తో పాటు ఇతర ఉన్నతాధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ఫామ్‌గేట్ ధర	వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్		
హైదరాబాద్	120	విజయవాడ	136
వరంగల్	120	గుంటూరు	127
కరీంనగర్	120	ఒంగోలు	127
మహబూబ్‌నగర్	120	చిత్తూరు	112
కర్నూలు	120	నెల్లూరు	117
విశాఖపట్నం	127	అనంతపురం	117
గోదావరి	136		



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	82,420 ▲	75,550 ▲	1,05,000 ▲
విజయవాడ	83,000 ▲	78,500 ▲	93,700 ▲
విశాఖపట్నం	80,410 ▲	73,710 ▲	92,400 ▲
రాజమండ్రి	82,420 ▲	75,550 ▲	93,700 ▼
ప్రొద్దుటూరు	81,650 ▲	75,560 ▲	93,000 ▼
ముంబై	80,348 ▲	73,599 ▲	91,211 ▲

గ్రాన్యూల్స్ లాభంలో 6 శాతం క్షీణత

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో గ్రాన్యూల్స్ ఇండియా నికర లాభం కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన 6 శాతం క్షీణించి రూ.117.60 కోట్లుగా నమోదైంది. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో లాభం రూ.125.70 కోట్లుగా ఉంది. అయితే ప్రస్తుత ఆర్థిక సంవత్సరం సెప్టెంబరు త్రైమాసికంతో పోల్చితే మాత్రం లాభం 21 శాతం వృద్ధి చెందింది. కాగా సమీక్షా త్రైమాసికంలో కంపెనీ ఆదాయం రూ.1,156 కోట్ల నుంచి రూ.1,138 కోట్లకు తగ్గింది.

లారస్ లాభంలో 300 శాతం వృద్ధి

డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో లారస్ ల్యాబ్స్ లిమిటెడ్.. నికర లాభం ఏకంగా 300 శాతం వృద్ధితో రూ.23 కోట్ల నుంచి రూ.92 కోట్లకు చేరుకుంది. సమీక్షా త్రైమాసికంలో కంపెనీ రెవెన్యూ కూడా 18 శాతం పెరిగి రూ.1,195 కోట్ల నుంచి రూ.1.415 కోట్లకు పెరిగింది. ఈ కాలంలో సీడీఎంఓ, ఎఫ్‌డీఎఫ్ డివిజన్ మంచి వృద్ధిని సాధించటం ఎంతగానో కలిసి వచ్చిందని లారస్ ల్యాబ్స్ సీఈఓ సత్యనారాయణ చావా తెలిపారు.

రెండు రోజుల ర్యాలీకి బ్రేక్

ముంబై: వారాంతం ట్రేడింగ్‌లో ఆద్యంతం లాభ, నష్టాల మధ్య ఊగిసలాడిన ప్రామాణిక ఈక్విటీ సూచీలు చివరికి నష్టాల్లో ముగిశాయి. దాంతో మార్కెట్లో రెండు రోజుల ర్యాలీకి తెరపడినట్లైంది. అంతర్జాతీయ మార్కెట్ల మిశ్రమ సంకేతాల నేపథ్యంలో ఈక్విటీ ట్రేడర్లు రియల్టీ, ఆయిల్ అండ్ గ్యాస్, హెల్త్‌కేర్ రంగ షేర్లలో అమ్మకాలకు పాల్పడటం ఇందుకు కారణమైంది. శుక్రవారం మార్కెట్లో ట్రేడింగ్ ముగిసేసరికి, సెన్సెక్స్ 329.92 పాయింట్లు కోల్పోయి 76,190.46 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 113.15 పాయింట్ల నష్టంతో 23,092.20 వద్దకు జారుకుంది.

అదానీకి శ్రీలంక సర్కారు షాక్!

విద్యుత్ కొనుగోలు ఒప్పందం రద్దు?

న్యూఢిల్లీ: విద్యుత్ కొనుగోలు ఒప్పందానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ ఉన్నతాధికారులకు భారీగా లంచాలు ముట్టజెప్పిందన్న ఆరోపణలపై అమెరికాలో దర్యాప్తు ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్‌నకు తాజాగా మరో షాక్ తగిలింది. ఆ ఆరోపణల నేపథ్యంలో శ్రీలంక కూడా తమ దేశంలో అదానీ గ్రీన్ ఎనర్జీ నిర్మిస్తున్న పవన విద్యుత్ ప్రాజెక్టులపై దర్యాప్తు ప్రారంభించినట్లు అంతర్జాతీయ న్యూస్ ఏజెన్సీ ఏఎఫ్‌పీ కథనం పేర్కొంది. అంతేకాదు, గత ఏడాది మే నెలలో అదానీ గ్రీన్ ఎనర్జీతో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పందాన్ని శ్రీలంక ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేసిందని, ఆ దేశ విద్యుత్ శాఖ ఉన్నతాధికారి ఈ విషయాన్ని ధ్రువీకరించారని తన కథనంలో వెల్లడించింది. శ్రీలంక ఉత్తర ప్రాంతంలోని మన్నార్, పూణెరిన్‌లో మొత్తం 484 మెగావాట్ల సామర్థ్యంతో కూడిన పవన విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణంతో పాటు ఆ ప్రాజెక్టుల నుంచి ఉత్పత్తి చేసే విద్యుత్‌ను 20 ఏళ్ల పాటు కొనుగోలు చేసేందుకు ఆ దేశ మాజీ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘే ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకుంది.

అదంతా అవాస్తవం: అదానీ గ్రూప్ ఈ వార్తలను ఖండించింది. అవి పూర్తిగా తప్పుడు, పక్కదోవ పట్టించే కథనాలేనని తన ప్రకటనలో పేర్కొంది. "ప్రాజెక్టు పూర్తిగా రద్దు కాలేదు. సాధారణ సమీక్ష ప్రక్రియలో భాగంగా శ్రీలంక ప్రస్తుత ప్రభుత్వం గత సర్కారు హయాంలో కుదుర్చుకున్న విద్యుత్ కొనుగోలు ఒప్పంద చార్జీలను పునఃసమీక్షించాలని నిర్ణయించింది. శ్రీలంక పునరుత్పాదక రంగంలో 100 కోట్ల డాలర్ల (రూ.8,600 కోట్లు) పెట్టుబడులు పెట్టడంతో పాటు ఆ దేశ హరిత ఇంధన రంగం, ఆర్థిక వృద్ధిని ముందుకు నడిపించే విషయంలో తమ గ్రూప్ కట్టుబడి ఉంద"ని అదానీ గ్రూప్ అధికారిక ప్రతినిధి పేర్కొన్నారు.

ఏపీ, తెలంగాణలోని ఎస్ఎంఈలపై దృష్టి: సీఎస్‌బీ బ్యాంక్


హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లోని చిన్న,మధ్య తరహా కంపెనీల (ఎస్ఎంఈ) రుణ అవసరాలపై సీఎస్‌బీ బ్యాంక్ ప్రత్యేక దృష్టి పెట్టింది. ఇందుకోసం రెండు రాష్ట్రాల్లో ఆరు ప్రత్యేక శాఖలు పని చేస్తున్నట్టు బ్యాంక్ ఎస్ఎంఈ బిజినెస్ గ్రూప్ హెడ్ శ్యామ్ మణి చెప్పారు. ఇప్పటి వరకు ఈ రెండు రాష్ట్రాల్లోని ఎస్ఎంఈలకు సీఎస్‌బీ బ్యాంక్ రూ.400 కోట్ల వరకు రుణాలు మంజూరు చేసింది. హైదరాబాద్‌లో ఫార్మా ముఖ్యంగా బల్క్‌డ్రగ్స్ ఎస్ఎంఈలు, ఏపీలో ట్రేడ్, తయారీ, వ్యవసాయ ఆధారిత ప్రాసెసింగ్ ఎస్ఎంఈల రుణ అవసరాలపై ప్రత్యేక దృష్టి పెట్టినట్టు మణి చెప్పారు. క్రిసిల్ పరపతి రేటింగ్, ఎస్ఎంఈల బ్యాలెన్స్ షీట్స్, జీఎస్‌టీ రిటర్న్‌ల ఆధారంగా కనీసం రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్ల వరకు, గరిష్ఠంగా రూ.75 కోట్ల నుంచి రూ.100 కోట్ల వరకు తమ రుణాలు ఉంటాయన్నారు. గత ఆర్థిక సంవత్సరం (2023-24) ఏపీ, తెలంగాణల్లో 28 శాతంగా ఉన్న తమ ఎస్ఎంఈల రుణాల వృద్ధి రేటు ఈ ఆర్థిక సంవత్సరం 28 నుంచి 30 శాతం వరకు ఉంటుందని ఆశిస్తున్నట్టు చెప్పారు.

మార్కెట్లోకి ఒప్పో రెనో 13



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): ఒప్పో ఇండియా... తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ మార్కెట్లలోకి ఒప్పో రెనో 13 సిరీస్ స్మార్ట్‌ఫోన్స్‌ను తీసుకువచ్చింది. ఒప్పో ఇండియా ప్రొడక్ట్ మార్కెటింగ్ మేనేజర్ అసీమ్ మాథుర్ ఈ ఫోన్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సరికొత్త మీడియాటెక్ డైమెన్సిటీ 8350 చిప్‌సెట్, ఏఐ రెడీ కెమెరాతో ఈ స్మార్ట్‌ఫోన్‌ను తీసుకువచ్చినట్లు చెప్పారు. అండర్ వాటర్ ఫొటోగ్రఫీ, ఏరోస్పేస్ గ్రేడ్ అల్యూమినియం ఫ్రేమ్, కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ.. ఈ ఫోన్ ప్రత్యేకత అని తెలిపారు. రెండు వేరియంట్లలో రెనో 13 ప్రో 5జీ, రెనో 13 5జీతో ఈ ఫోన్ అందుబాటులో ఉండనుంది. ఇందులో రెనో 13 5జీ ఆఫర్లతో కలుపుకుని 8జీబీ+128 జీబీ (రూ.34,199), 8జీబీ+256 జీబీ (రూ.35,999)తో అందుబాటులో ఉండగా రెనో 13 ప్రో 5జీ.. 12 జీబీ+256 జీబీ (రూ.44,999), 12 జీబీ+512 జీబీ (రూ.49,499)తో అందుబాటులో ఉంటాయి.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	460	విజయవాడ	490
వరంగల్	462	గోదావరి	485
చిత్తూరు	523	విశాఖపట్నం	485
		డజను గుడ్లు రూ.	72

www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

శనివారం | 25-1-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 297 | Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem |Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | వరంగల్

కిడ్నీ రాకెట్ కేసు.. సీఐడీకి అప్పగింత

3

ప్రభుత్వం కీలక నిర్ణయం.. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు

అవయవ మార్పిడి దందాలో ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ల పాత్రపై దర్యాప్తు

ప్రైవేటు ఆస్పత్రుల్లో సర్జరీల వివరాలను నమోదు చేయాలి: దామోదర

చర్లపల్లి జైలుకు అలకనంద ఆస్పత్రి యజమాని, రిసెప్షనిస్ట్



డబ్బుల కోసం కిడ్నాప్..

12

దొరికిపోతామని దారుణ హత్య

హైదరాబాద్‌లో పాన్‌మసాలా వ్యాపారి అపహరణ

కారులో తీసుకెళ్లి డబ్బు డిమాండ్ చేసిన నిందితులు

రూ.15 లక్షలు అకౌంట్‌కు బదిలీ చేసినా వదలని వైనం

కారులోనే ఖమ్మం జిల్లా కూసుమంచి వచ్చి అక్కడ హత్య

దాదాపు వారం రోజుల తర్వాత వెలుగులోకి ఘటన

నిందితుల్లో ఒకరు పాన్‌మసాలా వ్యాపారి వద్ద సబ్ డీలర్



మృతుడు రమేష్(ఫైల్)

2

సన్యాసినిగా మమతా కులకర్ణి

కిన్నెర అఖాడాలో చేరిన మాజీ హీరోయిన్

శ్రీయమాయి మమతా నందగిరిగా పేరు మార్పు

మహా మండలేశ్వర్‌గా నియామకం

కుంభమేళాలో పూజలు నిర్వహించిన మమత

మహాదేవుడి ఆదేశాలతోనే భక్తి మార్గమని వెల్లడి



హీరోయిన్‌గా..



సన్యాసినిగా..

TG RERA
TELANGANA REAL ESTATE REGULATORY AUTHORITY

7

అడ్డగోలు చెల్లదు


రియల్టర్ల ప్రచారంపై రెరా డేగకన్ను

ప్రకటనలు, ఫ్లెక్సీలు, హోర్డింగ్‌ల తనిఖీ

హైదరాబాద్‌లో నాలుగు ప్రత్యేక బృందాలు

నిబంధనలు ఉల్లంఘిస్తే నోటీసులు, జరిమానా

రాజకీయాలకు సాయిరెడ్డి సెలవు!



నేడు రాజ్యసభ సభ్యత్వానికి రాజీనామా

ఇక ఏ రాజకీయ పార్టీలోనూ చేరను

వ్యవసాయమే నా భవిష్యత్తు

టీడీపీతో రాజకీయ విభేదాలే..

చంద్రబాబుతో వ్యక్తిగత వైరం లేదు

జగన్, భారతి, మోదీ, షాకు కృతజ్ఞతలు

'ఎక్స్' వేదికగా వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి సంచలన ప్రకటన

ఎంపీ అయోధ్య రామిరెడ్డిదీ ఇదే దారి?

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

వైఎస్ కుటుంబానికి వీర విధేయుడు, అక్రమాస్తుల కేసులో ఏ2, 16నెలలు వైసీపీ అధినేత వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి జైలులో సహచరుడు, వైసీపీ కీలక నేత, రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి రాజకీయాల నుంచి తప్పుకొంటున్నట్లుగా సంచలన ప్రకటన చేశారు. 'ఇక ఏ పార్టీలోనూ చేరను. వ్యవసాయమే నా భవిష్యత్తు' అని ప్రకటించారు. రాజ్యసభ సభ్యుడిగా మరో మూడేళ్ల పదవీకాలం మిగిలి ఉన్నప్పటికీ.. శనివారమే దానికి రాజీనామా చేస్తున్నట్లు సాయి రెడ్డి స్పష్టం చేశారు. శుక్రవారం సాయంత్రం 'ఎక్స్' వేదికగా ఆయన ఈ ప్రకటన చేశారు. "రాజకీయాల నుంచి తప్పుకొంటున్నాను. ఏ రాజకీయ పార్టీలోనూ చేరడం లేదు. ఈ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం" అని ఆయన తెలిపారు. గత ఏడాది జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఏపీలో ఘోర పరాజయంతో వైసీపీ పూర్తిగా డీలా పడిపోయింది. పరాజయ భారం నుంచి పార్టీ అధ్యక్షుడు జగన్ ఇంకా పూర్తిగా కోలుకోలేదు! ఇలాంటి పరిస్థితుల్లో... వైఎస్ కుటుంబానికి నాలుగు దశాబ్దాలుగా నమ్మినబంటులా

> వేరే పదవులో, ప్రయోజనాలో లేక డబ్బులో ఆశించి రాజీనామా చేయడం లేదు. ఈ నిర్ణయం పూర్తిగా నా వ్యక్తిగతం. ఎలాంటి ఒత్తిళ్లూ లేవు. ఎవరూ ప్రభావితం చేయలేదు.
>
> - విజయసాయిరెడ్డి

మిగతా 10వ పేజీలో...

దావోస్ నుంచి తిరిగి వచ్చిన సీఎం రేవంత్‌కు విమానాశ్రయంలో కాంగ్రెస్ కార్యకర్తల ఘనస్వాగతం



20 లక్షల ఇళ్లు ఇవ్వండి

పీఎంఏవై కింద తెలంగాణకు మంజూరు చేయండి

మూసీకి 10 వేల కోట్లు, జీహెచ్ఎంసీకి 55 వేల కోట్లివ్వండి

మెట్రో రైల్ ఫేజ్-1ను జాయింట్ వెంచర్‌గా చేపట్టండి

విద్యుత్తు సంస్థల రుణాలకు వడ్డీ రేట్లను తగ్గించండి

పట్టణ ప్రగతికి తోడ్పడండి.. ఖట్టర్‌కు సీఎం రేవంత్‌ వినతి

పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖలపై కేంద్ర మంత్రి సమీక్ష

దావోస్ ఒప్పందాలపై సీఎంను అభినందించిన ఖట్టర్

దావోస్ నుంచి రాష్ట్రానికి రేవంత్.. ఘన స్వాగతం

మీ హయాంలో, మా పాలనలో పెట్టుబడులపై చర్చిద్దామా?

బీఆర్ఎస్ నేతలకు టీపీసీసీ చీఫ్ మహేశ్ గౌడ్ సవాల్

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ఆవాస యోజన (అర్బన్) 2.0 కింద తెలంగాణకు 20 లక్షల ఇళ్లను మంజూరు చేయాలని కేంద్ర గృహనిర్మాణ, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌కు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. దీంతోపాటు పలు ప్రాజెక్టుల నిర్మాణాల కోసం నిధులు కేటాయించి, మంజూరు చేయాలని కోరారు. శుక్రవారం రాష్ట్రానికి వచ్చిన కేంద్రమంత్రి శుక్రవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో పీఎంఏవై-అర్బన్ పథకంతోపాటు పట్టణాభివృద్ధి, విద్యుత్తు శాఖలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు హాజరైన సీఎం రేవంత్ మాట్లాడుతూ.. దేశ పట్టణ జనాభాలో 8 శాతం ప్రజలు తెలంగాణలో

మిగతా 11వ పేజీలో...

అడిగిన రుణంలో కేంద్రం కోత

రూ.2500 కోట్లకు గాను 1,800 కోట్లకే అనుమతి

నెట్ నెట్ భవనాన్ని కూల్చాల్సిందే!

జూబ్లీహిల్స్‌లోని నిర్మాణంలో తీవ్ర ఉల్లంఘనలు

తక్షణమే సరిచేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఉత్తర్వు

సెట్‌బ్యాక్స్‌లోనూ అంగుళమైనా వదలని వైనం

110 అడుగుల లోతుకు తవ్వి 5 అంతస్తులు!

5 మీటర్లకు బదులు 4.5 మీటర్ల ఎత్తుతో శ్లాబులు

స్టిల్ట్ పైన ఏడు అంతస్తుల శ్లాబులూ 3 మీటర్లకు బదులుగా.. 4.5 మీటర్ల ఎత్తుతో నిర్మాణం

సరిదిద్దడమంటే నేలమట్టం చేయడమే: ఇంజనీర్లు



జూబ్లీహిల్స్‌లో నెట్ నెట్ వెంచర్స్ నిర్మిస్తున్న భవనం (ఫైల్)

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజధాని హైదరాబాద్‌లోని నందగిరి హిల్స్‌లో నెట్ నెట్ వెంచర్స్ నిర్మించిన భవనంలో అడుగడుగునా ఉల్లంఘనలే ఉన్నట్టు జీహెచ్ఎంసీ అధికారులు తేల్చిన నేపథ్యంలో.. ఆ ఉల్లంఘనలను తక్షణమే సరిచేయాలంటూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి గురువారం సంచలన ఉత్తర్వులు ఇచ్చారు! అయితే.. అనుమతించిన ప్లాన్ ప్రకారం కాకుండా.. ఇష్టం వచ్చినట్టు, పర్యావరణ సమతుల్యతకు భంగం వాటిల్లేలా చేపట్టిన ఈ నిర్మాణంలో ఉల్లంఘనలను సరిదిద్దడమంటే భవనం కూల్చివేతతో సమానమే అని ఇంజినీర్లు అభిప్రాయపడుతున్నారు. కేబీఆర్ పార్క్‌కు కూతవేటు దూరంలో.. జూబ్లీ హిల్స్ రోడ్ నంబర్ 45లో నిర్మిస్తున్న భవనం కథ ఇది!! నందగిరి హిల్స్ ప్రాంతంలో హెచ్ఎండీఏ నుంచి హుడా వేలంలో జి.అమరేందర్ రెడ్డి అనే

మిగతా 10వ పేజీలో...

పార్ట్‌టైం చేస్తే ఇంటికే!



అమెరికాలో విద్యార్థులకు డిపోర్టేషన్ ముప్పు

చదువు పేరుతో వెళ్లి ఉద్యోగం చేసేవారిపై

నిఘా పెట్టి పట్టుకుంటున్న అధికారులు

పట్టుబడ్డ వారిని స్వదేశానికి పంపుతూ ఆదేశం

వారం రోజులుగా పార్ట్ టైం జాబ్‌లకు డుమ్మా

అక్కడి భారతీయ వ్యాపారులపైనా ప్రభావం

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని మిషిగన్ స్టేట్‌లో.. ఓ పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్న ఇద్దరు విద్యార్థులను ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) అధికారులు 21వ తేదీ రాత్రి పట్టుకున్నారు. ఆ విద్యార్థులు నిబంధనలకు విరుద్ధంగా క్యాంపస్ బయట అనధికారికంగా పనులు చేస్తుండడమే ఇందుకు కారణం. క్యాంపస్ నుంచి వారు ఎక్కడికి

మిగతా 12వ పేజీలో...

అక్రమ వలసదారులపై ట్రంప్ సర్కారు ఉక్కుపాదం



538 మంది అరెస్టు.. 373 మంది నిర్బంధం

సైనిక విమానాల్లో వందలమంది డీపోర్టేషన్

జన్మతఃపౌరసత్వ హక్కు రద్దును నిలిపివేస్తూ కోర్టు ఇచ్చిన తీర్పుపై అప్పీలు: ట్రంప్

2



ప్రైవేటు పాఠశాలల్లో ట్యూషన్ ఫీజే ఉండాలి!

- మిగతా ఏ రుసుములు వసూలు చేయకూడదు
- ఫీజుల ఖరారు, నియంత్రణకు ప్రత్యేక కమిటీ
- పర్యవేక్షణకు జిల్లా స్థాయుల్లో కమిటీలు వేయాలి
- ప్రతీ మూడేళ్లకోసారి ఫీజులను నిర్ధారించాలి
- రాష్ట్ర ప్రభుత్వానికి విద్యా కమిషన్ సిఫార్సులు..

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలల్లో ట్యూషన్ ఫీజు మాత్రమే ఉండాలని, మరే ఇతర ఫీజులను వసూలు చేయకుండా నియంత్రించాలని తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర సర్కారుకు సిఫార్సు చేసింది. ఫీజుల ఖరారు, నియంత్రణకు రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించింది. ప్రైవేటు పాఠశాలల ఫీజుల నియంత్రణకు సంబంధించి గత కొంతకాలంగా విద్యా కమిషన్ వివిధ వర్గాలతో విస్తృత చర్చలు జరిపి నివేదికను రూపొందించింది. శుక్రవారం విద్యా కమిషన్ చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ ఆకునూరి మురళి ఆధ్వర్యంలో

మిగతా 11వ పేజీలో...

బకెట్‌లో హీటర్‌తో ఉడికించాడు!



గురుమూర్తి, మాధవి(ఫైల్)

వీడిన హైదరాబాద్ మీర్‌పేట మహిళ మృతి కేసు మిస్టరీ

భార్య మాధవితో గొడవపడి తోసేసిన మాజీ సైనికుడు గురుమూర్తి

ఆమె శవాన్ని మాయం చేసేందుకు పథకం

ముద్దుపై కత్తితో ముక్కలు.. అవశేషాలు మీర్‌పేట చెరువులో..

ఆపై ఇల్లంతా శుభ్రం.. అయినా పట్టించిన 'బ్లూ రేస్ టెక్నాలజీ'

బాత్రూమ్, గదిలో, మొద్దుపై అవశేషాల ఆనవాళ్లు లభ్యం

నిందితుడిని నేడు రిమాండ్ చేసే అవకాశం!

హైదరాబాద్ సిటీ/సరూర్‌నగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): "అవును.. నా భార్యను నేనే చంపాను. మీ దగ్గర ఆధారాలుంటే అరెస్టు చేసుకోండి" అంటూ విచారణలో భాగంగా ఒకరంగా పోలీసులకు సవాలే విసిరిన మాజీ సైనికుడు గురుమూర్తి ఆటకట్టయింది. పోలీసుల నుంచి తప్పించుకునేందుకు అతడెంత పకడ్బందీగా వ్యవహరించినా 'ఖానూన్ కే హాత్ లంబే హోతే హై' అనేది మరోసారి రుజువైంది. అత్యంత విశ్వసనీయ సమాచారం ప్రకారం.. హైదరాబాద్, మీర్‌పేట మహిళ మర్డర్ కేసు మిస్టరీని రాచకొండ పోలీసులు ఛేదించారు. మృతదేహాన్ని గురుమూర్తి ముక్కలుగా నరికిన విషయం వాస్తవమే! అయితే వాటిని ఉడికించింది కుక్కర్‌లో కాదు.. బకెట్ నీళ్లలో ముక్కలు వేస్తూ హీటర్ పెట్టి విడతల వారీగా ఉడికించాడు! తర్వాత ఆ అవశేషాలను మీర్‌పేట చెరువులో పడేశాడు! ఎక్కడా చిన్న ఆధారం కూడా దొరక్కుండా ఇల్లంతా శుభ్రం చేసినా గురుమూర్తి తప్పించుకోలేకపోయాడు. అత్యాధునిక 'బ్లూ రేస్ టెక్నాలజీ'తో ఇంట్లో మాంసం, రక్తం ఆనవాళ్లను పోలీసులు గుర్తించి గురుమూర్తే నిందితుడని తేల్చారు. నరకడానికి ఉపయోగించిన కత్తి, చెక్క మొద్దును అతడు ఎక్కడి

మిగతా 3వ పేజీలో...

ఎస్సీ వర్గీకరణ నివేదిక ఓ కొలిక్కి

ఫిబ్రవరి మొదటి వారంలో ప్రభుత్వానికి!

వివరాలపై అధ్యయనం దాదాపు పూర్తి

పొందుపరిచే అంశాలపై కమిషన్ కసరత్తు

విచారణలో 7-8 వేల దరఖాస్తులు

1981 నుంచి ఎస్సీల వివరాల సేకరణ

అక్షరాస్యత నుంచి ఉద్యోగాల దాకా జాబితా

ప్రభుత్వంలో 94వేల మంది ఎస్సీ ఉద్యోగులు

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎస్సీ వర్గీకరణకు సంబంధించిన నివేదిక రూపకల్పన ఒక కొలిక్కి వస్తోంది. వర్గీకరణ కోసం సేకరించిన వివరాలపై అధ్యయనం దాదాపు పూర్తవ్వడంతో తాజాగా నివేదికలో పొందుపర్చాల్సిన అంశాలపై ఏకసభ్య కమిషన్ కసరత్తు చేస్తోంది. త్వరితగతిన ఈ ప్రక్రియను పూర్తిచేసి ఫిబ్రవరి మొదటి వారంలో ప్రభుత్వానికి నివేదికను సమర్పించనున్నది. ఎస్సీ వర్గీకరణ చేపట్టాలంటూ ఎన్నో ఏళ్లుగా డిమాండ్లు ఉన్న సంగతి తెలిసిందే. ఈ అంశంపై సుప్రీంకోర్టులోనూ కేసు నడిచింది. ఎస్సీలను వర్గీకరించే హక్కు రాష్ట్రాలకు ఉందంటూ

మిగతా 11వ పేజీలో...



పేలుడుతో నామరూపాల్లేకుండా పోయిన ఫ్యాక్టరీ

ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు

8 మంది మృతి.. ఏడుగురికి గాయాలు

మహారాష్ట్ర భండారా జిల్లాలో ఘటన

2

గజం రూ.1.85 లక్షలు

హైదరాబాద్ కేపీహెచ్‌బీలో ప్లాట్ల వేలం

ఉద్రిక్తతల మధ్య కొనసాగించిన అధికారులు

ఉదయం కోర్టు స్టే.. మధ్యాహ్నం గ్రీన్ సిగ్నల్

అమ్మకాలు ఖరారు చేయొద్దన్న హైకోర్టు

లేఅవుట్‌లో చూపెట్టకుండా మిగిలిన పాట్లుగా పేర్కొనడం తగదని స్పష్టీకరణ

12



డీఎంఈగా నరేంద్రకుమార్

తొలిసారి రెగ్యులర్ అధికారి నియామకం

పదేళ్ల ఇన్‌చార్జుల పాలనకు తెర

ఉత్తర్వులు జారీ.. కోర్టుకు కాపీ అందజేత

ఫలించిన నరేంద్రకుమార్ న్యాయపోరాటం

7



సినిమా బెనిఫిట్ షోల రద్దు

అర్ధరాత్రి 1.30 నుంచి ఉదయం 8.40 వరకు సినీ ప్రదర్శనలకు వీల్లేదు

ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు

10

దిల్‌రాజు, మరికొందరి స్టేట్‌మెంట్ల రికార్డు

7

ఆదాయం, పన్ను చెల్లింపుల్లో తేడాల గుర్తింపు

కీలక పత్రాలు, సాంకేతిక ఆధారాలు స్వాధీనం

నాలుగోరోజూ కొనసాగిన ఐటీ అధికార్ల సోదాలు

దిల్‌రాజును తీసుకెళ్లి మరీ పత్రాల పరిశీలన

సన్యాసినిగా మమతా కులకర్ణి

» కిన్నెర అఖాడాలో చేరిన మాజీ హీరోయిన్

వారణాసి, జనవరి 24: బాలీవుడ్ మాజీ హీరోయిన్ మమతా కులకర్ణి ఆధ్యాత్మిక మార్గంలోకి మళ్లారు. వారణాసిలోని కుంభమేళాలో కిన్నెర అఖాడాలో చేరి.. తన పేరును శ్రీ యమయ్ మమతా నందగిరిగా మార్చుకున్నారు. శుక్రవారం ఉదయం రుద్రాక్ష మాలలు, కాషాయ వస్త్రాలు ధరించి కుంభమేళాకు వచ్చిన మమత.. కిన్నెర అఖాడా ఆచార్య మహామండలేశ్వర్ డాక్టర్ లక్ష్మీనారాయణ్ త్రిపాఠిని కలిసి ఆశీస్సులు తీసుకున్నారు. అనంతరం మమతతో లక్ష్మీనారాయణ్ గంగానదిలో పూజలు నిర్వహింపజేశారు. నదిలో మమత మూడుసార్లు మునక వేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ్ మీడియాతో మాట్లాడుతూ, కిన్నెర అఖాడాతో మమత ఏడాదిన్నరగా సంప్రదింపులు జరుపుతున్నారని తెలిపారు. ఆమెను మహా మండలేశ్వర్‌గా నియమిస్తున్నట్లు వెల్లడించారు. మమత సినిమాల్లో నటించటంపై నిషేధం ఉంటుందా అన్న ప్రశ్నకు బదులిస్తూ.. కిన్నెర అఖాడాలో చేరిన వారు చేసే పనిపై ఎటువంటి నిషేధాలు ఉండవని, ఆమె కావాలనుకుంటే ఆధ్యాత్మిక పాత్రల్లో నటించవచ్చన్నారు. మమత మాట్లాడుతూ.. మహాదేవుడు, మహాకాళి, తన గురువు ఇచ్చిన ఆదేశాల ప్రకారమే తాను సన్యాసినిగా మారానని చెప్పారు. 2015లో లక్ష్మీనారాయణ్ త్రిపాఠి కిన్నెర అఖడాను ప్రారంభించారు. ట్రాన్స్‌జెండర్లకు (లింగమార్పిడి చేసుకున్న వ్యక్తులకు) సమాజంలో గౌరవం తీసుకువచ్చే లక్ష్యంతో దీనిని నెలకొల్పారు. ట్రాన్స్‌జెండర్లను అఖాడాలో చేర్చుకున్నారు. కాగా, మమతా కులకర్ణి 1990లలో బాలీవుడ్‌లో ప్రముఖ గ్లామర్ హీరోయిన్‌గా వెలుగొందారు. కరణ్ అర్జున్, క్రాంతివీర్, ఆషిక్ అవారా, సబ్‌సే బడా కిలాడీ, చైనా గేట్ తదితర హిట్ సినిమాల్లో ఆమె నటించారు. 2002తర్వాత ఆమె సినిమాలు చేయటం మానేశారు.

17 ఆధ్యాత్మిక నగరాల్లో మద్యం షాపులు క్లోజ్

» కీలక నిర్ణయం తీసుకున్న మధ్యప్రదేశ్ ప్రభుత్వం

భోపాల్, జనవరి 24: మధ్యప్రదేశ్ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ప్రధాన పుణ్యక్షేత్రాలు ఉన్న 17 పట్టణాలలోని మద్యం దుకాణాలను మూసి వేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు శుక్రవారం భోపాల్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయంలో సీఎం మోహన్ యాదవ్ మీడియాకు తెలిపారు. "ప్రధాన పుణ్యక్షేత్రాలు ఉన్న 17 పట్టణాలలోని మద్యం షాపులను పూర్తిగా మూసివేస్తున్నాం. ఉజ్జయిని నగరంలోని మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని అన్ని మద్యం దుకాణాలు బంద్ అవుతాయి. ఈ నిర్ణయం తక్షణమే అమలులోకి వస్తుంది" అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రంలో మద్యపాన నిషేధ లక్ష్యానికి ఇది తొలి అడుగని బీజేపీ నేతలు కొనియాడారు. మద్యం షాపులు బంద్ కానున్న ఆధ్యాత్మిక నగరాలు.... లింగా, పన్నా, దటియా, మాండ్లా, ముల్తాయి, ఓంకారేశ్వర్, మహేశ్వర్, మండలేశ్వర్, చిత్రకూట్, అమర్‌కంటక్, కుండల్‌పూర్, మంద్‌సోర్, బర్మన్ కలా, ఓర్చా, మైహర్, బందక్ పూర్, బర్మన్ ఖుర్ద్.

మార్కెట్ నుంచి 'పతంజలి' కారం వెనక్కి..

న్యూఢిల్లీ, జనవరి 24: యోగా గురువు రామ్‌దేవ్ బాబాకు చెందిన పతంజలి ఆయుర్వేద సంస్థకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భారత ఆహార భద్రతా, ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) ఆదేశాలతో మార్కెట్ నుంచి 4 టన్నుల కారం పొడిని వెనక్కు తీసుకుంది. ఆహార భద్రతా ప్రమాణాలకు విరుద్ధంగా ఉండటంతో ఓ బ్యాచ్‌కు చెందిన 200 గ్రాముల కారం పొడి ప్యాకెట్లను వెనక్కి తీసుకోవాలని పతంజలి సంస్థకు ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించింది. దీనిపై పతంజలి సంస్థ సీఈవో సంజీవ్ అస్థానా ప్రకటన విడుదల చేశారు. 'మా ఉత్పత్తి నమూనాలను పరీక్షించినప్పుడు కారానికి పురుగు పట్టకుండా వాడే మందును పరిమితికి మించి వినియోగించినట్లు ఎఫ్ఎస్ఎస్ఏఐ గుర్తించింది. దీంతో మార్కెట్ నుంచి 200 గ్రాముల కారం పొడి ప్యాకెట్లను వెనక్కి తీసుకునేందుకు తక్షణ చర్యలు చేపట్టాం. మా ఉత్పత్తుల నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీపడేది లేదు' అని వెల్లడించారు.

బద్దాల్ నుంచి 200 మంది రాజౌరీ ఆస్పత్రికి

» కశ్మీర్‌లో మరణాల మిస్టరీ..మృతదేహాల్లో విషపు ఆనవాళ్లు

జమ్మూ, జనవరి 24: జమ్మూ రాజౌరీ సమీపంలోని బద్దాల్ గ్రామంలో మిస్టరీ మరణాలపై అధికారుల దర్యాప్తు కొనసాగుతోంది. నిరుడు డిసెంబరు నుంచి గ్రామంలోని మూడు కుటుంబాల్లో 17 మంది అనుమానాస్పద స్థితిలో మృతిచెందడం, నలుగురు ఆస్పత్రిపాలవడం చర్చనీయాంశమైంది. ఈ మరణాలకు కారణాలు తెలియరాలేదు. తాజాగా ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మైనర్లు జ్వరం, వాంతులతో బాధపడుతుండటంతో వారిని రాజౌరీలోని ఆస్పత్రిలో చేర్పించారు. బద్దాల్ నుంచి 200 మందిని రాజౌరీలోని ఆస్పత్రికి తరలించారు. వారి ఆరోగ్య పరిస్థితిని ప్రత్యేక వైద్య బృందం నిరంతరం పర్యవేక్షిస్తోంది. గ్రామంలో పరిస్థితిని, అక్కడి ప్రజల కదలికలను నిశితంగా పర్యవేక్షించడం కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేశారు. అయితే గ్రామానికి నీళ్ల సరఫరా చేసే ట్యాంకులో పురుగుల మందు ఆనవాళ్లున్నాయని అనుమానాలు వ్యక్తం చేయడం ఆందోళన కలిగించింది. కాగా మృతదేహాల పోస్టుమార్టం రిపోర్టుల్లో విషపు ఆనవాళ్లు లభ్యమైనట్లు లఖ్‌నవులోని శాస్త్రీయ, పారిశ్రామిక పరిశోధన (సీఎస్ఐఆర్) టాక్సికాలజీ లాబొరేటరీ కౌన్సిల్ ప్రాథమికంగా నిర్ధారించినట్లు కేంద్రమంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

'వక్ఫ్' జేపీసీ భేటీలో రచ్చ

» ఒవైసీ, రాజా సహా 10 మంది విపక్ష ఎంపీల సస్పెన్షన్

న్యూఢిల్లీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేంద్రం తీసుకొచ్చిన వక్ఫ్ సవరణ బిల్లుపై చర్చకు ఏర్పాటైన సంయుక్త పార్లమెంటరీ కమిటీ (జేపీసీ) సమావేశంలో శుక్రవారం పెద్దఎత్తున గందరగోళం చెలరేగింది. ఛైర్మన్ జగదంబికాపాల్ ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని విపక్ష సభ్యులు ఆరోపించారు. ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలను ప్రభావితం చేయడానికి హడావుడిగా సమావేశాలు, చర్చలు పెట్టి ఆదరాబాదరాగా నివేదిక ఇవ్వాలని అధికార పక్ష సభ్యులు చూస్తున్నారని విమర్శించారు. ఛైర్మన్ తీరును నిరసిస్తూ నినాదాలు చేశారు. దీంతో కల్యాణ్ బెనర్జీ, నదీమ్ ఉల్ హక్(టీఎంసీ), అసదుద్దీన్ (ఎంఐఎం), ఎ.రాజా, ఎం.అబ్దుల్లా (డీఎంకే), మహ్మద్ జావేద్, ఇమ్రాన్ మసూద్, నసీర్ హుస్సేన్ (కాంగ్రెస్), అరవింద్ సావంత్ (ఉద్ధవ్ శివసేన), మొహిబుల్లా(ఎస్పీ)లను సమావేశం నుంచి ఒక్కరోజు సస్పెండ్ చేస్తున్నట్లు పాల్ ప్రకటించారు.

అక్రమ వలసదారులపై ట్రంప్ ఉక్కుపాదం



538 మంది అరెస్టు.. 373 మంది నిర్బంధం.. సైనిక విమానాల్లో వందలమంది డీపోర్టేషన్

తాను అమెరికా అధ్యక్ష బాధ్యతలు చేపట్టగానే అక్రమ వలసదారులను దేశం నుంచి వెళ్లగొడతానంటూ ఎన్నికల ప్రచారంలో ప్రకటించిన డొనాల్డ్ ట్రంప్.. పగ్గాలు చేపట్టిన మూడోరోజునే ఆ పని మొదలుపెట్టారు! ట్రంప్ యంత్రాంగం ఒక్క జనవరి 23నే.. అమెరికాకు అక్రమంగా వలసవచ్చిన నేరగాళ్లలో 538 మందిని అరెస్టు చేసినట్టు వైట్‌హౌస్ ప్రెస్ సెక్రటరీ కారొలిన్ లెవిట్ 'ఎక్స్'లో ట్వీట్ చేశారు. అరెస్ట్ అయినవాళ్లలో ఒక అనుమానిత ఉగ్రవాది, వెనిజులాకు చెందిన 'ట్రెన్ డి అరాగ్వా' అనే నేరగాళ్ల ముఠాలోని నలుగురు ప్రముఖ సభ్యులు, మైనర్లపై లైంగికదాడులకు పాల్పడిన పలువురు నేరగాళ్లు ఉన్నట్టు ఆమె వివరించారు. అంతేకాదు.. వందలాది అక్రమ వలసదారులను సైనిక విమానాల్లో దేశం నుంచి డీపోర్ట్ చేసినట్టు (దేశ బహిష్కరణ) పేర్కొన్నారు. "చరిత్రలోనే అతి పెద్ద బహిష్కరణ ప్రక్రియ ప్రస్తుతం అమెరికాలో జరుగుతోంది. హామీ ఇచ్చాం. హామీని నిలబెట్టుకుంటున్నాం" అని ఆమె తన ట్వీట్‌లో పేర్కొన్నారు. ఈ ఆపరేషన్ చేపట్టిన అమెరికా ఇమ్మిగ్రేషన్ అండ్ కస్టమ్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ (ఐసీఈ) కూడా జనవరి 23న అమెరికాలో 538మంది అక్రమ వలసదారులను అరెస్టు చేశామని, మరో 373మందిని నిర్బంధించామని ట్వీట్ చేసింది. వివిధ దేశాల నుంచి పలు మార్గాల్లో అమెరికాకు వచ్చి అనుమతులు లేకుండా అక్కడ నివసిస్తున్న అక్రమ వలసదారుల సంఖ్య దాదాపు 1.1కోట్ల దాకా ఉంటుందని అంచనా. ఇక అమెరికా డీపోర్ట్ చేసే మెక్సికన్లను ఆదుకోవడానికి ఆ దేశ ప్రభుత్వం 'మెక్సికో మిమ్మల్ని ఆదుకుంటుంది' అనే పథకం కింద తమ దేశ సరిహద్దుల్లో 9అత్యవసర షెల్టర్లను ఏర్పాటుచేసింది. అమెరికా తమ దేశానికి పంపే విదేశీయులకు సైతం తాము ఆశ్రయమిస్తామని పేర్కొంది. భారతదేశం కూడా ఈ మాస్ డీపోర్టేషన్ ఆపరేషన్‌పై స్పందించింది. "అక్రమ వలసలకు మేం వ్యతిరేకం. అమెరికాలో ఉన్న భారతీయులనే కాదు.. వారు ఏ దేశంలోనైనా ఉండాల్సిన కాలపరిమితికి మించి ఉన్నా, సరైన పత్రాలు లేకుండా నివసిస్తున్నా వారిని వెనక్కి తీసుకోవడానికి సిద్ధంగా ఉన్నాం. వారు భారతీయులని నిర్ధారణ అయితే తిరిగి భారత్‌కు రావడానికి సహకారం అందిస్తాం" అని భారత విదేశాంగ శాఖ అధికార ప్రతినిధి రణ్‌ధీర్ తెలిపారు.

అప్పీలు చేస్తాం

జన్మతః పౌరసత్వ హక్కును రద్దుచేస్తూ తాను ఇచ్చిన ఎగ్జిక్యూటివ్ ఆర్డర్‌ను తాత్కాలికంగా నిలిపివేస్తూ ఫెడరల్ డిస్ట్రిక్ట్ కోర్టు ఇచ్చిన తీర్పుపై డొనాల్డ్ ట్రంప్ స్పందించారు. దానిపై తమ యంత్రాంగం అప్పీలు చేస్తుందని గురువారం వైట్‌హౌస్‌లో మీడియాతో అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన మరో హామీ నెరవేర్చే దిశగా కూడా ట్రంప్ నిర్ణయం తీసుకున్నారు. అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్.కెన్నెడీ, ఆయన సోదరుడు, సెనెటర్ రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ, పౌర హక్కుల ఉద్యమనేత మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ హత్యలకు సంబంధించిన ఫైళ్లను బయటపెట్టాల్సిందిగా జాతీయ నిఘా సంస్థ డైరెక్టర్, అటార్నీ జనరల్‌ను ఆదేశిస్తూ కార్యనిర్వాహక ఉత్తర్వు జారీ చేశారు. దాని ప్రకారం 15రోజుల్లోగా జాన్ ఎఫ్.కెన్నెడీ హత్యకు సంబంధించిన పత్రాల విడుదలకు సంబంధించిన ప్రణాళికను రూపొందించాలి. 45రోజుల్లోగా మిగతా ఇద్దరి హత్యలకు సంబంధించిన పత్రాల విడుదల ప్రణాళికను రూపొందించాలి. ఉత్తర్వుపై సంతకం చేశాక ఆ పెన్నును రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ కుమారుడు రాబర్ట్ ఎఫ్.కెన్నెడీ జూనియర్‌కు జ్ఞాపికగా ఇచ్చారు.

వంద లక్షల కోట్లు!

ట్రంప్ సర్కారు చేపట్టిన అక్రమ వలసదారుల మాస్ డీపోర్టేషన్ భారీ ఖర్చుతో కూడుకున్న పని అని 'అమెరికన్ ఇమ్మిగ్రేషన్ కౌన్సిల్' 2022లో ఓ నివేదిక విడుదల చేసింది. దాని ప్రకారం 2022లోనే అందుకు అయ్యే ఖర్చు 1.1 ట్రిలియన్ డాలర్ల నుంచి 1.7 ట్రిలియన్ డాలర్ల దాకా ఉంటుందని అందులో పేర్కొంది. ఇప్పటి లెక్కల ప్రకారం ఆ మొత్తం.. దాదాపు రూ.వంద లక్షల కోట్లకు సమానం.

ట్రంపే ఉంటే..

"ట్రంపే గనక 2020ఎన్నికల్లో గెలిచి అధ్యక్షుడై ఉంటే.. ఉక్రెయిన్‌లో 2022లో సంక్షోభం తలెత్తి ఉండేది కాదేమో" అని రష్యా అధ్యక్షుడు పుతిన్ తాజాగా వ్యాఖ్యానించారు. ఉక్రెయిన్‌పై యుద్ధం విషయంలో చర్చలకు తానెప్పుడూ సిద్ధమేనన్నారు. ట్రంప్‌ను తెలివైనవాడు, కార్యసాధకుడుగా అభివర్ణించారు. ఉక్రెయిన్‌పై యుద్ధాన్ని ముగించే ఒప్పందం కుదుర్చుకోకుంటే రష్యాపై అధిక పన్నులు, సుంకాలు, ఆంక్షలు విధిస్తానంటూ బుధవారం ట్రంప్ హెచ్చరించిన నేపథ్యంలో పుతిన్ ఈ వ్యాఖ్యలు చేయడం గమనార్హం. మరోవైపు.. ఉత్తర అమెరికా అధ్యక్షుడు కిమ్ జాంగ్ ఉన్‌ను కలిసే ఆలోచన ఉన్నట్టు ట్రంప్ గురువారం వెల్లడించారు. ఇదిలా ఉండగా, ట్రంప్ ప్రమాణ స్వీకారం సందర్భంగా నిర్వహించిన 'ద లిబర్టీ బాల్' ఈవెంట్‌కు ఖలిస్థానీ ఉగ్రవాది పన్నూ హాజరు కావడం సంచలనం సృష్టించింది. అక్కడ ఆయన 'ఖలిస్థాన్ జిందాబాద్' అంటూ నినదించిన వీడియో వైరల్ అవుతోంది.

\- సెంట్రల్ డెస్క్

లోకం తీరు



ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో పేలుడు

» 8 మంది మృతి, ఏడుగురికి గాయాలు

ముంబై, జనవరి 24 : మహారాష్ట్రలోని భండారా జిల్లా జవహర్ నగర్ ప్రాంతంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలో శుక్రవారం ఉదయం జరిగిన పేలుడు వల్ల 8 మంది కార్మికులు మృతి చెందారు. మరో ఏడుగురు గాయాలపాలయ్యారు. గాయపడిన వారిని రక్షించేందుకు ప్రయత్నిస్తున్నారు. ఘటనను కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ నిర్ధారించారు. పేలుడు వల్ల ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలోని ఒక యూనిట్ పైకప్పు కూలడంతో కార్మికులు దాని కింద చిక్కుకున్నారని మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ తెలిపారు. జిల్లా అధికారులు అక్కడికి చేరుకున్నారని, మహారాష్ట్ర విపత్తుల స్పందన దళం సిబ్బంది కూడా వెళుతున్నారని ఆయన 'ఎక్స్'లో పేర్కొన్నారు. రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ఘటనపై విచారం వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు.

లీటర్ అమూల్ పాలపై రూ.1 తగ్గింపు

న్యూఢిల్లీ, జనవరి 24: అమూల్ బ్రాండ్ కింద డెయిరీ ఉత్పత్తులను మార్కెట్ చేస్తున్న గుజరాత్ కోఆపరేటివ్ మిల్క్ మార్కెటింగ్ ఫెడరేషన్ (జీసీఎంఎంఎఫ్) దేశవ్యాప్తంగా లీటరు పాల ధరలను రూ.1 మేర తగ్గించింది. ఒక లీటరు ప్యాక్‌లపై మాత్రమే ఈ ధరలు తగ్గాయి. పెద్ద పాల ప్యాక్‌లను వినియోగదారులు కొనేలా ప్రోత్సహించేందుకు ధరలను తగ్గించినట్టు జీసీఎంఎంఎఫ్ మేనేజింగ్ డైరెక్టర్ జయెన్ మెహతా తెలిపారు. ఢిల్లీలో లీటరు అమూల్ గోల్డ్ పాల ధర రూ.68 నుంచి 67కు, అమూల్ తాజా పాల ధర రూ.56 నుంచి రూ.55కు తగ్గించారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో జీసీఎంఎంఎఫ్ టర్నోవర్ 8 శాతం మేర పెరిగి రూ.59,445 కోట్లకు చేరుకుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రెండంకెల వృద్ధిని ఆశిస్తున్నట్టు మెహతా ఇంతకు ముందు పేర్కొన్నారు.

ఇనుప యుగం తమిళనేలపైనే ఆరంభం!

» శివకళైలో బయల్పడిన 5,300 ఏళ్ల నాటి ఇనుప పనిముట్లు



చెన్నై, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): భారతదేశంలో ఇనుప యుగం శాస్త్రవేత్తలు అంచనా వేసిన దానికంటే రెండు వేల ఏళ్ల ముందే ప్రారంభమైందా..? క్రీస్తు పూర్వం 3,345 ఏళ్ల క్రితమే తమిళనాడులో ఇనుప లోహాన్ని వినియోగించారా...? ప్రపంచంలోనే ఇనుప యుగం తమిళనేలపైనే ఆరంభమైందా..? అంటే తాజా అధ్యయనాలు అవుననే చెబుతున్నాయి. తమిళనాట 5,300 సంవత్సరాల క్రితమే ఇనుపయుగం ఆరంభమైనట్లు పురావస్తు శాఖ జరిపిన అధ్యయనంలో తేలింది. తమిళనాడులోని మాంగాడు (సేలం), కీళనమండి (తిరువణ్ణామలై), మయిలాండుంపారై (కృష్ణగిరి), ఆదిచ్చనల్లూరు, శివకళై (తూత్తుకుడి) తదితర ప్రాంతాల్లోని శ్మశానవాటికల్లో జరిపిన తవ్వకాల్లో పలు ఇనుప వస్తువులు లభించాయి. వీటిలో శివకళై వద్ద లభించిన ఇనుప ఆయుధం 5,300 సంవత్సరాల నాటిదని భారత్‌తోపాటు అమెరికాలో జరిపిన పరీక్షల్లో నిర్ధారణ అయింది. శివకళై వద్ద సుమారు 2,000 ఎకరాల స్థలంలో ఇనుప వ్యర్థాలు పరచుకుని ఉండటాన్ని ఆ ప్రాంతానికి చెందిన మాణిక్యం అనే ఉపాధ్యాయుడు గమనించి అక్కడ పురావస్తు తవ్వకాలు చేపట్టాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఆ మేరకు తమిళనాడు ప్రభుత్వం 2020లో తవ్వకాలు ప్రారంభించింది. ఆ తవ్వకాల్లో ఇనుముతో తయారైన కత్తులు, బాణపు కొనలు, ఉంగరాలు, కొడవళ్లు సహా 85కు పైగా ఇనుప పనిముట్లు లభించాయి.

సివిల్స్ అభ్యర్థులకు యూపీఎస్సీ కొత్త నిబంధన

» ప్రిలిమ్స్ దరఖాస్తుతో పాటే వయసు, రిజర్వేషన్ల నిర్ధారణ పత్రాలు తప్పనిసరి

» గతంలో ప్రిలిమినరీ అర్హత సాధించాకే సమర్పించాల్సి ఉండేది

న్యూఢిల్లీ, జనవరి24: సివిల్ సర్వీసుల ప్రిలిమినరీ పరీక్షలు రాసే అభ్యర్థులు ఇకపై ఆన్‌లైన్ అప్లికేషన్‌తో పాటు వయసు, రిజర్వేషన్‌లను నిర్ధారించే పత్రాలను కూడా అప్‌లోడ్ చేయాలని యూపీఎస్సీ సూచించింది. గతంలో ప్రిలిమినరీ పరీక్షలో అర్హత సాధించాక ఈ పత్రాలను సమర్పించాల్సి ఉండేది. ఇటీవల ఓ ఐఏఎస్ ప్రొబేషనర్ పూజా ఖేడ్కర్ తప్పుడు పత్రాలతో ఓబీసీగా ప్రకటించుకోవడంతో పాటు అంగవైకల్యానికి సంబంధించి తప్పుడు పత్రాలు సమర్పించినట్లు ఆరోపణలు రావడంతో యూపీఎస్సీ అధికారులు ఈ నిబంధన పెట్టారు. మరోవైపు యూపీఎస్సీ సివిల్స్- 2025 నోటిఫికేషన్ ఈ నెల 22న విడుదలయింది. అఖిల భారత సర్వీసుల్లో 23 విభాగాల్లోని 979 ఖాళీల భర్తీకి యూపీఎస్సీ ఈ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దరఖాస్తుల దాఖలుకు ఫిబ్రవరి 11వ తేదీ సాయంత్రం 6 గంటల వరకు అవకాశం కల్పించింది. మే 25న ప్రిలిమినరీ పరీక్షను నిర్వహిస్తారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్, వరంగల్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, అనంతపురంలో ప్రిలిమ్స్ పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేస్తారు.

'ఫిట్జీ' కోచింగ్ సెంటర్ల మూత

» ఢిల్లీ సహా దేశవ్యాప్తంగా పలు నగరాల్లో..

» కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో టీచర్ల మూకుమ్మడి రాజీనామాలు

» బోర్డు, ప్రవేశ పరీక్షల ముందు మూతతో ఆందోళనలో వేలాది మంది విద్యార్థులు

» ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న సంస్థ



న్యూఢిల్లీ, జనవరి 24: ఇంజినీరింగ్, నీట్ వంటి ప్రవేశ పరీక్షల కోచింగ్, విద్యార్థుల ఫౌండేషన్ ప్రోగ్రామ్స్‌లలో పేరొందిన ఎఫ్ఐఐటీజేఈఈ(ఫోరం ఫర్ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ-జాయింట్ ఎంట్రన్స్ ఎగ్జామినేషన్- ఫిట్జీ) సెంటర్లు దేశవ్యాప్తంగా పలు నగరాల్లో మూతపడ్డాయి. ఢిల్లీ, మేరట్, ఘజియాబాద్, లఖ్‌నవూ, వారాణసీ, ఇండోర్, భోపాల్, పాట్నా, పుణేతో పాటు తాజాగా నోయిడాలో ఆ సంస్థ కోచింగ్ సెంటర్లను మూసివేశారు. ఆర్థిక, పాలనాపరమైన సవాళ్లు, గత కొన్ని నెలలుగా టీచర్లకు జీతాలు చెల్లించలేకపోవడమే ఇందుకు కారణం! సరిగ్గా కీలకమైన బోర్డు, ప్రవేశ పరీక్షల సమయంలో కోచింగ్ కేంద్రాలను మూసివేయడంపై వేలాది మంది విద్యార్థులు, వారి తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొంత మంది ఫిట్జీ సెంటర్ల ముందు ధర్నాలు చేశారు. నోయిడాలో పోలీసు ఫిర్యాదు చేశారు. 100 మందికి పైగా విద్యార్థుల ఫిర్యాదు మేరకు భోపాల్‌లో ఫిట్జీ సెంటర్‌పై కేసు నమోదైంది. దీంతో కోచింగ్ సెంటర్ లైసెన్స్‌ను జిల్లా యంత్రాంగం రద్దు చేసింది. గత ఏడాది జూన్‌లో తాను రెండేళ్లకు సంబంధించి రూ.4 లక్షల ఫీజును చెల్లించానని, ఇప్పుడు కోచింగ్ సెంటర్‌ను మూసివేయడంతో ఇంజినీర్ కావాలనే తన కుమార్తె కలపై ప్రభావం పడుందని ఓ తండ్రి ఆవేదన వ్యక్తం చేశారు. తాము కష్టపడి సంపాదించి కట్టిన ఫీజును తిరిగివ్వాలని లేదా మిగిలిన కోర్సును పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఐదేళ్ల ప్రోగ్రామ్ ఫీజును ఒకేసారి చెల్లించామని, అందులో ఇంకా రెండేళ్లు ఉందని రాజీవ్ కుమార్ అనే మరో విద్యార్థి తండ్రి తెలిపారు.

నెలలుగా జీతాలు ఇవ్వడం లేదు..

గత కొన్ని నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో చాలా మంది టీచర్లు మూకుమ్మడిగా రాజీనామాలు చేశారని, దీని వలనే కోచింగ్ సెంటర్లు అకస్మాత్తుగా మూతపడ్డాయని హిందుస్థాన్ టైమ్స్ పేర్కొంది. 'నేను నాలుగేళ్లకు పైగా అక్కడ బోధన చేస్తున్నాను. గత ఏడాది జూలై నుంచి జీతాలు ఇవ్వకపోవడంతో.. నేను నవంబర్‌లో పాట్నా కోచింగ్ సెంటర్ నుంచి బయటకు వచ్చేశాను' అని ఒక టీచర్ పేర్కొన్నారు. అధ్యాపకులకు ఇతర కోచింగ్ సెంటర్ల నుంచి మంచి ఆఫర్లు రావడంతో వెళ్లిపోతున్నారని, దీంతో టీచర్లు లేకపోవడంతో మేరట్ సెంటర్‌ను మూసివేయాల్సి వచ్చిందని సిబ్బంది ఒకరు తెలిపారు.

నిధుల మళ్లింపు ఆరోపణలూ..

ఫిట్జీ సంస్థపై నిధులు మళ్లింపు ఆరోపణలు కూడా ఉన్నాయి. కోచింగ్ కార్యకలాపాల నిధులను ఇతర మార్గాలకు మళ్లించడంతో ఆ సంస్థ ఆర్థిక సంక్షోభంలో చిక్కుకుందని, దీని వలన ఇన్వెస్టర్లు, టీచర్లు గుడ్‌బై చెబుతున్నారనే చర్చ నడుస్తోంది. లైసెన్స్, ఫైర్ సేఫ్టీ నిబంధనలు ఉల్లంఘించినందుకు అధికారులు చర్యలు కూడా తీసుకున్నారని ఎన్డీటీవీ పేర్కొంది. మరోవైపు ఫిజిక్స్ వాలా, అన్అకాడమీ వంటి కొత్త సంస్థల నుంచి కూడా ఫిట్జీ విపరీతమైన పోటీ ఎదుర్కొంటోంది. ఐఐటీ ఢిల్లీ నుంచి మెకానికల్ ఇంజినీరింగ్ చేసిన డీకే గోయల్ అనే వ్యక్తి మూడు దశాబ్దాల క్రితం ఎఫ్ఐఐటీజేఈఈ సంస్థను స్థాపించారు. ఫిట్జీ సంస్థకు దేశవ్యాప్తంగా 41 నగరాల్లో 72 కోచింగ్ కేంద్రాలు ఉన్నాయి. వీటిల్లో 300 మంది సిబ్బంది ఉన్నారు.

ఎవుసంపై కేసీఆర్ నజర్

» ఫాంహౌస్‌లో 150 ఎకరాల్లో వెదురు సాగుకు ప్రణాళిక

» ఏడాది నుంచి ఎర్రవల్లి వ్యవసాయ క్షేత్రానికే పరిమితం



ఎర్రవల్లిలోని తన వ్యవసాయ క్షేత్రంలో మనుమడు హిమాన్షుతో కేసీఆర్

గజ్వేల్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ పూర్తిస్థాయిలో ఎవుసంపై దృష్టిపెట్టారు. గతంలో విత్తన వరి సాగు చేసిన ఆయన ఇప్పుడు వెదురుపై ఇష్టాన్ని ప్రదర్శిస్తున్నారు. 2023 డిసెంబరులో ఎన్నికల ఫలితాల అనంతరం సొంత కారులో సిద్దిపేట జిల్లా మర్కుక్ మండలం ఎర్రవల్లిలోని వ్యవసాయ క్షేత్రానికి వచ్చిన కేసీఆర్ అప్పటినుంచి ఇక్కడే ఉంటున్నారు. అడపాదడపా మాజీ మంత్రులు, పార్టీ నాయకులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను కలవడమే తప్ప.. బయటకు రావడం లేదు. 180 ఎకరాల వ్యవసాయ క్షేత్రంలో కేసీఆర్ 30 ఎకరాల్లో వరి పండిస్తున్నారు. 150 ఎకరాల్లో వెదురు సాగుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీనికోసం సలహాలు, సూచనలు అందించేందుకు.. అసెంబ్లీలో ప్రతిపక్ష నేత అయిన కేసీఆర్ తన వ్యక్తిగత కార్యదర్శి (పీఎస్)గా వ్యవసాయాధికారిని ఎంచుకున్నారు. మర్కుక్ మండల వ్యవసాయ అధికారిగా పనిచేస్తున్న తీగుళ్ల నాగేందర్‌రెడ్డి ఇటీవల కేసీఆర్ పీఎస్‌గా నియమితులయ్యారు. వెదురు సాగులో మెలకువలు, చేపట్టాల్సిన చర్యలపై ఈయన దృష్టి కేంద్రీకరించినట్లు తెలుస్తోంది. మొక్కలు నాటే ప్రక్రియ దాదాపు పూర్తయినట్లు సమాచారం.

మేడిగడ్డలో లోపాలను 2019లోనే గుర్తించాం

» ప్రభుత్వానికి నివేదించినా చర్యలు తీసుకోలేదు

» కాళేశ్వరం కమిషన్ ముందు ఎల్ అండ్ టీ ప్రతినిధులు

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): '2019లో తొలి వరదల అనంతరం గేట్లు దించగానే బ్యారేజీ దిగువ భాగంలో వేరింగ్ కోట్, అప్రాన్లు దెబ్బతిన్నాయి. సిమెంట్ కాంక్రీట్ బ్లాకులు చెల్లాచెదురయ్యాయి. అప్పుడే అధికారులకు దీనిపై నివేదిక ఇచ్చాం. తగిన మరమ్మతులు చేయడానికి వీలుగా డిజైన్లు/డ్రాయింగ్‌లు అందించాలని పదే పదే కోరాం. ఆ మరమ్మతులను సకాలంలో చేయనందువల్లే మేడిగడ్డ బ్యారేజీ దెబ్బతింది. బ్యారేజీ దిగువ భాగంలో ఎనర్జీ డిసిపేషన్ ఏర్పాట్లు లేకపోవడమే బ్యారేజీ వైఫల్యానికి కారణం' అని కాళేశ్వరం విచారణ కమిషన్‌కు ఎల్ అండ్ టీ సంస్థ నివేదించింది. కాళేశ్వరం బ్యారేజీలపై విచారణలో భాగంగా మేడిగడ్డ బ్యారేజీ నిర్మాణ సంస్థ ఎల్ అండ్‌టీ ప్రాజెక్టు డైరెక్టర్ ఎం.వి.రామకృష్ణరాజు, ఎల్ అండ్ టీ వైస్‌ప్రెసిడెంట్(హైడల్) ఎస్.సురేష్‌కుమార్, డిప్యూటీ జనరల్ మేనేజర్ రజనీష్ ఎస్.చౌహాన్‌లను కమిషన్ శుక్రవారం క్రాస్ ఎగ్జామినేషన్ చేసింది. మేడిగడ్డ బ్యారేజీ వైఫల్యానికి, బ్లాక్-7 కుంగిపోవడానికి కారణాలేంటని ప్రశ్నించగా రామకృష్ణంరాజు సమాధానమిచ్చారు. 2019 ఆగస్టు 6వ తేదీన తొలిసారి వరద వచ్చిందని 2019 నవంబరులో గేట్లు మూసివేశామని చెప్పారు. "ఆ సమయంలో బ్యారేజీ దిగువభాగంలో రక్షణ వ్యవస్థలు దెబ్బతిన్నాయి. మేడిగడ్డలోనే కాదు... అన్నారం, సుందిళ్లలోనూ ఇదే పరిస్థితి. వరద ప్రవాహ వేగం పెరగడం వల్లే బ్యారేజీలు దెబ్బతిన్నట్లు గుర్తించాం. ఐఐటీ హైదరాబాద్‌కూడా అధ్యయనం చేసి, వరద ప్రవాహ వేగాన్ని కచ్చితంగా అంచనా వేయడంలో లోపాలు, ఎనర్జీ డిసిపేషన్ ఏర్పాట్లు దిగువ భాగంలో లేకపోవడమే కారణమని నివేదిక ఇచ్చారు. అప్పట్లోనే ఆ లోపాలను సవరించడానికి వీలుగా తగిన డిజైన్లు/డ్రాయింగ్‌లు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరాం. నాలుగేళ్లయినా అధికారులు డిజైన్లు/డ్రాయింగ్‌లు అందించలేదు. 2020 జూన్‌లో బ్యారేజీ నిర్మాణం పూర్తయింది. 2022 జూన్ 28వ తేదీన డిఫెక్ట్ లయబులిటీ కాలం పూర్తయింది. ఐదేళ్లపాటు ఓ అండ్ ఎం ఒప్పందం జరిగింది. 2019లో గుర్తించిన లోపాలను సవరించని కారణంగా 2023 అక్టోబరు 23వ తేదీన బ్యారేజీ కుంగింది. బ్యారేజీలను వానాకాలానికి ముందు, వానాకాలం తర్వాత ఖాళీగా ఉంచి... ఎగువ, దిగువ భాగంలో ఏమైనా సమస్యలు ఉన్నాయా అని పరిశీలించి, నివేదికలు తయారు చేయాలి. బ్యారేజీ పూర్తయిన తర్వాత నాలుగేళ్లకాలంలో ఏ రోజు బ్యారేజీని ఖాళీ చేయలేదు. బ్యారేజీ వైఫల్యానికి ఇది కూడా ఒక కారణం." అని వివరించారు. వర్క్ ఆర్డర్ ఇచ్చిన ఆర్నెల్ల తర్వాత బ్యారేజీ నిర్మాణ స్థలాన్ని అప్పగించారని, రెండేళ్లలోపు పూర్తి చేయాలని టార్గెట్ విధించారని చెప్పారు. మేడిగడ్డ నిర్మాణ పనులను ఐటెమ్ రేట్ కాంట్రాక్ట్ (ఎంత పనిచేస్తే అంత చెల్లింపులు) కింద పని అప్పగించారన్నారు. దీనివల్లే తగిన అధ్యయనాలు, పరీక్షలు చేయలేకపోయామని పేర్కొన్నారు. బ్యారేజీని మళ్లీ మరమ్మతులు చేసి, వాడకంలోకి తేవొచ్చా అని కమిషన్ ప్రశ్నించగా... సవరణ డిజైన్లతో మరమ్మతులు చేసి, మళ్లీ వినియోగంలోకి తేవొచ్చని రాజు సమాధానమిచ్చారు. 2019లో బ్యారేజీ దెబ్బతిన్నప్పుడే మరమ్మతులకు తగిన డిజైన్లు ఇచ్చి ఉంటే బ్లాక్-7 కుంగేదే కాదని రాజు కమిషన్‌కు తెలిపారు.

బనకచర్ల ప్రాజెక్టుతో తెలంగాణకు నష్టం: హరీశ్

హైదరాబాద్, జనవరి24 (ఆంధ్రజ్యోతి): గోదావరి జలాలను తరలించేందుకు ఏపీ ప్రభుత్వం నిర్మించదలచిన బనకచర్ల ప్రాజెక్టువల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావు ఆరోపించారు. బనకచర్ల విషయంలో ఏపీ సీఎం చంద్రబాబునాయుడు ముందడుగు వేస్తుంటే తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి, నీటిపారుదల మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఏంచేస్తున్నారన్నారు. ఏపీని అడగడం సీఎంకు చేతకాకుంటే అఖిలపక్షాన్ని తీసుకుపోవాలని.. ఇంత సీరియస్ విషయాన్ని పట్టించుకోకుండా సీఎం, మంత్రులు దావోస్, ఢిల్లీ యాత్రల్లో బిజీగా ఉన్నారని హరీశ్‌రావు ఎద్దేవాచేశారు. కాగా గ్రామసభల్లో తెలంగాణ తిరగబడుతోందన్నారు. సభల్లో జరుగుతున్న ఘటనలు కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ఎత్తిచూపుతున్నాయని 'ఎక్స్'వేదికగా ఆయన పేర్కొన్నారు. 400రోజులపాటు అన్నివర్గాల ప్రజలను విజయవంతంగా మోసం చేసిన కాంగ్రెస్, గణతంత్ర దినోత్సవంనాడు మరోమోసానికి సిద్ధమైందన్నారు.

మంత్రులు, ముఖ్యమంత్రి గ్రామ సభల్లో ఉంటే జనం తరిమికొట్టేవారు : కేటీఆర్

సిరిసిల్ల/హైదరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గ్రామ సభలు రసాభాసగా మారాయని, మంత్రులు, సీఎం ఉంటే ప్రజలు తరిమికొట్టేవారని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. శుక్రవారం సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ బీఆర్ఎస్ ఛైర్‌పర్సన్లు, కౌన్సిలర్లను సన్మానించిన సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ గ్రామ సభల్లో ప్రభుత్వంపై ఉన్న కోపాన్ని ప్రజలు అధికారులపై చూపడంతో అధికారులు బలిపశువులు అవుతున్నారన్నారు. రేవంత్‌రెడ్డికి డైలాగ్‌లు కొట్టడం తప్ప పనిచేయడం చేతకాదని ప్రజలకు అర్థమైందన్నారు. 'కాంగ్రెస్ సర్కార్ కొత్త కంపెనీలంటూ ప్రచారం చేసుకొంటోంది. వాటి సంగతి దేవుడెరుగు..ఉన్న కంపెనీలుపోకుండా చూడాలి' అని కేటీఆర్ దావోస్ ఒప్పందాల గురించి ఎద్దేవా చేశారు.

కిడ్నీ రాకెట్ కేసు సీఐడీకి

ప్రభుత్వం కీలక నిర్ణయం.. నిందితులకు కఠిన శిక్షలు పడేలా చర్యలు

- ఈ దందాలో ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ల పాత్రపై దర్యాప్తు
- ప్రైవేటు ఆస్పత్రుల్లో శస్త్రచికిత్సల వివరాలను నమోదు చేయాలి
- మంత్రి దామోదర ఆదేశాలు



వనస్థలిపురం ఏరియా ఆస్పత్రిలో అలకనంద హాస్పిటల్ యజమాని సుమంత్

హైదరాబాద్, దిల్‌సుఖ్‌నగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సంచలనం సృష్టించిన కిడ్నీ రాకెట్ వ్యవహారాన్ని క్రైమ్ ఇన్వెస్టిగేషన్ డిపార్ట్‌మెంట్ (సీఐడీ)కి అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. హైదరాబాద్‌లోని అలకనంద మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో జరిగిన కిడ్నీ మార్పిడి దందాపై ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వైద్యుల కమిటీ ఇచ్చిన ప్రాథమిక నివేదికను మంత్రి పరిశీలించారు. అలకనంద హాస్పిటల్‌లో కిడ్నీ మార్పిడి శస్త్రచికిత్సలకు ఎటువంటి అనుమతి లేదని, నిబంధనలకు విరుద్ధంగా సర్జరీలు జరిగాయని అధికారులు మంత్రికి వివరించారు. తెలంగాణతో పాటు తమిళనాడు, కర్ణాటకలకు చెందిన వ్యక్తులకు ఈ అక్రమ వ్యవహారంతో సంబంధం ఉందని తెలిపారు. అత్యంత నిరుపేదల ఆర్థిక పరిస్థితిని ఆసరాగా తీసుకుని, వారిని మభ్యపెట్టి కిడ్నీల డొనేషన్‌కు ఒప్పిస్తున్నారన్నారు. అలకనంద హాస్పిటల్‌ను సీజ్ చేశామని, ఆస్పత్రి యజమానిని పోలీసులు అరెస్టు చేశారని మంత్రికి వివరించారు. ఈ కేసులో లోతైన విచారణ జరగాల్సిన అవసరం ఉందన్నారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ.. ఇలాంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలను సహించేది లేదని స్పష్టం చేశారు. కిడ్నీ మార్పిడి దందాను చాలా సీరియస్‌గా పరిగణిస్తున్నామని.. కేసుతో సంబంధం ఉన్నవాళ్లందరికీ కఠినంగా శిక్షలు పడేలా చర్యలు తీసుకుంటామన్నారు. పూర్తిస్థాయి విచారణ కోసం కేసును సీఐడీకి అప్పగించాలని, దీనికి సంబంధించిన ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా చొంగ్తును మంత్రి ఆదేశించారు.

నిందితుల రిమాండ్

అలకనంద ఆస్పత్రి యజమాని సుమంత్, రిసెప్షనిస్ట్ గోపీలను సరూర్‌నగర్ పోలీసులు అరెస్ట్ చేసి గురువారం అర్ధరాత్రి జడ్జి నివాసంలో హాజరుపరిచారు. తనను పోలీసులు కొడుతున్నారని సుమంత్ చెప్పటంతో అతడికి వైద్యపరీక్షలు నిర్వహించాలని జడ్జి పోలీసులను ఆదేశించారు. వనస్థలిపురంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సుమంత్‌కు వైద్యపరీక్షల్లో నిర్వహించారు. అతడికి ఎలాంటి గాయాలు లేవని తేలింది. ఆ నివేదికను మెజిస్ట్రేట్‌కు పోలీసులు సమర్పించారు. అనంతరం, నిందితులు ఇద్దరినీ శుక్రవారం ఉదయం చర్లపల్లి జైలుకు రిమాండ్‌కు తరలించిన పోలీసులు మిగతా నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఇప్పటి వరకు 10 మంది అనుమానితులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. వారిలో ముఖ్యంగా కర్ణాటకకు చెందిన బ్రోకర్లు, వైద్య సిబ్బంది ఉన్నట్లు తెలుస్తుంది. కిడ్నీ దందాలో కీలకంగా వ్యవహరించిన ఓ వైద్యుడు పోలీసులకు చిక్కకుండా కశ్మీర్‌కు పారిపోయినట్లుగా తెలిసింది. కాగా, సుమంత్ వివరాలు వెల్లడించకుండా, అతడిని కోర్టు ముందు హాజరుపరిచేలా అతని వెనుక ఉన్న పెద్దలు పావులు కదిపినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. సుమంత్ కనబడటం లేదంటూ అతని తరఫు న్యాయవాదులు గురువారం హైకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు చేసి, రిమాండ్ ప్రక్రియకు తెర తీశారు. మరోవైపు, అలకనంద ఆస్పత్రిలో అధికారులు సోదాలు జరిపినప్పుడు అక్కడి నుంచి పారిపోయిన వారిలో డాక్టర్ పవన్ అనే నెఫ్రాలజిస్ట్ ఉన్నట్లుగా పోలీసులు గుర్తించినట్లు తెలుస్తుంది. పవన్ నగరంలోని ప్రముఖ ఆసుపత్రుల్లో నెఫ్రాలజీ వైద్యునిగా పని చేస్తున్నట్లు అతను చిక్కితే కీలక సమాచారం లభించే అవకాశం ఉంది. కాగా, కిడ్నీ దందాలో నిందితులను పట్టుకోవటానికి ఓవైపు గాలింపు జరుపుతున్న పోలీసులు మరోవైపు సాంకేతిక ఆధారాలను సేకరించటంపైనా ప్రత్యేక శ్రద్ధ పెట్టారు.

పొరుగు రాష్ట్రాలకు సమాచారం ఇవ్వండి!

గతంలో కేరళలో కూడా కిడ్నీ రాకెట్ తరహా కేసు నమోదైన విషయాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ సమీక్ష సమావేశంలో ప్రస్తావించారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుతం రాష్ట్రంలో చోటుచేసుకున్న ఘటన గురించి కేరళతోపాటు కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలకు సమాచారం ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. అవయవ మార్పిడి అక్రమాలలో ప్రైవేటు అంబులెన్స్ డ్రైవర్ల పాత్ర ఉన్నట్టు గతంలో వచ్చిన ఆరోపణలను గుర్తు చేస్తూ.. ఆ దిశగా కూడా విచారణ జరగాలన్నారు. ప్రైవేటు, కార్పొరేట్ హాస్పిటల్స్‌లో జరుగుతున్న శస్త్రచికిత్సలపై నిఘా ఉంచాలన్నారు. వివరాలనూ నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. హాస్పిటళ్లకు అనుమతులు, రిజిస్ట్రేషన్ రెన్యువల్ విషయాల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులపై కఠిన చర్యలు ఉంటాయని చెప్పారు.

బ్రెయిన్ డెడ్ కేసులపైనా సీఐడీ దర్యాప్తు

అలకనంద హాస్పిటల్ కిడ్నీ మార్పిడి రాకెట్ కేసును రాష్ట్ర ప్రభుత్వం సీఐడీకి అప్పగించిన నేపథ్యంలో.. ఈ వ్యవహారానికి సంబంధించిన ఇతర అంశాలపైనా దర్యాప్తు జరిగే సూచనలు కనిపిస్తున్నాయి. ముఖ్యంగా బ్రెయిన్ డెడ్ కేసుల్లో జరిగిన అవయవ మార్పిడి శస్త్రచికిత్సలపై సీఐడీ దృష్టి పెట్టే అవకాశం ఉంది. బ్రెయిన్ డెడ్ కేసుల్లో మృతుల కుటుంబీకులను ముఖ్యంగా పేదవారిని, అంతగా అవగాహన లేని వారిని లక్ష్యంగా చేసుకొని వారి నుంచి ఏదో విధంగా ఆమోదం పొంది.. అవయవ మార్పిడి శస్త్రచికిత్సలు జరుపుతూ సొమ్ము చేసుకుంటున్నట్లు ఆరోపణలున్నాయి. ఈవ్యవహారంలో ప్రైవేటు అంబులెన్స్ వ్యవస్థ మీదా విమర్శలున్నాయి. ఈ నేపథ్యంలో.. రాష్ట్రంలో జరిగిన బ్రెయిన్ డెడ్ కేసుల్లో జరిగిన అవయవ మార్పిడి ఆపరేషన్లు నిబంధనల ప్రకారమే జరిగాయా? అన్నది సీఐడీ పరిశీలించే అవకాశమున్నట్లు తెలుస్తోంది. జీవన్‌దాన్ వెబ్‌సైట్‌లో పేర్కొన్న గణాంకాల ప్రకారం బ్రెయిన్ డెడ్‌గా ప్రకటించిన కేసులు అత్యధికం ప్రైవేటులోనే ఉన్నాయి. రాష్ట్రంలో ఇప్పటివరకు 1488 బ్రెయిన్‌డెడ్ కేసులు నమోదు కాగా.. వాటిలో 1445 ప్రైవేటు హాస్పిటళ్లలో, 43 ప్రభుత్వ ఆస్పత్రుల్లో నమోదయ్యాయి.

బకెట్‌లో హీటర్‌తో ఉడికించాడు!

(మొదటి పేజీ తరువాయి)

నుంచి తెచ్చాడు? ఆ కత్తిని ఏం చేశాడు? అనేవి తెలియాల్సి ఉంది.

మృతదేహాన్ని పొద్దంతా నరికాడు

అసలేం జరిగిందంటే.. కొన్నాళ్ల క్రితం బంధువుల ఇంట్లో జరిగిన వేడుకలో మాధవి తల్లిదండ్రులు తనతో వ్యవహరించిన తీరును గురుమూర్తి తీవ్ర అవమానకరంగా భావించాడు. అది మనసులో పెట్టుకొని అవకాశం దొరికినప్పుడల్లా మాధవితో గొడవపడేవాడు. సంక్రాంతికి ఇద్దరు పిల్లలను, భార్యను వెంటబెట్టుకొని నగరంలోనే ఉండే తన సోదరి ఇంటికి వెళ్లాడు. పండుగ అక్కడే జరుపుకొన్నారు. బడికి సెలవులు కావడంతో పిల్లలను అక్కడే వదిలేసి, అదేరోజు సాయంత్రం గురుమూర్తి, మాధవి ఇంటికి తిరిగొచ్చారు. మర్నాడు.. అంటే 15న రాత్రి మద్యం మత్తులో భార్యతో గురుమూర్తి గొడవపడి కొట్టాడు. ఆమె విసురుగా కింద పడి అక్కడికక్కడే మృతిచెందింది. కంగారుపడిపోయిన గురుమూర్తి, తాను పట్టుబడకుండా ఉండేందుకు మృతదేహాన్ని మాయం చేయాలనుకున్నాడు. ఇందుకోసం యూట్యూబ్‌లో రాత్రంతా వీడియోలు చూసి ఓ నిర్ణయానికొచ్చాడు. 16న ఉదయం భార్య మృతదేహాన్ని బాత్‌రూమ్ వద్దకు లాక్కెళ్లి.. అక్కడ చెక్క మొద్దుపై మృతదేహాన్ని ముక్కలు ముక్కలుగా నరికాడు. పొద్దంతా అతడు ఇదే పనిలో ఉన్నాడు. రాత్రికి ఆ ముక్కల్ని బకెట్‌లో వేసి హీటర్‌తో ఉడికించాడు. అనంతరం వాటిని మూటగట్టి మీర్‌పేట పెద్ద చెరువులో వేశాడు. ఇంటికి తిరిగొచ్చి ఎలాంటి ఆధారాలు దొరక్కుండా ఇల్లంతా శుభ్రం చేశాడు. ఇంటి యజమాని, తన కుటుంబసభ్యులతో సహా బెంగళూరులో ఉండటం, తన పిల్లలు బంధువుల ఇంట్లో ఉండటంతో గురుమూర్తికి అనుకూలించింది. 17న అత్తామామలకు అతడు ఫోన్ చేసి.. తనతో గొడవపడి మాధవి అలిగి ఇంట్లోంచి వెళ్లిపోయిందని నమ్మించాడు. అదేరోజు మెదక్ జిల్లా తూప్రాన్ మండలం దండుపల్లిలో ఉంటున్న మాదవి తల్లి ఉప్పాల సుబ్బమ్మ మీర్‌పేటకు చేరుకుంది. అల్లుడితో కలిసి బంధువుల ఇళ్లలో, తెలిసినవారి ఇళ్లలో వాకబు చేసినా ఆమె జాడ తెలియరాలేదు. 18న అల్లుడితో కలిసి మీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేసింది. అదేరోజు పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీని పరిశీలించిన పోలీసులకు గురుమూర్తి చెప్పినట్లుగా.. మాధవి ఇంట్లోంచి వెళ్లినట్లు ఎక్కడా కనిపించలేదు. అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా తానే చంపినట్లు ఒప్పుకొన్నాడు. అయితే మాధవిని హత్యచేసినట్లు బలమైన ఆధారాలు లభించకపోవడంతో బ్లూరేస్ టెక్నాలజీతో ఇల్లంతా జల్లెడ పట్టారు. బాత్రూమ్‌లో, గదిలో ఉన్న దుస్తులపై, మృతదేహాన్ని ముక్కలు చేసిన చెక్క మొద్దుపై కంటికి కనిపించని మానవ మాంసపు అవశేషాలు ఈ టెక్నాలజీ ద్వారా పోలీసులకు దొరికాయి. ఈ మేరకు శాస్త్రీయ ఆధారాలను సేకరించి ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. నిందితుడు గురుమూర్తిపై హత్య కేసు నమోదు చేశారు. శనివారం అతడిని రిమాండ్ చేసే అవకాశం ఉన్నట్లు సమాచారం. అతడిచ్చిన సమాచారంతో మీర్‌పేట పెద్దచెరువులో వెతగ్గా మృతదేహానికి సంబంధించిన భాగాల ముద్దలను పోలీసులు గుర్తించినట్లు కూడా తెలిసింది.

మా కుమార్తెలా ఏ అమ్మాయీ మోసపోవొద్దు

- బాజీ మాయమాటలు చెప్పి వలలో వేసుకున్నాడు
- అతడిని పెళ్లి చేసుకొని జీవితాన్ని నాశనం చేసుకుంది
- మౌనిక తల్లిదండ్రులు.. మృతదేహం వద్ద కన్నీరు

మధిర రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మౌనిక తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు! ఓ మోసగాడి మాటలను నమ్మి, పెళ్లి చేసుకొని, జీవితాన్నే నాశనం చేసుకుందని కన్నీరుమున్నీరయ్యారు. తమ కూతురిని కడసారి చూసేందుకు వారు హైదరాబాద్ నుంచి శుక్రవారం ఖమ్మం జిల్లా మధిర మండలం నిదానపురం గ్రామానికొచ్చారు. తన భర్త దొంగ అని తెలియడం, వివిధ చోరీలకు సంబంధించి పోలీసులొచ్చి అతడిని తీసుకెళ్లడాన్ని తీవ్ర అవమానంగా భావించి గురువారం ఉదయం ఇంట్లోనే ఇద్దరు కూతుళ్లను చంపి, మౌనిక ఉరివేసుకున్న సంగతి తెలిసిందే. ఖమ్మం ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం గురువారం అర్ధరాత్రి తర్వాత మృతదేహాలను నిదానపురానికి తీసుకొచ్చారు. బాజీ మాయమాటలు చెప్పి తమ కూతురు మౌనికను వలలో వేసుకున్నాడని తల్లిదండ్రులు విలపిస్తూ చెప్పారు. బాజీతో పెళ్లి వొద్దని అప్పట్లోనే చెప్పామని, అయినా తమ మాట వినకుండా బాజీని పెళ్లి చేసుకుని జీవితాన్ని నాశనం చేసుకుందని కన్నీళ్లపర్యంతమయ్యారు. ఆడపిల్లలెవరూ ఇలా మోసగాళ్ల వలలో పడొద్దని.. విలువైన జీవితాన్ని కోల్పోవొద్దని, పెద్దల మాటలు వినాలని సూచించారు. ఈనెల 16న చివరిగా తమకు మౌనిక ఫోన్ చేసిందని మృతురాలి మేనత్త చెప్పింది. 'మీ అమ్మానాన్న మీ చెల్లెనే ఎక్కువగా చూసుకుంటూ నిన్ను పట్టించుకోవడం లేదు.. వెళ్లి డబ్బులు తీసుకురా..' అని తనను బాజీ బెదిరిస్తున్నట్లుగా ఫోన్లో ఆమె చెప్పిందని మౌనిక మేనత్త వెల్లడించారు. 2 గంటల పాటు గ్రామంలో ఉన్న మౌనిక తల్లిదండ్రులు, బంధువులు అనంతరం వెళ్లిపోయారు. బాజీని పోలీసులు గురువారమే జైలుకు తరలించారు.

ఎంటెక్ చదివిన మౌనిక

మౌనిక ఉన్నత విద్యావంతురాలు. ఎంటెక్ పూర్తి చేసింది. ఈమె తల్లిదండ్రులు ప్రభుత్వ ఉద్యోగాలు చేస్తూ హైదరాబాద్ హయత్‌నగర్‌లో నివాసముంటున్నారు. వారికి మౌనికతో పాటు మరో కూతురు ఉంది. ఆమె లండన్‌లో ఉంటోంది. ఆరేళ్ల క్రితం మౌనికకు రైల్లో బాజీ పరిచయమయ్యాడు. అతడు డిగ్రీ మధ్యలోనే వదిలేశాడు. అతడి కుటుంబానికి కొద్దిపాటి పొలం ఉంది. తల్లిదండ్రులు కూలీ పనికి వెళుతుంటారు. తనకు ఆస్తిపాస్తులున్నాయని, మున్ముందు చదువు కొనసాగిస్తానని మౌనికకు మాయమాటలు చెప్పి వలలో వేసుకున్నాడు. తల్లిదండ్రులు అభ్యంతర పెట్టినా మౌనిక అతడిని మతాంతర వివాహం చేసుకుంది. వీరికి ఇద్దరు ఆడపిల్లలు మెహక్(5), మెనురూల్(4) ఉన్నారు. గత కొన్ని సంవత్సరాలుగా నుంచి ఈమె భర్త బాజీ ఏపని చేయకుండా జులాయిగా తిరుగుతూ సులువుగా డబ్బు సంపాదించేందుకు దొంగతనాలకు అలవాటుపడ్డాడు. పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు.



గాయపడ్డ బాలికను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

పెచ్చులూడిన అంగన్‌వాడీ భవనం పైకప్పు

- ఆరుగురు చిన్నారులకు గాయాలు

నారాయణఖేడ్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ మండల పరిధిలోని వెంకటాపూర్‌లో శుక్రవారం అంగన్‌వాడీ కేంద్రం పైకప్పు పెచ్చులు ఊడి పడడంతో ఆరుగురు చిన్నారులు గాయపడ్డారు. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అంగన్‌వాడీ కేంద్రం ప్రారంభమైన కొద్దిసేపటికే పై పెచ్చులూడి చిన్నారులపై పడ్డాయి. దీంతో అభిలాశ్, మౌనిక, వనిత, అంకిత, హారిక, ప్రణయ్‌కుమార్‌లకు గాయాలయ్యాయి. వారిని నారాయణఖేడ్ ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఎమ్మెల్యే సంజీవరెడ్డి, కలెక్టర్ వల్లూరి క్రాంతి చికిత్స పొందుతున్న చిన్నారులను పరామర్శించారు. నారాయణఖేడ్ ఇన్‌చార్జి సీడీపీవో సుజాత, అంగన్‌వాడీ టీచర్ అంబికను కలెక్టర్ సస్పెండ్ చేశారు.

రెండు ప్రాణాలు తీసిన రూ.వెయ్యి

- స్నేహితులే హంతకులు!

ఖిల్లా(నిజామాబాద్), జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : వెయ్యి రూపాయల కోసం ఓ వ్యక్తిని, అతడి ఆచూకీ అడిగిన మరొకరిని స్నేహితులే హత్య చేసిన ఘటన నిజామాబాద్ నగరంలో వెలుగు చూసింది. వివరాలను నిజామాబాద్ ఏసీపీ రాజవెంకటరెడ్డి నిజామాబాద్‌లోని తన కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. నిజామాబాద్ నగరానికి చెందిన ఎండీ.అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్, మహ్మద్ బహదూర్(40), సయ్యద్ యూసుఫ్(40) స్నేహితులు. వీరంతా కూలీ పనులు చేయడంతో పాటు శ్మశానాల్లో కాలిన బూడిదలో నుంచి బంగారం సేకరించేవారు. ఈ నెల 18వ తేదీన అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్, బహదూర్ కలిసి బైక్‌పై నిజాంసాగర్ కాలువకు ఆనుకొని ఉన్న శ్మశానవాటికకు వెళ్లారు. అక్కడ బంగారం కోసం వెతకగా.. ఏమీ దొరకలేదు. తర్వాత బహదూర్ వద్ద ఉన్న రూ.వెయ్యితో ముగ్గురూ కలిసి మద్యం తాగారు. అనంతరం మరో శ్మశాన వాటిక వద్దకు వెళ్లారు. అక్కడా బంగారం దొరకలేదు. దీంతో మద్యానికి తానిచ్చిన వెయ్యి రూపాయలు ఇవ్వాలంటూ అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్‌తో బహదూర్ గొడవకు దిగాడు. కోపోద్రిక్తులైన వారు అతడి తలపై కర్రలతో కొట్టి హత్య చేశారు. అతడి మృతదేహాన్ని సమీపంలో ఉన్న చెరువులో పడేశారు. ఈ నెల 19వ తేదీన యూసుఫ్.. బహదూర్ గురించి ఇద్దరినీ అడిగాడు. దీంతో యూసుఫ్ ద్వారా విషయం బయటకు వస్తుందని భయపడ్డ అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్.. అతణ్ని కూడా హత్య చేయాలని నిర్ణయించుకున్నారు. స్నానానికి వెళదామని యూసుఫ్‌ను నగరంలోని బాబన్ సహాబ్‌పహాడ్ వద్ద గల చెరువు వద్దకు తీసుకెళ్లారు. అక్కడ నీటిలో ముంచి హత్య చేశారు. నిజామాబాద్ సౌత్ రూరల్ సీఐ ఆధ్వర్యంలో పోలీసులు సెల్‌ఫోన్ సిగ్నళ్ల ఆధారంగా పరిశోధన జరిపారు. అమర్‌ఖాన్, రియాజ్‌ఖాన్‌లను విచారించగా నేరం అంగీకరించడంతో. హత్య కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఏసీపీ తెలిపారు.

మాజీ ఎమ్మెల్యే పెద్దికి రేషన్ కార్డు?

పరిశీలిస్తున్న అధికారులు

నల్లబెల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ పార్టీ నర్సంపేట మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి రేషన్ కార్డు వ్యవహారం చర్చనీయాంశంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వంలో నర్సంపేట ఎమ్మెల్యేగా, సివిల్ సప్లయి చైర్మన్‌గా పెద్ది కొనసాగారు. నాటి ప్రభుత్వంలో రేషన్ కార్డు దరఖాస్తు చేసుకోలేదు. అసలు గత ప్రభుత్వంలో కొత్త రేషన్ కార్డులు ఇచ్చిన దఖాలాలు కూడా లేవని ప్రజలు అంటున్నారు. నేటీ కాంగ్రెస్ ప్రభుత్వంలో రేషన్ కార్డుకు దరఖాస్తు చేసుకోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రజల్లో తీవ్రంగా చర్చ నడుస్తోంది.

కులగణన సమగ్ర సర్వే, ప్రజా పాలన కుటుంబ వివరాలు

తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సమగ్ర కుటుంబ కులగణన సర్వే, ప్రజా పాలన కుటుంబ వివరాలు సర్వే చేసింది. మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి స్వగ్రామం నల్లబెల్లిలో కులగణన సమగ్ర కుటుంబ సర్వే అధికారులు పెద్ది ఇంటికి వెళ్లారు. అనంతరం సమగ్ర కులగణన కుటుంబ సర్వే ఫామ్‌లో కుటుంబ వివరాలను నింపుతున్న క్రమంలో రేషన్ కార్డుకు సంబంధించి రేషన్ కార్డు ఉన్నట్లు అయితే రేషన్ కార్డు నెంబరు రాయండి లేదంటే 00ను రాయండి అని కాలంలో ఉంది. దీంతో పెద్దికి రేషన్ కార్డు లేదు కాబట్టి 00 ను ఫామ్ కాలంలో నింపడంతో.. దీంతో రేషన్ కార్డు అన్‌లైన్ ద్వారా కొత్తగా నెంబర్ వచ్చి ఉంటుందని అధికారులు తెలియజేస్తున్నారు.

గుర్తు తెలియని మహిళ దారుణ హత్య

మేడ్చల్ టౌన్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): గుర్తుతెలియని ఓ మహిళ దారుణ హత్యకు గురయింది. మేడ్చల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మునీరాబాద్ గ్రామ శివారులోని ఓఆర్ఆర్ అండర్ పాస్ వంతెన కింద తగులబెట్టిన స్థితిలో ఉన్న ఓ మహిళ మృతదేహాన్ని శుక్రవారం స్థానికులు చూసి పోలీసులకు సమాచారమిచ్చారు. మృతురాలిని వివాహితగా భావిస్తున్నారు. ఆమె వయసు 20-25 ఏళ్ల మధ్య ఉంటుందని, ఒక చేతిపై రోహిత్, మరో చేతిపై శ్రీకాంత్ అనే పేర్లు టాటూలు ఉన్నట్టు గుర్తించారు. బండరాయితో తలపై బాది హత్య చేసిన అనంతరం కాలబెట్టి ఉంటారని పోలీసులు భావిస్తున్నారు.

కేటీఆర్‌పై ఎన్నికల కేసు కొట్టివేసిన హైకోర్టు



హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): పార్లమెంట్ ఎన్నికల కోడ్ అమలులో ఉండగా అనుమతి లేకుండా విలేకరుల సమావేశం పెట్టారంటూ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై పెట్టిన కేసును శుక్రవారం హైకోర్టు కొట్టివేసింది. ఆయనతో పాటు బీఆర్ఎస్ నాయకులు మాగంటి గోపీనాథ్, గడ్డం ఆశిష్‌కుమార్ యాదవ్, పీ శ్రీకాంత్, ఇనాయత్ అలీ బార్కీ, మొహమ్మద్ సలాహుద్దీన్ లోధీ తదితరులపై ఉన్న కేసును కూడా కొట్టేసింది. కేటీఆర్, సహా ఇతర నిందితులు దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను జస్టిస్ కే లక్ష్మణ్ ధర్మాసనం అనుమతించింది. రాష్ట్ర ప్రభుత్వ అధికారిక ముద్ర నుంచి చార్మినార్ గుర్తును తొలగించరాదని కోరుతూ కేటీఆర్ తదితరులు అనుమతి లేకుండా ప్రెస్‌మీట్లు పెట్టి నిరసన కార్యక్రమాలు నిర్వహించారని చార్మినార్ పోలీసులు కేసు పెట్టారు. వాదనలు విన్న ధర్మాసనం దీన్ని కొట్టివేసింది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

తటస్థ తీర్పరి

జమ్మూకశ్మీర్‌లో నిర్మిస్తున్న కిషన్‌గంగ, రాట్లే జలవిద్యుత్ కేంద్రాలకు సంబంధించి భారత్ పాకిస్థాన్ మధ్య విభేదాలను పరిష్కరించే అధికారం తనకు ఉన్నదని ప్రపంచబ్యాంకు నియమించిన తటస్థనిపుణుడు ఇటీవల చేసిన నిర్ధారణ భారతదేశానికి పెద్ద ఉపశమనం. తటస్థ నిపుణుడు మైఖేల్ లీనో తీసుకున్న ఈ నిర్ణయం అనాదిగా భారత్ వాదనను సమర్థించిందని మనదేశం ప్రకటించింది. సింధునదీ జలాల ఒప్పందం ప్రకారం ఉభయదేశాల మధ్యా రేగిన ఈ విభేదాలను పరిష్కరించే అధికారం, సామర్థ్యం తటస్థ నిపుణుడికి మాత్రమే ఉన్నదని భారతదేశం వాదిస్తున్న విషయం తెలిసిందే. అయితే, 1960లో ఉభయదేశాలూ చేసుకున్న ఈ నదీజలాల ఒప్పందాన్ని మారిన పరిస్థితుల నేపథ్యంలో సమీక్షించి, సవరించుకోవాలంటూ భారతదేశం రెండేళ్ళుగా పాకిస్థాన్‌ను పోరుతున్న అంశానికీ, ఈ సరికొత్త పరిణామానికీ సంబంధం లేదు. దీనికితోడు, తీర్పరి ఎవరంటూ ఎంతోకాలంగా రెండుదేశాల మధ్యా సాగుతున్న వివాదాన్ని ఈ నిర్ణయం కొత్తమలుపు తిప్పిన మాట నిజం.

సింధునదికి ఉపనదులైన జీలం, చినాబ్‌మీద భారతదేశం జలవిద్యుత్ కేంద్రాలను నిర్మిస్తూండటం పాకిస్థాన్ వ్యతిరేకిస్తోంది. ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంలో, రెండుదేశాలమధ్యా ఆరుదశాబ్దాల క్రితం కుదిరిన ఈ ఒప్పందానికి లోబడి ఈ ప్రాజెక్టుల నిర్మాణం జరిగిందని, నీటి స్వేచ్ఛా ప్రవాహాన్ని ఈ నిర్మాణాలు ఏమీ అడ్డుకోవడం లేదని భారతదేశం అంటోంది. అయినా, ఈ రెండు ప్రాజెక్టులమీద పాకిస్థాన్ అభ్యంతరం లేవనెత్తి ఆర్బిట్రేషన్ కోర్టును ఏర్పాటుచేయవలసిందిగా ప్రపంచ బ్యాంకును డిమాండ్ చేసింది. వివాద పరిష్కారానికి తటస్థ నిపుణుడి నియామకాన్ని ఒప్పందం నిర్దేశిస్తున్నదని భారతదేశం గుర్తుచేసింది. తగువు ఎవరు తీర్చాలన్న అంశంమీద ఈ రెండుదేశాల తగువుతో తలపట్టుకున్న ప్రపంచబ్యాంకు ఉభయులవాదనలకూ లొంగింది. భారత్ కోరినమేరకు మైఖేల్ లీనోను తటస్థనిపుణుడిగా, పాక్ కోరినప్రకారం షాన్ మర్ఫీ అధ్యక్షతన మధ్యవర్తిత్వకోర్టునూ 2022లో నియమించింది. ఇలా రెండు వివాద పరిష్కార వ్యవస్థలు ఉండటం సమస్యను మరింత జటిలం చేస్తుందని, ఒకే సమస్యకు రెండు పరిష్కారాలు ముందుకు వస్తే ఆచరణలో సమస్యలు తలెత్తుతాయని భారత్ స్పష్టంచేస్తూ వచ్చింది. ఈ నేపథ్యంలో, తానే తీర్పరినంటూ తటస్థనిపుణుడు చేసిన ప్రకటనను భారత్ స్వాగతించడం సహజం.

రెండుదేశాలూ కూడా మొదట తటస్థనిపుణుడి విషయంలో ఏకాభిప్రాయంతోనే ఉన్నప్పటికీ, 2016లో పాకిస్థాన్ మనసు మార్చుకొని ఆర్బిట్రేషన్ కోర్టును డిమాండ్ చేయడం, ఆ ప్రతిపాదనను ఆదిలో తిరస్కరించిన ప్రపంచబ్యాంకు ఆఖరుకు లొంగిరావడం భారత్‌కు ఆగ్రహం కలిగించింది. హేగ్‌లో ఈ కోర్టులో జరిగేవాదోపవాదాలకు హాజరుకాకుండా తన నిరసనను తెలియచేస్తూ వచ్చింది. వివాదాన్ని పరిష్కరించే అధికారం తటస్థ నిపుణుడికి ఉన్నదని ఈ కొత్త పరిణామం తేల్చినప్పటికీ, ఆర్బిట్రేషన్ కోర్టుకు ఏ అధికారాలూ ఉండబోవని కాదు. సాంకేతికాంశాలను నిగ్గుతేల్చే న్యాయం చెప్పే అధికారం నిపుణుడికి ఉన్నప్పటికీ, కోర్టు పరిధిలోకి వచ్చే మిగతా కొన్ని అంశాలు అలాగే ఉంటాయన్నది సదరు ప్రకటన సారాంశం. కిషన్‌గంగ, రాట్లే జలవిద్యుత్ ప్రాజెక్టుల సాంకేతిక, నిర్మాణ అంశాలమీద రాబోయే రోజుల్లో ఈ తటస్థనిపుణుడి సమక్షంలో ఉభయదేశాలూ తమ వాదనలను వినిపించవచ్చు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించి పాకిస్థాన్ లేవనెత్తిన ఏడు అభ్యంతరాలూ ఈ నిపుణుడి పరిధిలోకి రాబోతూండటం, ఆర్బిట్రేషన్‌కోర్టు ఈ అంశాల జోలికి రాకపోవడం భారతదేశానికి మేలుచేస్తుందని విశ్లేషకుల అభిప్రాయం. తటస్థ నిపుణుడి నిర్ణయానికి ఉభయపక్షాలూ కట్టుబడటం గతంలో జరిగినప్పటికీ, మూడుదశల పరిష్కార వ్యవస్థలో పైస్థాయిలో కోర్టు కూడా ఉన్నందున పాకిస్థాన్ కొత్త మెలికలు పెట్టవచ్చునన్న అనుమానాలూ ఉన్నాయి. నెహ్రూ–అయూబ్‌ఖాన్ సంతకాలు చేసిన ఈ సింధునదీజలాల ఒప్పందం తొమ్మిదేళ్ళ సుదీర్ఘచర్చల అనంతరం ప్రపంచబ్యాంకు మధ్యవర్తిత్వంలో అత్యంత పటిష్ఠంగా రూపుదిద్దుకుంది. అనంతరకాలంలో అనేక దేశాలమధ్య ఈ తరహా ఒప్పందాలకు ఇది ఆదర్శంగా నిలిచింది. భారత్–పాకిస్థాన్ మధ్య కించిత్తు సయోధ్య లేకున్నా ఆరుదశాబ్దాలుగా నిలిచిన ఈ ఒప్పందాన్ని వివాదాల్లోకి లాగకుండా జాగ్రత్తపడటం ఇరువురికీ మంచిది.

వెలుగు బాటలో వైరుధ్యాల భారతం!

నిజానికి, ఈ కొత్త రాజ్యాంగచట్టం కింద ఏదైనా పొరపాటు జరగడమే కనుక సంభవిస్తే, అందుకు కారణం అది దుష్టమైన రాజ్యాంగమవటం వల్ల మాత్రం కాదు. మనం చెప్పగలిగేదేమంటే, మనిషి దుష్టుడని.

– బి. ఆర్. అంబేద్కర్
4 నవంబర్ 1948న రాజ్యాంగ సభలో

ఈ నెల 26న మనం భారత రాజ్యాంగ 75వ వార్షికోత్సవాన్ని జరుపుకోనున్నాం. ప్రస్తుతం అధికారంలో ఉన్న రాజకీయవేత్తలకు, అట్టహాసంగా వేడుకలు నిర్వహించేందుకు అదొక సందర్భమవుతుంది. తమ పాలన గురించి ఘనంగా చెప్పుకునేందుకు వారు ఆ శుభ దినాన్ని ఒక అవకాశంగా ఉపయోగించుకుంటారు. రాజ్యాంగాన్ని ఆమోదించే ముందు నాటి న్యాయశాఖ మంత్రి, రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చేసిన హెచ్చరికలను గుర్తుచేస్తూ దేశ పాలకుల ఉల్లాసోత్సాహాల మనస్థితిని నిగ్రహించదలుచుకున్నాను.

రాజ్యాంగ స్వరూప స్వభావాలు, నియమ నిబంధనల గురించి మూడు సంవత్సరాల పాటు జరిగిన చర్చలలో అంబేద్కర్ పలుమార్లు జోక్యం చేసుకుంటూ ఆ చర్చలను నిర్ణయాత్మకంగా ప్రభావితం చేశారు. 4 నవంబర్ 1948న

> '1950 జనవరి 26న మనం మన వైరుధ్యాల జీవనంలోకి ప్రవేశించనున్నాం. రాజకీయంగా మనకు సమానత్వం ఉంటుంది కానీ, సామాజిక ఆర్థిక జీవనంలో అసమానతలు ఉంటాయి. ఒక మనిషికి ఒక వోటు, ఒక వోటుకు ఒక విలువ అన్న సూత్రాన్ని మనం రాజకీయాల్లో గుర్తిస్తాం. మన సామాజిక ఆర్థిక నిర్మాణం కారణంగా ఒక మనిషికి ఒక విలువ ఇచ్చే సూత్రాన్ని పాటించడం జరగదు. మన సామాజిక, ఆర్థిక జీవనంలో ఎంతకాలం సమానత్వ తిరస్కరణ కొనసాగుతుంది?' డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 75 సంవత్సరాల క్రితమే వర్తమాన భారతదేశానికి సంధించిన ప్రశ్న అది!

రాజ్యాంగ ముసాయిదాను సమర్పిస్తూ ఒక అసాధారణ ప్రసంగం చేశారు. ఒక ఏడాది అనంతరం రాజ్యాంగం తుది ప్రతిని సభకు నివేదిస్తూ మరో చరిత్రాత్మక ప్రసంగం వెలువరించారు. రెండో సందర్భంలో వెలువరించిన ప్రసంగంలోని పలు భాగాలు సుప్రసిద్ధమైనవే అయినా మళ్లీ మళ్లీ గుర్తు చేసుకోవలసిన ప్రాధాన్యమున్నవి. అవి భారతీయుల వీరారాధన ప్రవృత్తికి సంబంధించినవి. "ప్రజాస్వామ్యాన్ని రూపంలోనే కాక, వాస్తవంగా కూడా పరిరక్షించుకోవాలంటే మనం చెయ్యవల్సిందేమిటి? జాన్ స్టువర్ట్ మిల్ చేసిన హెచ్చరికను ఎప్పుడూ మనసులో ఉంచుకోవడం. ప్రజాస్వామ్య పరిరక్షణలో ఆసక్తి ఉన్న వారందరూ కూడా 'ఓ గొప్ప మనిషి' కాళ్ల ముందు మన స్వేచ్ఛను సమర్పించటం గానీ, అతడికి అధికారాలను అప్పగించటం గానీ జరిగితే, వారి వ్యవస్థలన్నింటినీ విధ్వంసం చేయగల అవకాశం అతడికి లభిస్తుంది కనుక, అలాంటి పని చేయకూడదు" అని మిల్ హెచ్చరించారు. అంబేద్కర్ ఇంకా ఇలా అన్నారు: 'మిల్ హెచ్చరిక మన దేశంలో మరింతగా అవసరం. ఎందుకంటే ఇక్కడ భక్తి, లేక నాయకుడి పట్ల అతి గౌరవం చెప్పలేని పరిమాణంలో రాజకీయాల్లో పాత్ర వహిస్తుంది; ప్రపంచంలోని మరే దేశంలోనూ ఈ నాయకత్వ పూజ ఇంతగా రాజకీయాల్లో జోక్యం చేసుకోదు. మత పరంగా భక్తి పరుడైతే అది మోక్ష మార్గమవవచ్చు. ఆత్మకు విముక్తి కలగవచ్చు. అయితే రాజకీయంలో భక్తి లేక నాయక పూజ పతనానికీ, అంతిమంగా నియంతృత్వానికీ దారితీసే నిశ్చయమైన మార్గం'.

1970ల్లో ఇందిరాగాంధీ వ్యక్తి పూజ, ఇప్పుడు నరేంద్ర మోదీ వీరారాధనను గమనిస్తే అంబేద్కర్ వ్యాఖ్యలు ఎంతో ముందు తెలివిడితో చేసినవిగా లేవూ? ఇందిర, మోదీ వ్యక్తి పూజలు వేర్వేరు తీరుల్లో భారత ప్రజాస్వామ్యాన్ని దిగజార్చివేశాయి. ఈ గుడ్డి ఆరాధనా ప్రవృత్తి రాజకీయేతర రంగాలలోని ప్రముఖులు– క్రికెటర్లు, సినిమా తారలు, వ్యాపార సమ్రాట్‌లు– తదితరుల పట్ల కూడా విపరీతంగా వ్యక్తమవడం అంబేద్కర్‌ను విస్మయపరిచి ఉండేది కాదు. అయితే ఈ నాటి తన సొంత అనుయాయులు సైతం తనపట్ల అమిత భక్తి ప్రపత్తులు చూపడం బహుశా అంబేద్కర్‌ను ఇబ్బందికి లోను చేసి ఉండేది.

రాజ్యాంగ సభలో తన చివరి ప్రసంగంలో అంబేద్కర్ హెచ్చరిక కూడా వర్తమానానికి ఎంతో ప్రాసంగికత ఉన్నదే అనటంలో సందేహం లేదు. 'మన రాజకీయ ప్రజాస్వామ్యాన్ని ఒక సామాజిక ప్రజాస్వామ్యంగా రూపొందించుకోవాలని' ఆయన నొక్కి చెప్పారు. ఆయన ఇలా అన్నారు: '1950 జనవరి 26న మనం మన వైరుధ్యాల జీవనంలోకి ప్రవేశించబోతున్నాం. రాజకీయంగా మనకు సమానత్వం ఉంటుంది కానీ, సామాజిక ఆర్థిక జీవనంలో అసమానత్వం ఉంటుంది. ఒక మనిషికి ఒక వోటు, ఒక వోటుకు ఒక విలువ అన్న సూత్రాన్ని మనం రాజకీయాల్లో గుర్తిస్తాం. సామాజిక, ఆర్థిక జీవితంలో మన సామాజిక ఆర్థిక నిర్మాణం కారణంగా ఒక మనిషికి ఒక విలువ ఇచ్చే సూత్రాన్ని పాటించడం జరగదు. ఎంత కాలం మనం ఈ వైరుధ్యాల జీవితాన్ని గడపాలి? మన సామాజిక, ఆర్థిక జీవనంలో ఎంతకాలం సమానత్వ తిరస్కరణ కొనసాగుతుంది?'

కుల పరమైన అసమానతలు భారతీయ సమాజాన్ని ఎంతగా వికృతం చేశాయో వ్యక్తిగత అనుభవం, విద్వత్ పరిశోధన ద్వారా అంబేద్కర్‌కు పరిపూర్ణ అవగాహన ఉంది. జెండర్ అసమానతలపై కూడా తన సమకాలీన పురుష రాజకీయవేత్తల కంటే ఆయనే ఎంతో జాగరూకత చూపేవారు. దళితులు, మహిళలతో సహా వయోజనులు అందరికీ ఓటు హక్కు కల్పించడం ద్వారా ఒక వ్యక్తి ఒక వోటు అనే సూత్రాన్ని రాజ్యాంగం స్థిరపరిచింది. అయితే ఆ సంవిధానం అమలులోకి వచ్చిన 75 సంవత్సరాల తరువాత కూడా ఒక మనిషి ఒక విలువ అనే సూత్రం ఆమోదం పొందనే లేదు.

రాజకీయాలలో సమానత్వం, సామాజిక ఆర్థిక జీవనంలో అసమానతలు అనే మన జాతి జీవన వాస్తవాన్ని నిరసించడంలో దళితుల, మహిళల హక్కులే ప్రధానంగా ఆయన దృష్టిలో ఉన్నాయి. మన సమాజంలో ఉన్న మరో రెండు దుర్బల వర్గాల వారి పట్ల అంబేద్కర్ స్వల్ప శ్రద్ధ మాత్రమే చూపారు. ఆ సామాజిక వర్గాలు ఆదివాసీలు, మత మైనారిటీలు. 75 సంవత్సరాల 'రాజ్యాంగ బద్ధ' ప్రజాస్వామ్యంలో మధ్య భారతంలోని గిరిజన సముదాయాలు పొందిన లబ్ధి స్వల్పాతి స్వల్పమని, కోల్పోయింది అపారమని వర్జీనియస్ క్సాక్సా, నందినీ సుందర్, ఫెలిక్స్ పాడెల్ మొదలైన మానవ శాస్త్రవేత్తలు ధ్రువీకరించారు.

మత మైనారిటీల విషయానికి వస్తే ముస్లింలు తాము దగా పడ్డామని భావిస్తున్నారు. స్వాతంత్ర్య ఆగమన సమయంలో తమకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో ప్రభుత్వాలు శ్రద్ధ చూపడం లేదని వారు వాపోతున్నారు. పాకిస్థాన్ ఆవిర్భవించిన తరువాత కోట్లాది ముస్లింలు భారత్‌లోనే ఉండిపోయారు. ఇతర మతస్థులతో పాటు ముస్లింలకు కూడా సంపూర్ణ పౌరసత్వ హక్కులు ఉంటాయనే విషయమై ఆ నాటి ప్రభుత్వం తమకు ఇచ్చిన హామీ నెరవేరకపోవడం పట్ల వారు అమితంగా బాధపడుతున్నారు. దశాబ్దాలుగా, మరీ ముఖ్యంగా 2014 నుంచి ముస్లింలకు పౌరసత్వ హక్కులను క్రమంగా నిరాకరిస్తున్నారు. ఆ మతస్థులను పలు విధాల వేధింపులకు గురిచేస్తున్నారు. వారి దేశభక్తిని శంకిస్తున్నారు. వివిధ కళంకాలను వారికి ఆపాదిస్తున్నారు. సామాజిక అసమానతలు, వీరారాధన ప్రవృత్తి విషయమై అంబేద్కర్ రాజ్యాంగ సభలో చేసిన హెచ్చరికలు ప్రస్తుతం మన దేశం, భారతీయులు ఉన్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని సూటిగా చేసినవిగా లేవూ?! అంతకు ఒక సంవత్సరం ముందు రాజ్యాంగ సభలోనే ఆయన ఎంతో దూర దృష్టితోనే చేసిన హెచ్చరికలను కూడా మనం తప్పక గుర్తు చేసుకోవాలి. ముఖ్యంగా 'రాజ్యంగ నైతికత'ను మనం పెంపొందించుకోవల్సిన అవసరముందని ఆయన నొక్కి చెప్పడాన్ని మనం తప్పక జ్ఞాపకం చేసుకోవాలి. రాజ్యాంగ నైతికత గురించి 19వ శతాబ్ది గ్రీస్ చరిత్రకారుడు జార్జి గ్రోట్ చెప్పిన దాన్ని అంబేద్కర్ తన ప్రసంగంలో ఉటంకించారు. గ్రోట్ ఇలా చెప్పారు: 'రాజ్యాంగ రూపాల పట్ల అత్యున్నత గౌరవం చూపాలి. రాజ్యాంగ వ్యవస్థల లోపల పనిచేస్తూ అధికారం పట్ల విధేయత చూపిస్తూ, స్వేచ్ఛగా మాట్లాడాలి. పార్టీల మధ్య విభేదాలు ఎంతగా ఉన్నప్పటికీ అన్ని రాజ్యాంగ రూపాల పట్ల తన ప్రత్యర్థులకు ఉండే గౌరవం తనకు ఉన్న గౌరవం కంటే ఏ మాత్రం తక్కువ కాదన్న సంపూర్ణ విశ్వాసం ప్రతి పౌరుని హృదయంలోనూ నెలకొని ఉండాలి'.



■ రామచంద్ర గుహ

గతానుగతం

ఇటీవలి దశాబ్దాలలో మన రాజకీయాలలో ప్రబలిన పాక్షిక ధోరణులు, జాతీయ రాజకీయ పక్షాల మధ్య పరస్పర అపనమ్మకం చూస్తుంటే ఆ సమున్నత ప్రజాస్వామిక ఆదర్శానికి మన దేశం ఎంత దూరంలో ఉన్నదో స్పష్టమవుతుంది. ఈ పరిణామానికి అంబేద్కర్ పూర్తిగా విస్తుబోయేవారు కాదేమో? నవంబర్ 4, 1948న రాజ్యాంగ సభలో వెలువరించిన ప్రసంగంలో ఆయన ఇలా అన్నారు: 'రాజ్యాంగ నైతికత సహజ భావన కాదు; దాన్ని అలవాటు చేసుకోవాలి. దాన్ని మన ప్రజలు ఇంకా నేర్చుకోలేదని మనం తెలుసుకోవాలి. సారభూతంగా అప్రజాస్వామికమైన భారతదేశపు జన జీవనంలో ప్రజాస్వామ్యమన్నది పై మెరుగు దిద్దడమే అవుతుంది'. ఆయన ఇంకా ఇలా అన్నారు: 'రాజ్యాంగపు రూపాన్ని మార్చకుండా, పాలనా వ్యవస్థ రూపాన్ని మాత్రమే మారుస్తూ, దాన్ని రాజ్యాంగ స్ఫూర్తికి పొసగని, వ్యతిరేక రూపంగా చేసి రాజ్యాంగాన్ని పథ భ్రష్టం చేయటానికి ఎంతో అవకాశమున్నది'. ఈ హెచ్చరిక కూడా విషాదకరంగా వాస్తవమవలేదూ? 'నిబద్ధ ఉద్యోగస్వామ్యం', 'నిబద్ధ న్యాయవ్యవస్థ'ను ప్రోత్సహించడం ద్వారా ఇందిరాగాంధీ నేతృత్వంలోని కాంగ్రెస్ అందుకొక ఉదాహరణ నెలకొల్పింది. ఈ ప్రమాదకర భావాలను 2014 తరువాత మోదీ ప్రభుత్వం మరింత ముందుకు తీసుకువెళ్లింది.

రాజ్యాంగ సభలో అంబేద్కర్ ప్రసంగంలోని చివరి వ్యాఖ్యలతో ఈ కాలమ్‌ను ముగించదలుచుకున్నాను: 'స్వాతంత్ర్యం మనపై బాధ్యతలు మోపిందని మాత్రం మనం మరువకూడదు. స్వతంత్రం రావటం వల్ల, ఏ తప్పు జరిగినా బ్రిటిష్ వారిని నెపమెన్నే అవకాశం మనకు లేదు. ఇంక, ఈ తర్వాత తప్పులు దొర్లితే మరెవరినీ నిందించలేం, మనల్ని మనం తప్ప'. 75 సంవత్సరాల తరువాత మన సమస్యలకు ఇతరులను తప్పు పట్టే ధోరణి మనలో, అంబేద్కర్ కాలంలో కంటే, మరింతగా ప్రబలిపోయింది. ప్రస్తుత పాలకుల హయాంలో మన వైఫల్యాలకు ఇతరులను బాధ్యులను చేసే ధోరణి మరింత విపరీత పోకడలు పోతోంది. తమది స్వదేశీ, ఆత్మ నిర్భర్ ప్రభుత్వమని చెప్పుకునే పాలకులు తమ వైఫల్యాలు, అసమర్థతకు శతాబ్దాల నాటి మొగల్ చక్రవర్తులు, 1947లో మన దేశం నుంచి నిష్క్రమించిన బ్రిటిష్‌వారు; 1964లో కీర్తిశేషుడు అయిన జవహర్‌లాల్ నెహ్రూను బాధ్యులను చేస్తున్నారు!

(వ్యాసకర్త చరిత్రకారుడు)

ప్రజాస్వామ్య హృదయం మన రాజ్యాంగం

గత 75 సంవత్సరాలుగా రాజ్యాంగం మన దేశానికి సమర్థమైన, ప్రభావశీలమైన మార్గదర్శకత్వాన్ని అందించింది. యావద్భారతీయులూ ముఖ్యంగా మన సమాజంలోని సామాజిక దుర్బల వర్గాలు, మత మైనారిటీలు తమ హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంరక్షించే శక్తిగా రాజ్యాంగాన్ని విశ్వసిస్తున్నారు. గత ఏడు దశాబ్దాలుగా ఆసేతు హిమాచలం ఒకే జాతి–ఒకే ప్రజ అన్న స్ఫూర్తిని పెంపొందించడంలో మన రాజ్యాంగం విజయవంతమయింది.

భారత రాజ్యాంగ ప్రస్థానానికి ఈ జనవరి 26న 75 ఏళ్లు పూర్తవుతాయి. ఈ శుభ సందర్భాన్ని పురస్కరించుకుని ప్రభుత్వం ఏడాది పొడుగునా 'హమారా సంవిధాన్–హమారా స్వాభిమాన్' అనే ఉద్ఘోషతో పలు కార్యక్రమాలు నిర్వహించనున్నది. నవంబర్ 26, 2024న పార్లమెంటు సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన రాజ్యాంగ అమృతోత్సవాల ప్రారంభ కార్యక్రమంలో 'మన దేశ పవిత్ర గ్రంథం'గా రాజ్యాంగాన్ని రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అభివర్ణించారు. భారత రాజ్యాంగ నిర్మాణ చరిత్ర ప్రతి భారతీయునికీ గర్వకారణమైనది. మనకొక సొంత రాజ్యాంగాన్ని రూపొందించుకునే ప్రయత్నాలు రాజ్యాంగ సభ ఏర్పాటుకు కనీసం 25 సంవత్సరాల ముందే ప్రారంభమయ్యాయి. ప్రప్రథమ భారత ప్రభుత్వ చట్టం–1858 ప్రథమ భారత స్వాతంత్ర్య సంగ్రామం (1857) పర్యవసానంగా వచ్చింది. ఆ చట్ట రూపకల్పనలో భారతీయులు ఎవరికీ భాగస్వామ్యం లేదు. ఆరు దశాబ్దాల అనంతరం కొత్త భారత ప్రభుత్వ చట్టం–1919 అమలులోకి వచ్చింది. అప్పటికే భారత జాతీయ కాంగ్రెస్ ఛత్రం కింద జాతీయవాదులు ఏకమై స్వాతంత్ర్య సాధనకు పోరాడుతున్నారు. ఈ కొత్త చట్టాన్ని కాంగ్రెస్ నిరసించింది. బ్రిటిష్ ప్రభుత్వం కాకుండా భారతీయ చట్ట సభే భారతదేశ సొంత రాజ్యాంగాన్ని రచించాలని జాతీయవాదులు డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీ పార్లమెంటరీ విభాగం అయిన స్వరాజ్ పార్టీ ఈ అంశాన్ని కేంద్ర లెజిస్లేటివ్ అసెంబ్లీలో లేవనెత్తింది. రాజ్యాంగ సంస్కరణల గురించి చర్చించేందుకు ఒక రౌండ్ టేబుల్ సమావేశాన్ని నిర్వహించాలని స్వరాజ్ పార్టీ డిమాండ్ చేసింది. అయితే వలసపాలకులు ఈ డిమాండ్‌ను ఉపేక్షించారు. భారత ప్రజలు అందరూ ఏకీభవించే, ఆమోదించే ఒక రాజ్యాంగాన్ని రూపొందించాలని భారత జాతీయోద్యమ నాయకులను లార్డ్ బిర్కెన్ హెడ్ సవాల్ చేశారు. దేశానికి అవసరమైన రాజ్యాంగబద్ధమైన చర్యలను సూచించేందుకు పూర్తిగా బ్రిటిష్ నాయకులు, అధికారులతో ఒక కమిషన్‌ను కూడా ఆయన నియమించారు. ఇదే సైమన్ కమిషన్‌గా సుప్రసిద్ధమైనది. లార్డ్ బిర్కెన్ హెడ్ సవాల్‌ను కాంగ్రెస్ అంగీకరించింది. రాజ్యాంగ ముసాయిదాను రూపొందించేందుకు డిసెంబర్ 1927లో మోతీలాల్ నెహ్రూ అధ్యక్షతన ఒక కమిటీనేర్పాటు చేసింది. సుభాస్ బోస్, అనీబీసెంట్, ఎమ్ఆర్ జయకర్, జవహర్‌లాల్ నెహ్రూతో పాటు ముస్లింలీగ్ ప్రతినిధులు ఇరువురు ఆ కమిటీలో సభ్యులు. 1928లో ఆ కమిటీ ఒక ముసాయిదా రాజ్యాంగాన్ని దేశ ప్రజలకు నివేదించింది. ఇదే 'నెహ్రూ నివేదిక'గా సుప్రసిద్ధమైనది. ప్రాథమిక హక్కులు, ద్విసభీయ పార్లమెంటు, అధికారాల విభజన, న్యాయ వ్యవస్థకు స్వతంత్ర ప్రతిపత్తి, కేంద్ర–రాష్ట్ర సంబంధాలు మొదలైన అంశాలపై 22 అధ్యాయాలు, 188 అధికరణలు నెహ్రూ రిపోర్ట్‌లో ఉన్నాయి. 21 సంవత్సరాల వయసు నిండిన ప్రతి భారతీయ పౌరుడికీ ఓటు హక్కు కల్పించాలని ఆ నివేదిక సూచించింది. బిర్కెన్‌హెడ్ సవాల్‌కు నెహ్రూ నివేదిక ఒక దీటైన సమాధానమని వ్యాఖ్యానిస్తూ 'మనం మన స్వాతంత్ర్య మాగ్నాకార్టాను రచించుకున్నామని' ఒక ప్రముఖ దినపత్రిక వ్యాఖ్యానించింది. జనవరి 26, 1930ని 'స్వాతంత్ర్య దినం'గా పాటించాలని డిసెంబర్ 1929లో లాహోర్‌లో జరిగిన కాంగ్రెస్ మహాసభ పిలుపునిచ్చింది. ఆ చరిత్రాత్మక సందర్భాన్ని శాశ్వతంగా గుర్తుంచుకునేందుకే స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని జనవరి 26, 1950 నుంచి అమలుచేయాలని రాజ్యాంగ సభ నిర్ణయించింది.

భారతీయులకు 'ఆమోదయోగ్యమైన రాజ్యాంగం' రూపొందించేందుకు రాజ్యాంగ సభని ఏర్పాటు చేయాలని మే 1924లో స్వరాజ్ పార్టీ తీర్మానం చేసింది. భారతీయులు రాజ్యాంగ సభ గురించి వినడం అదే మొదటిసారి. ఆ తరువాత కాలంలో కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య పోరాటాన్ని ముమ్మరం చేసింది. భారత స్వాతంత్ర్య చట్టం–1947ను తీసుకురావడం ద్వారా భారతదేశ చట్టాల నిర్మాణంలో తమకు ఇంకెంత మాత్రం ఎలాంటి పాత్ర ఉండబోదని బ్రిటిష్ ప్రభుత్వం ఎట్టకేలకు అంగీకరించింది. రాజ్యాంగ నిర్మాణ బాధ్యతలను పూర్తిగా భారతీయులకే అప్పగించింది.

రాజ్యాంగ సభ తొలి సమావేశం డిసెంబర్ 9, 1946న జరిగింది. ముసాయిదా రాజ్యాంగాన్ని ఫిబ్రవరి 21, 1948న సభకు సమర్పించారు. మార్పులు చేర్పులతో కూడిన కొత్త ముసాయిదాను నవంబర్ 4, 1948న రాజ్యాంగ సభకు సమర్పించారు. కొత్త ముసాయిదాలోని ప్రతి అధికరణను, ప్రతి అధికరణలోని ప్రతి నిబంధనను సభ్యులు కూలంకషంగా చర్చించారు. ఆ చర్చల ఫలితంగా రూపొందిన తుది ముసాయిదాను నవంబర్ 26, 1949న ఆమోదించారు. ముసాయిదాపై చర్చల్లో రాజ్యాంగ సభ సభ్యుల ప్రసంగాలు, వాదోపవాదాలు మొత్తం 3.6 మిలియన్ పదాలుగా రికార్డయ్యాయి. 3,675 సవరణలను ప్రతిపాదించారు. వాటిలో 2,473 సవరణలను విపులంగా చర్చించారు. ఈ మహోన్నత కృషి ఫలితంగా రూపొందిన భారత రాజ్యాంగంలో 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు ఉన్నాయి. రాజ్యాంగ ముసాయిదా రచనా భారాన్ని చాలావరకు డాక్టర్ అంబేద్కరే స్వయంగా వహించారు. 'ముసాయిదా కమిటీ సభ్యులు ఎంత అంకితభావంతో కృషి చేశారో నేను గ్రహించాను. ముఖ్యంగా ఆ కమిటీ చైర్మన్ డాక్టర్ అంబేద్కర్, తన ఆరోగ్యపరిస్థితి బాగా లేనప్పటికీ రాజ్యాంగ నిర్మాణానికి పూర్తిగా అంకితమయ్యారు' అని రాజ్యాంగసభ చైర్మన్ రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యానించారు.

డిసెంబర్ 1946లో రాజ్యాంగ లక్ష్యాల తీర్మానాన్ని రాజ్యాంగ సభలో ప్రతిపాదిస్తూ అది కేవలం ఒక తీర్మానం మాత్రమే కాదని, అది ఒక 'ప్రకటన', ఒక 'దృఢసంకల్పం', ఒక 'ప్రతిజ్ఞ', అంతిమంగా అది ఒక 'అంకితం' అని జవహర్‌లాల్ నెహ్రూ భావోద్వేగంతో ఉద్ఘాటించారు. రాజ్యాంగ సభలోని 299 మంది సభ్యులు 35 నెలల పాటు ఆ మహా సంకల్పంతో కృషి చేసి మన మహోన్నత సంవిధానాన్ని రూపొందించారు.

75 సంవత్సరాల భారత రాజ్యాంగ ప్రస్థానంలో జాతి జీవనాన్ని మౌలికంగా ప్రభావితం చేసిన హిందూ కోడ్ బిల్లు, మౌలిక విధులు, పంచాయతీరాజ్ వ్యవస్థ వికేంద్రీకరణ, కేంద్రీకృత ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాలకు స్వస్తి, అధికరణ 370 రద్దు మొదలైన రాజ్యాంగ సంస్కరణలు ఆ మహోన్నత గ్రంథం స్ఫూర్తితో అమలులోకి వచ్చాయి. భారత రాజ్యాంగాన్ని 'వలసవాద రాజ్యాంగం'గా కొంత మంది విమర్శిస్తున్నారు. అయితే, 1928లో మోతీలాల్ నెహ్రూ కమిటీ రూపొందించిన నెహ్రూ నివేదికలోని అనేక అంశాలు స్వతంత్ర భారత రాజ్యాంగంలో ఉన్నాయి. గత 75 సంవత్సరాలుగా రాజ్యాంగం మన దేశానికి సమర్థమైన, ప్రభావశీలమైన మార్గదర్శకత్వాన్ని అందించింది. యావద్భారతీయులూ ముఖ్యంగా మన సమాజంలోని సామాజిక దుర్బల వర్గాలు, మత మైనారిటీలు తమ హక్కులు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను సంరక్షించే శక్తిగా రాజ్యాంగాన్ని విశ్వసిస్తున్నారు. గత ఏడు దశాబ్దాలుగా ఆసేతు హిమాచలం ఒకే జాతి–ఒకే ప్రజ అన్న స్ఫూర్తిని పెంపొందించడంలో మన రాజ్యాంగం విజయవంతమయింది. అంతిమంగా రాజ్యాంగం ఒక సంకల్ప పత్రం మాత్రమే. ఆ మౌలిక శాసనాన్ని అమలు పరుస్తున్నవారి రాజ్యాంగ నైతికత – ఆ సంవిధాన స్ఫూర్తి– చాలా ప్రధానమైనది. 'రాజ్యాంగ నైతికత అనేది సహజ భావన కాదు. దాన్ని అలవాటు చేసుకోవాలి' డాక్టర్ అంబేద్కర్ హెచ్చరించారు. గణతంత్ర దినోత్సవాన్ని జరుపుకోనున్న శుభసందర్భంలో రాజ్యాంగ నైతికతను పెంపొందించుకునేందుకు జాతి తనకు తాను అంకితమవ్వాలి.





• రామ్ మాధవ్
బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి


పెట్టుబడుల గమ్యస్థానం తెలంగాణ

దావోస్ కేంద్రంగా జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సు–2025లో గత ఏడాదితో పోలిస్తే తెలంగాణకు నాలుగు రెట్లు అధికంగా పెట్టుబడులు పెట్టడానికి వివిధ సంస్థలు ఆసక్తి చూపించాయంటే ఆ ప్రయత్నంలో ప్రభుత్వం భారీ విజయం సాధించినట్టే. నాయకత్వ కృషి ఎంతో ఉంటే తప్ప పెట్టుబడులు రావు. నమ్మకం కలగందే పెట్టుబడులకు సంస్థలు కూడా ముందుకు రావు.

తెలంగాణలో ప్రజా ప్రభుత్వం ఏడాది పూర్తి చేసుకున్న సందర్భంగా 'తెలంగాణ రైజింగ్' అన్న నినాదంతో అనుసరిస్తున్న విధానాలు రాష్ట్రంలో భారీ పెట్టుబడులకు దోహదపడ్డాయి. అందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని ప్రతినిధి బృందం దావోస్‌లో అడుగుపెట్టిన క్షణం నుంచి నిరంతరం శ్రమించింది. పరిమితమైన సమయంలో క్షణం తీరికలేకుండా ప్రపంచ దిగ్గజాలతో సంప్రదింపులు జరిపింది. ముఖ్యమంత్రి మాటల్లో చెప్పాలంటే 'తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని పారిశ్రామికవేత్తలకు నమ్మకం కలిగించడం ద్వారా అధిక పెట్టుబడులను ఆకర్షించాం. గత ఏడాది మా ప్రభుత్వం రూపొందించిన అనుకూల విధానాలే దీనికి కారణం' అన్నారు. ఆయన ప్రయత్నాల ఫలితంగానే ఈ రోజు తెలంగాణ పేరు ప్రపంచ వేదికలపై వినిపిస్తోంది. ఏకంగా రూ.1,78,950 కోట్ల విలువ చేసే పెట్టుబడులు తెలంగాణకు రావడమంటే ఆషామాషీ కాదు. వీటితో దాదాపు 50 వేల మందికి ఉద్యోగాలు లభిస్తాయి. పరోక్షంగా అనేక మందికి ఉపాధి లభిస్తుంది.

దావోస్‌లో 'కంట్రీ స్ట్రాటజిక్ డైలాగ్' అన్న అంశంపై వరల్డ్ ఎకనమిక్ ఫోరం నిర్వహించిన సదస్సులోను, 'రీఇమేజింగ్ అర్బన్ మొబిలిటీ–ట్రెండ్స్, ఇన్నోవేషన్స్ అండ్ ఆపర్చునిటీస్–2030 అండ్ బియాండ్' అన్న అంశంపై భారత పరిశ్రమల సమాఖ్య (సిఐఐ), హెచ్‌ఎంసీ సంయుక్తంగా నిర్వహించిన సదస్సులోను తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలు, లక్ష్యాలను ప్రపంచ దిగ్గజాల ముందు ముఖ్యమంత్రి స్పష్టంగా ఆవిష్కరించారు. కమ్యూనికేషన్ రంగంలో శరవేగంగా వచ్చిన మార్పులను అందిపుచ్చుకోవడంలో రాజీవ్‌గాంధీని, సరళీకృత ఆర్థిక విధానాలతో దేశానికి మార్గనిర్దేశకులైన పీవీ నరసింహారావును, అలాగే హైదరాబాద్‌లో ఐటీ రంగ విస్తరణకు చంద్రబాబు నాయుడు తీసుకున్న చర్యలు, హైదరాబాద్ ఒక మహానగరంగా విస్తరించడానికి విస్తృతమైన మౌలిక సదుపాయాలు కల్పించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లాంటి నేతలు చూపిన బాటను కొనసాగిస్తామని, దేశాన్ని ఐదు ట్రిలియన్ల ఎకానమీగా తీర్చిదిద్దాలన్న ప్రధాన మంత్రి సంకల్పానికి తెలంగాణ వంతుగా నిలబడతామనీ దావోస్‌లో రేవంత్‌రెడ్డి స్పష్టంగా చెప్పారు.

> రానున్న రోజుల్లో హైదరాబాద్ మహానగరాన్ని ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్, మధ్యలో రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు... ఇలా అనేక అంశాలకు సంబంధించి తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రి దావోస్ వేదికగా ఆవిష్కరించారు.



మూడు పార్టీలకు చెందిన ముగ్గురు ముఖ్యమంత్రులు ఒకే వేదికపైన మాట్లాడిన సందర్భంలో కూడా రేవంత్‌రెడ్డి తన వైఖరిని స్పష్టంగా వెల్లడించారు. సరిహద్దు రాష్ట్రాలతో స్నేహపూర్వక సంబంధాలు కొనసాగిస్తూ, అభివృద్ధి విషయంలో ప్రపంచంతో పోటీపడతామన్నారు. మూడు రాష్ట్రాల నుంచి గలగలా పారే కృష్ణా, గోదావరి నదులతో పోలుస్తూ ప్రపంచ ఆర్థిక సదస్సు వేదికగా మూడు రాష్ట్రాలూ అభివృద్ధి చెందాలని ఆకాంక్షించిన నాయకుడు రేవంత్‌రెడ్డి. ఆ మాటలు ప్రపంచ ఆర్థిక సదస్సు మోడరేటర్ సమీర్ శరణ్‌నే కాదు.. ఎంతో మంది ప్రముఖులు, పారిశ్రామికవేత్తలను కూడా ఆకర్షించాయి. మూడు రోజుల దావోస్ పర్యటనలో రేవంత్‌రెడ్డి ఇదే ఒరవడిని కొనసాగించారు. పెట్టుబడులను ఆకర్షించడంలో ఆయన స్పీడ్ ఒక అసెట్.

ముఖ్యమంత్రి ఆధ్వర్యంలోని ప్రజా ప్రభుత్వం గత ఏడాది కాలంలో దూరదృష్టితో అమలు చేస్తున్న ప్రణాళికలు పారిశ్రామికవేత్తల్లో నమ్మకం కలిగిస్తున్నాయి. కొత్తగా డేటా సెంటర్ల ఏర్పాటు లేదా విస్తరణకు ఆయా సంస్థలు చొరవ చూపడానికి అదీ ఒక కారణమే. ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ రంగంలో శరవేగంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ)ను అందరికన్నా ముందుగా అందిపుచ్చుకుని హైదరాబాద్‌లో ప్రపంచస్థాయి సదస్సును నిర్వహించడమే కాకుండా, ప్రత్యేకంగా ఏఐ సిటీ నిర్మించాలని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు ఆ రంగంలో విస్తరించాలన్న సంస్థల్లో విశ్వాసాన్ని పెంచింది. హైదరాబాద్ కేంద్ర బిందువుగా డేటా సెంటర్లను నెలకొల్పడానికి ఐటీ కంపెనీలు ఆసక్తి చూపిస్తున్నాయంటే, అందుకు ప్రభుత్వం ప్రోత్సాహకంగా నిలుస్తున్న తీరు ఆయా సంస్థలకు నమ్మకం కలిగిస్తున్నది.

ఎలక్ట్రిక్ వాహనాలపై రోడ్ టాక్స్, రిజిస్ట్రేషన్ ఛార్జీల మినహాయింపు ఇస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం మంచి ఫలితాలను అందిస్తోంది. ఎలక్ట్రిక్ వాహనాల అమ్మకాలు పెరగడం, కాలుష్య కారక వాహనాలను తగ్గించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం ఎంతగా కట్టుబడి ఉందో అర్థమవుతుంది. మూసీ ప్రక్షాళన కూడా హైదరాబాద్ నగర భవిష్యత్తుకు ఒక బృహత్తరమైన ప్రణాళిక. కొందరు కావాలని కూల్చివేతలుగా చిత్రీకరించే ప్రయత్నాలు చేసినప్పటికీ మరో వంద సంవత్సరాల పాటు హైదరాబాద్ కాలుష్య రహిత, పర్యావరణ హితమైన నగరంగా విలసిల్లాలని చేపట్టిందే మూసీ పునరుజ్జీవం. కాలుష్య కాసారంగా మారిన మూసీని ప్రక్షాళన చేసి, ఈ మహానగర నీటి అవసరాలను తీర్చడమే కాకుండా, నల్గొండ ప్రజల సాగునీరు వంటి అనేక విషయాలతో ముడిపడిన అంశాలను దావోస్ వేదికగా ముఖ్యమంత్రి వివరించారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ మహానగరాన్ని ఏ విధంగా తీర్చిదిద్దబోతున్నాం. ఔటర్ రింగ్ రోడ్డు నుంచి రీజినల్ రింగ్ రోడ్డు, రీజినల్ రింగ్ రైల్, మధ్యలో రేడియల్ రోడ్లు, పారిశ్రామిక క్లస్టర్లు... ఇలా అన్ని విషయాలకు సంబంధించి తెలంగాణ భవిష్యత్తు ప్రణాళికలను ముఖ్యమంత్రి దావోస్ వేదికగా ఆవిష్కరించారు.

ప్రపంచ వేదికల్లో తెలంగాణ ఇమేజ్‌ని పెంచాలన్న ప్రయత్నాలు జరుగుతున్న తరుణంలో పెట్టుబడులను కొందరు హేళన చేస్తున్నారు. అయితే, రాష్ట్రానికి మంచి చేస్తున్నారా లేక రాజకీయ ప్రయోజనాలు ఆశిస్తున్నారా అన్నది ప్రజలు గమనిస్తూ ఉంటారు. హైదరాబాద్‌లో ఉన్న కంపెనీతో దావోస్‌లో ఒప్పందమేంటని కొందరు వ్యంగ్య ధోరణులు ప్రదర్శిస్తున్నారు. వారి హయాంలోనూ అదే జరిగినా, మరిచిపోయి నిస్సిగ్గుగా తెరమీదకు వస్తుంటారు. నిజానికి హైదరాబాద్‌కు చెందిన ఒక కంపెనీ తెలంగాణ, మహారాష్ట్ర, గుజరాత్‌లలోనూ విస్తరణకు ఉన్న అవకాశాలను అధ్యయనం చేసింది. ఆయా ప్రభుత్వాల నుంచి లభించే ప్రోత్సాహకాలు, అవకాశాలు, అపాయింట్‌మెంట్స్... ఒకటేమిటి అనేకానేక అంశాలు ఇందులో ఇమిడి ఉంటాయి. వీటన్నింటికీ దావోస్ ఒక వేదికగా నిలుస్తుంది.

తమిళనాడులో ఆ రాష్ట్రానికి సంబంధించిన ఏదైనా ఒక సమస్య తెరమీదకొస్తే ఆ రాష్ట్రంలో రాజకీయ పార్టీలన్నీ ఒకే వేదికపైకి వస్తాయి. తెలంగాణలోనూ ముఖ్యంగా రాష్ట్ర అభివృద్ధి, పునర్నిర్మాణంలో కలిసి రావాలని, అనుభవంతో కూడిన అభిప్రాయాలు, సలహాలు, సూచనలు ఇవ్వాలని ముఖ్యమంత్రి ప్రతిసారీ అంటుంటారు. ప్రపంచ పటంలో తెలంగాణ, హైదరాబాద్‌లు ఉండాలని అందరూ ఆకాంక్షించాలి. పెట్టుబడులు వస్తున్నాయంటే హర్షించాలి.

'మా పోటీ... ప్రపంచంతో'– ఈ మాట అనాలంటే ఎంతో దూరదృష్టి, ధైర్యం కావాలి. మార్గనిర్దేశం చేసే శక్తి, సామర్థ్యాలు ఉండాలి. తెలంగాణ అన్ని రంగాల్లో పురోభివృద్ధి సాధించడానికి జరుగుతున్న ప్రయత్నాలను మనస్ఫూర్తిగా స్వాగతిద్దాం. పెట్టుబడులకు గమ్యస్థానంగా మారుస్తున్నందుకు గర్వపడదాం. తెలంగాణ పునర్నిర్మాణానికి అంకితమవుదాం.

■ బోరెడ్డి అయోధ్యరెడ్డి
సీపీఆర్‌ఓ, తెలంగాణ ముఖ్యమంత్రి



- వరంగల్‌లో రూ.10వేల కోట్లు పెట్టనున్న సిఫీ టెక్నాలజీస్
- 200 మెగావాట్లతో డేటా సెంటర్, ఏఐ హబ్స్ ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటన
- ములుగు జిల్లాలో హైడ్రో, సోలార్ విద్యుత్ ప్లాంట్లు నిర్మించనున్న సన్ పెట్రో కెమికల్స్
- జిల్లా బాటలో అమెజాన్ వెబ్ సర్వీసెస్, యూనీలివర్ తదితర కంపెనీలు..
- ఇప్పటికే వరంగల్‌లో పలు ఐటీ సంస్థల కార్యకలాపాలు

ఓరుగల్లు వైపు.. దిగ్గజ సంస్థల చూపు..

పెట్టుబడులు పెట్టేందుకు దావోస్ కేంద్రంగా ప్రభుత్వంతో ఒప్పందం

హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయంగా వరంగల్‌పై పలు కంపెనీల ఆసక్తి

హైదరాబాద్ తర్వాత రెండో రాజధానిగా భావిస్తున్న ఓరుగల్లుకు దిగ్గజ కంపెనీలు క్యూ కడుతున్నాయి. పెట్టుబడులు పెట్టేక్రమంలో ఆయా సంస్థలు హైదరాబాద్‌కు ప్రత్యామ్నాయంగా వరంగల్‌ను ఎంచుకుంటున్నాయి. అలాగే రాజధాని తరువాత ఐటీ పరిశ్రమకు ఇక్కడ ఉన్న అనుకూల వాతావరణం కంపెనీల రాకకు దోహదపడుతోంది. రాష్ట్రంలోకి పెట్టుబడులను ఆహ్వానించేందుకు ఇటీవల దావోస్ కేంద్రంగా జరిగిన భేటీల్లో పలు కంపెనీలతో సీఎం రేవంత్‌రెడ్డి, ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్‌తో పాటు ఓరుగల్లులో కూడా కొత్త ప్రాజెక్టుల ఏర్పాటుకు పలు కంపెనీలు ముందుకు వచ్చాయి. డేటా సెంటర్, ఏఐ హబ్స్‌తో పాటు హైడ్రో, సోలార్ విద్యుత్ ప్లాంట్లను ఏర్పాటు చేయడానికి, అలాగే ఆయిల్ పామ్‌ను అభివృద్ధి చేయడానికి పలు కంపెనీలు ఆసక్తి చూపాయి. ఇవన్నీ పూర్తయితే ఉమ్మడి జిల్లాకు చెందిన వేలాది మంది నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు అందనున్నాయి.

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

వరంగల్‌లో పెట్టుబడులకు పలు దిగ్గజ కంపెనీలు ఆసక్తి చూపుతున్నాయి. వరంగల్‌లో అత్యాధునిక డేటా సెంటర్‌ను ఏర్పాటు చేసేందుకు దేశంలోనే ప్రముఖ దిగ్గజ సంస్థ సిఫీ టెక్నాలజీస్ ముందుకు వచ్చింది. రూ.10వేల కోట్లతో 200మెగావాట్ల సామర్థ్యంతో డేటా సెంటర్, ఏఐ హబ్స్ ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వంతో సిఫీ టెక్నాలజీస్ సంస్థ ఒప్పందం కుదుర్చుకుంది. దేశవ్యాప్తంగా పలు కంపెనీలు, సంస్థల కంప్యూటర్లు, సర్వర్లు, డేటాబేస్‌లు, నెట్‌వర్క్ పరికరాలు లాంటి ఐటీ సిస్టమ్స్ నిల్వ చేసే డేటా సెంటర్‌ను వరంగల్‌లో ఏర్పాటు చేసేందుకు సిఫీ టెక్నాలజీస్ కంపెనీ ముందుకు వచ్చింది. మడికొండలో ఇప్పటికే ఐదారు ఐటీ కంపెనీలు కార్యకలాపాలను నిర్వహిస్తున్నాయి. దేశంలో దిగ్గజ సంస్థల్లో ఒకటిగా పేరున్న

(మిగతా 7వ పేజీలో)



మల్లంపల్లి తహసీల్దార్ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న మంత్రులు సీతక్క, సురేఖ, ఎంపీ బలరాంనాయక్

పదేళ్ల ఆకాంక్షను నెరవేర్చాం

- ఉమర్‌ఖాన్ పేరిట ఉన్న భూములకు త్వరలో పట్టాలు
- కొడిశలకుంట నుంచి మల్లంపల్లి దాకా గోదావరి జలాలు
- మల్లంపల్లి మండలం ప్రారంభంలో మంత్రి సీతక్క
- త్వరలో సొంత భవనాలను నిర్మిస్తామని హామీ
- సమ్మక్క సారలమ్మల్లా కలిసి అభివృద్ధి చేస్తామన్న కొండా సురేఖ

6



వేదికపై అభివాదం చేస్తున్న సురేఖ, సీతక్క

చిన్న జాతరపై చిన్న చూపు వద్దు

- మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- మేడారంలో మినీ జాతరపై సమీక్ష సమావేశం

6

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీకి నిధులివ్వండి

- కేంద్ర మంత్రికి సీఎం రేవంత్ విజ్ఞప్తి
- రూ.4,170కోట్లు విడుదల చేయాలని విన్నపం

వరంగల్ కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్మించే అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు కేంద్ర ప్రభుత్వం నుంచి నిధులు విడుదల చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌ను కోరారు. హైదరాబాద్‌లోని గ్రాండ్ కాకతీయ హోటల్‌లో తెలంగాణ అభివృద్ధికి సంబంధిచిన పనులపై కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ కట్టర్‌తో సమీక్ష సమావేశం జరిగింది. రాష్ట్రంలో జరిగే అభివృద్ధి పనులు, పెండింగ్ పనులు, ఇంకా చేయాల్సిన పనులు, మిగిలి ఉన్న పనులపై సమీక్ష జరిగింది. ఈ సమీక్షలో రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సమీక్షలో వరంగల్ అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం కోసం వెంటనే రూ. 4,170 కోట్ల నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమీక్ష సమావేశంలో వరంగల్ నగర పాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే పాల్గొన్నారు.

విభిన్న రంగాల్లో బాలికలదే ప్రథమ స్థానం

- వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి
- అంబేద్కర్ భవన్‌లో జాతీయ బాలికా దినోత్సవం

వడ్డేపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): విభిన్న రంగాల్లో బాలికలు రాణిస్తూ ప్రథమ స్థానంలో నిలుస్తున్నారని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం హనుమకొండలోని అంబేద్కర్ భవన్‌లో జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ జిల్లా మహిళలు, పిల్లలు, దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ ఆధ్వర్యంలో బేటీ బచావో- బేటీ పడావో దశాబ్ది (2015-2025) ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ ప్రావీణ్య, జిల్లా సంక్షేమ అధికారి జయంతి తదితరులు జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. బాలికల్లోని సృజనాత్మకతను వెలికితీసే విధంగా చాలా మంచి కార్యక్రమాన్ని నిర్వహించారని అన్నారు. రాణిరుద్రమ దేవి పాలించిన జిల్లా అని పేర్కొన్నారు. ఈ జిల్లాలో ఎంతో మంది మహిళా అధికారులు, ప్రజాప్రతినిధులు ఉన్నారని చెప్పారు. మహిళా ఐఏఎస్‌లు జిల్లాలో అధికంగా పనిచేశారని పేర్కొన్నారు. మహిళలు ఏ విషయంలోనూ తక్కువకాదని, అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్నారని తెలిపారు. మహిళలే ప్రథమ స్థానం సాధిస్తూ సమాజానికి దిక్సూచిగా నిలుస్తున్నారని అన్నారు. సమాజంలో ఏదైనా కలుషితం కావచ్చు కానీ.. ఒక్క తల్లి ప్రేమ మాత్రం ఎప్పుడు కలుషితం కాలేదని స్పష్టం చేశారు. ఆడ పిల్లలకు తండ్రిపైనే ఎక్కువగా ప్రేమ ఉంటుందని అన్నారు. బాలికలకు ఇలాంటి కార్యక్రమాలను నిర్వహించి లింగ వివక్షతను అరికట్టాల్సిన అవసరం ఉందన్నారు. బాలికలను చదువు, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో ప్రోత్సహించాలని కోరారు. మేయర్ గుండు సుధారాణి మాట్లాడుతూ.. బేటీ బచావో- బేటీ పడావో దశాబ్ది



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి వేదికపై మేయర్ గుండు సుధారాణి, కలెక్టర్ ప్రావీణ్య

ఉత్సవాలు పెద్ద ఎత్తున నిర్వహించుకోవడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. సమాజంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థకు ఎంతో ప్రాధాన్యత ఉండేదని పేర్కొన్నారు. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ప్రాముఖ్యతను తెలియజేస్తూ బాలికలు కళ్లకు కట్టినట్లు ప్రదర్శించిన ప్రదర్శన ఎంతో బాగుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య మాట్లాడుతూ.. జాతీయ బాలికల దినోత్సవం కార్యక్రమాన్ని తొలుత రాజస్థాన్ రాష్ట్రంలో ప్రారంభించారని అన్నారు. దేశంలో బాలికల నిష్పత్తి తగ్గుతున్న నేపథ్యంలో బేటీ బచావో - బేటీ పడావో కార్యక్రమాన్ని ప్రభుత్వాలు తీసుకొచ్చాయని పేర్కొన్నారు. జిల్లాలో లింగ నిర్ధారణ పరీక్షల నియంత్రణకు చర్యలు తీసుకుంటున్నట్లు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డీఈవో డి.వాసంతి, డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య, 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి, రెడ్ క్రాస్ రాష్ట్ర ఈసీ మెంబర్ ఈవీ శ్రీనివాసరావు, మహిళా అభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆర్‌జేడీ ఝాన్సీ లక్ష్మిబాయి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి సౌరం ప్రవీణ్‌కుమార్, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ సుధాకర్, రాజేంద్ర ప్రసాద్‌తో పాటు ఐసీడీఎస్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. విద్య, సాంస్కృతిక క్రీడా విభాగాలలో విశేష ప్రతిభ కనబర్చిన విద్యార్థినిలకు అతిథులుచేతుల మీదుగా శాలువాలు, ప్రశంసా పత్రాలతో ఘనంగా సత్కరించారు. విద్యార్థినులు ప్రదర్శించిన వివిధ నృత్య రూపకాలు ఆద్యంతం ఆకట్టుకున్నాయి.

రసాభాసలు, నిలదీతలు, అడ్డగింతలు

- ముగిసిన గ్రామ, వార్డు, డివిజన్ సభలు
- జాబితాలో పేర్లు లేకపోవడంతో నిరసనలు
- వెల్లువెత్తిన కొత్త దరఖాస్తులు

హనుమకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : నాలుగు సంక్షేమ పథకాల అమలుకు లబ్ధిదారులను గుర్తించేందుకు నిర్వహించిన గ్రామ, వార్డు, డివిజన్ సభలు శుక్రవారం ముగిశాయి. నాలుగు రోజుల పాటు నిర్వహించిన ఈ సభల్లో హనుమకొండ జిల్లాలో మొత్తం 299 గ్రామ, వార్డు, డివిజన్ సభలను, వరంగల్ జిల్లాలో మొత్తం మొత్తం 328 గ్రామ, వార్డు, డివిజన్ సభలను నిర్వహించారు.

నిరసనలు

గ్రామ, వార్డు సభలను అధికారులు సభలను తూతూ మంత్రంగా నిర్వహించినట్టు విమర్శలు వెల్లువెత్తాయి. ప్రభుత్వ మార్గదర్శకాల స్ఫూర్తితో ఎక్కడా సభలు జరగలేదన్న ఆరోపణలు ఉన్నాయి. అర్హుల జాబితాలు తప్పుల తడకగా మారాయి. గ్రామ సభల్లో ప్రకటించిందే తుది జాబితా అని కొన్ని చోట్ల అధికారులు ప్రకటించగా, మరికొన్ని చోట్ల జాబితాల్లో వచ్చిన పేర్లే ఖరారైనట్టు కాదని చెప్పడం గందరగోళానికి దారి తీసింది. గ్రామ సభల్లో దరఖాస్తు చేసుకున్న వారి పేర్లను ఎప్పుడు చేరుస్తారని అధికారులను ప్రశ్నించగా అధికారులు సరైన సమాధానం చెప్పకపోవడంతో మరింత ఇబ్బందిగా మారింది. రైతు భరోసా, ఇందిరమ్మ రైతు ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు లబ్ధిదారుల ఎంపికకు నిర్వహించిన ఈ సభల్లో ప్రతీ చోట ప్రజలు జాబితాల్లో తమ పేర్లు లేవని, అనర్హుల



ఖానాపురం మండలం కొడ్తిమాట్‌తండా గ్రామ సభలో కుర్చీలతో దాడి చేసుకుంటున్న కాంగ్రెస్, బీఆర్ఎస్ వర్గీయులు

హనుమకొండ జిల్లా	
రేషన్ కార్డులు	:32,987
ఇందిరమ్మ ఇళ్లు	:19,585
రైతు భరోసా	: 388
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా:	4,517
మొత్తం దరఖాస్తులు	:57,477

వరంగల్ జిల్లా	
రేషన్ కార్డులు	:28,868
ఇందిరమ్మ ఇళ్లు	:20,578
రైతు భరోసా	: 580
ఇందిరమ్మ ఆత్మీయ భరోసా:	6,982
మొత్తం దరఖాస్తులు	:57,008

పేర్లతోనే వాటిని నింపారంటూ నిరసనలు వ్యక్తం చేశారు. గ్రామసభ వద్దనే ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. మరో చోట డప్పుచప్పుళ్లతో నిరసన ప్రకటించారు. అధికారులను నిలదీశారు. బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తలు సైతం గ్రామసభ ల్లో లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా లేదంటూ అధికారుల తో వాగ్వాదానికి దిగుతున్నారు. కాంగ్రెస్ కార్యకర్తలు అడ్డుపడడంతోవారికి, బీజేపీ, బీఆర్ఎస్ కార్యకర్తల మధ్య వాగ్వాదాలు చోటు చేసుకున్నాయి.తోపులాటలదాకా వెళ్లాయి. కొన్ని చోట్ల పోలీసులు రంగ ప్రవేశం చేయాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి.

వేలల్లో వచ్చిన దరఖాస్తులు

ప్రభుత్వం దగ్గర ఉన్న జాబితాలో లేనివారు ఇందిరమ్మ ఇల్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, రేషన్‌కార్డు, రైతు భరోసా పథకాలకు దరఖాస్తు చేసుకు నేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిం చింది. దీనితో గ్రామ సభల్లో దర ఖాస్తులు

(మిగతా 8వ పేజీలో)

చిన్న జాతరపై చిన్నచూపు వద్దు

- మంత్రులు కొండా సురేఖ, సీతక్క
- మేడారంలో మినీ జాతరపై సమీక్ష సమావేశం



అధికారుల వసతి గృహాలను ప్రారంభిస్తున్న మంత్రులు

తాడ్వాయి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఫిబ్రవరి 12 నుంచి 15 వరకు జరిగే మినీ జాతరపై సంబంధిత అధికారులకు చిన్న చూపు వద్దని భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేయాలని పర్యావరణ, అటవీ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయితీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ(సీతక్క) అన్నారు. శుక్రవారం ఎంపీ బలరాంనాయక్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లెం వెంకట్రావు, దేవాదాయ ధర్మాదా య కమిషనర్ శ్రీధర్, జిల్లా కలెక్టర్ దివాకర, ఎస్పీ శబరీష్‌లతో కలిసి మేడారం లో వారు పర్యటించారు. ఈ సందర్భంగా వనదేవతలు సమ్మక్క సారలమ్మ లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం ఐడీడీఏ పీవో చిత్రా మిశ్రా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మినీ జాతర సమీక్షా సమావేశంలో పాల్గొన్నారు. హాజరైన పలు శాఖల అధికారులతో మాట్లాడి మినీ జాతర నిర్వహణపై పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ మినీ మేడారం జాతరకు సుమారు 40లక్షల మంది భక్తులు అమ్మవార్లను దర్శించుకునే అవకాశం ఉందని అన్నారు. దర్శనాల సమయంలో ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేయాలని అధికారులతో అన్నారు. అంగరంగ వైభవంగా జరిగే మేడారం మినీ జాతరకు వచ్చే భక్తులు సంతోషంగా తిరుగు ప్రయాణం చేసేలా సౌకర్యాలు ఉండాలని అధికారులను ఆదేశించారు. సీతక్క మాట్లాడుతూ.. అన్ని శాఖల అధికారులు భక్తులకు సౌకర్యాలు కల్పించడంలో నిమగ్నం కావాలని సూచించారు. ముఖ్యంగా పారిశుధ్య పనులు, గద్దెల ప్రాంగణంలో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు నిరంతరం కొనసాగాలని అన్నారు. మహా జాతర సందర్భంగా జరిగిన చిన్న చిన్న సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని అన్నారు. అనంతరం మేడారం, రెడ్డిగూడెం గ్రామాల్లో ఫారెస్ట్ రేంజ్ అధికారుల వసతిగృహాలను ప్రారంభించారు. ఈ సమావేశంలో దేవాదాయ ధర్మాదాయ డిప్యూటీ కమిషనర్ సంధ్యారాణి, అసిస్టెంట్ కమిషనర్ సునిత, కార్యనిర్వాహణ అధికారి రాజేంద్రం, పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు, అధికారులు, ఇంజనీర్లు, పలు శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

మండలంలోని మెండ్యాలతోగు అటవీ ప్రాంతంలో రూ.1కోటి వ్యయంతో అభివృద్ధి చేసిన బ్లాక్‌బెర్రీ దీవి పర్యటక కేంద్రాన్ని ములుగు జిల్లా అటవీ సంరక్షణ అధికారి రాహుల్ కిషన్ జాదవ్ ఆధ్వర్యంలో ఇద్దరు మంత్రులు సీతక్క, సురేఖ ప్రారంభించారు. తాడ్వాయి అడవుల్లో ఉన్న అద్భుతమైన దీవిని గుర్తించి అభివృద్ధి చేసిన కలెక్టర్, డీఎఫ్‌వోలను మంత్రులు అభినందించారు.

పదేళ్ల ఆకాంక్షను నెరవేర్చాం..

- ఉమర్‌ఖాన్ పేరిట ఉన్న భూములకు త్వరలో పట్టాలు
- కొడిశలకుంట నుంచి మల్లంపల్లి దాకా గోదావరి జలాలు
- మల్లంపల్లి మండలం ప్రారంభంలో మంత్రి సీతక్క
- త్వరలో సొంత భవనాలను నిర్మిస్తామని హామీ
- సమ్మక్క, సారలమ్మల్లా కలిసి అభివృద్ధి చేస్తామన్న కొండా సురేఖ



సభలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క, వేదికపై మంత్రి సురేఖ, ఎంపీ బలరాంనాయక్, తదితరులు



సీతక్క, సురేఖకు గజమాలతో స్వాగతం పలుకుతున్న మల్లంపల్లి ప్రజలు

ములుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మల్లంపల్లిని మండలంగా ఏర్పాటు చేయాలని పదేళ్లుగా చేస్తున్న పోరాటానికి ఫలితం దక్కిందని, ఆ ఆకాంక్షను నెరవేర్చామని అని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క పేర్కొన్నారు. నూతన మండలంగా ఏర్పడ్డ మల్లంపల్లిని శుక్రవారం రాష్ట్ర అటవీ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ పోరిక బలరాంనాయక్‌తో కలిసి ప్రారంభించారు. అలాగే పీఏసీఎస్ భవనంలో ఏర్పాటు చేసిన తహసీల్దార్ కార్యాలయాన్ని కూడా ప్రారంభించి ములుగు తహసీల్దార్ విజయభాస్కర్‌కు ఇన్‌చార్జ్ బాధ్యతలు అప్పగించారు. 500 మెట్రిక్ టన్నుల సామర్థ్యం కలిగిన గోదాంను ప్రారంభించారు. అంతకుముందు మంత్రులకు మల్లంపల్లి ప్రజలు డప్పు చప్పుళ్లు, పూలవర్షం కురిపించి, బాణసంచా కాల్చి ఘన స్వాగతం పలికారు. భారీ గజమాలతో సత్కరించారు. ఈ సందర్భంగా మల్లంపల్లిలో మంత్రులు, ఎంపీ రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మల్లంపల్లి మండల సాధన జేఏసీ ఆధ్వర్యంలో నిర్వహించిన కతజ్ఞతా సభలో మంత్రి సీతక్క మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడి హోదాలో ములుగులో పాదయాత్ర చేసిన రేవంత్‌రెడ్డి ఇక్కడి ప్రజల ఆకాంక్షను తెలుసుకొని నాడే మాటిచ్చారని, సీఎంగా ఆ మాటను నెరవేర్చారన్నారు. మల్లంపల్లి మండల ఏర్పాటు కోసం దివంగత జడ్పీ చైర్మన్ జగదీశ్ నిస్వార్థంగా కృషి చేశారని, ఆయన పేరు కలిసివచ్చేలా జేడీ మల్లంపల్లిగా నామకరణం చేసేందుకు స్పెషల్ జీవో తీసుకువస్తానన్నారు. బీఆర్ఎస్ జగదీశ్‌ను అవమానించిందని, కానీ తాము ఆయన సేవలను గుర్తిస్తామన్నారు. గడిచిన పదేండ్లలో ప్రజల ఆకాంక్షతో నాటి పాలకులు ఆడుకున్నారని, ఓట్ల కోసం మండలాన్ని ఆశపెట్టి కాలయాపన చేశారన్నారు. మంత్రులు జిల్లాకు వస్తే మల్లంపల్లి వాసులను పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించేవారని గుర్తు చేశారు. తన విజయంలో మల్లంపల్లి ప్రజల సహకారమందించారని తెలిపారు. త్వరలోనే అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మిస్తామని, స్థల సేకరణ చేయాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఉమర్‌ఖాన్ పేరిట ఉన్న భూములలో సాగు చేసుకుంటున్న రైతులకు పట్టాలు జారీ చేస్తామని చెప్పారు. కొడిశలకుంట నుంచి మల్లంపల్లి దాకా అన్ని చెరువులకు గోదావరి జలాలను మళ్లించడం జరుగుతుందని, అవసరమైన కెనాల్ నిర్మాణం చేస్తామన్నారు. మల్లంపల్లిలో మహిళా భవన్ నిర్మిస్తానన్నారు. గణతంత్ర దినోత్సవం నుంచి నాలుగు పథకాలు అమలవుతాయని, త్వరలోనే మహిళలకు రూ.2500 సాయం, పింఛన్ పెంపు పథకాలను కూడా అమలు చేస్తామని మంత్రి సీతక్క తెలిపారు. మహిళలకు ఉచిత బస్సు, రూ.500గ్యాస్ సిలిండర్ విజయవంతంగా అమలు చేస్తున్నామని, రూ.2లక్షల లోపు రుణాలను మాఫీ చేసి రైతుల రుణం తీర్చుకున్నామన్నారు. ప్రజాపాలన గ్రామసభలపై బీఆర్ఎస్ నాయకులు కుట్ర చేస్తున్నారని మండిపడ్డారు. కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో కుమ్మరి నాగేశ్వర్‌రావు అనే వ్యక్తికి మద్యం తాగించి ఆత్మహత్యాయత్నానికి ప్రేరేపించారని ధ్వజమెత్తారు. నాగేశ్వర్‌రావు భార్యకు అంగన్‌వాటీ టీచర్ ఉద్యోగం తానే ఇప్పించానని, ఆకుటుంబానికి నాలుగెకరాల పంట భూమి కూడా ఉందని సీతక్క తెలిపారు. ఇల్లులేని నిరుపేదలకే తొలి ప్రాధాన్యతగా ఇందిరమ్మ గృహాలను మంజూరు చేయడం జరుగుతుందన్నారు. బీఆర్ఎస్ పార్టీలాగా చీకట్లో లబ్ధిదారులను ఎంపిక చేయడం లేదని, ప్రజల మధ్యే అర్హులను ప్రకటిస్తున్నామని చెప్పారు.



ఇన్‌చార్జ్ తహసీల్దార్ విజయభాస్కర్‌ను సత్కరిస్తున్న మంత్రులు సీతక్క, సురేఖ

మల్లంపల్లి అభివృద్ధికి సహకారం : మంత్రి కొండా సురేఖ

మల్లంపల్లి ప్రజల ఆకాంక్షను అర్థంచేసుకునే మనసున్న సీఎం రేవంత్‌రెడ్డి మండలాన్ని ఏర్పాటు చేశారని, ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేసేందుకు సంపూర్ణ సహకారం అందిస్తానని మంత్రి సురేఖ అన్నారు. రామాలయ నిర్మాణానికి రూ.30లక్షల నిధులు కేటాయిస్తున్న చెప్పారు. గత ప్రభుత్వం లక్షల కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని ఆరోపించారు. బీఆర్ఎస్ మళ్లీ గెలిస్తే రాష్ట్రాన్ని అమ్ముకునేదని గ్రహించిన ప్రజలు సంక్షేమ పాలన అందించే కాంగ్రెస్‌ను గెలిపించుకున్నారన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి కాంగ్రెస్ ప్రభుత్వం సంక్షేమ ఫలాలను అందిస్తుందని తెలిపారు. సీతక్కకు తనకు మధ్య విబేధాలున్నట్లు మీడియాలో ఊహాజనిత కథనాలు వస్తున్నాయని, అవన్నీ అవాస్తవాలన్నారు. సమ్మక్క, సారలమ్మల్లా తామెప్పుడూ కలిసే ఉంటామని చెప్పారు. ఏతోడూ లేకుండా రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన సీతక్క ఎన్నో అవమానాలు, సవాళ్లను ఎదుర్కొని ఈస్థాయికి చేరారని ప్రశంసించారు.

రూ.50 లక్షలతో మార్కెట్ యార్డు ఎంపీ బలరాంనాయక్

మల్లంపల్లిలో మార్కెట్ యార్డు నిర్మాణానికి తన నిధుల నుంచి రూ.50లక్షలు కేటాయిస్తానని ఎంపీ బలరాంనాయక్ హామీ ఇచ్చారు. బీఆర్ఎస్ తెలంగాణను అప్పులపాలు చేసిందని ఆరోపించారు. సమయం ఎక్కువైనా కాంగ్రెస్ ఇచ్చిన ప్రతీ వాగ్దానాన్ని నిలబెట్టుకుంటోందని తెలిపారు. ములుగును అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని, మల్లంపల్లిలో కావాల్సిన పాలనా సౌలభ్యాలను కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమాలలో టెస్కాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు, జిల్లా కలెక్టర్ టీఎస్.దివాకర, డీఎఫ్‌వో రాహుల్ కిషన్ జాదవ్, అదనపు కలెక్టర్ సీహెచ్.మహేందర్‌జీ, ఆర్డీవో వెంకటేష్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ బానోతు రవిచందర్, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పైడాకుల అశోక్, పీఏసీఎస్ చైర్మన్ బొక్క సత్తిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గురుకుల విద్య బలోపేతానికి కృషి

- తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి

ఏటూరునాగారం రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో గురుకుల విద్యను మరింతగా బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నట్లు తెలంగాణ గిరిజన సంక్షేమ గురుకులాల కార్యదర్శి సీతాలక్ష్మి అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని తెలంగాణ గురుకులాల మహిళ డిగ్రీ కళాశాల, స్పోర్ట్స్ స్కూల్, గురుకులాల బాలుర, బాలికల జూనియర్ కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలలోని మౌలిక సదుపాయాలు, విద్యార్థులకు అందుతున్న విద్య తదితర అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ... గురుకులాల్లో గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యతోపాటు మౌలిక సదుపాయాల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని, విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా ఉపాధ్యాయులు, అధ్యాపకులు చూసుకోవాలన్నారు. విద్యార్థులు ఆయా కళాశాలల్లో ఏమైనా సమస్యలుంటే నేరుగా తమ దృష్టికి తీసుకొస్తే వెంటనే వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. అదేవిధంగా గిరిజన విద్యార్థుల ఉన్నత విద్య కోసం ఆర్థికంగా సహాయ, సహకారాలు అందిస్తున్నామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా, ఆర్‌సీవో హరిసింగ్, డీసీవో శ్రీనివాసరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.




కళాశాలలో కార్యదర్శి సీతాలక్ష్మిని సన్మానిస్తున్న పీవో చిత్రామిశ్రా

నిట్‌లో స్ట్రక్చర్ మెటీరియల్‌పై వర్క్‌షాపు

హనుమకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ నిట్‌లో శుక్రవారం 'స్ట్రక్చర్ మెటీరియల్ ఎక్సలెన్స్. ఇన్నోవేషన్స్ ఇన్ స్టీల్ కాంక్రీట్, క్యాప్ సిస్టమ్‌పై రెండు రోజుల జాతీయ వర్క్‌షాపు ప్రారంభమైంది. సెంటర్ ఫర్ ట్రైనింగ్ అండ్ లెర్నింగ్ (సీటీఎల్), మెటలర్జికల్, మెటీరియల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్(ఎఎంఈ), నిట్ సివిల్ ఇంజనీరింగ్ డిపార్టుమెంట్ సంయుక్తంగా ఈ వర్క్‌షాపును నిర్వహిస్తున్నాయి. టాటా స్టీల్ స్మార్ట్ గ్రూప్ సౌజన్యం వహిస్తోంది. వరంగల్ నిట్ సీటీఎల్ అధిపతి ప్రొఫెసర్ టి.కిశోర్ వర్క్‌షాపును ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్ట్రక్చర్ మెటీరియల్‌లో సాంకేతిక నైపుణ్యాన్ని అభివృద్ధి చేయడంలో, నిర్మాణాత్మక పదార్థాలను ఆవిష్కరణలను ప్రోత్సహించడంలో పరస్పర సహకారం ప్రాముఖ్యతను వివరించారు. వర్క్‌షాపు కన్వీనర్, ఎంఎంఈ విభాగాధిపతి ప్రొఫెసర్ కిశోర్‌బాబు వర్క్‌షాపు లక్ష్యాలను వివరించారు. టాటా టిస్కాన్ రిటైల్ (ఏపీ, తెలంగాణ) సీనియర్ ఏరియా సేల్స్ మేనేజర్ కొడాలి రమ్య ఈ వర్క్‌షాపునకు గౌరవాతిథిగా హాజరయ్యారు. స్మార్ట్ ఐరన్స్ ప్రైవేటు లిమిటెడ్ మార్కెటింగ్, బిజినెస్ డెవలప్‌మెంట్ వైస్‌ప్రెసిడెంట్ వైభవ్ తాడేశ్వర్ గౌరవాతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి కోఆర్డినేటర్‌గా డాక్టర్ బండి భరత్ వ్యవహరించారు.



వర్క్‌షాపును ప్రారంభిస్తున్న సీటీఎల్ హెడ్ ప్రొఫెసర్ కిశోర్



స్థానిక ఎన్నికల కోసమే గ్రామసభలు

- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



విలేకరులతో మాట్లాడుతున్న దయాకర్‌రావు

దేవరుప్పుల, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో గెలుపొందడం కోసమే నాలుగు పథకాలపై ప్రజలను మభ్యపెట్టేందుకే ప్రభుత్వం గ్రామసభలు నిర్వహిస్తోందని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. శుక్రవారం దేవరుప్పులలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మండల బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. నాలుగు రోజులుగా అధికారులు గ్రామసభలు నిర్వహిస్తూ లబ్ధిదారుల పేర్లు చదివి వెళ్లిపోతున్నారని విమర్శించారు. ఎన్నికల ముందు మాయమాటలు చెప్పి అధికారంలోని వచ్చిన రేవంత్ సర్కార్ ఏడాది గడిచినా ఒక్క హామీని కూడా అమలు చేయకపోవటం శోచనీయమన్నారు.

గ్రామసభలకు డేట్స్ ఇచ్చి విదేశాల్లో సీఎం ఎంజాయ్ చేస్తున్నారని దుయ్యబట్టారు. పత్రికల్లో ఇస్తున్న ప్రకటనలు పచ్చి అబద్ధాలని, వేలకోట్లు పెట్టుబడి తెలంగాణకు వస్తున్నది అనేది బూటకమన్నారు. రూ.2లక్షల వరకు రుణమాఫీ ఏమైందన్నారు. గ్రామసభల్లో ప్రజలు అధికారులపై మండిపడుతున్నా ప్రభుత్వం కళ్లు తెరవడం లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు చింత రవి, కొల్లూరు సోమయ్య, నర్సింహారెడ్డి, ఏలె సుందర్, కృష్ణమూర్తి, తీగల సత్తయ్య, సిరిపురం సోమయ్య, శీల తిరుమలేష్ పాల్గొన్నారు.

సింగరాజుపల్లిలో శుక్రవారం ఎర్రబెల్లి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దయాకర్‌రావు దుప్పట్లు పంపిణీ చేశారు. గ్రామ డీలర్ అన్నారపు యాదగిరి తల్లి మారెమ్మ అనారోగ్యంతో మృతి చెందగా, ఎర్రబెల్లి పరామర్శించారు. మన్‌పహాడ్‌కు చెందిన ముత్యాల రాగయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా పరామర్శించారు.

నిట్‌ను సందర్శించిన స్వీడన్ ప్రొఫెసర్లు




సివిల్ ఇంజనీరింగ్ ప్రొఫెసర్లతో సమావేశమైన స్వీడన్ లుండ్ ప్రొఫెసర్లు

హనుమకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రమాదాలను నివారించడానికి భద్రతా వ్యవస్థను అభివృద్ధి చేయడానికి వరంగల్ నిట్ స్వీడన్‌లోని లుండ్ విశ్వవిద్యాలయానికి సహకరిస్తోంది. ఇందులో భాగంగా ఇందుకు సంబంధించిన ప్రాజెక్టులో పనిచేయడానికి స్వీడన్ నుంచి ప్రొఫెసర్లు శుక్రవారం నిట్‌కు వచ్చారు. భారతదేశంలో దుర్భరమైన రహదారి వినియోగదారులకు సురక్షిత భద్రతా వ్యవస్థ - దృక్పథం ఈ ప్రాజెక్టు చేస్తున్నారు. స్కీం ఫర్ ప్రమోషన్ ఆఫ్ ఆకాడమీ అండ్ రీసెర్చ్ కోలాబరేషన్ (స్పార్క్) దీనిని స్పాన్సర్ చేసింది. సివిల్ ఇంజనీరింగ్ విభాగం ప్రొఫెసర్ రవి శంకర్, ప్రొఫెసర్ రఘురాం ఈ ప్రాజెక్టును నిర్వహిస్తున్నారు. ఈ సురక్షిత భద్రతా వ్యవస్థ రోడ్డు భద్రతా నిర్వహణలో మనుషుల బలహీనతలను, వారు పొరపాట్లకు లోనయ్యే స్వభావాన్ని గుర్తిస్తుంది. ఈ సందర్భంగా లుండ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్లు అలియక్సీ లరేషిన్, రార్మెలో డి ఆగోస్టినో మాట్లాడుతూ.. సేఫ్ సిస్టమ్ ప్రధాన లక్ష్యం ప్రమాదం జరిగితే ప్రాణాపాయం లేదా, జీవితాన్ని ప్రభావితం చేసే గాయాలు జరగకుండా నివారించడమేనన్నారు. ఈ భద్రతా వ్యవస్థకు సంబంధించిన బాధ్యతను విధాన నిర్ణేతలు, ప్రణాళికకర్తలు, ఇంజనీర్లు, వాహన తయారీదారులు, డ్రైవర్లు, అమలు అధికారులు, డాక్టర్లు మీడియా వ్యక్తులు పంచుకోవాలన్నారు. ఈ నేపథ్యంలో వరంగల్ నిట్ ఈనెల 28వ తేదీన చాలెంజెస్ టూవర్డ్స్ జీరో డెత్- అడాప్టింగ్ ద సేఫ్ సిస్టమ్ ఇన్ ఇండియా అనే అంశంపై వివిధ వాటాదారులతో వర్క్‌షాపు నిర్వహించనున్నది.

అనారోగ్యంతో ఎంఈవో రవీందర్ మృతి

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా హసన్‌పర్తి మండల విద్యాశాఖాధికారి ఈసరి రవీందర్ (52) శుక్రవారం మృతి చెందారు. ఆయన కొన్నేళ్లుగా కిడ్నీ సంబంధ వ్యాధితో చికిత్స పొందుతున్నారు. శుక్రవారం హనుమకొండలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందారు. మృతుడు రవీందర్‌కు భార్య, ఒక కొడుకు, ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. కాగా, ఆయన మృతికి డీఈవో వాసంతి, వివిధ ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఎంఈవోలు సానుభూతిని ప్రకటించారు.



ఈసరి రవీందర్ (ఫైల్)

రాజకీయ చైతన్యంతోనే బీసీలకు రాజ్యాధికారం



సదస్సులో మాట్లాడుతున్న చిరంజీవులు

బాలసముద్రం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాజకీయ చైతన్యం ద్వారానే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక చైర్మన్, రిటైర్డ్ ఐఏఎస్ టి. చిరంజీవులు అన్నారు. భారతరత్న జననాయక్ కర్పూరి ఠాకూర్ జయంతి సందర్భంగా 'స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీల పాత్ర' అనే అంశంపై హనుమకొండ హరిత కాకతీయ హోటల్‌లో బీసీ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సదస్సుకు బీసీ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర నాయకుడు డాక్టర్ కూరపాటి రమేష్ అధ్యక్షత వహించారు. సదస్సులో చిరంజీవులు మాట్లాడుతూ.. సకల సామాజిక రంగాల్లో జనాభా దామాషా ప్రకారంగా తమ వాటా కోసం ఉద్యమిస్తున్న బీసీలు దోపిడీ, ఆధిపత్య కులాల రాజకీయ పార్టీలను వీడాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏళ్ల గడిచినా బీసీ జనగణన కోసం పోరాటం చేయడం బాధాకరమని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీలో కులగణన జరిపి స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని ప్రకటించారని ఆ హామీ అమలయ్యే వరకు పోరాటం చేయాలని కోరారు. స్థానిక సంస్థల్లో బీసీ అభ్యర్థుల విజయం కోసం ఇంటలెక్చువల్ ఫోరం నాయకులు చైతన్య సదస్సులు నిర్వహిస్తామన్నారు. పల్లెల్లోగెలిస్తేనే ఢిల్లీని గెలువవచ్చునని అప్పుడే బీసీలకు రాజ్యాధికారం సాధ్యమని అన్నారు.

ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్ మాట్లాడుతూ.. బీసీ శక్తిని రాజకీయ శక్తిగా మార్చినప్పుడే రాజ్యాధికారం సాధ్యమని అన్నారు. సదస్సులో ఇంకా ప్రొఫెసర్లు కూరపాటి వెంకటనారాయణ, దినేష్, విజయ్‌బాబు, దిగంబర్‌రావు, కుడా మాజీ చైర్మన్ సంగంరెడ్డి సుందర్‌రాజ్ యాదవ్, డాక్టర్ కొలిపాక వెంకటస్వామి, న్యాయవాదులు రాచకొండ ప్రవీణ్‌కుమార్, ఎగ్గడి సుందర్‌రాం, వివిధ సంఘాల నాయకులు వడ్లకొండ వేణుగోపాల్‌గౌడ్, గొల్లపెల్లి వీరస్వామి, తిరునగరి శేషు, వల్లాల జగన్ తదితరులు పాల్గొన్నారు.

28, 29 తేదీల్లో జాబ్ మేళాలు

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్, హనుమకొండ జిల్లాల ఉపాధి కల్పన, శిక్షణ శాఖల ఆధ్వర్యంలో ఈ నెల 28, 29 తేదీల్లో జాబ్ మేళాను నిర్వహిస్తున్నట్లు ఎంప్లాయిమెంట్ ఆఫీసర్లు సీహెచ్.ఉమారాణి, ఎం.మల్లయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. వరంగల్ జిల్లా ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలో అపోలో ఫార్మసీలో ఖాళీలకు, హనుమకొండ జిల్లా ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జాబ్ మేళాలలో యాక్సిస్ బ్యాంకులో ఖాళీలను భర్తీ చేసేందుకు జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని తెలిపారు. టెన్త్, ఇంటర్, డీఫార్మసీ, బీఫార్మసీ, ఇంటర్, డిగ్రీ పాసై 18 నుంచి 35 ఏళ్ల మధ్య గల యువతీ యువకులు జాబ్ మేళాకు హాజరు కావచ్చునని వారు తెలిపారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు రెండు రోజులు ములుగు రోడ్‌లోని సంబంధిత కార్యాలయాల్లో ఉదయం 10 గంటలకు వారి జిరాక్స్ పత్రాలతో హాజరు కావాలని వారు సూచించారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
మక్కలు (బిల్టీ రకం)	-	-
పల్లికాయ (సూక)	6210	5600
పల్లికాయ (పచ్చిది)	4000	3100
కందులు	4559	4460
పెసళ్లు	7701	2800
పత్తి	7120	5800
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	14000	9000
తేజ మిర్చి (కొత్తది)	-	-
తేజ ఏసీ	13000	11000
వండర్‌హాట్	14000	11500
యూఎస్341ఏసీ	-	-
యూఎస్341	15500	11500
సింగిల్‌పట్టి ఏసీ	-	-
తాలు మిర్చి	6500	3000


- వరంగల్ వ్యవసాయం

సాహిత్యంతో సమాజ పురోభివృద్ధి

పుస్తకాలు బహుమతులుగా ఇచ్చే సంస్కృతి పెరగాలి.. వచ్చే ఏడాది రాజ్‌భవన్‌లో సాహితీ మహోత్సవం

- తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ
- హైదరాబాద్ సాహితీ మహోత్సవం షురూ
- పాల్గొన్న ప్రఖ్యాత నటి షబానా అజ్మీ

హైదరాబాద్ సిటీ, జనవరి24 (ఆంధ్రజ్యోతి): "సాహిత్యం, కళలు సమాజ పురోభివృద్ధికి ప్రధానంగా తోడ్పడతాయి. అవి మనకు తెలియని ప్రపంచంతో పాటు మనల్ని మనకు కొత్తగా పరిచయం చేస్తాయి. అందుకే ప్రతి ఒక్కరికి సాహిత్యానుభూతి ఉండడం ముఖ్యం. సాహిత్యానుభవం లేని జీవితం అసంపూర్ణం" అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ వ్యాఖ్యానించారు. తనది సాహిత్యం, కళలను ఆరాధించే కుటుంబ నేపథ్యమని, ఆ వాతావరణంలోనే తాను పుట్టి, పెరిగినట్లు తెలిపారు. తన తాతయ్య, తల్లి కూడా చిత్రకారులని, తండ్రి రామేంద్ర కిషోర్‌దేవ్ వర్మ సైతం మంచి సాహిత్యాభిమాని అని పేర్కొన్నారు. హైటెక్ సిటీ, సత్వా నాలెడ్జ్ సిటీ వేదికగా 15వ హైదరాబాద్ సాహితీ మహోత్సవంను శుక్రవారం జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. అనంతరం ఆవరణలో నెలవైన ప్రత్యేక చిత్రప్రదర్శనను ఆయన వీక్షించారు. అక్కడ కాన్వాస్‌పై కొలువుదీరిన ప్రకృతి రమణీయ చిత్రాలను కొనియాడారు. అనంతరం గవర్నర్ మాట్లాడుతూ.. వచ్చే ఏడాది హైదరాబాద్ సాహితీ మహోత్సవాన్ని రాజ్‌భవన్‌లో నిర్వహించేలా ప్రణాళిక తయారు చేయాలని ఫెస్టివల్ డైరెక్టర్లతో అన్నారు. అందుకు అవసరమైన అనుమతులు ఇప్పిస్తానని మాట ఇచ్చారు. పుస్తకాలను బహుమతులుగా ఇచ్చి పుచ్చుకొనే సంస్కృతి పెరగాలని ఆకాంక్షించారు. షబానా అజ్మీ సినిమాలంటే తనకు చాలా ఇష్టమని, మరీ ముఖ్యంగా ఆమె నటనకు పెద్ద అభిమానిని అని వెల్లడించారు. జిష్ణుదేవ్ వర్మ రాసిన పుస్తకాన్ని సాహితీ ఉత్సవంలో ప్రత్యేకంగా ప్రదర్శనకు ఉంచారు. హైదరాబాద్ సాహితీ మహోత్సవం చైర్మన్ జయేశ్ రంజన్ స్వాగతోపన్యాసం చేశారు. ముఖ్య అతిథులుగా పాల్గొన్న లిథువేనియా రాయబారి డయానా మికేవిసెన్, ప్రముఖ నటి షబానా అజ్మీలను నిర్వాహకులు ప్రొ. విజయకుమార్, అమితా దేశాయ్, కిన్నెర మూర్తి శాలువాతో సత్కరించారు.



హైదరాబాద్ సాహితీ మహోత్సవం ప్రారంభ సభలో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, నటి షబానా అజ్మీ, లిథువేనియా రాయబారి డయానా, జయేశ్ రంజన్

భారతీయ భాషలంటే చాలా ఇష్టం

హైదరాబాద్ సాహిత్య మహోత్సవానికి ప్రత్యేక ఆహ్వానితురాలిగా లిథువేనియా రాయబారి డయానా మికేవిసెన్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. భారతీయ భాషలంటే తనకు చాలా ఇష్టమని, అందులోనూ హిందీ , సంస్కృతభాషలపై మరింత మమకారమని తెలిపారు. డయానాను 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకంగా పలకరించగా.. 'సాగర సంగమం' సినిమాకు తాను వీరాభిమానిని అని చెప్పారు. ఆ చిత్రాన్ని రష్యన్ భాషలో లెక్కలేనన్నిసార్లు చూసినట్లు వెల్లడించారు. అంతేకాదు, వేటూరి సుందరరామమూర్తి రాసిన 'మౌనమేలనోయి ఈ మరపురాని రేయి..' పాట తెలుగులో ఆలపించి, ఆ సినిమాపై తనకున్న అభిమానాన్ని చాటారు.

రియల్టర్ల అడ్డగోలు ప్రచారంపై రెరా తనిఖీలు

- హైదరాబాద్ నలుదిక్కులా ప్రకటనలు, ఫ్లెక్సీల హోర్డింగుల తనిఖీలకు 4బృందాలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానా

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రియల్టర్ల అడ్డగోలు ప్రకటనలపై రియల్ ఎస్టేట్ రెగ్యులేటరీ అథారిటీ(రెరా) ప్రత్యేకంగా దృష్టి సారించింది. తమ అనుమతుల్లేని ప్రాజెక్టులపై రియల్ ఎస్టేట్ కంపెనీలు చేస్తున్న ప్రచారంపై తనిఖీలు చేసి నివేదిక ఇవ్వాలని నాలుగు బృందాలను నియమించింది. ఈ మేరకు శుక్రవారం ఉత్తర్వులిచ్చింది. రియల్ ఎస్టేట్ సంస్థలు తమ ప్రాజెక్టు గురించిన ప్రకటనలు ఇవ్వాలంటే తప్పనిసరిగా రెరా ఇచ్చిన రిజిస్ట్రేషన్ నంబర్ ఉండాలి. కానీ, కొన్ని సంస్థలు పురపాలక శాఖ అనుమతులు పొందకుండా, రెరా రిజిస్ట్రేషన్ లేకుండా ప్రీ లాంచింగ్ పేరుతో ప్రకటనలు ఇస్తూ అమ్మకాలు చేస్తున్నాయి. సంవత్సరాల పాటు నిర్మాణాలు చేయకుండా కొనుగోలుదారులను ముప్పుతిప్పలు పెడుతున్నాయి. ఈ నేపథ్యంలో రిజిస్ట్రేషన్ లేకుండానే హోర్డింగ్స్ పెట్టడం, ప్రకటనలపై ప్రాజెక్టు పేరు, వెబ్‌సైట్, చిరునామా ముద్రించకపోవడం, అనుమతుల్లేకుండా ఫ్లెక్సీలు, బ్యానర్లు కట్టడం తదితర అంశాలపై హైదరాబాద్ నగర నలువైపులా తనిఖీలు చేసి.. రిజిస్ట్రేషన్ లేకుండా బ్యానర్లు ఏర్పాటు చేసి ఉంటే షోకాజ్ నోటీసులు ఇవ్వాలని, జరిమానాలు విధించాలని రెరా ఆదేశించింది.

- శ్రీశైలం హైవే, దక్షిణ హైదరాబాద్, ఎయిర్‌పోర్టు, బెంగళూరు జాతీయ రహదారి మార్గాల్లో తనిఖీలు చేసేందుకు జాయింట్ డైరెక్టర్ వెంకటరామిరెడ్డి, కె.ప్రభాకర్ నేతృత్వంలోని కమిటీ నివేదిక ఇవ్వాల్సి ఉంటుంది.
- హైటెక్ సిటీ, నాగపూర్ జాతీయ రహదారి, వరంగల్ హైవే, పశ్చిమ హైదరాబాద్ వైపు పరిశీలన చేసేందుకు అదనపు రిజిస్ట్రార్ డి.రవీందర్, జగదీశ్ నేత్వంలో కమిటీని వేశారు.
- విజయవాడ జాతీయ రహదారి, వరంగల్ జాతీయ రహదారి, తూర్పు హైదరాబాద్ వైపు తనిఖీలు చేయడానికి రెరా సాంకేతిక అధికారులు కె.అంజయ్య, ఎన్. తిరుపతయ్య నేతృత్వంలో కమిటీని నియమించారు.
- ముంబయి జాతీయ రహదారి, ఉత్తర హైదరాబాద్ , నాగార్జున సాగర్ రహదారి వైపు లీగల్ సెల్ ఏడీ శ్రీమతి హెచ్.చంద్రవదన, కె.నిరంజన్ రావు నేతృత్వంలో కమిటీని వేశారు.

ఏఈ పోస్టులకు అభ్యర్థుల ఎంపిక

మునిసిపల్ పరిపాలన శాఖలోని అసిస్టెంట్ ఇంజనీర్(ఏఈ) పోస్టులకు ఎంపికైన 650 మంది అభ్యర్థుల ప్రాథమిక జాబితాను టీజీపీఎస్సీ వెబ్‌సైట్‌లో ఉంచింది. మునిసిపల్ విభాగంలో ఏఈ పోస్టుల భర్తీ కోసం 2022 సెప్టెంబరు 12న నోటిఫికేషన్ ఇచ్చారు. 2023 అక్టోబరు 18, 19 తేదీల్లో పరీక్షలు నిర్వహించారు. తాజాగా ఎంపికైన అభ్యర్థుల జాబితాను ప్రకటించారు.

దిల్‌రాజు సహా మరికొందరి స్టేట్‌మెంట్ల రికార్డు

ఆదాయం, పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసాలు గుర్తించిన ఐటీ

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ నిర్మాత, తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్ రాజు నివాసంలో ఐటీ అధికారుల సోదాలు వరుసగా నాలుగోరోజు కొనసాగాయి. గత మంగళవారం తెల్లవారుజాము నుంచి సినీ ప్రముఖుల నివాసాలు, కార్యాలయాల్లో ఐటీ సోదాలు జరుగుతున్నాయి. సుకుమార్‌తోపాటు వివగతా వారికి సంబంధించి ఇళ్లు, కార్యాలయాల్లో గురువారం సోదాలు ముగిసినా దిల్‌రాజు నివాసం, కార్యాలయాలు, వ్యాపార భాగస్వాముల నివాసాల్లో ఐటీ ప్రత్యేక బృందాలు సోదాలు నిర్వహించాయి. శుక్రవారం సోదాల అనంతరం దిల్‌రాజును శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వరా క్రియేషన్స్ కార్యాలయానికి తీసుకెళ్లారు. దిల్‌రాజు ప్రొడక్షన్ కార్యాలయాల్లోనూ సోదాలు నిర్వహించారు. గేమ్ ఛేంజర్, సంక్రాంతికి వస్తున్నాం సహా ఇటీవల నిర్మించిన సినిమాల గురించి ఐటీ అధికారులు ఆరా తీసినట్లు తెలిసింది. డాకు మహారాజ్ సినిమాకు దిల్‌రాజు డిస్ట్రిబ్యూటర్‌గా ఉండటంతో ఆ సినిమా కలెక్షన్‌లపైనా కొన్ని వివరాలు ఐటీ అధికారులు సేకరించారు. దిల్‌రాజుతోపాటు ఎస్‌వీసీ ఆడిటర్, అకౌంటెండ్ స్టేట్‌మెంట్లను ఐటీ అధికారులు రికార్డు చేసినట్లు సమాచారం. వరుసగా నాలుగు రోజులు జరిగిన తనిఖీల్లో ఆర్థిక లావాదేవీలు, పన్ను చెల్లింపునకు సంబంధించిన పలు పత్రాల్ని ఐటీ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. రెండేళ్లుగా పెట్టిన పెట్టుబడులు, వచ్చిన లాభాలు, పన్ను చెల్లింపుల్లో వ్యత్యాసాలు ఉన్నట్లు ఐటీ అధికారులు ప్రాథమికంగా గుర్తించారు.

ఛత్తీస్‌గఢ్‌లో బూటకపు ఎన్‌కౌంటర్లు: హరగోపాల్

నల్లకుంట, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఛత్తీస్‌గడ్‌లో ఆపరేషన్ కగార్ పేరిట బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నారన్నారని పౌర హక్కుల సంఘం నేత ప్రొఫెసర్ హరగోపాల్ ఆరోపించారు. ఆదివాసులను అడవి నుంచి దూరం చేసేందుకే కేంద్రం ఈ ఎన్‌కౌంటర్లు చేయిస్తోందని ధ్వజమెత్తారు. బస్తర్‌లో జరుగుతున్న ఎన్‌కౌంటర్లపై ప్రజా సంఘాలు శుక్రవారం హైదర్‌గూడలో నిర్వహించిన సమావేశంలో హరగోపాల్ మాట్లాడారు. గడిచిన ఏడాది కాలంలో జరిగిన, ప్రస్తుతం జరుగుతున్న అన్ని ఎన్‌కౌంటర్లపై సుప్రీంకోర్టు జడ్జితో న్యాయ విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు.

చందన్‌మిశ్రాను కోర్టులో హాజరుపర్చాలి

- పౌర హక్కుల సంఘం డిమాండ్

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): చందన్‌మిశ్రా అనే వ్యక్తిని పోలీసులే సివిల్ డ్రెస్సుల్లో వచ్చి ఇంటి నుంచి పట్టుకెళ్లిపోయారని పౌర హక్కుల సంఘం తెలిపింది. ఆయనపై కేసులుంటే చట్టపరంగా శిక్షించేందుకు కోర్టులో హాజరుపర్చాలని శుక్రవారం ఓ ప్రకటనలో డిమాండ్ చేసింది. 'మావోయిస్టులతో కొంతకాలం పాటు పనిచేసి చందన్ మిశ్రా ఈరోజే జగద్గిరిగుట్టలోని తన ఇంటికొచ్చారు. పెద్ద ఎత్తున పోలీసులు సివిల్ డ్రెస్సుల్లో వచ్చి ఆయన్ను తీసుకెళ్లిపోయారు. ఆయన భార్య స్వాతి ద్వారా మాకు విషయం తెలిసింది. కోర్టులో ఆయన్ను వెంటనే హాజరుపర్చాలి' అని సంఘం అధ్యక్షుడు గడ్డం లక్ష్మణ్, ప్రధాన కార్యదర్శి ఎస్.నారాయణరావు పేర్కొన్నారు. ఈ ఘటనపై ఎంఎల్ పీఐ (రెడ్ ఫ్లాగ్) ఏపీ రాష్ట్ర కమిటీ కూడా స్పందించింది. చందన్‌మిశ్రాను వెంటనే విడుదల చేయాలని కమిటీ కార్యదర్శి మరీదు ప్రసాద్ బాబు డిమాండ్ చేశారు.

3 రోజులూ కష్టంగానే జేఈఈ గణితం పేపర్

ఎడ్యుకేషన్ డెస్క్: జేఈఈ మెయిన్ పేపర్-1 పరీక్షలు ఈనెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగాయి. మూడు రోజుల విరామం తరువాత మళ్లీ జనవరి 28నుంచి 30వ తేదీ వరకు జరగనున్నాయి. అయితే తొలి మూడు రోజుల్లో జరిగిన ఆరు ప్రశ్నపత్రాలను విశ్లేషిస్తే దాదాపుగా అన్ని సెషన్లలో గణితం(మేథ్స్) పేపర్ కఠినంగా ఉంది. భౌతికశాస్త్రం, రసాయన శాస్త్రం పేపర్లు కొంత అటుఇటుగా ఉన్నాయి.

గ్రామసభల్లో దరఖాస్తుల వెల్లువ!

- మరోసారి సభలు పెట్టే అవకాశం
- రాష్ట్రవ్యాప్తంగా ముగిసిన కార్యక్రమం

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో నాలుగు పథకాలకు.. కొత్తగా దరఖాస్తులు వెల్లువెత్తాయి. ఈ పథకాల అమలు జాబితాలో పేర్లు లేనివారంతా మళ్లీ దరఖాస్తు చేసుకోవాలంటూ.. ప్రజాప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు చెబుతుండటంతో ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డుల పంపిణీ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకాలు ఒక్కోదానికి వేలసంఖ్యలో దరఖాస్తులు వచ్చాయి. ఆయా పథకాలకు అర్హులను గుర్తించడంలో భాగంగా.. రాష్ట్రంలో నాలుగు రోజులుగా చేపట్టిన గ్రామసభల నిర్వహణ శుక్రవారం ముగిసింది. రాష్ట్రవ్యాప్తంగా 12,769 పంచాయతీలు, పురపాలికల్లోని 2,387 వార్డుల పరిధిలో గ్రామసభలు నిర్వహించినట్లు అధికారులు తెలిపారు. జనగామ జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 14,532, ఇందిరమ్మ ఇళ్ల కోసం 13,955, రైతుభరోసాకు 491, ఆత్మీయ భరోసాకు 5,270 దరఖాస్తులు వచ్చాయి. గద్వాల జిల్లాలో రేషన్ కార్డుల కోసం 23,197, ఇందిరమ్మ ఇళ్ల కోసం 10,955, రైతు భరోసాకు 917, ఆత్మీయ భరోసా లబ్ధికి 7,105, ఆదిలాబాద్ జిల్లాలో రేషన్‌కార్డుల కోసం 32,727, ఇందిరమ్మ ఇళ్ల కోసం 16,730, రైతు భరోసాకు 387 దరఖాస్తులు అందాయి. 4 సంక్షేమ పథకాల అర్హులకు లబ్ధి చేకూరే విధంగా 26న ప్రత్యేక కార్యక్రమం నిర్వహించనున్నారు.

డీఎంఈగా నరేంద్రకుమార్

తొలిసారి రెగ్యులర్ నియామకం

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వైద్య విద్యలో పదేళ్ల ఇన్‌చార్జుల పాలనకు తెర పడింది. ఎట్టకేలకు ప్రభుత్వం రెగ్యులర్ డీఎంఈ (వైద్య విద్య సంచాలకులు)ని నియమించింది. డాక్టర్ ఎ.నరేంద్రకుమార్‌ను డీఎంఈగా నియమిస్తూ ఆరోగ్యశాఖ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే అకడమిక్ డీఎంఈగా డాక్టర్ శివరాంప్రసాద్‌ను నియమిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఈ మేరకు డాక్టర్ నరేంద్రకుమార్ శుక్రవారం సాయంత్రం కోఠిలోని కార్యాలయంలో డీఎంఈగా బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు ప్రభుత్వ వైద్యుల సంఘం అభినందనలు తెలిపింది. పూర్తిస్థాయి డీఎంఈ నియామకం పట్ల సంఘం అధ్యక్షుడు డాక్టర్ నరహరి ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత డీఎంఈ పోస్టు ఆంధ్రప్రదేశ్‌కు వెళ్లిపోవడంతో.. అప్పటి నుంచి ఇన్‌చార్జులతోనే నెట్టుకొచ్చారు. తొలుత డాక్టర్ పి.శ్రీనివాస్, ఆ తర్వాత డాక్టర్ రమణి, అనంతరం డాక్టర్ రమేశ్‌రెడ్డిలను బీఆర్ఎస్ ప్రభుత్వం ఇన్‌చార్జి డీఎంఈలుగా నియమించింది. ఇందులో రమేశ్‌రెడ్డి ఒక్కరే ఏడేళ్లపాటు డీఎంఈగా ఉన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రమేశ్‌రెడ్డిని తప్పించి.. త్రివేణికి ఇన్‌చార్జి డీఎంఈ బాధ్యతలు అప్పగించింది. అనంతరం సంగారెడ్డి మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వాణికి ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. ఇప్పటిదాకా ఇన్‌చార్జి డీఎంఈగా ఆమెనే కొనసాగుతూ వచ్చారు. వాస్తవానికి డీఎంఈ అయ్యే సీనియారిటీ జాబితాలో నరేంద్రకుమార్ మొదటి వరుసలో ఉన్నారు. కానీ, బీఆర్ఎస్ హయాంలో ఎక్కడో 50వ స్థానంలో ఉన్నవారిని తీసుకువచ్చి ఇన్‌చార్జులుగా నియమించారు. దీనిపై నరేంద్ర్‌కుమార్ హైకోర్టును ఆశ్రయించగా.. అప్పటి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. కోర్టు ఆదేశాల మేరకు 2023 మార్చి16న రెగ్యులర్ డీఎంఈ, అకడమిక్ డీఎంఈ పోస్టులను మంజూరు చేసినా.. రెగ్యులర్ నియామకాలు చేపట్టలేదు. కాంగ్రెస్ సర్కారు వచ్చాక.. కొన్ని సాంకేతిక అంశాల కారణంగా డీఎంఈ నియామకం వాయిదా పడుతూ వచ్చింది. ఈ నెల 24న రెగ్యులర్ డీఎంఈ నియామకంపై వ్యక్తిగతంగా హాజరు కావాలని ఆరోగ్య శాఖ కార్యదర్శిని కోర్టు ఆదేశించింది. దీంతో సీనియారిటీ ప్రకారం పదోన్నతుల ద్వారా నియామకం చేపట్టినట్లు వైద్యశాఖ కోర్టుకు తెలిపింది. సంబంధిత జీవో కాపీని కోర్టుకు అందజేసింది.

పర్యాటకానికి ప్రోత్సాహమేదీ?

- ఉమ్మడి జిల్లాలో పలు దర్శనీయ స్థలాలు
- నిత్యం అధిక సంఖ్యలో పర్యాటకుల రాక
- కనీస సాకర్యాలు లేక ఇబ్బందులు
- కొత్త జిల్లాల్లో ఏర్పాటుకాని టూరిజం ఆఫీసులు
- సిబ్బంది కొరతతో కొరవడుతున్న పర్యవేక్షణ
- పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి నిధుల కొరత

నేడు జాతీయ పర్యాటక దినోత్సవం



హనుమకొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కాకతీయుల కాలం నాటి ఎన్నో అపురూప ప్రాచీన కట్టడాలు.. ప్రకృతి రమణీయతను పంచే సరస్సులు.. మనసులను ఓలలాడించే జలపాతాలు.. చరిత్రకు ఆనవాళ్లుగా నిలిచిన కళాఖండాలు, సుప్రసిద్ధ దేవాలయాలు ఎన్నో ఉమ్మడి జిల్లాకు మణిహారాలుగా వెలుగొందుతున్నాయి. అనేక పర్యాటక ప్రాంతాలకు నిలయమైన ఉమ్మడిజిల్లాలోని పర్యాటక ప్రాంతాలను సందర్శించేందుకు నిత్యం వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. హనుమకొండలోని వేయిస్తంభాల గుడి, పద్మాక్షి దేవాలయం, ఐనవోలు, ములుగు జిల్లాలోని యునెస్కో గుర్తింపు పొందిన రామప్ప, అందాలొలికించే లక్నవరం సరస్సు, బొగత జలపాతం, మహబూబాబాద్ జిల్లాలోని పాండవులగుట్ట, వరంగల్‌లోని భద్రకాళి దేవాలయం, వరంగల్ కోట తదితర ప్రదేశాలు మొదటి స్థానంలో ఉన్నాయి. ఎటొచ్చి పర్యాటకాన్ని అభివృద్ధి చేసే ప్రోత్సాహమే ప్రభుత్వం నుంచి లేదు. దర్శనీయ స్థలాల్లో కనీస సౌకర్యాలు లేక సందర్శకులు ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి ఉంది. నేడు జాతీయ పర్యాటక దినోత్సవం సందర్భంగా ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యాటకంపై ప్రత్యేక కథనం.

కొత్త జిల్లాల్లో కార్యాలయాలు కరువు

రాష్ట్ర ఆవిర్భావంతర్వాత బీఆర్ఎస్ హయాంలో జిల్లాల విభజన జరిగింది. కానీ నేటికీ ఈ జిల్లాల్లో పర్యాటక శాఖ కార్యాలయాలను ఏర్పాటు చేయలేదు. జిల్లాల పునర్విభజన ఫలితంగా ఉమ్మడి వరంగల్ జిల్లా హనుమకొండ, వరంగల్, జనగామ, మహబూబాబాద్, ములుగు, జయశంకర్ భూపాలపల్లిలుగా ఏర్పడింది. వీటిలో హనుమకొండ జిల్లాలో మినహా విగతా వాటిల్లో ఇప్పటి వరకు టూరిజం ఆఫీసులు లేవు. ఉమ్మడి వరంగల్ జిల్లా కేంద్రంగా ఉన్న పూర్వ పర్యాటక కార్యాలయం హనుమకొండ కలెక్టరేట్‌లో కొనసాగుతోంది. కొత్త జిల్లాల పరిధిలో పలు పర్యాటక ప్రాంతాలు అనేకం ఉన్నా అక్కడ టూరిజం ఆఫీసులు లేకపోవడంతో పర్యవేక్షణ కరువైంది. ఆ జిల్లాల్లో పర్యాటకాభివృద్ధి కుంటుపడుతోంది.





ఒకే అధికారికి 9 జిల్లాలు

బీఆర్ఎస్ హయాంలో పర్యాటకం తీవ్ర నిర్లక్ష్యానికి గురైంది. అంతకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఎంతో కొంత అభివృద్ధి జరిగింది. జిల్లాలకు నిధులు కూడా విడుదలయ్యేవి. కానీ ఆ తర్వాత బీఆర్ ఎస్ సర్కార్ పట్టించుకోలేదు. రాష్ట్రంలో ఇప్పటికీ మూడు జిల్లాలు హైదరాబాద్, హనుమకొండ, నల్లగొండల్లో మాత్రమే పర్యాటక కార్యాలయాలు ఉన్నాయి. వీటికి ముగ్గురు అధికారులు ఉండగా ఒక్కో అధికారి పరిధిలో 9 నుంచి 10 జిల్లాలు ఉన్నాయి. హనుమకొండ కలెక్టరేట్ కేంద్రంగా ఉన్న పర్యాటక కార్యాలయం అధికారికి వరంగల్ ఉమ్మడి జిల్లాతోపాటు నల్లగొండ జిల్లా ఇన్‌చార్జ్ బాధ్యతలను అప్పగించారు. పన్నెండేళ్ల గా ఉమ్మడి వరంగల్, నల్గొండ జిల్లాల పరిధిలోని తొమ్మిది జిల్లాల్లోని పర్యాటక ప్రాంతాల పర్యవేక్షణను ఆయనే చూడాల్సి వస్తోంది.

వేధిస్తున్న నిధుల సమస్య

పర్యాటక శాఖ తీవ్ర నిధుల కొరతను ఎదుర్కొంటోంది. పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి ఎలాగో ప్రభుత్వం నిధులు ఇవ్వడం లేదు. కనీసం ఆయా ప్రత్యేక సందర్భాల్లో దర్శనీయ స్థలాల గురించిన ప్రచారానికి, ఉత్సవాల నిర్వహణకు కూడా పైసా విదల్చడం లేదు. దీంతో జిల్లా పర్యాటక శాఖ ఉనికి ప్రశ్నార్థకమవుతోంది. ట్రైబల్ టూరిజం సర్క్యూట్‌కు కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన సుమారు రూ.90కోట్లు, రామప్ప యునెస్కో గుర్తింపు పొందిన తర్వాత అక్కడ మౌలిక సదుపాయాల కల్పనకు ఇచ్చిన నిధులు మినహా ఉమ్మడి వరంగల్ జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం నుంచి విడుదలైన నిధులు అంతంత మాత్రమే. లక్నవరం, పాకాల, మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు మినహా మిగతా పర్యాటక ప్రాంతాలు నిధులు లేక ఎలాంటి అభివృద్ధికి నోచుకోవడం లేదు.

సిబ్బంది కొరత

పర్యాటక శాఖకు చాలినంత సిబ్బంది లేరు. ప్రస్తుతం ఉన్నవారిలో చాలా మంది కాంట్రాక్టు ఉద్యోగులే. జిల్లా పర్యాటక శాఖ కార్యాలయంలో ఉన్న ఏడుగురు ఉద్యోగుల్లో జిల్లా అధికారి ముగ్గురు అటెండర్లు మినహా మిగతావారు చాలా ఏళ్లుగా కాంట్రాక్టు పద్ధతిపై పని చేస్తున్నారు. ఈ అటెండర్లు కూడా కారుణ్యనియామకాల కింద నియమితులైనవారే. ఉమ్మడి జిల్లా పరిధిలో అనేక ముఖ్యమైన పర్యాటక ప్రాంతాలు ఉన్నప్పటికీ వాటి గురించి టూరిస్టులకు వివరించడానికి, వాటి గొప్పతనం, విశిష్టతల గురించి విదేశీ టూరిస్టులు, ఇతర రాష్ట్రాల సందర్శకులకు తెలియజేసేలా గైడ్లు లేరు. ప్రస్తుతం రామప్ప, వరంగల్ కోటకు ఇద్దరు మాత్రమే ఉండగా.. వారు కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న వారే.

అటకెక్కిన శిల్పారామం

నగర ప్రజలు ఎన్నో ఏళ్లగా ఎంతో ఆశతో ఎదురు చూస్తున్న శిల్పారామం ఏర్పాటు ప్రతిపాదన అటకెక్కింది. పర్యాటక శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు కావలసిన శిల్పారామం 15 ఏళ్లుగా కలగానే మిగిలింది. హైదరాబాద్ తరహాలో వరంగల్‌కు 15 ఏళ్ల క్రితం నాటి కాంగ్రెస్ ప్రభుత్వం శిల్పారామాన్ని మంజూరు చేసి.. ఇందుకు రూ.6.50కోట్లు నిధులిచ్చింది. అయినా పనులు మొదలుకాలేదు. శిల్పారామం ఏర్పాటుకు అవసరమైన స్థలం ఎంపికపై తకరారు ఇప్పటికీ ఎడతెగకుండా సాగుతూనే ఉంది. ప్రభుత్వ స్థలాలు అందుబాటులో ఉన్నా ఎంపికలో తీవ్ర జాప్యం జరుగుతోంది. కాంగ్రెస్ ప్రభుత్వంలోనే మంజూరైన శిల్పారామం ప్రాజెక్టును ఆచరణలోకి తీసుకోవలసిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్‌పైనే ఉందని నగరవాసులు అంటున్నారు. నగరంలో శిల్పారామం ఏర్పాటయితే పర్యాటకుల సంఖ్య పెరుగుతుంది. స్థానికంగా చేతి వృత్తులవారికి పని దొరుకుతుంది.

సావనీర్ సెంటర్ ఏదీ?

పలు దర్శనీయ స్థలాలకు నిలయమైన వరంగల్‌లో ఇప్పటి వరకు సావనీర్ సెంటర్ లేదు. రాష్ట్రం మొత్తంలో ప్రస్తుతం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో మాత్రమే ఇది ఉంది. రాష్ట్రం నుంచే కాకుండా, ఇతర రాష్ట్రాలు, విదేశాల నుంచి నిత్యం వేలాది మంది యాత్రికులు వరంగల్‌కు వస్తుంటారు. దర్శనీయ స్థలాలను చూసిన అనంతరం స్థానికంగా లభించే వస్తువులను, చేతితో తయారు చేసిన కళాఖండాలను, దుస్తులను కొనుగోలు చేయడానికి ఇష్టపడతారు. కొత్తవాడలోని దర్రీలు, పెంబర్తిలోని ఇత్తడి కళారూపాలు, కలంకారి వస్త్రాలు, మట్టితో చేసిన వస్తువులు, చెక్క శిల్పాలు, లోహ వస్తువులు ఉమ్మడి జిల్లాలోని చేతివృత్తులు ప్రత్యేకం. వరంగల్ బ్రాండ్‌గా నిలిచే ఈ వస్తువులను ఒక దగ్గర విక్రయించేందుకు ఏర్పాటు చేసే షో రూంనే సావనీర్ సెంటర్‌గా పిలుస్తారు. దీనిని ఏర్పాటు చేస్తే పర్యాటకులు తమకు ఇష్టమైనవాటిని ఒక దగ్గర కొనుగోలు చేయడానికి అవకాశం ఏర్పడుతుంది. తద్వారా పర్యాటకం ప్రత్యేకత తెలుస్తుంది. టూరిస్టుల సంఖ్య కూడా పెరుగుతుంది. ఈ దిశగా పర్యాటక శాఖ దృష్టి పెట్టడం లేదు.

ఓరుగల్లు వైపు.. దిగ్గజ సంస్థల చూపు..

(5వ పేజీ తరువాయి)

సిపీ టెక్నాలజీస్ కూడా వరంగల్‌లో డేటా సెంటర్ ఏర్పాటుకు ముందుకు రావటంతో ఇక్కడ ఐటీ పరిశ్రమ మరింతా విస్తృతమయ్యే అవకాశం ఏర్పడింది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) హబ్స్‌ను కూడా అభివృద్ధి చేసేందుకు సిపీ టెక్నాలజీస్ ఆసక్తి చూపుతుంది. ప్రపంచవ్యాప్తంగా ఏఐకి అత్యధిక డిమాండ్ ఉంది. ఈ నేపథ్యంలో యువత ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ కోర్సులపై ఆసక్తి చూపుతున్నారు. ఈ రంగంలో అత్యధిక ఉద్యోగావకాశాలు ఉండటంతో చాల మంది ఏఐలో పట్టు సాధిస్తున్నారు. వరంగల్ కూడా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ రంగంలో ఉద్యోగావకాశాలు కల్పించేందుకు సిపీ టెక్నాలజీస్ హబ్‌లను ఏర్పాటు చేస్తుండటం అనేకమంది యువతకు స్థానికంగా ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

హైడ్రో, సోలార్ విద్యుత్ ఉత్పత్తి ప్లాంట్లు

మన్యం ప్రాంతమైన ములుగు జిల్లాలో హైడ్రో, సోలార్ విద్యుత్ ఉత్పత్తి చేసేందుకు సన్ పెట్రో కెమికల్స్ కంపెనీ ప్రభుత్వంతో ఒప్పందం చేసుకుంది. నాగర్‌కర్నూలు, మంచిర్యాలతో పాటు ములుగు జిల్లాల్లో 3,400మెగావాట్ల పంప్ స్టోరేజీ హైడ్రో విద్యుత్ ప్లాంట్‌ను, 5,440మెగావాట్ల సోలార్ విద్యుత్ ప్లాంట్‌ను ఏర్పాటు చేసేందుకు రూ.45,500కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు సన్ పెట్రో కెమికల్స్ ముందుకు వచ్చింది. అయితే 3400మెగావాట్ల హైడ్రో విద్యుత్ ఉత్పత్తిలో ములుగు జిల్లాలోనే 2400మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే అవకాశం ఉంది. ములుగు జిల్లాలోని తుపాకులగూడెం ప్రాజెక్టు వద్ద ఇప్పటికే హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టును ప్రతిపాదించారు. 24మెగావాట్ల సామర్థ్యం ఉన్న 10 టర్బైన్లు ఏర్పాటు చేసి 240మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేయాలని ప్రణాళిక రూపొందించారు. అయితే మొదట్లో టీజీ జెన్‌కోకు ఈ ప్రాజెక్టు అప్పగించినప్పటికి అడుగులు పడలేదు. ఈ నేపథ్యంలో దావోస్‌లో ప్రభుత్వంతో సన్ పెట్రో కెమికల్ చేసుకున్న ఒప్పందం ప్రకారం తుపాకులగూడెం బ్యారేజీ వద్ద హైడ్రో విద్యుత్ ఉత్పత్తి చేయనుంది. దీంతో ఈ ప్రాంతంలో వందలాది మందికి ఉపాధి అవకాశాలు రానున్నాయి. సోలార్ విద్యుత్ ఉత్పత్తికి కూడా ములుగు జిల్లాలో ఇప్పటికే ప్రణాళిక రూపొందించారు. అడవి ప్రాంతంతో పాటు సరస్సులు, ఖాళీ ప్రదేశాల్లో సోలార్ విద్యుత్‌ను ఉత్పత్తి చేసేందుకు ప్రభుత్వం ఆసక్తిగా ఉంది. ఇప్పటికే సోలార్ విద్యుత్ ఉత్పత్తి కోసం ములుగు జిల్లాను పైలట్ ప్రాజెక్టు ప్రభుత్వం ఎంచుకుంది. దీంతో సన్ పెట్రో కెమికల్స్ కంపెనీ పెట్టుబడులు పెట్టేందుకు ముందుకు రావటంతో ములుగు జిల్లాలో వేలాది మందికి ఉపాధి అవకాశాలు ఏర్పడనున్నాయి. ములుగు జిల్లాల్లో సన్ పెట్రో కెమికల్స్ కంపెనీ సుమారు రూ.25వేల కోట్ల పెట్టుబడులు పెట్టే అవకాశం ఉందని సమాచారం.

మరిన్ని పెట్టుబడులకు అవకాశం

ఐటీ దిగ్గజ కంపెనీలు తెలంగాణలో హైదారాబాద్‌కు ప్రత్యామ్నాయ నగరంగా వరంగల్ వైపు మొగ్గు చూపుతున్నాయి. ఇప్పటికే వరంగల్‌లో సియెంట్, టెక్ మహేంద్ర, జెన్‌పాక్ట్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, క్వాడ్రంట్ రిసోర్సెస్ తదితర కంపెనీలు వచ్చాయి. ఇంక్యుబేషన్ సెంటర్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేశారు. తాజాగా సిపీ టెక్నాలజీస్ కూడా డేటా సెంటర్, ఏఐ హబ్స్ ఏర్పాటు చేసేందుకు వస్తుండటంతో వరంగల్‌లో ఐటీ మరింత అభివృద్ధి చెందనుంది. దావోస్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్ రాష్ట్రంలో రూ.60వేల కోట్లతో పెట్టుబడులు పెట్టేందుకు ఒప్పందం చేసుకుంది. ఇప్పటికే హైదరాబాద్‌లో ఇప్పటికే మూడు డేటా సెంటర్లు ఉన్నాయి. కొత్తగా మరిన్నీ డేటా సెంటర్స్‌ను ఏర్పాటు చేసేందుకు అమెజాన్ వెబ్ సర్వీసెస్ ఆసక్తితో ఉంది. ఇప్పుడిప్పుడే ఐటీ అభివృద్ధి చెందుతున్న వరంగల్‌లో కూడా అమెజాన్ వెబ్ సర్వీసెస్ కంపెనీ పెట్టుబడులకు ఆసక్తి ఉందని సమాచారం. ఇటీవలే కంపెనీ ప్రతినిధులు మడికొండ ప్రాంతంలో వంద ఎకరాల భూమిని పరిశీలించినట్లుగా తెలిసింది. ప్రపంచ దిగ్గజ కంపెనీ అమెజాన్ వరంగల్‌లో డేటా సెంటర్‌ను ఏర్పాటు చేస్తే వరంగల్‌కు ఐటీ రంగంలో తిరుగుండదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే యూనీలివర్ కంపెనీ రాష్ట్రంలో బాటిల్ క్యాప్ ఉత్పత్తి చేసేందుకు పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిగా ఉంది. కాకతీయ మెగాటెక్స్ టైల్ పార్కులో ఇందుకు కావాల్సిన వనరులు ఉండటంతో ఆ కంపెనీ పెట్టుబడులు కూడా వరంగల్‌కు వస్తాయనే ఆశతో ఉన్నారు. వీటితో పాటు భవిష్యత్తులో హైదరాబాద్‌కు దీటుగా మరిన్నీ ఐటీ కంపెనీలు వరంగల్‌లో పెట్టుబడులు పెట్టేందుకు క్యూ కట్టే అవకాశం ఉందని నిపుణులు పేర్కొంటున్నారు. ఇటీవల గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ల(జీసీసీ)కు వరంగల్ డెస్టినేషన్‌గా మారుతుందని నేషనల్ అసోసియేషన్ ఆఫ్ సాఫ్ట్‌వేర్ అండ్ సర్వీస్ కంపెనీస్ (నాస్కామ్)వెల్లడించింది. అంతర్జాతీయ వ్యాపారంలో జీసీసీలు కీలక పాత్ర పోషిస్తాయి. ఒక్క హైదరాబాద్‌లోనే 355కు పైగా జీసీసీలు ఉన్నాయి. ఒక్క జీసీసీ ఏర్పాటు అయితే 500మంది నుంచి వెయ్యి మంది వరకు ఉపాధి అవకాశాలు లభిస్తాయి. ఇంత కీలకమైన జీసీసీలకు వరంగల్ గమ్య స్థానంగా మారుతుందని నాస్కామ్ వెల్లడించింది. ఈ నేపథ్యంలో కొత్త కంపెనీలు వరంగల్ బాట పట్టడం ఖాయమనే ధీమా నిపుణుల నుంచి వ్యక్తమవుతోంది.

ఓరుగల్లులో పుష్కలంగా మానవ వనరులు

వరంగల్‌ను ఐటీ హబ్‌గా ఏర్పాటు చేసేందుకు గత ఐదారేళ్లుగా తీవ్ర ప్రయత్నాలు జరుగుతున్నాయి. అభివృద్ధి మొత్తం ఒక్క హైదరాబాద్ చుట్టే కేంద్రీకృతం కాకుండా ద్వితీయ శ్రేణి నగరాలకు విస్తరించాలని ప్రభుత్వం భావిస్తోంది. హైదరాబాద్ తరువాత వరంగల్‌లో ఐటీ ఇండస్ట్రీకి అనుకూల వాతావరణం ఉండటంతో అనేక కంపెనీలు ఇన్వెస్ట్ చేసేందుకు మొగ్గుచూపుతున్నాయి. ఇప్పటికే మడికొండలో ఐటీ పార్కు అభివృద్ధి కోసం గత ప్రభుత్వం 40ఎకరాల స్థలాన్ని కేటాయించింది. సియెంట్, టెక్ మహేంద్ర, జెన్‌పాక్ట్, ఎల్‌టీఐ మైండ్ ట్రీ, క్వాడ్రంట్ రిసోర్సెస్ తదితర కంపెనీలు వచ్చాయి. ఇంక్యుబేషన్ సెంటర్, టెక్నాలజీ డెవలప్‌మెంట్ సెంటర్లను ఏర్పాటు చేశారు. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కు, హనుమకొండ ఐటీ పార్కు, వరంగల్ ఐటీ పార్కు తదితర ఇండస్ట్రీస్ అందుబాటులోకి రావటంతో చాలమందికి ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయి. ఐటీ ఇండస్ట్రీకి వరంగల్ సానుకూలంగా ఉన్నట్లుగా నాస్కామ్ అధ్యయనంలో తేలటంతో కొత్త కంపెనీలు వరంగల్ వైపు మొగ్గుచూపుతున్నాయి. వరంగల్‌లో దేశవ్యాప్తంగా గుర్తింపు ఉన్న నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎన్ఐటీ)తో పాటు కిట్స్ ఎస్ఆర్ లాంటి ప్రముఖ ఇంజనీరింగ్ యూనివర్సిటీలతో పాటు 50కిపైగా ఇంజనీరింగ్ కాలేజీలు ఉండటం ఐటీ అభివృద్ధికి కలిసి వచ్చే అంశంగా నాస్కామ్ పేర్కొంది. అంతేకాకుండా ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా సుమారు 20వేల మంది గ్రాడ్యుయేట్స్ బయటకు వస్తుండటంతో మానవ వనరులకు కొరత లేదు. హనుమకొండ, కాజీపేట, వరంగల్ పట్టణాలు ఐటీ పార్కుకు అనుకూలంగా ఉన్నాయి. మొత్తానికి దావోస్ వేదికగా ప్రభుత్వంతో సంస్థలు ఒప్పందాలు చేసుకోవడం, వరంగల్‌లో కూడా పెట్టుబడులు పెట్టేందుకు చొరవచూపడంపై ప్రజల్లో హర్షం వ్యక్తమవుతోంది.

పూజారి హత్య కేసులో వ్యక్తికి జీవిత ఖైదు

వరంగల్ లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పట్టణం పోచమ్మ మైదాన్ ప్రాంతంలోని శివసాయి దేవస్థానం పూజారిని హత్య చేసిన కేసులో నేరం రుజువైనందున నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.15వేల జరిమానా విధిస్తూ వరంగల్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి నిర్మల గీతాంబ శుక్రవారం తీర్పు చెప్పారు. కేసు వివరాలు ఈ విధంగా ఉన్నాయి. 2018 అక్టోబరు 24న దేవాలయంలో మైక్ పెట్టాడన్న కోపంతో ఎల్బీ నగర్ ప్రాంతానికి చెందిన సయ్యద్ నాతిక్ హుస్సెన్ గుడిలో ఉన్న పూజారి సత్యనారాయణ శర్మపై విచక్షణా రహితంగా దాడిచేసి తీవ్రంగా గాయపర్చాడు. ఆయన ఆస్పత్రిలో చికిత్సపొందుతూ వారం తర్వాత మృతి చెందారు. దీంతో మరో పూజారి దండాపంతుల ప్రవీణ్‌కుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు నిందితుడిపై హత్యా నేరం కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. విచారణలో నేరం రుజువైనందున నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష , రూ.15వేలు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెలువరించారు. కోర్టు పీసీ డి.శ్రీనివాస్ సాక్షులను ప్రవేశపెట్టగా లైజన్ అధికారిగా ఏఎస్ఐ హరికృష్ణ వ్యవహరించారు. దర్యాప్తు అధికారిగా సీఐ టి.గోపి వ్యవహరించగా పబ్లిక్ ప్రాసిక్యూటర్లు ఎం.సత్యనారాయణ, సిరబోయిన శ్రీనివాస్ కేసు వాదించారు.

రసాభాసలు, నిలదీతలు, అడ్డగింతలు

(5వ పేజీ తరువాయి)

వెల్లువెత్తాయి. అయితే వీటిని ఎప్పుడు పరిశీలించేది స్పష్టత లేదు. అయితే గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తులను ఖరారు చేసేందుకు మార్గదర్శకాలను విడిగా జారీ చేయనున్నట్టు చీఫ్ సెక్రెటరీ కలెక్టర్లకు పంపిన సర్క్యులర్‌లో పేర్కొన్నారు. దీంతో గ్రామసభల్లో వచ్చిన దరఖాస్తుల పరిశీలనపై అధికారులు సరైన వివరణ ఇవ్వలేకపోతున్నారు. ఫలితంగా ఈనెల 26న అమలు చేయబోయే పథకాల అర్హుల జాబితాలో తమకు అవకాశం ఉండబోవటం లేదని తెలినవారు నిరాశకు లోనవుతున్నారు. ఈ క్రమంలో నాలుగు పథకాలకు రెండు జిల్లాల్లో మళ్లీ వేలల్లో దరఖాస్తులు వచ్చాయి. గ్రామసభల్లో ఇచ్చిన దరఖాస్తులకు అధికారులు రశీదు ఇవ్వడం లేదు. దీంతో దరఖాస్తు చేసుకున్నవారు ఇవి పరిశీలనకు వస్తాయా? అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలి



విద్యార్థులకు నోట్‌బుక్కులు, బియ్యం బస్తాలు అందిస్తున్న అనితారెడ్డి

బాలసముద్రం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : పేద, ధనిక భేదం లేకుండా విద్యార్థులకు నాణ్యమైన విద్య అందాలని కేయూ పాలకమండలి సభ్యురాలు డాక్టర్ కరకాల అనితారెడ్డి అన్నారు. జనవరి 24 ప్రపంచ విద్యా దినోత్సవం, బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకొని హనుమకొండ లష్కర్ బజార్ బాప్టిస్టు చర్చి ఆవరణలోని రీచ్ బాలికల ఆశ్రమంలో శుక్రవారం వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలకు ఆమె నోట్‌బుక్కులు, బియ్యం బస్తాలు, చాక్లెట్లు పంపిణీచేశారు. వేడుకలో అనితారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు అందివచ్చిన అవకాశాలు వినియోగించుకొని అన్ని విధాలుగా ఉన్నతంగా ఎదగాలని అన్నారు. తల్లిదండ్రులు, పెద్దల పట్ల గౌరవం, దేశభక్తి, సామాజిక సేవా దృక్పథాన్ని అలవర్చుకొని విద్యతోపాటు సంస్కారం పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ మెంబర్ పరికి సుధాకర్, రీచ్ బాలికల ఆశ్రమం డైరెక్టర్ జాన్సన్ ప్రసాద్, ఇన్‌చార్జి జన్ను నివేదిత తదితరులు పాల్గొన్నారు.

క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు : కలెక్టర్

హనుమకొండ కలెక్టరేట్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో క్రీడల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. జిల్లా కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం క్రీడల అభివృద్ధిపై వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర అధికారులు, వివిధ క్రీడా సంఘాల నాయకులతో కలిసి కలెక్టర్ ప్రావీణ్య సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జేఎన్ఎస్‌లోని బ్యాడ్మింటన్ ఇండోర్ స్టేడియం, జిమ్నాస్టిక్ హాల్, స్విమ్మింగ్ పూల్ రిపేరింగ్ పనులు, మౌలిక వసతులపై చర్చించారు. అలాగే కొత్తగా నిర్మిస్తున్న రెజ్లింగ్ హాల్, కబడ్డీ హాల్ పనులపై సమీక్షించారు. అంతర్జాతీయ ప్రమాణాలతో జేఎన్ఎస్‌లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలని చర్చించుకున్నారు. మున్సిపల్, కుడా ఆధ్వర్యంలో జరుగుతున్న పనులపై సమీక్షించారు. క్రీడా అవసరాలకు కావాల్సిన ఫండ్స్ తీసుకురావడానికి కావాల్సిన ఏర్పాట్లపై మాట్లాడుకున్నారు. ఈసమావేశంలో కుడా చైర్మన్ ఇనగాల వెంకట్రామిరెడ్డి, మేయర్ గుండు సుధారాణి, డీవైఎస్ఓ అశోక్ కుమార్, అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎర్రబెల్లి వరదరాజేశ్వర్‌రావు, కార్యదర్శి సారంగపాణి, వివిధ క్రీడాసంఘాల నాయకులు, కుడా అధికారులు, ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలి

» పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

వడ్డేపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధిలో ప్రజలు భాగస్వాములు కావాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్‌లో రూ.5కోట్ల 50 లక్షలతో గోకుల్ నగర్ నుంచి సమ్మయ్యనగర్ వరకు నిర్మించే డ్రెయినేజీ పనులకు గోకుల్ నగర్ వద్ద భూమి పూజ చేశారు. కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి సుధాకర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్, గాంధీనగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు నాయిని లక్ష్మారెడ్డి, బంక సతీష్, బంక రమేష్, బంక చంద్రశేఖర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

న్యూశాయంపేటలో అక్రమ కట్టడాల కూల్చివేత

» మానవ హక్కుల కమిషన్ ఆదేశాలతో కదిలిన యంత్రాంగం



అక్రమ కట్టడాలను ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేస్తున్న అధికారులు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలోని న్యూశాయంపేట శివారులో పట్టా భూమిలో అక్రమంగా నిర్మించిన కట్టడాలు శుక్రవారం కూల్చివేశారు. వివరాల్లోకి వెళితే.. హనుమకొండ హంటర్‌రోడ్డు న్యూశాయంపేట సమీపంలోని సర్వే నెంబర్ 125లో చారుమతి అనే మహిళకు సుమారు రెండు ఎకరాల స్థలం ఉంది. కొద్దిరోజుల తర్వాత ఆమెకు సంబంధించిన పట్టా భూమిలో అదే ప్రాంతానికి చెందిన కృష్ణ అనే వ్యక్తితోపాటు మరికొందరు కలిసి అక్రమంగా కట్టడాలు నిర్మించాడు. దీనిపై చారుమతి రెండేళ్ల కిందట బల్దియా అధికారులకు ఫిర్యాదు చేసింది. అధికారులు ఆక్రమణదారులకు నోటీసులు ఇచ్చినా పట్టించుకోకపోవడంతో జాతీయ మానవహక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసింది. కూల్చివేతలకు బల్దియా ఇచ్చిన ఆదేశాలను అమలు చేయాలని రెండు రోజుల కిందట జిల్లా కలెక్టర్, కమిషనర్‌కు నోటీసులు అందాయి. ఈ క్రమంలో కృష్ణ సైతం హైకోర్టును ఆశ్రయించాడు. గురువారం బల్దియా అధికారుల సమక్షంలో శాయంపేటలోని అక్రమంగా నిర్మించిన కట్టడాలను కూల్చివేసినట్టు చారుమతి తెలిపారు.

పథకాల కోసం పైసలిస్తే పేర్లు తొలగిస్తాం

» అర్హుల ఇంటికే వచ్చి పథకాలు అందజేస్తాం..

» వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

రాంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కార్లు, భవంతులు కలిగి పేదలకు చెందే పథకాలను పైసలతో కొనుగోలు చేయాలని చూస్తే లబ్ధిదారుల జాబితాలో నుంచి వారి పేర్లను తొలిగిస్తామని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి హెచ్చరించారు. 6వ డివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ చెన్నం మధు అధ్యక్షతన జరిగిన వార్డు సభ సమావేశంలో ఎమ్మెల్యే నాయిని ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అసలైన అర్హులకు ఇంటికే వచ్చి పథకాలు అందజేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. వార్డు సభలు అయిపోయాయని, అందోళన చెందొద్దని, దరఖాస్తుల స్వీకరణ అనేది నిరంతర ప్రక్రియ అన్నారు. మున్సిపాలిటీ, తహసీల్దార్ కార్యాలయాల్లో కౌంటర్‌లు ఏర్పాటుచేసి దరఖాస్తులు స్వీకరిస్తామన్నారు. అధికారులు అందుబాటులో లేకుంటే ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయానికి వచ్చి తనకు నేరుగా ఇవ్వొచ్చని సూచించారు. డబుల్‌బెడ్ రూమ్‌లను జనవరి 26 తర్వాత పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న నిరుపేదలకు వాటిలో అవకాశం కల్పిస్తామన్నారు. ఈ సమావేశంలో కార్పొరేషన్ అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

● వడ్డేపల్లి: పనిచేసే ప్రభుత్వానికి ప్రజలే అండగా నిలవాలని, ప్రజా ప్రభుత్వంలో అర్హులందరికీ సంక్షేమపథకాలు అందుతాయని పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం గ్రేటర్ వరంగల్ 58వ డివిజన్ ఎన్జీవోస్ కాలనీ వాటర్ ట్యాంకు వద్ద నిర్వహించిన ప్రజా పాలన వార్డు సభలో ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి మాట్లాడారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ తహసీల్దార్ కె.శ్రీపాల్‌రెడ్డి, 58వ డివిజన్ కార్పొరేటర్ ఇమ్మడి లోహిత రాజు, మాజీ కార్పొరేటర్ ఎనుకొంటి నాగరాజు, 58, 60 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు తాళ్లపెల్లి సుధాకర్, ఎనుకొంటి పున్నం చందర్, కాంగ్రెస్ సీనియర్ జిల్లా నేతలు తాళ్లపెల్లి విజయ్, మండల సమ్మయ్య, తాళ్లపెల్లి రవీందర్, ఎండి అక్మల్, తాళ్లపెల్లి మేరి, బుస్స నవీన్, ఎండిసాజీద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి

గోకుల్‌నగర్‌లో..

గ్రేటర్ వరంగల్ 57వ డివిజన్ గోకుల్ నగర్‌లో ప్రజా పాలన వార్డు సభ ను శుక్రవారం నిర్వహించారు. ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో 57వ డివిజన్ కార్పొరేటర్ నల్ల స్వరూపరాణి- సుధాకర్‌రెడ్డి, జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బంక సరళ యాదవ్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బంక సంపత్ యాదవ్, బంక సతీష్, నాయిని లక్ష్మారెడ్డి, బంక చంద్రశేఖర్‌తోపాటు గాంధీ నగర్ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు చెరుకు వెంకటరాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● న్యూశాయంపేట: డివిజన్ ప్రజలు ఎవరూ ఆందోళన చెందవద్దని ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని 31వ డివిజన్ కార్పొరేటర్ మామిండ్ల రాజు అన్నారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, రైతు భరోసా, భూమిలేని నిరుపేదలకు ఆర్థిక సహాయం అందించేందుకు దరఖాస్తుల స్వీకరణ పేరుతో శుక్రవారం 31వ డివిజన్ న్యూశాయంపేటలో వార్డు సభ నిర్వహించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కృష్ణ, పన్నుల విభాగం రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రజని, కార్పొరేటర్లు రాజు అర్హులైన ప్రజల నుంచి ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు అంకేశ్వరపు సురేందర్, నాయకులు మామిండ్ల సురేష్, కనుకుంట్ల కృష్ణ, మున్సిపల్ కార్పొరేషన్ వార్డు ఆఫీసర్ లోకనాథం, బిల్ కలెక్టర్లు, ఐసీడీఎస్ ఆర్‌పీలు పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడులు

వరంగల్ క్రైం, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : కేయూసీ పోలీస్‌స్టేషన్ పరిధిలోని పరిమళకాలనీలో ఓ రహస్య ప్రాంతంలో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ సీఐ మేకల రంజిత్ టీం దాడులు చేసింది. ముగ్గురిని అదుపులోకి తీసుకొని రూ.7020 నగదు స్వాధీనం చేసుకొని పేకాట రాయుళ్లను స్థానిక పోలీసులకు అప్పగించినట్లు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ తెలిపారు.

గుట్కాలు పట్టివేత

ఎలాంటి అనుమతులు లేకుండా నిబంధనలకు వ్యతిరేకంగా విక్రయిస్తున్న గుట్కాలను టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్ టీం పట్టుకుంది. ధర్మారంలోని హోల్‌సేల్ షాపు కాంప్లెక్స్‌లోని షాపు నెంబర్ 63 హనుమాన్ ట్రాన్స్‌పోర్ట్ యాజమాని రాయబారపు రాకేశ్ నుంచి రూ.50,000 విలువ చేసే గుట్కాలను స్వాధీనం చేసుకున్నట్లు ఏసీపీ మధుసూదన్ తెలిపారు. గుట్కాలను గీసుగొండ పోలీసులకు అప్పగించినట్లు తెలిపారు. కాగా, గుట్కాలు ట్రాన్స్‌పోర్ట్ చేసిన వ్యక్తి, రిసీవర్ పరారీలో ఉన్నారన్నారు.

'లక్ష డప్పుల' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి



ఎస్సీ వర్గీకరణ కోసం మద్దతుగా న్యాయవాదుల ర్యాలీ

వరంగల్ లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అమలు కోసం ఫిబ్రవరి 7న హైదరాబాద్‌లో జరిగే లక్షల డప్పులు.. వెయ్యి గొంతుకల సాంస్కృతిక కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వరంగల్, హనుమకొండ జిల్లాల బార్ అసోసియేషన్ ప్రతినిధులు పిలుపు నిచ్చారు. జిల్లా కోర్టు ప్రధాన గేటు నుంచి రెండు జిల్లాల కార్యవర్గం ఆధ్వర్యంలో అమరవీరుల స్థూపం వరకు న్యాయవాదులందరు డప్పు కొడుతూ సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణకు పెద్ద సంఖ్యలో న్యాయవాదులు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వరంగల్, హనుమకొండ జిల్లాల అధ్యక్షులు తీగల జీవన్‌గౌడ్, మాతంగి రమేష్‌బాబు, ప్రధాన కార్యదర్శి లాడే రమేష్, మాదిగ లాయర్స్ ఫెడరేషన్ జాతీయ అధ్యక్షుడు బి.వెంకట్‌రత్నం, తెలంగాణ బార్ కౌన్సిల్ సభ్యులు భైరపాక జయాకర్, దుస్సా జనార్దన్, రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ అడ్వొకేట్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి సిద్ధూనాయక్, సీనియర్, జూనియర్ మహిళా న్యాయవాదులు పాల్గొన్నారు.

ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలు అందించాలి

వరంగల్ మెడికల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రామాల్లో ఆయుష్మాన్ ఆరోగ్యకేంద్రాల ద్వారా నాణ్యమైన వైద్య సేవలు అందించాలని కేంద్ర సభ్యురాలు డాక్టర్ అనూష పార్థసారథి, డాక్టర్ రాజీవ్ త్రిపాఠి సూచించారు. ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్ భీంపల్లిని వర్చువల్‌గా జాతీయ నాణ్యతా ప్రమాణాల కోసం శుక్రవారం పరిశీలించారు. ప్రసవ సేవలు, నవజాత, శిశు ఆరోగ్య, బాల్య, కిశోర, కుటుంబ నియంత్రణ, గర్భనిరోధక, పునరుత్పత్తి ఆరోగ్య సేవలపై ఆరా తీశారు. జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా క్వాలిటీ మేనేజర్ సాగర్, అఖిల్, డాక్టర్ పద్మశ్రీ, డాక్టర్ హిమబిందు, డాక్టర్ దుర్గాప్రసాద్, డాక్టర్ కవిత, డాక్టర్ రేణుక, హెల్త్ సూపర్‌వైజర్ కనకలక్ష్మీ, స్టాఫ్‌నర్స్ సరిత పాల్గొన్నారు.

బాలికలకు చట్టపరమైన హక్కులపై అవగాహన ఉండాలి

వరంగల్ లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : బాలికలకు విద్య, వైద్యం చట్టపరమైన హక్కులపై అవగాహన ఉండాలని వరంగల్ జిల్లా న్యాయసేవా సంస్థ చైర్‌పర్సన్, జిల్లా జడ్జి నిర్మల గీతాంబ పేర్కొన్నారు. శుక్రవారం న్యాయ సేవా సదన్‌లో జాతీయ బాలికల దినోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఆడపిల్లలు తమ హక్కుల గురించి తప్పకుండా తెలుసుకోవాలని లింగ వివక్షను రూపు మాపడానికి కృషి చేయాలని ఆమె పేర్కొన్నారు. మహిళా సాధికారత కోసం సమాజంలోని బాలికలందరూ విజ్ఞానవంతులై చురుకైన పాత్ర పోషించాలని సూచించారు. బాల్య వివాహాలు నిరోధించి హింస నుంచి వారిని రక్షించడానికి కుటుంబం, మిత్రులు, ఉపాధ్యాయులు సమాజమంతా కృషి చేయాలని న్యాయమూర్తి పేర్కొన్నారు. బాలికలపై ఎటువంటి అత్యాచారాలు జరిగిన, వేధింపులకు గురైనా 1098, 100, 9391907362 నంబర్లకు సమాచారం అందిస్తే సంబంధిత అధికారులు చర్యలు చేపడుతారని న్యాయమూర్తి నిర్మలగీతాంబ తెలిపారు.

హనుమకొండ జిల్లా జడ్జి సీహెచ్ రమేష్‌బాబు మాట్లాడుతూ.. బాలికల సంరక్షణ కోసం న్యాయసేవాధికార సంస్థలు కృషి చేస్తాయని ఆడపిల్లలు ఎదుర్కొంటున్న అసమానతలను తమ దృష్టికి తీసుకురావాలని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ కార్యదర్శులు క్షమాదేశ్ పాండే, ఎం.సాయికుమార్, డీసీపీ సలీమ, సీడబ్ల్యూసీ చైర్ పర్సన్ వసుధ, హనుమకొండ, వరంగల్ జిల్లాల బార్ అసోసియేషన్ అధ్యక్షులు మాతంగి రమేష్‌బాబు, తీగల జీవన్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డును తరలించే బాధ్యత నాదే



మడికొండ వార్డుసభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే నాగరాజు

» అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు

» వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

» మడికొండ, రాంపూర్‌లో ప్రజాపాలన వార్డు సభలు

మడికొండ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వాల అనాలోచిత నిర్ణయాల వల్ల మడికొండ, రాంపూర్ శివారులో ఏర్పాటుచేసిన చెత్త డంపింగ్ యార్డు వల్ల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తనను కలచి వేస్తున్నాయని తప్పకుండా డంపింగ్ యార్డును తొలగించే బాధ్యత తనదేనని వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్.నాగరాజు స్పష్టం చేశారు. గ్రేటర్ వరంగల్ 46వ డివిజన్ మడికొండ ఎస్సీ కాలనీలో గురువారం ఏర్పాటు చేసిన ప్రజాపాలన వార్డు సభలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పులను సరిచేసుకుంటూ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల, రేషన్ కార్డులు, రైతు బంధు వంటి ప్రభుత్వ పథకాలు రాలేదని ఎవరూ కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు తప్పకుండా అందజేస్తామని తెలిపారు. ఈసందర్భంగా మాజీ సర్పంచ్ వస్కుల వెంకటస్వామి, బీజేపీ నాయకుడు గడ్డం మహేందర్ తదితరులు డంపింగ్ యార్డు విషయంపై ఏం చర్యలు తీసుకుంటున్నారని ప్రశ్నించారు. దానికి ఎమ్మెల్యే సమాధానమిస్తూ డంపింగ్ సమస్య పరిష్కారం కోసం సీఎం రేవంత్‌రెడ్డి మాట ఇచ్చారని, తప్పకుండా డంపింగ్ యార్డు సమస్య పరిష్కారం బాధ్యత తనదేనని వెల్లడించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు పలువురు వినతి పత్రాలు అందజేశారు.

కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ మునిగాల సరోజన, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సారంపెల్లి శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం జ్యోతి అమర్‌నాథ్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, నాయకులు వస్కుల నాగరాజు, వస్కుల శంకర్, కుర్ల మోహన్, భైరి లింగమూర్తి, బిల్ల రవిందర్, తాడూరి మోహన్, మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ రవీందర్‌గౌడ్, తహసీల్దార్ బావుసింగ్, హౌసింగ్ డీఈ సిద్దార్థ నాయక్, వ్యవసాయ శాఖ ఏవో సంతోష్, స్మార్ట్ సిటీ ఏఈ సతీష్, సీఐ పుల్యాల కిషన్, అధికారులు, సిబ్బంది, మహిళలు పాల్గొన్నారు.

సీనియర్ న్యాయవాది సాయం శంకరయ్య మృతి



శంకరయ్య (ఫైల్)

వరంగల్ లీగల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : సీనియర్ న్యాయవాది, జనతా పార్టీ నాయకుడు, సోషలిస్టు పార్టీ నాయకుడు సాయం శంకరయ్య(88) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. హనుమకొండలోని అడ్వొకేట్స్ కాలనీలో తన స్వగృహంలో తుది శ్వాస విడిచారు. 1969లో లా డిగ్రీ పుచ్చుకొని వరంగల్ కోర్టులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేశారు. న్యాయవాద వృత్తిలో అంచెలంచెలుగా ఎదిగి ఎంతోమందికి ఆదర్శంగా నిలిచారు. న్యాయవాద వృత్తితో పాటు సామాజిక, రాజకీయ రంగాల్లో తన వంతు పాత్ర పోషించారు. 1981-82లో లోక్‌దళ్ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తున్న క్రమంలో ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. న్యాయవాద వృత్తిలో కుడా చైర్మన్‌గా రెండేళ్లపాటు కొనసాగారు. అదే విధంగా ప్రభుత్వ న్యాయవాదిగా 1989-92 కాలంలో పనిచేశారు. వరంగల్ జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేశారు. అదే విధంగా కాకతీయ యూనివర్సిటీ స్టాండింగ్ కౌన్సిల్‌గా, ఎల్ఐసీ స్టాండింగ్ కౌన్సిల్‌గా పనిచేశారు. తెలంగాణ ఉద్యమంలో క్రియాశీలక పాత్ర పోషించి ఉద్యమానికి వెన్నుదన్నుగా నిలిచారు. వివాదంలో ఉన్న హయగ్రీవచారి కాంపౌండ్ స్థలాన్ని ప్రభుత్వానికి దక్కేలా (ప్రస్తుత కాళోజీ కళాక్షేత్రం) న్యాయపోరాటం చేశారు. శనివారం ఆయన అంత్యక్రియలు జరుగుతాయని కుటుంబ సభ్యులు తెలిపారు.

మూడో రోజూ ప్రశాంతంగా జేఈఈ మెయిన్స్

వరంగల్ ఎడ్యుకేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా వరంగల్, హనుమకొండ జిల్లాకేంద్రాల్లోని అయిదు పరీక్షా కేంద్రాల్లో జరుగుతున్న జేఈఈ మెయిన్స్ పరీక్ష శుక్రవారం ప్రశాంతంగా జరిగింది. రెండు సెషన్లలో జరిగిన పరీక్షకు 97.35 శాతం మంది విద్యార్థులు హాజరయ్యారు. ఉదయం పూట జరిగిన మొదటి సెషన్ పరీక్షకు 1221 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా, 1186 మంది విద్యార్థులు హాజరయ్యారు. మధ్యాహ్నం పూట సెషన్‌లో నిర్వహించిన పరీక్షకు 1,085 మంది హాజరుకావాల్సి ఉండగా 1,059 మంది విద్యార్థులు హాజరయ్యారు. రెండు సెషన్లలో మొత్తం 2,306 మంది విద్యార్థులు పరీక్ష రాయాల్సి ఉండగా 2,245 మంది హాజరుకాగా 61 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. కాగా, సిటీ కోఆర్డినేటర్ కె.శైలతరెడ్డి అయాన్ డిజిటల్ సెంటర్, మోక్షిత్ కంప్యూటర్స్, నోబుల్ టెక్నాలజీస్‌ల్లో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాలను సందర్శించి పరీక్ష విధానాన్ని పరిశీలించారు. జేఈఈ మెయిన్స్ పరీక్ష తిరిగి ఈ నెల 28, 29, 30 తేదీల్లో ఉన్నాయని ఆమె తెలిపారు.

బల్దియా పరిధిలో ముగిసిన వార్డు సభలు

వరంగల్ కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థ పరిధిలో ఐదు రోజులుగా జరిగిన వార్డు సభలకు ప్రజల నుంచి అనూహ్య స్పందన లభించింది. ప్రధానంగా వార్డు సభలకు రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లకు ప్రజలు దరఖాస్తులతో క్యూకట్టారు. బల్దియా అధికారులు ఒక రోజు ముందే వార్డు సభలను ప్రకటించడంతో ప్రజలు ఉదయమే ఆయా డివిజన్‌ల సెంటర్‌లకు చేరుకుని అధికారులకు దరఖాస్తులు అందించారు. వార్డు సభలు శుక్రవారంతో ముగిసినట్టు అధికారులు వెల్లడించారు.

కాగా, శుక్రవారం బల్దియా పరిధిలో 10 డివిజన్‌లలో వార్డు సభలు జరిగాయని బల్దియా అధికారులు తెలిపారు. ఈ సభలో శుక్రవారం ఒక్కరోజే 2,897 రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు రాగా, ఐదు రోజులకు కలుపుకుని 27,979 దరఖాస్తులు వచ్చినట్టు బల్దియా అధికారులు తెలిపారు. ఇక ఇందిరమ్మ ఇండ్ల కోసం శుక్రవారం 1,891 దరఖాస్తులు వచ్చాయని, ఐదు రోజులకు కలుపుకుని 14,662 దరఖాస్తులు వచ్చినట్టు వెల్లడించారు. ఐదు రోజులలో మొత్తంగా 42,631 దరఖాస్తులు ప్రజల నుంచి స్వీకరించినట్టు అదనపు కమిషనర్ జోనా తెలిపారు. బల్దియా పరిధిలోని 66 డివిజన్‌లలో యుద్ధప్రాతిపదికన నిర్వహించిన వార్డుసభలలో ఇంకా చాలామంది ప్రజలు దరఖాస్తులు అందించాల్సి ఉందని తెలిపారు. బల్దియా అధికారులు ఐదురోజుల పాటు అన్ని డివిజన్‌లలో దరఖాస్తులు స్వీకరిస్తే బాగుండేదని, డివిజన్‌కు ఒక్క రోజే కేటాయించడంతో ఇబ్బందిగా మారిందని కొందరు ఆవేదన వ్యక్తం చేశారు. కానీ వార్డుసభలలో దరఖాస్తులు అందించని వారు సర్కిల్ కార్యాలయాలలో అందించవచ్చని, ఇది నిరంతర ప్రక్రియ అని బల్దియా అధికారులు వెల్లడించారు. ఇక దరఖాస్తులు తీసుకున్నారు సంక్షేమ పథకాలు ఎప్పుడు వసాయోనని ప్రజలు ఎదురుచూస్తు న్నారు. అయితే వార్డుసభలలో బల్దియా అధికారులు, సిబ్బంది, స్థానిక ప్రజాప్రతినిధులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొంటున్నారు.

విద్యార్థులకు పరిశుభ్రమైన తాగునీరు

» కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి



కామన్ మెస్‌లో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న వీసీ ప్రతాప్‌రెడ్డి, డైరెక్టర్ రాజ్‌కుమార్

కేయూ క్యాంపస్ జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ విద్యార్థులకు మౌలిక సదుపాయాల కల్పనలో ముందుంటామని కేయూ వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కేయూ క్యాంపస్‌లోని కామన్ మెస్, పద్మాక్షి లేడీస్ హాస్టల్‌లో వరంగల్ బాలవికాస కేంద్రం, వర్సిటీ సంయుక్తంగా మినరల్ వాటర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వీసీ ప్రతాప్‌రెడ్డి వాటర్ ప్లాంట్లను ప్రారంభించి మాట్లాడారు. వర్సిటీ, బాలవికాస సంస్థ రూ.10లక్షల ఖర్చుతో రెండు వాటర్ ప్లాంట్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు ప్రకటించారు. గంటకు వెయ్యి లీటర్ల పరిశుభ్రమైన తాగునీటిని అందిస్తున్నట్లు పేర్కొన్నారు. 4వేల లీటర్ల నిల్వ సామర్థ్యం ఉంటుందని తెలిపారు. క్యాంపస్‌లో మరోక 5 వాటర్ ప్లాంట్లను నూతనంగా ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. వర్సిటీ ట్యాంకులతో నీటి సరఫరాచేసే భారం తగ్గుతోందని అన్నారు. వాటర్ ప్లాంట్ల నిర్వహణ భారాన్ని రెండేళ్ళ పాటు బాలవికాస సంస్థ భరిస్తుందని తెలిపారు. ఈ ప్లాంటు ఏర్పాటుకు మాజీ వీసీ వాకాటి కరుణ కృషి చేశారని సిబ్బంది కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ పి.మల్లారెడ్డి, హాస్టల్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎల్‌పీ రాజ్‌కుమార్, వర్సిటీ పాలక మండలి సభ్యులు ప్రొఫెసర్ బి.సురేశ్‌లాల్, ప్రొఫెసర్ నిమ్మ సుదర్శన్, డాక్టర్ బి.రమ, డాక్టర్ సుకుమారి, డాక్టర్ మల్లం నవీన్, పుల్లూరి సుధాకర్, డాక్టర్ కరుకాల అనితారెడ్డి, డీవో ప్రొఫెసర్ ఎన్.వాసుదేవారెడ్డి, డాక్టర్ చిలువేరు రాజ్‌కుమార్, పోలేపాక కోర్నెల్, కేర్ టేకర్ రాజు, మధు, గోపాల్, హాస్టల్స్, బిల్డింగ్ డివిజన్ సిబ్బంది పాల్గొన్నారు.

కార్పొరేటర్లకు ఖరీదైన స్మార్ట్ ఫోన్లు

» కౌన్సిల్ సమావేశంలో నోరు ఎత్తకుండా కొత్త ఎత్తుగడ?

» ఈనెల 29న బల్దియా కౌన్సిల్ సమావేశం

» ఆగమేఘాల మీద ఫోన్ల కొనుగోలు, పంపిణీ

వరంగల్ కార్పొరేషన్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి) : గ్రేటర్ వరంగల్ నగర పాలక సంస్థలో అసలు ఏం జరుగుతుంది? అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. మొన్నటి వరకు వరంగల్ నగర మేయర్‌పై అవిశ్వాస తీర్మానం పెట్టి తొలగిస్తామని కారాలు మిరియాలు నూరిన ప్రతిపక్షం, స్వపక్షం వ్యతిరేక వర్గం ఎక్కడ పోయింది? అనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

బల్దియాకు సంబంధించిన 66 మంది కార్పొరేటర్లకు ఖరీదైన స్మార్ట్‌ఫోన్లు వచ్చాయి. ఈనెల 29న బల్దియాలో జరిగే కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష, అనుకూల వర్గం కార్పొరేటర్లు నోరు ఎత్తకుండా ఉండేందుకే ఈ సెల్‌ఫోన్‌ల వ్యవహారం తెరపైకి తెచ్చినట్టు తెలుస్తోంది. శుక్రవారం 66 మంది కార్పొరేటర్లకు కె-సెక్షన్ నుంచి ఫోన్‌ల పంపిణీ జరిగిన విషయం చర్చనీయాంశంగా మారింది.

2022 మార్చిలో కార్పొరేటర్లకు ఒక సెల్‌ఫోన్‌తో పాటు వారి డివిజన్ నెంబర్‌ను చివరి అంకె కలిసేటట్టు ఫోన్‌నెంబర్‌తో సిమ్‌ను అప్పుడే అందించారు. కార్పొరేటర్ల వద్ద గతంలో ఇచ్చిన ఫోన్ ఉండగా, శుక్రవారం కొత్త ఫోన్‌ను ఇవ్వడంపై దుమారం రేగింది. మేయర్ ఆదేశాల మేరకు బల్దియా ఐటీ విభాగం అధికారులు పెద్దఎత్తున సెల్‌ఫోన్‌లు కొనుగోలు చేసినట్టు తెలిసింది. ఒక్కో ఫోన్‌కు రూ.33వేలు వెచ్చించి కే-సెక్షన్ ప్రధాన అధికారి ద్వారా కార్పొరేటర్లకు పంపిణీ చేశారు. కార్పొరేటర్లకు ఖరీదైన ఫోన్‌లను అందించడంవల్ల బల్దియా ఆదాయానికి గండిపడుతోందని కొందరు విమర్శిస్తున్నారు. 66 మంది కార్పొరేటర్లతో పాటు మరో 200 సెల్‌ఫోన్లు కూడా అదే ధరతో కొనుగోలు చేసి పక్కన పెట్టినట్టు తెలిసింది. మిగిలిన ఫోన్‌లను బల్దియాలో ఆయాశాఖల వింగ్ అధికారులు, సిబ్బందితో పాటు మరికొందరి అందించేందుకు సన్నాహాలు జరుగుతున్నట్టు తెలిసింది.



కార్పొరేటర్లకు అందించిన సెల్‌ఫోన్లు

గత పాలకవర్గం ఇచ్చినట్టే ఇచ్చాం : మేయర్ సుధారాణి

66 మంది కార్పొరేటర్లను సమన్వయం చేసేందుకు అందరికి సెల్‌ఫోన్‌లు అందించాం. గత పాలకవర్గం అందించిన ప్రకారమే ఫోన్‌లు ఇచ్చాం. అంతేకాకుండా ఫోన్‌లు కొనుగోలు చేసేందుకు టెండరు కూడా పిలిచి మరీ పంపిణీ చేశాం. ఫోన్‌ల కొనుగోలు విషయంలో జరుగుతున్న ప్రచారంలో ఏ మాత్రం నిజం లేదు.

అన్నం కూడా ఔషధమే!

"అన్నం పరబ్రహ్మ స్వరూపం" అంటారు మన పూర్వీకులు. ప్రతి రోజూ తినే ఈ అన్నానికి అంత ప్రాముఖ్యత ఇవ్వటానికి కారణం దానిలో ఉన్న పౌష్టికాహార విలువలు. కేవలం పౌష్టికాహార విలువలు మాత్రమే కాకుండా అన్నానికి అనేక రకాల విశిష్టతలు కూడా ఉన్నాయి.

'భక్తము' అంటే అన్నం అని అర్థం. 'భక్తము'కు పంచబడేది, కేటాయించబడేది, నిర్దేశించబడేది అనే అర్థాలు కూడా ఉన్నాయి. ఈ నిర్వచన కోణం నుంచి చూస్తే ఇతరులకు పెట్టేది అన్నం. దీనిని ఎలా వండాలనే విషయాన్ని కూడా భోజన కుతూహలంలో వివరించారు. అన్నాన్ని వండటానికి బియ్యాన్ని చేటలో చెరగాలి. ఆ తర్వాత ఒక గిన్నెలో ఈ బియ్యపు కొలతకు ఐదు రెట్లు ఎక్కువగా నీళ్లు పోసి కాచాలి. ఇలా కాగిన నీటిని ఎసరు అంటారు. ఈ ఎసరులో బియ్యాన్ని పోసి సన్నటి సెగ మీద అన్నాన్ని ఉడకనివ్వాలి. ఈ సమయంలో నీరు దగ్గరపడుతూ ఉంటుంది. ఈ నీటిని గంజి అంటారు. సాధారణంగా ఈ గంజిని పారబోస్తారు. దీని వల్ల అన్నంలో అధికంగా ఉన్న పిండి పదార్థాలు కొట్టుకుపోతాయి.



పాకదర్పణం అనే గ్రంథం ప్రకారం- గంజి వార్చకుండా అన్నం వండితే దానిని 'అసృతాన్నదోషం' అంటారు. అంటే ఈ తరహా అన్నం తింటే అరుగుదల కష్టమవుతుంది. రుచిలో కూడా తేడా ఉంటుంది. కఫదోషం పెరుగుతుంది. ఇక గంజివార్చిన తర్వాత అన్నం మెతుకులు ఒక దానికి మరొకటి అంటుకోకూడదు. ఇలా ఉండటాన్ని విశదం అంటారు. ఇలాంటి అన్నం మన జాఠరాగ్నిని పెంచుతుంది. పోషకంగా పనిచేస్తుంది. ఇలా తినే అన్నం రక్తంలో ఒత్తిడి (బీపీ), స్థూలకాయం, తలతిరుగుడు మొదలైన వాటికి విరుగుడుగా పనిచేస్తుంది. భోజనకుతూహలంలో అన్నం గురించి మరిన్ని వివరాలు ఉన్నాయి. అవి..

- చల్లారిన అన్నం జఠరాగ్నిని మందగింపచేస్తుంది. ఉబ్బసం, నోట్లో నీళ్లూరటం లాంటి బాధలు కలుగుతాయి.
- చద్దన్నాన్ని పెరుగుతో కలిపి తింటే బీపీ తగ్గుతుంది చలవ చేస్తుంది. కానీ వాతాన్ని పెంచుతుంది. అందువల్ల దీనిలో కూరగాయముక్కలను కలుపుకొని తినాలి.
- బియ్యం కొలతకు 15 రెట్లు ఎక్కువగా పోసి.. ఉడికించి.. దాని ద్వారా వచ్చిన గంజిని తాగితే జీర్ణశక్తి బాగా మెరుగుపడుతుంది. దీనిని మెట్టటి అన్నం అంటారు.
- బియ్యం కొలతలో నాలుగోవంతు పెసరపప్పు కలిపి వండే అన్నం ద్వారా వచ్చిన గంజిలో చాలా పోషకాలు ఉంటాయి.

• గంగరాజు అరుణాదేవి

తలలో పేలు తగ్గాలంటే..!

బడికి వెళ్లే పిల్లలకు తరచూ తలలో పేలు చేరుతుంటాయి. వీటివల్ల పిల్లల్లో రక్తహీనత, శిరోజాలు రాలిపోవడం, ఎదుగుదల ఆగిపోవడం వంటి సమస్యలు వస్తాయి. తలలో పేలు పడ్డాయని తెలిసిన వెంటనే వాటిని తొలగించేందుకు నిపుణులు చెబుతున్న చిట్కాలివి...

- తలలో పేల సమస్య పోవాలంటే శిరోజాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. కుంకుడు కాయ లేదంటే శీకాయ పొడితో ప్రతిరోజూ తలస్నానం చేయాలి. దీనివల్ల వెంట్రుకలకు పట్టి ఉన్న ఈపు(పేల గుడ్లు) రాలిపోతుంది. వారం రోజుల్లో పేలు కూడా తగ్గుతాయి. ఒక గ్లాసు నీళ్లలో రెండు చెంచాల త్రిఫల చూర్ణం కలిపి ఆ నీటిని మాడుకు పట్టిస్తే పేలు రాలిపోతాయి.
- ఒక గిన్నెలో అయిదు చెంచాల కొబ్బరి నూనె వేసి కొద్దిగా వేడి చేయాలి. అందులో మూడు కర్పూరం బిళ్లలను వేళ్లతో చిదిమి పొడిలా చేసి కలపాలి. రాత్రి పడుకునే ముందు ఈ నూనెని మాడుకి, వెంట్రుకలకు పట్టించాలి. శిరోజాలను ముడిపెట్టి తలకు పలుచని వస్త్రాన్ని చుట్టాలి. ఉదయాన్నే మైల్డ్ షాంపూతో తలస్నానం చేస్తే పేలన్నీ పోతాయి.
- ఒక కప్పు పెరుగులో రెండు చెంచాల నిమ్మరసం పిండి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని తలకు పట్టించి పది నిమిషాల తరవాత తలస్నానం చేస్తే తలలో పేల సమస్య తీరిపోతుంది.
- గుప్పెడు వేపాకులు, కొన్ని తులసి ఆకులు తీసుకుని ముద్దలా నూరి అందులో చిటికెడు పసుపు, రెండు చెంచాల కొబ్బరి నూనె కలిపి ఈ మిశ్రమాన్ని తలకు పట్టించాలి. పావు గంట తరవాత గోరువెచ్చని నీళ్లతో తలస్నానం చేస్తే మంచి ఫలితం కనిపిస్తుంది



- ఒక గిన్నెలో మూడు చెంచాల కొబ్బరి నూనె, ఒక చెంచా యాపిల్ సైడర్ వెనిగర్ వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని వేళ్లతో తీసుకుని తలంతా రాయాలి. పది నిమిషాల తరవాత దువ్వెనతో కుదుళ్ల నుంచి వెంట్రుకల చివరి వరకు సున్నితంగా దువ్వితే పేలన్నీ రాలిపోతాయి.
- మూడు చెంచాల వేపనూనెని గిన్నెలో వేసి కొద్దిగా వేడిచేయాలి. ఈ నూనెని మాడు మీద, వెంట్రుకలకు పట్టించాలి. అరగంట తరవాత దువ్వెనతో వేగంగా దువ్వితే పేలన్నీ బయటికి వచ్చేస్తాయి.
- కుటుంబ సభ్యులందరూ ఒకే దువ్వెన వాడడం వల్ల పేలు ఒకరి నుంచి మరొకరికి వ్యాపిస్తాయి. తలలో పేలు పడ్డాయని తెలిసిన వెంటనే పిల్లలకు వేరే దువ్వెన, దిండు ఏర్పాటు చేయాలి. వాటిని కూడా నిత్యం శుభ్రం చేస్తూ ఉంటే సమస్య పెరగకుండా ఉంటుంది.

వంటిల్లు



రోగనిరోధక శక్తి పెంచే రుచులివే!

రుతువులు మారే క్రమంలో మన శరీరంపై అనేక రకాల బ్యాక్టీరియాలు దాడి చేస్తూ ఉంటాయి. వీటి దాడులను ఎదుర్కోవటానికి శరీరానికి రోగనిరోధక శక్తి అవసరం. ఈ రోగనిరోధక శక్తిని మెరుగుపరచడంలో మనం తినే ఆహారం ప్రధాన పాత్ర పోషిస్తుంది. అలాంటి కొన్ని వంటలు ఎలా చేయాలో మనం తెలుసుకుందాం.

ఓట్స్ ఫ్రూట్స్ సలాడ్

కావాల్సిన పదార్థాలు:

ఓట్స్- రెండు కప్పులు, దాల్చిన చెక్క పొడి- అర స్పూను, యాపిల్ ముక్కలు- ఒక కప్పు, అరిటిపండు ముక్కలు- ఒక కప్పు, ద్రాక్ష పళ్లు- పది, తేనె- రెండు చెంచాలు, గుమ్మడి గింజలు- చెంచా, నీళ్లు- తగినన్ని.

తయారీ విధానం

- ఓట్స్‌ను ఒక గిన్నెలో తీసుకొని తగినన్ని నీళ్లు పోయాలి. ఆరు నుంచి ఎనిమిది గంటల పాటు నాననివ్వాలి. ఒకవేళ త్వరగా కావాలనుకుంటే మామూలు నీళ్లకు బదులుగా వేడి నీళ్లు పోస్తే... మూడు గంటల్లో నానిపోతాయి.
- నానిన ఓట్స్‌లో ముందుగా యాపిల్ ముక్కలు, అరిటిపండు ముక్కలు, ద్రాక్ష పళ్లు, తేనె, గుమ్మిడి గింజలు కలపాలి.
- ఆ మిశ్రమంపై దాల్చిన చెక్క పొడిని చల్లాలి.

జాగ్రత్తలు

- ఓట్స్‌లో నీళ్లకు బదులుగా పాలు కూడా పోయవచ్చు. దీని వల్ల రుచి మారుతుంది.
- కొందరు ఈ సలాడ్‌ను బాగా పలచగా చేస్తారు. అలాంటప్పుడు ఓట్స్‌లో ఎక్కువ నీళ్లు లేదా పాలు పోయాలి.
- గుమ్మిడి గింజలతో పాటుగా పొద్దు తిరుగుడు గింజలు, తులసి గింజలను కూడా కలుపుకోవచ్చు.





అల్లం తులసీ కిచిడీ

కావాల్సిన పదార్థాలు: బాగా కడిగిన తులసి ఆకులు- రెండు చెంచాలు, తురిమిన అల్లం ముక్కలు: అర చెంచా, బియ్యం- ఒక కప్పు, పెసరపప్పు- అర కప్పు, నెయ్యి- నాలుగు చెంచాలు, కరివేపాకు- రెండు చెంచాలు, జీలకర్ర- అర స్పూను, పసుపు- చిటికెడు, ఉప్పు- తగినంత, నీళ్లు- తగినన్ని.

తయారీ విధానం

- ఒక గిన్నెలో బియ్యం, పెసరపప్పు వేసి బాగా కడగాలి. దానిలో నాలుగు కప్పుల నీళ్లు పోయాలి.
- తులసి ఆకులు, పసుపు వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని కుక్కర్‌లో నాలుగు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.
- ఒక మూకుడులో నెయ్యిని వేడి చేయాలి. దీనిలో జీలకర్ర, అల్లం ముక్కలు, కరివేపాకు వేసి వేయించాలి.
- అన్నం, పెసరపప్పు మిశ్రమంలో వేయించిన జీలకర్ర, అల్లం ముక్కలు, కరివేపాకుతో పాటుగా ఉప్పు వేసి బాగా కలపాలి.

జాగ్రత్తలు

- తులసి ఆకులను వేయించకూడదు. అన్నంతో పాటుగా ఉడకనివ్వాలి. దీని వల్ల తులసి ఆకుల్లోని సారం అన్నంలో కలుస్తుంది. దీని వల్ల రోగనిరోధకశక్తి పెరుగుతుంది.

కిమ్చి స్క్రాంబుల్డ్ ఎగ్స్



కావాల్సిన పదార్థాలు:

కిమ్చి తయారీకి: సన్నగా తరిగిన క్యాబేజీ- రెండు కప్పులు, ఉప్పు- తగినంత, కారం- చెంచా, వెల్లుల్లి రెబ్బలు- రెండు, అల్లం ముక్కలు- ఒక చెంచా, పంచదార- రెండు చెంచాలు

స్క్రాంబుల్డ్ ఎగ్స్ తయారీకి: కోడిగుడ్లు- రెండు, పాలు- పావుకప్పు, బ్రెడ్ ముక్కలు- పావు కప్పు, ఉల్లిపాయ ముక్కలు- రెండు స్పూన్లు, ఉప్పు- చిటికెడు, నూనె లేదా నెయ్యి- ఒక చెంచా.

కిమ్చి తయారీ విధానం:

సన్నగా తరిగిన క్యాబేజీలో ఉప్పు, కారం, వెల్లుల్లి రెబ్బలు, అల్లం ముక్కలు, పంచదార వేసి బాగా కలపాలి. దీనిని ఫ్రిజ్‌లో పెట్టాలి. బాగా ఊరిన తర్వాత బయటకు తీయాలి.

స్క్రాంబుల్డ్ ఎగ్స్ తయారీ విధానం

- ఒక గిన్నెలో గుడ్లలోని సొనను బాగా కలపాలి. దీనిలో పాలు వేసి మళ్లీ కలపాలి. తర్వాత బ్రెడ్, ఉల్లిపాయ ముక్కలు, ఉప్పు వేసి మిశ్రమంలా చేయాలి.
- ఒక మూకుడులో నూనె లేదా నెయ్యిని వేసి వేడి చేయాలి.

దానిలో ఈ మిశ్రమాన్ని వేయాలి. అది వేడికి దగ్గరపడిన తర్వాత ఒక గరిటెతో చిన్న చిన్న ముక్కలుగా చేయాలి. దానిని ఒక గిన్నెలోకి తీసుకోవాలి.

- ఆ గిన్నెలోనే కిమ్చి వేసి కలపాలి.

జాగ్రత్తలు

- సొనలో పాలు పోస్తే అదనపు రుచి వస్తుంది. పాలు వేయకపోయినా పర్వాలేదు.
- కిమ్చిలో ఎక్కువ పంచదార వేయకూడదు. దీని వల్ల తీపి పెరిగిపోతుంది.

సంకల్పం

ఉన్నత చదువు... దానికి తగిన కొలువు... జీవితం సాఫీగా సాగిపోతోంది. కానీ ఆమె అంతటితో సరిపెట్టుకోలేదు. సమాజానికి తనవంతుగా తిరిగివ్వాలన్న సంకల్పం ఆమెను కుదురుగా కూర్చోనివ్వలేదు. అందుకే కోరి తెచ్చుకున్న ఉద్యోగం వదిలేసి... అట్టడుగు వర్గాల పిల్లలకు అండగా నిలబడ్డారు. రోబోటిక్స్, కోడింగ్, ఏఐ వంటివి నేర్పించి... వారి భవితకు బంగారు బాట వేస్తున్నారు. దాని కోసమే 'ది ఇన్నోవేషన్ స్టోరీ' నెలకొల్పి... చదువు అవ్వగానే ఉపాధి అవకాశాలు అందుకొనేలా పిల్లలను తీర్చిదిద్దుతున్న 53 ఏళ్ల మీనల్ మజుందార్ కథ ఇది.

సాంకేతికత వైపు నడిపిస్తున్నారు



"రాకెట్ వేగంతో దూసుకుపోతున్న నేటి ప్రపంచంలో సాంకేతికత అన్ని రంగాలకూ విస్తరించింది. పాఠశాల దశ నుంచే పిల్లలకు ఆ దిశగా బలమైన పునాదులు పడాలి. లేదంటే భవిష్యత్తులో కెరీర్ పరంగా ఎంతో నష్టపోతారు. దీన్ని దృష్టిలో ఉంచుకొనే నేను 'ది ఇన్నోవేషన్ స్టోరీ' (టీఐఎస్) ప్రారంభించాను. వెనుకబడిన వర్గాల పిల్లలకు 'స్టెమ్' (సైన్స్, టెక్నాలజీ, ఇంజనీరింగ్, మేథమెటిక్స్)ను ఒక ప్రాజెక్టుగా తీసుకొని బోధించడం దీని ప్రధాన ఉద్దేశం. ఇందులో భాగంగా రోబోటిక్స్, కోడింగ్, ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్ వంటివి చిన్న వయసులోనే పరిచయం చేస్తున్నాం. ఫలితంగా చదువు పూర్తవుతూనే వారికి మెరుగైన ఉద్యోగ అవకాశాలు లభిస్తాయి. పేదరికం నుంచి అభివృద్ధిపథం వైపు అడుగులు వేయడానికి ఆ కుటుంబాలకు నేను చేస్తున్న చిరు సాయంగా దీన్ని భావిస్తున్నాను.

మా అమ్మాయివల్ల...

బ్యాంకులో మంచి ఉద్యోగం వదిలేసి ఇటువైపు రావడానికి ప్రధాన కారణం మా అమ్మాయి. ఆ కారణం ఏంటో తెలియాలంటే నా గురించి చెప్పాలి. నేను పుట్టి పెరిగిందంతా ముంబయిలోనే. బాగా చదువుకొని, ఉన్నత స్థానంలో ఉండాలనేది నా చిన్ననాటి ఆకాంక్ష. దాని కోసం కష్టపడి చదివాను. ఇంజనీరింగ్ తరువాత ఎంబీఏ చేద్దామనుకున్నాను. కోల్‌కతా ఐఐఎంలో సీటు వచ్చింది. ఎంబీఏ పూర్తయ్యాక ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌లో ఉద్యోగం వచ్చింది. కొద్ది కాలంలోనే సీనియర్ వైస్‌ప్రెసిడెంట్ హోదాకు వెళ్లాను. జీవితాంతం బ్యాంకర్‌గానే ఉండాలనేది అప్పటి నా ఆలోచన. ఆ ఉద్యోగం నాకు బాగా నచ్చింది. కానీ అక్కడే నా జీవితం అనుకోని మలుపు తిరిగింది. మా అమ్మాయి అప్పుడు ఎనిమిదో తరగతి చదువుతోంది. తను స్కూలు రోబోటిక్స్ టీమ్‌లో భాగస్వామి కావాలనుకుంది. నేను సరే అనడంతో టీమ్‌లో చేరింది. నలభై మంది టీమ్‌లో తను ఒక్కతే అమ్మాయి కావడంతో ఎన్నో సవాళ్లు ఎదురయ్యాయి. తనను బయటి వ్యక్తిలా చూసేవారు. అవన్నీ భరించలేక, అక్కడ ఏమీ నేర్చుకోలేక ఇబ్బందులు పడింది. నాది ఇంజనీరింగ్ నేపథ్యం కావడంతో ఇంటి దగ్గర నేనే రోబోటిక్స్ నేర్పించాను. టెక్నాలజీకి సంబంధించి ప్రతి విషయంలో తనకు మార్గదర్శిగా ఉన్నాను. అప్పుడు నాకు అర్థమైంది ఏంటంటే... తరగతి గదుల్లో ఎంత బోధించినా పెద్దగా ఫలితం ఇవ్వదని. దానికి బదులు పిల్లలను నిజమైన ప్రాజెక్టుల్లో భాగస్వాములను చేస్తే వారి ఆలోచనాశక్తి పెరుగుతుందని... సమస్య ఉత్పన్నమైనప్పుడు సొంతంగా పరిష్కరించుకోగలిగే సామర్థ్యం అలవడుతుంది.! అంటే అనుభవపూర్వకంగా అభ్యాసం అనమాట.

వారిని చూశాక...

కొవిడ్ సమయంలో విద్యా సంస్థలన్నీ మూతపడ్డాయి. ఆన్‌లైన్ బోధన మొదలైంది. కానీ పేద వర్గాలకు చెందిన అనేకమంది విద్యార్థులు మొబైల్, ట్యాబ్‌లు, ల్యాప్‌టాప్‌ల వంటి సౌకర్యాలు లేక తరగతులకు దూరమయ్యారు. ఇది నన్ను కలచివేసింది. ఒకవైపు ఉద్యోగం చేస్తూనే 'సలామ్ బాంబే ఫౌండేషన్'తో కలిసి పని చేశాను. ముఖ్యంగా కొవిడ్ సమయంలో 18 లక్షల రూపాయలు సేకరించి, వెనుకబడిన వర్గాల విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు కొని ఇచ్చాను. కోల్‌కతా ఐఐఎంలో చదివినప్పుడు ఒక



బలమైన బృందాన్ని నిర్మించాను. కొవిడ్ సమయంలో ఆ బృందం నా సేవా కార్యక్రమాలకు ఆర్థికంగా సహకరించింది. అయితే కొద్దిమంది పిల్లలకు మాత్రమే ల్యాప్‌టాప్‌లు ఇవ్వగలిగాను. మరి మిగిలినవారి పరిస్థితి ఏంటి? వారి చదువు కొనసాగేదెట్లా? ల్యాప్‌టాప్‌లు ఇచ్చినంతమాత్రాన సమస్య పరిష్కారం కాదని అప్పుడు గ్రహించాను. పాఠ్యపుస్తకాల్లో విద్య మాత్రమే కాకుండా ప్రపంచంతో పోటీపడాలంటే విద్యార్థి దశ నుంచే రోబోటిక్స్, ఏఐ లాంటి సబ్జెక్టులు కూడా అవసరమని భావించాను.

'టీఐఎస్'కు శ్రీకారం...

నేను అనుకున్న లక్ష్యం వైపు అడుగులు వేయాలంటే పూర్తి సమయం దానికి కేటాయించాలి. అప్పుడే న్యాయం చేయగలుగుతానని అనిపించింది. వెంటనే నా ఉద్యోగానికి రాజీనామా చేశాను. బ్యాంకింగ్ రంగంలో పద్నాలుగేళ్ల నా ప్రస్థానం ముగిసింది. 2021లో 'టీఐఎస్'కు అంకురార్పణ జరిగింది. పేద, ప్రభుత్వ పాఠశాలల పిల్లలతో పాటు ఆసక్తిగల ప్రైవేటు స్కూళ్ల విద్యార్థులకు కూడా ఏఐ, రోబోటిక్స్, వెబ్‌డెవలప్‌మెంట్, 3డీ క్యాడ్ వంటివి నేర్పిస్తున్నాం. మొదటి ఏడాది 250 మందికి శిక్షణ ఇచ్చాం. దీనికోసం ప్రతిష్ఠాత్మక సంస్థలైన ఐఐటీ-ఢిల్లీ, ఐఐఎస్‌సీ- బెంగళూరు, అమెజాన్ ఫ్యూచర్ ఇంజనీర్, క్యాప్‌జమినీ, టాటా క్యాపిటల్‌తో కలిసి పని చేస్తున్నాం. మా దగ్గర శిక్షణ తీసుకున్న విద్యార్థులు పలు జాతీయ, అంతర్జాతీయ రోబోటిక్స్ పోటీల్లో పాల్గొన్నారు. వారిలో అధిక శాతం అట్టడుగు వర్గాల పిల్లలే. ఇది నాకు ఎంతో సంతృప్తినిచ్చింది. దీని ద్వారా ఇప్పటివరకు పది వేలమందికి పైగా విద్యార్థులు ప్రయోజనం పొందారు. రాబోయే ఐదేళ్లలో పది లక్షల మందికి మా సేవలు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాను. అది నెరవేరుతుందని ఆశిస్తున్నాను."

మేకప్

ల్యూబ్ మిలమిలలు శాశ్వతమా?

ముఖాన్ని మిలమిలా మెరిపించడం కోసం తాజాగా ల్యూబ్ ట్రెండ్ వాడుకలోకొచ్చింది. ప్రధానంగా సామాజిక మాధ్యమాల ఇన్‌ఫ్లుయెన్సర్లు ఇష్టారాజ్యంగా వాడుకుంటున్న లూబ్రికెంట్ల ధోరణితో ఒరిగే లాభనష్టాలు, ప్రత్యామ్నాయాల గురించి తెలుసుకుందాం!

ముఖం ఎంతగా మెరుపులు వెదజల్లితే అంత ఎక్కువ మంది ఫాలోవర్లను సొంతం చేసుకోవచ్చనే ఆలోచనతో అందుబాటులో ఉన్న ఉపాయాలన్నీ అనుసరిస్తూ ఉంటారు ఇన్‌ఫ్లుయెన్సర్లు. సన్నిహిత ప్రదేశాల కోసం ఉద్దేశించిన ల్యూబ్స్‌ను ముఖం మెరుపుకు ఉపయోగించే ధోరణి ఊపందుకుంటోంది. జారుడుగా ఉండి, తాత్కాలికంగా ముఖానికి బిగుతును, మెరుపునూ పెంచే ల్యూబ్‌లు, మేకప్‌లో కీలకమైన ప్రైమర్ల స్థానాన్ని భర్తీ చేయడం మొదలుపెట్టాయి. ముఖాన్ని నునుపుగా మార్చి, చర్మ రంధ్రాలను కనిపించకుండా చేసి, మేకప్‌కు ముఖాన్ని సిద్ధం చేసే సాధనాలు ప్రైమర్లు. అంతకుమించిన ఫలితాన్ని అందిస్తున్నాయనే కొన్ని ల్యూబ్ వీడియోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టడంతో ఈ పాశ్చాత్య సంస్కృతి మన దేశంలో కూడా విస్తరించింది. అయితే ల్యూబ్‌లను ప్రైమర్లుగా వాడడం వల్ల కొన్ని దుష్ప్రభావాలుంటాయి. అవేంటంటే...

- సిలికాన్ లేదా నీటి ఆధారిత ల్యూబ్‌లు కొన్ని వాణిజ్య ప్రైమర్లను మరిపించినప్పటికీ అవి ముఖ సౌందర్యానికి తగ్గట్టు తయారైనవి కావు
- సిలికాన్ ఆధారిత ల్యూబ్‌లు దీర్ఘకాల వినియోగానికి ఉద్దేశించి తయారైనవి కావు
- సన్నిహిత సందర్భాల కోసం తయారైన లూబ్రికెంట్స్‌లో ముఖ చర్మానికి హాని చేసే కారకాలుంటాయి
- బిగుతును పెంచే ల్యూబ్స్ వల్ల, కళ్ల దిగువన, పెదవులు చుట్టూరా సన్నని గీతలు ఏర్పడతాయి
- ల్యూబ్స్‌తో చర్మం రంధ్రాలు పూడుకుపోయే ప్రమాదం ఉంది
- ల్యూబ్ వాడకంతో ముఖానికి అంటుకున్న జిడ్డును తొలగించడం కష్టమవుతుంది.

ప్రత్యామ్నాయాలు ఇవే

ముఖానికి మెరుపు కోసం చవకగా దొరికే ల్యూబ్స్ ఉపయోగించి, చర్మ సమస్యలను కొని తెచ్చుకునే బదులు, చర్మ తత్వానికి నప్పే ప్రైమర్లను ఎంచుకోవడం అన్ని విధాలా సురక్షితం. వాటిని ఎలా ఎంచుకోవాలంటే...

- పొడి చర్మం కలిగినవాళ్లు హైడ్రేటింగ్ ప్రైమర్లను ఎంచుకోవాలి
- చర్మ రంధ్రాలు పెద్దవిగా ఉన్నవాళ్లు వాటిని కప్పేసే, పోర్ ఫిల్లింగ్ ప్రైమర్లను ఎంచుకోవాలి
- జిడ్డు చర్మం కలిగినవాళ్లు, మాటిఫైయింగ్ ప్రైమర్లు ? వాడుకోవాలి.



పట్టు చీరలు ఇలా పదిలం...

పట్టుచీరలు చాలా సున్నితంగా ఉంటాయి. వీటిని సరైన విధానంలో సంరక్షించుకోకుంటే మెరుపు కోల్పోయి పాతగా కనిపిస్తాయి. పట్టుచీరలు ఎక్కువకాలం మన్నికగా ఉండాలంటే ఏ చిట్కాలు పాటించాలో తెలుసుకుందాం!

- పట్టుచీరని ఒకసారి కట్టుకుని విడిచిన తరవాత దానికి బాగా గాలి తగిలేలా ఆరేయాలి. తేమ, చల్లదనం లేకుండా పొడిగా ఆరిన తరవాతనే మడత పెట్టి భద్రపరచాలి. నాలుగైదుసార్లు కట్టుకున్న తరవాత చీరని డ్రైక్లీనింగ్ చేయించవచ్చు. దీనివల్ల పట్టు చీర మెరుపు పోకుండా ఉంటుంది.
- చీర మీద చిన్న మరకలు లేదా మురికి అంటితే అక్కడ మాత్రమే..... నీళ్లతో తడిపిన దూదితో తుడవాలి. కొద్దిగా గ్లిజరిన్ రాసి పలుచని బట్టతో తుడిచినా మరకలు పోతాయి.
- పట్టు చీరని శుభ్రం చేయాలనుకుంటే మొదటిసారి మాత్రం డ్రైక్లీనింగ్ చేయించాలి. తరవాత తగిన జాగ్రత్తలు తీసుకుంటూ నీళ్లలో ముంచి ఉతకవచ్చు. నీళ్లలో కొద్ది మోతాదులో బేబీ షాంపూని మాత్రమే కలపాలి. డిటర్జెంట్, సర్ఫ్ కలపకూడదు. చీరని నీళ్లలో ఎక్కువసేపు నాననివ్వకూడదు. చేతులతో గట్టిగా పిండకూడదు.
- చీర కొనను నీళ్లలో ముంచి వేళ్లతో పిండి రంగు పోతున్నదీ లేనిదీ పరిశీలించాలి. రంగు వదులుతున్నట్లయితే ఒక బకెట్ నీళ్లలో పది చుక్కల నిమ్మరసం కలిపి అందులో చీర ముంచి వెంటనే తీసి నీడలో ఆరవేయాలి.
- చీరని ఇస్త్రీ చేసేముందు దానిపై కొన్ని నీటి చుక్కలు చల్లితే ముడతలు తొందరగా పోతాయి. పట్టుచీరని నేరుగా ఇస్త్రీ చేయకూడదు. చీరపై నూలు దుపట్టా లేదా పరిశుభ్రమైన తువాలు పరిచి దానిమీద ఇస్త్రీ చేయాలి. దీనివల్ల ఇస్త్రీ పెట్టె వేడికి జరీ నల్లబడకుండా ఉంటుంది.
- పట్టుచీరని చక్కగా మడతపెట్టి సన్నని నూలు వస్త్రం లేదా తెల్లని కాగితంలో చుట్టి అలమరాలో పెట్టుకోవాలి. కనీసం మూడు నెలలకు ఒకసారైనా చీర మడతలను మార్చాలి. లేకుంటే మడతలపై చిరుగులు వస్తాయి.
- పట్టుచీరలను అలమరాలో సర్దిన తరవాత వాటి మధ్యలో కలరా ఉండలు లేదంటే ఫ్యాబ్రిక్ ఫ్రెషనర్స్‌ను ఉంచాలి. దీనివల్ల పురుగులు చేరకుండా ఉంటాయి. గంధపు చెక్కను పలుచని గుడ్డలో చుట్టి పెడితే చీరలకు తేమ చేరకుండా ఉంటుంది. వాటికి మంచి సువాసన కూడా పడుతుంది.
- పట్టుచీర మీద దగ్గరనుంచి పెర్ఫ్యూమ్‌ని స్ప్రే చేయకూడదు. దానిలోని రసాయనాల వల్ల జరీ పోగులు పాడయ్యే అవకాశం ఉంది. కాబట్టి ఒక అడుగు దూరంలో ఉండి స్ప్రే చేయడం మంచిది.



ప్రజా ప్రభుత్వాలను, పత్రికా స్వేచ్ఛను కూల్చివేసిన చరిత్ర కాంగ్రెస్‌ది: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి



హైదరాబాద్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): ప్రజా ప్రభుత్వాలను కూల్చివేసి, పత్రికా స్వేచ్ఛను హరించి వేసిన చరిత్ర కాంగ్రెస్ పార్టీదని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్ రెడ్డి అన్నారు. రాజ్యాంగం గురించి అవగాహన లేని, రాజ్యాంగం చదవని వ్యక్తి రాహుల్ గాంధీ అని, ఆయనకు రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని కేంద్ర మంత్రి విమర్శించారు. శుక్రవారం భారత రత్న కర్పూరీ ఠాకూర్ జయంతి సందర్భంగాపార్టీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన నివాళి అర్పించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. మాతృభాష పరిరక్షణలో భాగంగా హిందీ భాష ప్రోత్సాహానికి ఠాకూర్ ఎంతో కృషి చేశారని కొనియాడారు. గతంలో రాజకీయ పార్టీల కనుసైగలతో పద్మ అవార్డులు వచ్చేవని, నేడు నిస్వార్థంగా దేశం కోసం పని చేసిన మహానుభావులకే అవార్డులు ఇచ్చి గౌరవించుకుంటున్నామని పేర్కొన్నారు.

కాషాయం గూటికి కరీంనగర్ మేయర్

» బీఆర్‌ఎస్‌కు గుడ్ బై.. 10 మంది కార్పొరేటర్లు కూడా



సునీల్‌రావు

కరీంనగర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): కరీంనగర్ మునిసిపల్ కార్పొరేషన్ మేయర్ యాదగిరి సునీల్‌రావు బీఆర్ఎస్ పార్టీకి గుడ్ బై చెప్పి బీజేపీలో చేరేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. ఆయనతో పాటు 10 మంది కార్పొరేటర్లు కూడా బీఆర్ఎస్‌ను వీడనున్నారు. శనివారం నగరంలోని ఎస్‌బీఎస్ ఫంక్షన్‌హాల్‌లో కేంద్రహోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కుమార్ సమక్షంలో తాము బీజేపీలో చేరుతున్నట్లు సునీల్‌రావు ప్రకటించారు. కొద్దికాలంగా బండి సంజయ్‌తో సన్నిహితంగా ఉంటూ వస్తున్న సునీల్‌రావు బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తారని ప్రచారం జరుగుతున్నది. సునీల్ రావు మాత్రమే కాకుండా బీఆర్ఎస్ నుంచి గెలిచిన మెజార్టీ కార్పొరేటర్లను కూడా పార్టీ మార్పించాలని కేంద్రమంత్రి బండి సంజయ్‌కుమార్ కార్యాచరణ రూపొందించి ఆయనకు అప్పగించారు. తొలుత 16 మంది కార్పొరేటర్లు బీఆర్ఎస్‌కు రాజీనామా చేస్తారని భావించారు. అయితే స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి గంగుల కమలాకర్ కొందరిని బుజ్జగించి పార్టీ వీడకుండా ఒప్పించగలిగారని, దీంతో సునీల్‌రావుతో 10 మంది కార్పొరేటర్లు మాత్రమే బీజేపీలో చేరుతున్నారని తెలుస్తున్నది. ఈ నెల 28తో కరీంనగర్ కార్పొరేషన్ పాలకవర్గ పదవీకాలం ముగియనుండడంతో ఆలోగానే బీఆర్ఎస్‌కు తమ రాజీనామాలతో షాక్ ఇవ్వనున్నారు.

కౌశిక్‌రెడ్డిపై కోడిగుడ్లతో దాడి

కమలాపూర్, జనవరి 24(ఆంధ్రజ్యోతి): హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన గ్రామసభలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. ఎమ్మెల్యే కౌషిక్‌రెడ్డిపై కాంగ్రెస్, బీజేపీ కార్యకర్తలు టమాటాలు, కోడిగుడ్లతో దాడి చేశారు. సభలో కౌషిక్‌రెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సంవత్సరం దాటినా ఆరు పథకాలు, 66 హామీలను నెరవేర్చకపోవడంతో పాటు కాలయాపన చేస్తోందని అన్నారు. ఊకదంపుడు మాటలు మాట్లాడుతూ కాలం వెల్లదీస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్, బీజేపీలతో ఎలాంటి పనులు జరుగవని, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రజలకు ఎంతో మేలు చేసిందని తెలిపారు. ఇలా ఎమ్మెల్యే మాట్లాడుతుండ డంతో ఆగ్రహానికి గురైన బీజేపీ, కాంగ్రెస్ కార్యకర్తలు ఎమ్మెల్యేలపై టమాటాలు, కోడిగుడ్లతో దాడి చేశారు. బీఆర్ఎస్ హయాంలో ఏం అభివృద్ధి జరిగిందని నిలదీశారు. పోలీసులు సముదాయించడంతో గొడవ సద్దుమణిగింది.

రాజకీయాలకు సాయిరెడ్డి సెలవు!

(మొదటిపేజీ తరువాయి)

ఉన్న విజయ సాయిరెడ్డి చేసిన 'రాజీనామా' ప్రకటన వైసీపీలో పెను సంచలనం సృష్టిస్తోంది. అక్రమాస్తుల కేసుల్లో అరెస్టు అనంతరం జగన్‌కు సాయిరెడ్డి మరింత సన్నిహితుడయ్యారు. వైసీపీ కార్యకలాపాల్లో క్రియాశీలకంగా పాల్గొంటూ వచ్చారు. 2009 నుంచి 2019 దాకా పదేళ్లపాటు ప్రతిపక్షంలో ఉండగా... తెలుగుదేశంపై దూకుడుగా వ్యవహరించారు. మరీముఖ్యంగా... 2014-19 మధ్య టీడీపీ అధికారంలో ఉండగా చంద్రబాబు, లోకేశ్‌లపై వ్యక్తిగత విమర్శలతో విరుచుకుపడ్డారు. ఒకరకంగా చెప్పాలంటే.. తన స్థాయికి, హూందాకు తగని వ్యాఖ్యలు చేస్తూ 'వివాదాస్పదుడి'గా ముద్ర వేయించుకున్నారు. అక్రమాస్తుల కేసులో ఏ2గానే కాదు... వైసీపీలోనూ సుదీర్ఘకాలం నంబర్ 2గా సాయిరెడ్డి కొనసాగారు. పార్టీలో సజ్జల రామకృష్ణా రెడ్డి క్రియాశీలం అయ్యాక సాయిరెడ్డి పరిస్థితి మారిపోయింది. ఆయనను జగన్ కొన్నాళ్లు దూరం ఉంచడం, కొన్నాళ్లు బుజ్జగించడం... ఇలా వైసీపీలో సాయిరెడ్డి పరిస్థితి గజిబిజిగా తయారైంది. ఒక దశలో ఆయన పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఉత్తరాంధ్ర జిల్లాల సమన్వయకర్తగా చక్రం తిప్పారు. ఆ తర్వాత సాయిరెడ్డిని తప్పించి... జగన్ తన బాబాయి వైవీ సుబ్బారెడ్డికి ఉత్తరాంధ్ర బాధ్యతలు అప్పగించారు. జగన్‌పై తాను అలిగినా, తనపై జగన్ ఆగ్రహించినా సాయిరెడ్డి మాత్రం ఆయనను అంటిపెట్టుకునే ఉన్నారు.

బాబు, బాలయ్యతో మాట్లాడారని...

నారా లోకేశ్ పాదయాత్రను ప్రారంభించే సమయంలో నటుడు నందమూరి తారకరత్న గుండెపోటుకు గురయ్యారు. ఆయన భార్య సాయిరెడ్డికి సన్నిహిత బంధువు. దీంతో... తారకరత్నకు వైద్య సేవలు అందించే సమయంలో సాయిరెడ్డి తరచూ ఆస్పత్రికి వచ్చి వెళ్లారు. అదే సమయంలో.. బాలకృష్ణ, చంద్రబాబుతో పలుమార్లు మాట్లాడారు. ఇది .. జగన్‌కు ఆగ్రహం తెప్పించిందని అంటారు. ఆ తర్వాత కాలంలో మళ్లీ దగ్గరైనా అంతకుముందున్న 'పరస్పర విశ్వాసం' సన్నగిల్లిందని చెబుతారు. వైఎస్ కుటుంబ ఆస్తుల పంపకాల వివాదంలో ఆయన జగన్ పక్షానే నిలిచారు. వైఎస్ విజయలక్ష్మి, షర్మిలపై విమర్శలు గుప్పించి.. వారికీ చెడ్డయ్యారు.

'పోర్టు' వివాదంలో మునిగి...

ఎన్నికల్లో ఓటమి తర్వాత వైసీపీ పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. జగన్‌తోపాటు సాయిరెడ్డిపై కేసుల కత్తి వేలాడుతూనే ఉంది. దీనికి తోడు... తాజాగా కాకినాడ డీప్‌సీ పోర్టు వివాదంలో సాయిరెడ్డి నిండా మునిగిపోయారు. బెదిరించి, భయపెట్టి పోర్టులో వాటాలు లాక్కున్నారన్న ఫిర్యాదు మేరకు సీఐడీ నమోదు చేసిన కేసులో సాయిరెడ్డి కూడా నిందితుడే. దీనిని ఆధారంగా చేసుకుని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా రంగంలోకి దిగింది. సాయిరెడ్డిని పిలిచి ప్రశ్నించింది కూడా! అదే సమయంలో అనూహ్యంగా సండూర్ పవర్‌లో పెట్టుబడులపైనా ప్రశ్నలు సంధించింది. ఈ క్రమంలో... కాకినాడ డీప్ పోర్టులో వాటాలను 'అరబిందో' వదిలేసుకుంది. అయినా... కేసు మాత్రం అలాగే ఉంది! వీటన్నింటి నేపథ్యంలోనే సాయిరెడ్డి 'రాజీనామా' ప్రకటన వెలువడటం గమనార్హం.

ఫిబ్రవరి 10న విదేశాలకు...

రాజీనామా చేసిన ప్రకటన రోజునే... విదేశీ పర్యటనకు అనుమతి ఇవ్వాలంటూ సాయిరెడ్డి నాంపల్లిలోని సీబీఐ ప్రత్యేక కోర్టును కోరారు. ఫిబ్రవరి 10 నుంచి మార్చి 10వ తేదీ వరకు నార్వే, ఫ్రాన్స్‌లో పర్యటించేందుకు అనుమతించాలని పిటిషన్ వేశారు. దీనిపై న్యాయస్థానం సీబీఐ స్పందన కోరుతూ విచారణను 27వ తేదీకి వాయిదా వేసింది.

'అయోధ్య'దీ అదే దారి!?

వైసీపీకే చెందిన మరో రాజ్యసభ సభ్యుడు అయోధ్య రామిరెడ్డి కూడా త్వరలోనే వైసీపీకి గుడ్‌బై చెప్పి.. తన పదవికి రాజీనామా చేసే అవకాశముందని తెలుస్తోంది. రాజకీయ భవిష్యత్తుపై మరింత స్పష్టత కోసం ఆయన వేచి చూస్తున్నారని... అది రాగానే రాజీనామా ప్రకటన చేస్తారని చెబుతున్నారు.

నెట్ నెట్ భవనాన్ని కూల్చాల్సిందే!

(మొదటిపేజీ తరువాయి)

వ్యక్తికి చెందిన నెట్ నెట్ వెంచర్స్ సంస్థ 4.748 ఎకరాల భూమిని కొనుగోలు చేసింది. ఈ స్థలంలో 12 అంతస్తుల (జీ+4, 7 సెల్లార్లు) నిర్మాణం చేపట్టేందుకు 2013లో జీహెచ్ఎంసీ నుంచి అనుమతి పొందింది. ఆ తరువాత 2015లో జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీలో 865.42 చదరపు గజాల భూమిని కొనుగోలు చేసింది. ఇది జూబ్లీహిల్స్ రోడ్ నంబరు 45కు ఆనుకునే ఉంటుంది. కాగా.. సొసైటీకి సంబంధించి కొంత వెసులుబాటు కల్పిస్తూ ప్రభుత్వం 2017లో జీవో నంబరు 305 జారీ చేసింది. దాని ప్రకారం రోడ్డుకు ఇరువైపులా ఉన్న స్థలాల్లో 30 మీటర్ల వరకు నిర్మాణాలు చేసుకోవచ్చు. కానీ దీని వెనుకాలే ఉన్న హుడా లేఅవుట్‌కు ఈ నిబంధనలు వర్తించవు. జూబ్లీహిల్స్ హౌసింగ్ సొసైటీకి ఇచ్చిన వెసులుబాటును అడ్డుపెట్టుకుని.. నెట్‌నెట్ వెంచర్స్ సంస్థ తమకు 30 మీటర్ల నిర్మాణానికి అనుమతి ఇవ్వాలంటూ జీహెచ్ఎంసీకి దరఖాస్తు పెట్టుకుంది. అనుమతులు కూడా సాధించింది. జీ+4తో మొదలుపెట్టి.. ఆ తర్వాత జీ+5, జీ+12, చివరకు జీ+13, వరకు.. 2,09,620 చదరపు అడుగుల్లో నిర్మాణం చేసుకునేలా అనుమతి పొందింది. ఈ స్థలంలో సెవన్ స్టార్ హోటల్, మల్టీప్లెక్స్, షాపింగ్ మాల్ నిర్మించాలనేది నెట్ నెట్ వెంచర్ ప్రతిపాదన. అలా నిర్మించడం హెచ్ఎండీఏ, జీహెచ్ఎంసీ పర్యావరణ నిబంధనలకు విరుద్ధం. అయినా నాంపల్లి సర్కిల్-18 పరిధిలో చేపట్టిన ఈ భవన నిర్మాణానికి జీహెచ్ఎంసీ 2023 సెప్టెంబరు 26న అనుమతులు మంజూరు చేసింది. ఇలా అన్ని నిబంధనలనూ ఉల్లంఘించి చేపడుతున్న ఈ నిర్మాణంపై నందగిరి కో ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ సభ్యులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీంతో ఈ నిర్మాణాన్ని పరిశీలించిన విజిలెన్స్ అధికారులు పలు ఉల్లంఘనలను గుర్తించారు.

ఇవీ ఉల్లంఘనలు..

భవన నిర్మాణం చేపట్టిన ప్రాంతం పెద్ద పెద్ద రాళ్లతో అసమతుల్యంగా ఉంటుంది. నేల స్వభావం దెబ్బతినకుండా భవన నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉన్నా.. నెట్ నెట్ వెంచర్స్ నిర్వాహకులు భూమి లోపలకు సుమారు 110 అడుగులు మేర తవ్వకాలు చేశారు. అక్కడి నుంచి 5 అంతస్తుల స్టిల్ట్ నిర్మాణ పనుల విషయంలో, సెట్ బ్యాక్స్ విషయంలోనూ నిబంధనలు పాటించలేదు. సెట్ బ్యాక్స్ కోసం 7 మీటర్ల నుంచి 10 మీటర్ల వరకు వదలాల్సి ఉండగా అంగుళం కూడా వదలకుండా ఆ ప్రాంతంలో కాంక్రీట్ గోడలు, ర్యాంపులు నిర్మించారు. అగ్నిమాపక వాహనాలు కూడా తిరిగే అవకాశం లేకుండా 5 అంతస్తుల స్టిల్ట్ నిర్మాణాలు చేపట్టారు. స్టిల్ట్ నుంచి ఆపైన నిర్మించిన 7 అంతస్తుల విషయంలో 3 మీటర్ల ఎత్తులో ఒక్కో శ్లాబ్ వేయాల్సి ఉంటే అక్కడ 4.5 మీటర్ల ఎత్తులో వేసినట్టు జీహెచ్ఎంసీ కమిషనర్ తన 19 పేజీల ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో.. అనుమతించిన ప్లాన్ ప్రకారం కాకుండా చేపట్టిన నిర్మాణాలను తొలగించాలని ఆదేశించారు. స్టిల్ట్ 5 అంతస్తుల్లోనూ సెట్ బ్యాక్స్ ప్రాంతంలో ఉన్న కాంక్రీట్ నిర్మాణాలను తొలగించాలని.. నిర్దేశించిన ప్రాంతంలో కాకుండా వాహనాల రాకపోకలకోసం చేపట్టిన ర్యాంపులను తొలగించాలని, కోర్టు ఆదేశాల ప్రకారం చర్యలు చేపట్టాలని డిప్యూటీ కమిషనర్‌ను ఆదేశించారు. ఈ ఉత్తర్వుల ప్రకారం చూస్తే భవనం పూర్తిగా కూల్చివేతకు గురయ్యే అవకాశాలే కనిపిస్తున్నాయి.

హరీశ్‌వి దగుల్బాజీ మాటలు

» ప్రతిపాదనల్లోనే గోదావరి-బనకచర్ల అనుసంధానం

» ఏపీ నీరు తరలిస్తోందంటూ హరీశ్ అసత్య ప్రచారం: ఉత్తమ్

» గోదావరి-బనకచర్ల లింక్‌ను అడ్డుకోవాలని కేంద్రానికి లేఖ



హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): 'గోదావరి-బనకచర్ల అనుసంధానం.. ప్రతిపాదన మాత్రమే. ప్రాజెక్టు పూర్తికావడం కాదు కదా.. డీపీఆర్ కూడా తయారు కాలేదు. చుక్క నీరు పోలేదు. రూ.80 వేల కోట్ల వ్యయంతో మూడు భాగాలుగా ప్రాజెక్టును ప్రతిపాదించారు. నిధులు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. దీనికే ప్రాజెక్టు పూర్తయినట్లు అబద్ధాలు చెబితే ఎలా..? హరీశ్‌రావు దగుల్బాజీ మాటలు మాట్లాడుతున్నారు' అని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి మండిపడ్డారు. గోదావరి-బనకచర్ల అనుసంధానంతో 200 టీఎంసీలను ఏపీ తరలించుకుపోతోందని మాజీ మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలకు కౌంటర్ ఇస్తూ శుక్రవారం సచివాలయంలో ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. గోదావరి-బనకచర్ల అనుసంధానానికి అనుమతి ఇవ్వరాదని కేంద్రానికి తాము ఇప్పటికే లేఖలు రాశామని తెలిపారు. గోదావరి జలాల్లో తెలంగాణ ప్రయోజనాలను కాపాడతామని చెప్పారు. కేసీఆర్, హరీశ్ అసమర్థత, అహంకారం వల్లే కృష్ణా జలాల కేటాయింపులో తెలంగాణకు అన్యాయం జరిగిందని మండిపడ్డారు. పాలమూరులో రూ.27,500 కోట్లు, సీతారామలో రూ.7 వేల కోట్లు పెట్టినా ఒక్క ఎకరం తడవలేదని ధ్వజమెత్తారు. కాగా, బచావత్ ట్రిబ్యునల్ తీర్పుకు, ఆంధ్రప్రదేశ్ పునర్వ్యవస్థీకరణ చట్టానికి వ్యతిరేకంగా గోదావరి-బనకచర్ల అనుసంధానాన్ని ఏపీ ప్రభుత్వం ప్రతిపాదించిందని.. ఈ ప్రాజెక్టును అడ్డుకోవాలని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌కు మంత్రి ఉత్తమ్ లేఖ రాశారు. రూ.80,112 కోట్ల వ్యయంతో పోలవరం నుంచి 200 టీఎంసీలను తరలించేలా ఈ ప్రాజెక్టును ప్రతిపాదించారని, 150 టీఎంసీలతో గుంటూరు జిల్లాలోని బొల్లాపల్లిలో రిజర్వాయర్ నిర్మాణం చేపట్టాలని నిర్ణయించారని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టుకు ఏపీ ప్రభుత్వం అనుమతులు పొందలేదని తెలిపారు.

సీతారామ ఎత్తిపోతలలో ప్యాకేజీ-2 తిరస్కరణ

సీతారామ ఎత్తిపోతల పథకంలో ప్యాకేజీ-2 కింద ప్రతిపాదించిన రూ.172 కోట్ల పనులను కమిషనర్ ఆఫ్ టెండర్స్(సీవోటీ) తిరస్కరించింది. ప్యాకేజీ-2 పనులకు టెండర్లు దక్కించుకున్న కాంట్రాక్టర్‌కు పూర్వానుభవం లేనందున ఈ నిర్ణయం తీసుకుంది. ఇక ప్యాకేజీ-1లో రూ.369 కోట్లతో చేపట్టే పనులతో పాటు రూ.56 కోట్లతో ఎస్కేప్ రెగ్యులేటర్ పనులను పక్కనపెట్టింది.

రాష్ట్రంలో సినిమా బెనిఫిట్‌షోల రద్దు: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 24: రాష్ట్రంలో సినిమా బెనిఫిట్ షోలను రద్దు చేస్తూ హైకోర్టు శుక్రవారం ఆదేశాలు జారీ చేసింది. ఏమైనా సినిమాల బెనిఫిట్ షోలకు అనుమతి ఇచ్చి ఉంటే వాటిని రద్దు చేయాలని ప్రభుత్వానికి స్పష్టం చేసింది. సినిమాటోగ్రఫీ చట్టం ప్రకారం అర్ధరాత్రి దాటిన తర్వాత 1.30 నుంచి ఉదయం 8.40 వరకూ సినిమాలను ప్రదర్శించటానికి వీల్లేదని హైకోర్టు గుర్తు చేసింది. విచారణ సందర్భంగా.. బెనిఫిట్ షోల రద్దుకు సంబంధించిన ఉత్తర్వుల అమలుకు చర్యలు తీసుకుంటామని ప్రభుత్వ న్యాయవాది తెలిపారు.

టెట్ ప్రాథమిక కీ విడుదల

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ఇటీవల జరిగిన ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్)కు సంబంధించి ప్రాథమిక కీ విడుదలైంది. టెట్ ప్రాథమిక కీతో పాటు రెస్పాన్స్ షీట్లను కూడా డిపార్ట్‌మెంట్ వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని శుక్రవారం అధికారులు తెలిపారు. టెట్ కీపై శనివారం నుంచి సోమవారం వరకు ఆన్‌లైన్ ద్వారా అభ్యంతరాలు తెలుపవచ్చని వెల్లడించారు.

చిత్రజ్యోతి

SINCE 1965

వేసవికి విడుదల



బాలీవుడ్ హీరో సన్నీ డియోల్ హీరోగా గోపీచంద్ మలినేని దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'జాట్'. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, టీజీ విశ్వప్రసాద్ నిర్మాతలు. ఈ చిత్రం ఏప్రిల్ 10న థియేటర్లలో విడుదలవుతోంది. ఈ మేరకు నిర్మాతలు రిలీజ్ డేట్ పోస్టర్ విడుదల చేశారు. ఇందులో సన్నీ డియోల్ ఇంటెన్స్ యాక్షన్-ప్యాక్డ్ అవతార్‌లో కనిపించారు. భుజంపై రాకెట్ లాంచర్‌తో ఆగ్రహంగా ముందుకు అడుగులేస్తున్న సన్నీ డియోల్ లుక్ అదిరిపోయింది. మొత్తానికి పోస్టర్‌లో ఈ చిత్రంలో రణదీప్ హుడా, వినీత్ కుమార్ సింగ్, సయామీ ఖేర్, రెజీనా కాసాండ్రా కీలక పాత్రలు పోషిస్తున్నారు. తమన్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రంలోని యాక్షన్ సన్నివేశాలు, కొరియోగ్రఫీ ప్రేక్షకులను కట్టిపడేస్తాయని నిర్మాతలు తెలిపారు.

బాలయ్య సరసన సంయుక్త



నందమూరి బాలకృష్ణ హీరోగా బోయపాటి శ్రీను దర్శకత్వంలో రూపుదిద్దుకుంటున్న భారీ ప్రతిష్ఠాత్మక చిత్రం 'అఖండ 2.. తాండవం'. ఈ సినిమాలో కథానాయికగా సంయుక్త మీనన్‌ను ఎంపిక చేసినట్లు నిర్మాతలు రామ్ ఆచంట, గోపీచంద్ ఆచంట చెప్పారు. హీరోయిన్లను అద్భుతమైన పాత్రల్లో చూపించే బోయపాటి శ్రీను సంయుక్త కోసం ఓ కీలక పాత్ర సిద్ధం చేశారు. భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా రూపుదిద్దుకొనే ఈ చిత్రం షూటింగ్ ప్రస్తుతం జరుగుతోంది. ఈ సినిమాకు ఎస్. థమన్ సంగీత దర్శకుడు. సి.రామ్‌ప్రసాద్ ఛాయాగ్రాహకుడు. ఈ ఏడాది సెప్టెంబర్ 25న విజయదశమి సందర్భంగా ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు.

దోమకొండ కోటలో ప్రియాంక చోప్రా



కామారెడ్డి జిల్లాలోని దోమకొండ గడికోటలో శుక్రవారం ప్రముఖ నటి ప్రియాంక చోప్రా సందడి చేశారు. తెల్లవారుజామున 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు ఆమె గడి కోటలో ఉన్నారు. ఈ సందర్భంగా అక్కడి శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కోట తరఫున సిబ్బంది తీర్థప్రసాదాలు అందజేశారు. కోట సీనియర్ మేనేజర్ బాబ్జి హీరోయిన్‌కు జ్ఞాపికను అందజేశారు. అద్దాల బంగ్లా, సొరంగ మార్గం, చుట్టూ కందకం, కోట చరిత్రను వివరించారు. ప్రియాంక చోప్రా గతంలో రాంచరణ్‌తో 'జంజీర్' సినిమాలో నటించారు. ఆయన శ్రీమతి ఉపాసన ఈ కోటకు వారసురాలు అనే విషయం తెలిసిందే. ప్రియాంక చోప్రా దోమకొండకు వచ్చిందన్న విషయం తెలుసుకున్న స్థానికులు ఉదయమే కోట వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. ఆమెను చూసేందుకు ఎగబడ్డారు.

దోమకొండ (ఆంధ్రజ్యోతి)

నాన్న మాటే నా జీవన మంత్రం

- షబానా



'సినిమా దర్శకులకు స్వేచ్ఛ ఉండాలి, అదే సమయంలో సామాజిక బాధ్యత కూడా చాలా ముఖ్యం' అని బాలీవుడ్ నటి షబానా ఆజ్మీ వ్యాఖ్యానించారు. అలా అని ప్రతి సినిమా సందేశాత్మకంగా ఉండాలి అన్న వాదన కూడా సరికాదన్నారు. చలనచిత్రానికి వినోద విలువలు కూడా అవసరం అన్నారు. షబానా ఆజ్మీ సినీ స్వర్ణోత్సవం సందర్భంగా హైదరాబాద్ సాహిత్య మహోత్సవం వేదికగా 'ఎ లైఫ్ ఇన్ సినిమా - షబానా ఆజ్మీ' అంశంపై అమితా దేశాయ్ ఆధ్వర్యంలో చర్చాగోష్ఠి జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... హైదరాబాద్‌తో తనకున్న అనుబంధాన్ని గుర్తుచేసుకున్నారు. ఇక్కడే పుట్టి, తొమ్మిదో ఏట వరకు ఉన్న తాను తర్వాత కాలంలోనూ వేసవి సెలవులకు నగరానికి వస్తుండేదాన్నని చెప్పారు. సమాజంలో మార్పు కోసం పనిచేస్తున్న క్రమంలో నిరాశ చెందకుండా, నిబద్ధతతో ముందుకెళ్లడాన్నే తాను విశ్వసిస్తానని షబానా చెప్పారు. మార్పు ఒక్క రోజులో వచ్చేది కాదు, కనుక మనం చేసే పని ఇప్పటికిప్పుడు ఫలితాలను ఇవ్వలేకపోవచ్చు. కానీ రేపటినాడు జరిగే మార్పునకు దోహదపడుతుందని తన తండ్రి కైఫీ ఆజ్మీ చెప్పిన మాటలే తనకు జీవిత సూత్రమని, వాటినే ఆచరిస్తూ ముందుకు సాగుతున్నానని షబానా ఆజ్మీ తెలిపారు.

హైదరాబాద్ సిటీ (ఆంధ్రజ్యోతి)

యశ్ చిత్రంలో నయనతార



యశ్ హీరోగా మలయాళ దర్శకురాలు గీతా మోహన్ దాస్ తెరకెక్కిస్తోన్న చిత్రం 'టాక్సిక్'. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానుంది. ప్రాజెక్టు మొదలైనప్పటి నుంచి ఇప్పటి వరకు నటీనటుల గురించి ప్రకటించలేదు. కానీ బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ ఇందులో నటిస్తున్నాడంటూ మేకర్స్ ఆ మధ్య ఓ పోస్టర్ వదిలారు. మరోవైపు 'టాక్సిక్' హీరోయిన్ ఈమె నంటూ సోషల్ మీడియాలో ఎంతో మంది కథానాయికల పేర్లు చక్కర్లు కొట్టాయి. అయితే ఈ ప్రాజెక్టులో నయనతార భాగమైనట్లు బాలీవుడ్ నటుడు అక్షయ్ ఒబెరాయ్ తాజాగా ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ప్రస్తుతం తాను యశ్ సినిమా షూటింగ్‌లో ఉన్నానని, దీనిలో నయనతార కూడా నటిస్తున్నారని, ఇంతకు మించి నేనేమీ చెప్పలేనని, పూర్తి సమాచారాన్ని డైరెక్టర్ గీతూ మోహన్ దాస్ ప్రకటిస్తారని అక్షయ్ ఒబెరాయ్ చెప్పారు. అయితే నయనతార ఏ పాత్రలో కనిపించనున్నారనే దానిపై ఆయన స్పష్టతనివ్వలేదు. కాగా ఈ చిత్రంలో బాలీవుడ్ కథానాయిక కియారా అద్వాణీ ప్రత్యేక గీతంలో నర్తించనున్నారని సమాచారం.

లాస్ ఏంజెలెస్‌లో షూట్ చేస్తాం



'ఫాస్ట్ ఎక్స్ 2' చిత్రం మిగిలిన షూటింగ్‌ను లాస్ ఏంజెలెస్‌లో జరపనున్నట్లు హాలీవుడ్ హీరో విన్‌డీజిల్ ప్రకటించారు. లాస్ ఏంజెలెస్‌లోని పలు ప్రాంతాలను కార్చిచ్చు దహించివేసిన నేపథ్యంలో ఆ నగరం కోసం తనవంతుగా ఏదైనా చేయాలని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా తెలిపారు. 'ఇప్పుడు లాస్ ఏంజెలెస్‌కు మన అవసరం మరింత ఉంది. 'ఫాస్ట్ అండ్ ఫ్యూరియస్' ఫ్రాంచైజీలో తొలి చిత్రం షూటింగ్ 25 ఏళ్ల క్రితం ఇక్కడే మొదలైంది. మళ్లీ ఇప్పుడు ఆ నగరంలో 'ఫాస్ట్ ఎక్స్ 2' సినిమా షూటింగ్ చేయబోతున్నందుకు ఆనందంగా ఉంది. నటి జోర్డానా సూచనతో ఈ నిర్ణయం తీసుకున్నాను. లాస్ ఏంజెలెస్‌లో పరిస్థితులు కుదుటపడ్డాక చిత్రీకరణ ప్రారంభిస్తాం' అని తెలిపారు. ఈ ఫ్రాంచైజీలో వస్తున్న చివరి చిత్రం ఇదే. వచ్చే ఏడాది ప్రేక్షకుల ముందుకు రానుంది. లూయిస్ లెటెర్రీర్ దర్శకత్వం వహిస్తున్నారు.

ఇక వెంకటలచ్చిమి అని పిలుస్తారేమో!

పాయల్ రాజ్‌పుత్ ప్రధాన పాత్రలో తెరకెక్కనున్న చిత్రం 'వెంకటలచ్చిమి'. ముని దర్శకత్వంలో రాజా, ఎస్ఎస్ చౌదరి నిర్మించనున్న ఈ సినిమా శుక్రవారం పూజా కార్యక్రమాలతో ప్రారంభమైంది. ఈ సందర్భంగా చిత్ర దర్శకుడు ముని మాట్లాడుతూ 'కథ అనుకున్నప్పుడే పాయల్ రాజ్‌పుత్ సరిపోతారనిపించింది. పాన్ ఇండియా సినిమాగా తెలుగుతో పాటు హిందీ, పంజాబీ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈ రివెంజ్ డ్రామా భారతీయ చిత్ర పరిశ్రమలో సంచలనం సృష్టించడం ఖాయం' అని అన్నారు. హీరోయిన్ పాయల్ రాజ్‌పుత్ మాట్లాడుతూ "మంగళవారం' సినిమా తర్వాత ఎన్నో కథలు విన్నాను. నచ్చక తిరస్కరించాను. ఈ సినిమా తర్వాత నా పేరు వెంకటలచ్చిమిగా స్థిరపడిపోతుందేమో అన్నంతగా బలమైన సబ్జెక్టు ఇది' అని అన్నారు.



అడిగిన రుణంలో కేంద్రం కోత

- రూ.2500 కోట్లు తీసుకోవాలనుకుంటే రూ.1,800 కోట్ల అప్పునకే అనుమతి

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 28న తీసుకోవాలనుకున్న రూ.2,500 కోట్ల అప్పునకుగాను... రూ.1,800 కోట్ల రుణానికి మాత్రమే కేంద్ర ప్రభుత్వం అనుమతిచ్చింది. రూ.700 కోట్ల అప్పునకు కోత పెట్టింది. దీంతో రూ.1,800 కోట్ల అప్పు కోసం రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు రాష్ట్ర ప్రభుత్వం శుక్రవారం ఇండెంటు పెట్టింది. ఈ నెలలో మొత్తం రూ.10 వేల కోట్ల అప్పు తీసుకుంటామంటూ ఆర్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించిన సంగతి తెలిసిందే. ఇందులో ఈ నెల 7న రూ.3000 కోట్ల అప్పు తీసుకున్నది. 14న తీసుకోవాల్సిన రూ.2000 కోట్లు, 21న తీసుకోవాల్సిన రూ.2,500 కోట్ల అప్పునకు కేంద్రం అనుమతించలేదు. దాంతో ప్రతిపాదిత రూ.10వేల కోట్ల అప్పులో రూ.4,500 కోట్లకు కోత పడింది. తాజాగా 28న తీసుకోవాల్సిన రూ.2,500 కోట్ల అప్పులో మరో రూ.700 కోట్లకు కేంద్రం కోత పెట్టింది. దీంతో ఈ నెలలో రాష్ట్ర ప్రభుత్వానికి అందే అప్పు మొత్తం రూ.4,800 కోట్లు మాత్రమే. మిగతా రూ.5,200 కోట్ల అప్పునకు కోత పడినట్లే. అయితే... ఈ నెల 28న తీసుకోవాల్సిన రూ.1,800 కోట్ల అప్పులో 24 ఏళ్ల కాల పరిమితితో రూ.1000 కోట్లు, 25ఏళ్ల కాల పరిమితితో రూ.800 కోట్ల చొప్పున రుణాన్ని తీసుకుంటామని రాష్ట్ర ప్రభుత్వం ఆర్‌బీఐకి తెలియజేసింది.

మంత్రి ఉత్తమ్ కాన్వాయ్‌కు స్వల్ప ప్రమాదం

- ఒకదానికొకటి ఢీ.. 8 కార్లు ధ్వంసం.. మంత్రి క్షేమం

గరిడేపల్లి, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రయాణిస్తున్న వాహన శ్రేణి వెనుక ఉన్న కార్లు ఒకదానికొకటి ఢీకొని స్వల్పంగా దెబ్బతిన్నాయి. సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలంలోని జాన్‌పహాడ్ దర్గా ఉర్సులో పాల్గొనేందుకు శుక్రవారం హుజూర్‌నగర్ నుంచి వెళుతుండగా గరిడేపల్లి మండల కేంద్రంలో ఈ ఘటన జరిగింది. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ప్రయాణిస్తున్న వాహనం వెనుక పోలీస్, ఎస్కార్ట్, ఇతర నాయకుల వాహనాలు మొత్తం 11 వస్తున్నాయి. ఈ క్రమంలో గరిడేపల్లి పోలీసుస్టేషన్ వద్దకు రాగానే స్థానిక కాంగ్రెస్ నాయకులు కాన్వాయ్‌లో మంత్రి ప్రయాణిస్తున్న కారును నిలపాలని కోరగా ఒక్కసారిగా ఆపారు. మంత్రి కారు అకస్మాత్తుగా నిలపడంతో వెనుక వస్తున్న వాహనాలను కూడా డ్రైవర్లు నిలిపారు. ఈ క్రమంలో ఎస్కార్ట్ కారుకు వెనుకనున్న కార్లు ఒకదానికొకటి ఢీకొని మొత్తం 8 వాహనాలు పాక్షికంగా దెబ్బతిన్నాయి. అయితే మంత్రి ఉత్తమ్ ప్రయాణిస్తున్న కారు ముందు ఉండడంతో ఎలాంటి ప్రమాదం జరగలేదు.

నాగేశ్వర్‌రావు ఆత్మహత్యాయత్నం వెనుక కుట్ర

- ఆయన భార్యకు నేనే ఉద్యోగం ఇప్పించా: మంత్రి సీతక్క

హైదరాబాద్/ములుగు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం బుట్టాయిగూడెంలో గురువారం జరిగిన గ్రామసభలో కుమ్మరి నాగేశ్వర్‌రావు అనే వ్యక్తి పురుగులమందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడటం వెనుక బీఆర్‌ఎస్ నాయకుల కుట్ర ఉందని మంత్రి సీతక్క ఆరోపించారు. అతనికి మద్యం తాగించి ఆత్మహత్యకు ప్రేరేపించారన్నారు. ములుగు జిల్లాలో కొత్తగా ఏర్పడిన మల్లంపల్లి మండలాన్ని సహచర మంత్రి కొండా సురేఖ, మహబూబాబాద్ ఎంపీ బలరాంనాయక్‌తో కలిసి శుక్రవారం ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. నాగేశ్వర్‌రావు భార్యకు తానే అంగన్‌వాడీ టీచర్ ఉద్యోగం ఇప్పించానని, ఆ కుటుంబానికి నాలుగెకరాల వ్యవసాయ భూమి ఉందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకే తొలి ప్రాధాన్యంగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామని చెప్పారు.

ప్రైవేటు పాఠశాలల్లో ట్యూషన్ ఫీజే ఉండాలి!

(మొదటిపేజీ తరువాయి)

సభ్యులు విశ్వేశ్వరరావు, చారకొండ వెంకటేశ్, జ్యోత్స్నలు ఈ నివేదికను విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణాకు సమర్పించారు. ప్రస్తుతం ప్రైవేటు స్కూళ్ల ఫీజుల విషయంలో సర్కారుకు ఎటువంటి నియంత్రణ లేని నేపథ్యంలో విద్యా కమిషన్ నివేదికకు ప్రాధాన్యత నెలకొంది. ఫీజుల ఖరారు, వాటి నియంత్రణ కోసం ఈ నివేదికలో స్పష్టత ఇచ్చినట్టు సమాచారం. స్కూళ్లలో పలురకాల ఫీజులను వసూలు చేయకుండా.. ట్యూషన్ ఫీజును మాత్రమే వసూలు చేయాలని విద్యా కమిషన్ పేర్కొంది. ఆయా స్కూళ్ల పరిస్థితులను బట్టి ఫీజులను వివిధ క్యాటగిరీలు (కనిష్ఠం నుంచి గరిష్ఠం)గా విభజించాలని సూచించింది. ఇందుకు అక్కడి సదుపాయాలను పరిగణనలోకి తీసుకోవాలంది. అలాగే పాఠ్య పుస్తకాలు, యూనిఫాం వంటి వాటితో ఆయా స్కూళ్లు వ్యాపారం చేయకూడని విధంగా వ్యవస్థ ఉండాలని స్పష్టం చేసింది. ఫీజుల ఖరారు, నియంత్రణ కోసం రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక నియంత్రణ కమిటీని ఏర్పాటు చేయాలని విద్యా కమిషన్ సూచించింది. ఈ కమిటీకి ఛైర్మన్‌గా రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ ఐఏఎస్ అధికారిని.. సభ్యులుగా సంబంధిత రంగానికి చెందిన నలుగురు నిపుణులను నియమించాలని తెలిపింది. జిల్లా స్థాయిల్లోనూ ప్రతి జిల్లాకో కమిటీని ఏర్పాటు చేయాలని.. ఫీజులను ఖరారు చేసిన తర్వాత వాటి అమలులో నమోదయ్యే ఫిర్యాదులపై ఈ జిల్లా కమిటీలు చర్యల్ని తీసుకోవాల్సి ఉంటుందని స్పష్టం చేసింది. మూడేళ్లకోసారి ఫీజును ఖరారు చేయాల్సి ఉంటుందని వివరించింది. కాగా, విద్యా కమిషన్ చేసిన సిఫార్సులపై ప్రభుత్వం తుదినిర్ణయం తీసుకోనుంది. ఈ సిఫార్సులను అమలు చేయాలని భావిస్తే.. ముసాయిదా బిల్లుకు అసెంబ్లీ ఆమోదంతో చట్టబద్ధత కల్పించాలి. ఆ తర్వాతే ఫీజుల ఖరారు, నియంత్రణ కమిటీ ఏర్పాటుకు అవకాశముంటుందని అధికారులు చెప్పారు.

మూసీ ప్రక్షాళనకు సహకరించండి

కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌కు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విజ్ఞప్తి

హైదరాబాద్, కరీంనగర్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని మూసీనది ప్రక్షాళన చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని, కేంద్రం నుంచి నిధులు ఇప్పించి సహకరించాలని కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్‌ను మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి కోరారు. శుక్రవారం కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవం అనంతరం నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. సొంతింటి కలను సాకారం చేసుకునేందుకు వరంగల్, కరీంనగర్, ఖమ్మం నగరాల్లో 65 లక్షల మంది, రాష్ట్రవ్యాప్తంగా 81.60 లక్షల మంది దరఖాస్తు చేసుకున్నారన్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం కేంద్రం నుంచి ఇళ్లను మంజూరు చేయించుకోలేకపోయిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వాటా కింద తెలంగాణకు 8 శాతం ఇళ్లు ఇవ్వాల్సి ఉండగా కేవలం 0.7% మాత్రమే వచ్చాయన్నారు. రాష్ట్రానికి రావాల్సిన 8% ఇళ్లను మంజూరు చేయాలని కోరారు. హైదరాబాద్‌లో యూపీఏ ప్రభుత్వం 68 కిలోమీటర్ల మెట్రో రైలు మార్గాన్ని ఏర్పాటు చేసిందని, పీపీపీ పద్ధతిలో మరో 75 కిలో మీటర్ల మెట్రోలైన్ విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించినందున కేంద్రం నుంచి నిధులు మంజూరు చేయాలన్నారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన వాటా మేరకు సంక్షేమ పథకాలు, నిధులు తెచ్చేందుకు కేంద్రమంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్ కృషి చేయాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. తెలంగాణ అభివృద్ధికి కేంద్రం సహకరించాలని కోరారు. అంతకు ముందు రాష్ట్ర పర్యటనకు వచ్చిన సందర్భంగా శుక్రవారం శంషాబాద్ విమానాశ్రయంలో కేంద్ర మంత్రి మనోహర్‌లాల్‌ఖట్టర్‌ను మంత్రికి పొంగులేటి స్వాగతం పలికారు. అక్కడి నుంచి ఇద్దరు కలిసి కరీంనగర్ జిల్లా పర్యటనకు వెళ్లారు. కరీంనగర్ నుంచి హైదరాబాద్ వచ్చిన తర్వాత నిర్వహించిన సమావేశంలో మంత్రి పొంగులేటి.. గృహ నిర్మాణ శాఖ, గృహ నిర్మాణ సంస్థల అంశాలను ప్రస్తావించారు. "తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలకనుగుణంగా గత పదేళ్లలో పేదల ఇండ్ల నిర్మాణం జరగలేదు. ఇండ్ల నిర్మాణానికి ప్రజల నుంచి భారీ ఎత్తున డిమాండ్ ఉంది. దీనిని దృష్టిలో పెట్టుకొని రాష్ట్రానికి ప్రధానమంత్రి ఆవాస్ యోజన అర్బన్ పథకం (2.0) కింద కనీసం 20 లక్షల ఇండ్లు మంజూరు చేయండి"అని మంత్రి పొంగులేటి కేంద్ర మంత్రి ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గత ప్రభుత్వం గృహనిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ఇండ్ల నిర్మాణానికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. వచ్చే నాలుగేళ్లలో 20 లక్షల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. 26 జిల్లాల్లోని 6,867 గ్రామాలను ఇటీవల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ కిందికి తెచ్చామని, వాటిని కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో చేర్చాలని కోరారు.

20 లక్షల ఇళ్లు ఇవ్వండి

(మొదటిపేజీ తరువాయి)

ఉన్నారని తెలిపారు. పీఎంఏవై 2.0లో చేరిన తొలి రాష్ట్రమైన తెలంగాణ.. ఇళ్ల నిర్మాణానికి సమగ్రమైన వివరాలు, పూర్తి ప్రణాళికతో సన్నద్ధంగా ఉందని చెప్పారు. దేశంలోని మహానగరాలైన ఢిల్లీ, చెన్నై, బెంగళూరుతో పోలిస్తే హైదరాబాద్‌లో మెట్రో కనెక్టివిటీ తక్కువగా ఉందని, ఈ నేపథ్యంలో మెట్రో ఫేజ్-1 కింద ఆరు కారిడార్లను గుర్తించామని కేంద్ర మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వీటిలో మొదటి ఐదు కారిడార్లకు సంబంధించిన సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్)లు పూర్తయ్యాయని తెలిపారు. ఈ కారిడార్ల నిర్మాణానికి రూ.24,269 కోట్ల వ్యయం అవుతుందని, ఈ డీపీఆర్‌లను ఆమోదించడంతోపాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్త భాగస్వామ్యం (జాయింట్ వెంచర్) కింద వీటిని చేపట్టి నిధులు కేటాయించాలని సీఎం కోరారు.

పట్టణాల అభివృద్ధికి సహకరించండి..

గ్రేటర్ హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పురపాలికల అభివృద్ధికి కేంద్రం సహకారం అందించాలని కేంద్రమంత్రి ఖట్టర్‌ను సీఎం రేవంత్ కోరారు. హైదరాబాద్‌లో చేపట్టనున్న అభివృద్ధి కార్యక్రమాలకు రూ.55,652 కోట్ల ఆర్థికసాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణలో 65% భూభాగం పట్టణ పరిధిలోనే ఉందని తెలిపారు. రాష్ట్రాన్ని రూ.లక్ష కోట్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా చేపట్టిన ప్రాజెక్టుల గురించి కేంద్ర మంత్రికి వివరించారు. మూసీ రివర్‌ఫ్రంట్ డెవలప్‌మెంట్‌కు చేయూతనివ్వాలని విజ్ఞప్తి చేశారు. మూసీలోకి మురుగు చేరకుండా నదికి ఇరువైపులా 55 కిలోమీటర్ల (మొత్తంగా 110 కి.మీ.) కాలువలు, బాక్స్ డ్రెయిన్లు, ఎస్టీపీల నిర్మాణం చేపడుతున్నామని, వీటికి రూ.10 వేల కోట్ల నిధులు ఇవ్వాలన్నారు. హైదరాబాద్ నగరంతోపాటు సమీపంలోని 27 పురపాలక సంస్థల పరిధిలో మురుగునీటి నెట్‌వర్క్ నిర్మాణానికి రూ.17,212 కోట్లతో సమగ్ర మురుగునీటి మేజర్ ప్లాన్ (సీఎస్ఎంపీ) తయారు చేశామని సీఎం తెలిపారు. అమృత్ 2.0 లేదా ప్రత్యేక ప్రాజెక్టుగా సీఎస్ఎంపీని గుర్తించి నిధులు సమకూర్చాలన్నారు. వరంగల్ నగరంలో రూ.41.70 కోట్లతో సమగ్ర భూగర్భ నీటి పారుదల (యూజీడీ) పథకాన్ని చేపట్టేందుకు నిధులివ్వాలని కోరారు.



శంషాబాద్ విమానాశ్రయంలో సీఎం రేవంత్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న నేతలు, ప్రజాప్రతినిధులు

లక్ష సౌర పంపులు కేటాయించండి..

తెలంగాణలోని గిరిజన రైతులకు నిరంతరం సాగునీరు అందించేందుకు వీలుగా పీఎం కుసుమ్ పథకం కింద లక్ష సౌరపంపులను కేటాయించాలని సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క.. కేంద్రమంత్రి ఖట్టర్‌కు విజ్ఞప్తి చేశారు. రాష్ట్రానికి కుసుమ్-సీ ఎఫ్ఎల్ఎస్ కాంపొనెంట్ కింద 2,500 మెగావాట్లను కేటాయించాలన్నారు. విద్యుత్తు సరఫరా, నెట్‌వర్క్ బలోపేతానికి రూ.488 కోట్ల అంచనా వ్యయంతో 9 ప్రాజెక్టుల నివేదికలను కేంద్రానికి సమర్పించామని, వాటిని వెంటనే మంజూరు చేయాలని కోరారు. రివాంప్డ్ డిస్ట్రిబ్యూషన్ సెక్టార్ స్కీం(ఆర్డీఎస్ఎస్)లో తెలంగాణ డిస్కమ్‌లను చేర్చాలన్నారు. రాష్ట్ర విద్యుత్తు సంస్థలకు.. విద్యుత్తు ఫైనాన్స్ కార్పొరేషన్ (పీఎఫ్‌సీ), గ్రామీణ విద్యుదీకరణ కార్పొరేషన్ (ఆర్ఈసీ)లు ఇచ్చిన రుణాలకు సంబంధించిన వడ్డీ రేట్లను తగ్గించాలని విజ్ఞప్తి చేశారు. కొత్త పునరుత్పత్తి విద్యుత్తు ప్లాంట్ల నిర్మాణానికి రెండేళ్లకు పైగా సమయం పడుతుందని, అందువల్ల ఆర్‌పీపీవో లక్ష్యాలను చేరుకోలేకపోయినందుకు విధించే జరిమానాలను మాఫీ చేయాలన్నారు. కాగా, స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో జరిగిన ప్రపంచ ఆర్థిక సదస్సులో తెలంగాణకు రూ.1.78 లక్షల కోట్ల పెట్టుబడులను సాధించినందుకు సీఎం రేవంత్‌రెడ్డిని.. కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అభినందించారు. కాగా, సమీక్ష సందర్భంగా తెలంగాణలో పురపాలక శాఖ, హైదరాబాద్ అభివృద్ధిపై రూపొందించిన షార్ట్ ఫిల్మ్‌ను ఖట్టర్ తిలకించారు.

మంత్రులతో సీఎం భేటీ నేడు

సీఎం రేవంత్ రెడ్డి శనివారం అందుబాటులో ఉండే మంత్రులు, ఉన్నతాధికారులతో సమావేశం కానున్నారు. 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేయనున్న పథకాలపై సమీక్ష చేయనున్నారు. రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ నేస్తం, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల పంపిణీ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంపై చర్చించే అవకాశం ఉంది. అదేవిధంగా గ్రామ సభల్లో వచ్చిన దరఖాస్తుల మీదా చర్చించనున్నారు. ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణకు మరో విడత గ్రామ సభలను నిర్వహించే అంశంపైనా సీఎం సమీక్షించే అవకాశం ఉంది.

కేంద్రం నిధుల వినియోగంలో రాష్ట్ర సర్కారు విఫలం

- కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్



"తెలంగాణ విషయంలో కేంద్రం వివక్ష చూపుతోందంటూ జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తున్నాం. ప్రధాని మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత పదేళ్లలో రూ.10 లక్షల కోట్లకుపైగా నిధులను తెలంగాణలో ఖర్చు చేసింది. పన్నుల రూపేణా రూ.2.3 లక్షల కోట్లు, వివిధ పథకాల కింద రూ.6.2 లక్షల కోట్లు, గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ కింద రూ.లక్ష కోట్లు కేటాయించాం. ఈ ఆర్థిక సంవత్సరంలోనే గ్రాంట్స్ ఇన్ ఎయిడ్ రూపంలో రూ.21,636 కోట్లను కేటాయించేలా బడ్జెట్ అంచనాలు రూపొందించాం. కేంద్రం కేటాయించిన నిధులను సకాలంలో ఖర్చు చేయడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమవుతోంది" అని కేంద్ర మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ అన్నారు. కరీంనగర్‌లో స్మార్ట్‌సిటీ ప్రాజెక్టులో భాగంగా పలు అభివృద్ధి పనులను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఖర్చుచేసిన నిధులకు సంబంధించిన యూసీలను సమర్పించడంలో జాప్యం చేయడంవల్ల కేంద్ర నిధులు ఆగిపోతున్నాయన్నారు.

కలెక్టర్‌పై పొంగులేటి ఆగ్రహం

స్మార్ట్ సిటీ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవం సందర్భంగా తోపులాట చోటు చేసుకుంది. ఒక సందర్భంలో కేంద్ర మంత్రి బండి సంజయ్ గన్‌మన్ మోచేయి మంత్రి పొంగులేటికి తాకింది. దీంతో ఆగ్రహించిన మంత్రి శ్రీనివాస్‌రెడ్డి పక్కనే ఉన్న కలెక్టర్ పమేలా సత్పతిపై అసహనం వ్యక్తం చేశారు. కలెక్టర్ ఏదో మాట్లాడుతుండగానే మంత్రి వాహనంలో ఎక్కి వెళ్లారు. అనంతరం మంత్రులు ఆర్‌అండ్‌బీ అతిథి గృహానికి చేరుకోగా.. కేంద్ర మంత్రి బండి సంజయ్.. తన గన్‌మన్‌ను మంత్రి పొంగులేటి వద్దకు తీసుకువెళ్లి క్షమాపణ చెప్పించారు.

దేవుడంటేనే ధర్మం.. ధర్మం అంటేనే ఒకరికి సాయపడటం

ఇది దేవుడికి ఇష్టం

- దేవుడు ఉన్నాడంటేనే మనం బతుకుతున్నాం
- లేడనుకుంటే ఒక్క సెకను కూడా బతకలేం
- ధర్మం అంటే మతం కాదు.. మానవత్వం, పరోపకారం
- దేవుడు అనేది అదొక ధైర్యం.. విశ్వాసం.. నమ్మకం
- ఒకరికి సాయం చేయాలని దేవుడు కోరుకుంటాడు
- నేను దేవున్ని నమ్ముతానా.. లేదా?..
- భక్తి ఉందా.. లేదా? అనే చర్చకు పోను
- శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ సమక్షంలో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు

సంగారెడ్డి రూరల్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): నిత్యం పొలిటికల్ పంచ్‌లతో తనదైన శైలిలో విరుచుకుపడే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ తూర్పు జగ్గారెడ్డి ఈ సారి దేవుడిపై ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. రంగంపేట ఆశ్రమ పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ మాధవానంద సరస్వతి స్వామిజీ సమక్షంలో భజన గీతాలు ఆలపించిన అనంతరం దేవుడు ధర్మం అనే అంశాలపై తన మనసులో మాటను బయటపెట్టారు. 'దేవుడంటేనే ధర్మం అని.. ధర్మం అంటే మతం కాదని.. తన దృష్టిలో ధర్మం అంటే దానం, మానవత్వం' అని జగ్గారెడ్డి అన్నారు. తాను దేవుడిని నమ్ముతానా.. లేదా? తనకు భక్తి ఉందా లేదా? అనే చర్చకు పోను అని అంటూనే దేవుడిపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేసి ఆకట్టుకున్నారు. ఈ సృష్టిలో భగవంతుడు ఉన్నాడంటేనే మనం బతుకుతున్నాం.. లేడనుకుంటే ఒక్క సెకను కూడా బతకలేం అని అన్నారు. దేవుడు అంటే ధైర్యం, విశ్వాసం, నమ్మకమని వ్యాఖ్యానించారు. కాగా ధర్మమంటే తన దృష్టిలో దానమని చెప్పిన జగ్గారెడ్డి.. ఇంకేమైనా అర్థాలు ఉంటాయో తెలపాలని మాధవానంద సరస్వతి స్వామిజీని కోరారు. దీనికి స్వామిజీ స్పందిస్తూ.. జగ్గారెడ్డి తనకు పరీక్ష పెట్టారని.. దానం, పరోపకారం, దయ, మైత్రి, ప్రేమ అన్నీ ధర్మంలో భాగాలేనని చెప్పారు. దేవుడిని నమ్ముతానా లేదా అని వ్యాఖ్యానించిన జగ్గారెడ్డిలో సంపూర్ణమైన దైవభక్తితో పాటు దానగుణం ఉందని చెప్పారు.



మాధవానంద స్వామిజీ ఆధ్యాత్మిక కార్యక్రమంలో గీతాలు ఆలపిస్తున్న జగ్గారెడ్డి

ఎస్సీ వర్గీకరణ నివేదిక ఓ కొలిక్కి

(మొదటిపేజీ తరువాయి)

గత ఏడాది చివర్లో సర్వోన్నత న్యాయస్థానం తీర్పు ఇచ్చింది. ఆ తీర్పు నేపథ్యంలోనే రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణలో ఎస్సీల వర్గీకరణ కోసం 2024 నవంబరు 11న రిటైర్డ్ జస్టిస్ డాక్టర్ షమీమ్ అక్తర్ నేతృత్వంలో ఏకసభ్య కమిషన్‌ను ఏర్పాటుచేసింది. నివేదిక సమర్పణకు 2025 జనవరి 10 దాకా గడువు ఇవ్వగా.. ఆశించిన సమయానికి నివేదిక రూపకల్పన పూర్తికాలేదు. దీంతో తాజాగా కమిషన్ గడువును ఫిబ్రవరి 10వరకు పెంచుతూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఉమ్మడి జిల్లాలవారీగా పర్యటనలు, బహిరంగ విచారణలను నిర్వహించిన కమిషన్‌కు.. జిల్లాల్లో దాదాపు 7-8 వేల దాకా దరఖాస్తులు వచ్చాయి. వర్గీకరణ కావాలంటూ 60-70 శాతం మంది విజ్ఞప్తి చేయగా.. మరో 30 శాతం మంది తమను మాదిగ, మాలలకు సంబంధం లేకుండా ప్రత్యేకంగా ఉంచాలని కోరారు. కొంతమంది మాత్రం వర్గీకరణ.. రాజ్యాంగంలోని 341 అధికరణకు విరుద్ధమని తెలిపినట్టు సమాచారం. మాదిగ, మాల అనే భేదం చూడకుండా తమకు న్యాయం జరిగేలా చూడాలంటూ చాలామంది విజ్ఞప్తి చేయగా.. మాలలకు అన్యాయం జరిగిందని కొన్ని ప్రాంతాల్లో, మాదిగలకు అన్యాయం జరిగిందంటూ మరికొన్ని ప్రాంతాల్లో కమిషన్‌కు వినతులు వచ్చినట్టు తెలిసింది. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లను కేటాయించి, తమకు న్యాయం జరిగేలా చూడాలంటూ హైదరాబాద్‌లోని కమిషన్ కార్యాలయంలో కలిసి కొంతమంది విజ్ఞప్తి చేశారు. మొత్తమ్మీద.. ఏర్పాటైన కొద్దికాలంలోనే కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణను పూర్తిచేసింది. ఇప్పుడు రాష్ట్రంలో మొత్తం ఎస్సీ కులాలు ఎన్ని, ఏ కులం వారు ఎంతమంది ఉన్నారు, ఆయా కులాల్లోని ఉప కులాలు సహా వాటిలో ఎంత జనాభా ఉందనే అంశాలను తేల్చేపనిలో కమిషన్ నిమగ్నమైంది. ఇందుకోసం 1981 నుంచి ఉన్న ఎస్సీ జనాభా వివరాలను కమిషన్ సేకరించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్రంలో 52.5 లక్షల మంది ఎస్సీలు ఉండగా.. వీరిలో మాదిగలు 33.5 లక్షలు, మాలలు 19 లక్షల మంది ఉన్నారు. దీని ప్రకారమే ఇప్పుడు వర్గీకరణ ప్రక్రియ కొనసాగుతోంది.

ఇవి కూడా..

ఎస్సీల్లో అక్షరాస్యత శాతం ఎంత? విద్యా సంస్థల్లో ప్రవేశాలు పొందిన విద్యార్థులు ఎంతమంది?, ఎస్సీ ఉపకార వేతనాలను ఎంతమంది అందుకున్నారు?, ఎస్సీ కార్పోరేషన్ ద్వారా స్వయం ఉపాధి కోసం ప్రభుత్వం అందించే ఆర్థిక సాయాన్ని ఎంతమంది పొందారనే వివరాలను కూడా కూడా కమిషన్ సేకరించింది.

ఎస్సీల్లో ఎంతమంది ప్రభుత్వ ఉద్యోగాల్లో ఉన్నారనే వివరాలను కూడా సేకరించింది. దాని ప్రకారం ప్రభుత్వ, ప్రభుత్వ రంగ సంస్థలన్నింటిలో కలిపి దాదాపు 94 వేల మందికిపైగానే ఉన్నట్టు ఆయా శాఖలు ఇచ్చిన వివరాల ఆధారంగా వెల్లడైంది.

గతంలోగానీ ఇప్పుడుగానీ.. గ్రామ, మునిసిపాలిటీల్లో వార్డు సభ్యుని నుంచి ఎమ్మెల్యే, మంత్రి, ఎంపీ దాకా రాజకీయ ప్రాతినిధ్యానికి సంబంధించిన వివరాలను కూడా కమిషన్ సేకరించింది.

అప్పుడు.. మళ్లీ ఇప్పుడు!

ఎస్సీలు, వర్గీకరణ, వారికి అమలుచేసే రిజర్వేషన్ల అంశంపై ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాం నుంచే పలు వాదనలు నడుస్తున్నాయి. ప్రస్తుతం ఎస్సీలకు 15 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. అయితే జనాభా ప్రకారం అధికంగా ఉన్న మాదిగలకు తక్కువ రిజర్వేషన్ వర్తిస్తుందనే వాదన ప్రధానంగా ఉంది. దీనికి 1965నాటి లోకూర్ కమిషన్ నివేదికలే నిదర్శనమని మాదిగలు అంటున్నారు. ఈ నేపథ్యంలో ఎస్సీలను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజించాలనే డిమాండ్ 1994లోనే తెరపైకి వచ్చింది. అనంతరం కొంతకాలానికి.. అంటే 1997లో అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం జస్టిస్ రామచంద్రరాజు కమిషన్‌ను ఏర్పాటుచేసింది. ఆ కమిషన్ సూచనల మేరకు 15% రిజర్వేషన్‌ను ఏ, బీ, సీ, డీ గ్రూపులుగా విభజిస్తూ అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. దాని ప్రకారం గ్రూపు-ఏలో రెల్లి సహా దాని అనుబంధంగా ఉన్న 12 కులాలకు కలిపి ఒక శాతం రిజర్వేషన్ కేటాయించి, వాటిని అట్టడుగు కులాలుగా గుర్తించారు. ఇక బీ గ్రూపులో మాదిగ దాని అనుబంధంగా ఉన్న మొత్తం 18 కులాలను చేర్చి వీరికి 7% కోటా ఇచ్చారు. సీ గ్రూపులో మాల సహా 25 కులాలను చేర్చి, వీరికి 6 శాతం రిజర్వేషన్ కేటాయించారు. గ్రూపు-డీలో ఆది, ఆంధ్రులతోపాటు మరో నాలుగు కులాలను చేర్చి వారికి కూడా ఒక శాతం రిజర్వేషన్‌ను కేటాయించారు. కానీ, ఈ రిజర్వేషన్‌ల కేటాయింపుపై పలువురు కోర్టుకెళ్లడంతో హైకోర్టు ఆ ఉత్తర్వులను రద్దు చేసింది. ఆ తరువాత ఉమ్మడి ఏపీ సర్కారు మరోసారి 2000 సంవత్సరంలో ఎస్సీ వర్గీకరణ కోసం రేషనలైజేషన్ ఆఫ్ రిజర్వేషన్ అనే చట్టాన్ని ఆమోదించింది. కానీ ఆ చట్టాన్ని కూడా 2004లో సుప్రీంకోర్టు కొట్టివేసింది. ఇలా ఉమ్మడి ఏపీలో ఒకసారి ఎస్సీల వర్గీకరణ అంశంపై సుదీర్ఘ వ్యవహారం నడవగా.. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇప్పుడు తెలంగాణలో మరోసారి ఎస్సీ వర్గీకరణ అంశం తెరపైకి వచ్చింది. అయితే ప్రస్తుత ప్రభుత్వం చేపట్టిన వర్గీకరణపైనా మాదిగ, మాలల మధ్య వాదప్రతివాదాలు మొదలయ్యాయి. వర్గీకరణ వద్దని మాలలు, కావాలని మాదిగలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు. నివేదిక అందిన తరువాత ప్రభుత్వం దీనిపై ఒక నిర్ణయం తీసుకోనుంది.

తెలంగాణకు ఆర్థిక అనారోగ్యం

- నీతి ఆయోగ్ ఆర్థిక ఆరోగ్య సూచికలో 8వ స్థానం
- వైసీపీ హయాంలో ఘోరంగా దెబ్బతిన్న ఏపీ.. సూచికలో 17వ స్థానం

న్యూఢిల్లీ, జనవరి 24(ఆంధ్రజ్యోతి): నీతి ఆయోగ్ శుక్రవారం విడుదల చేసిన ఆర్థిక ఆరోగ్య సూచిక ప్రకారం ఆర్థికంగా బలంగా ఉన్న రాష్ట్రాలలో తెలంగాణ 8వ స్థానం, ఆంధ్రప్రదేశ్ 17వ స్థానం దక్కించుకున్నాయి. మొదటి స్థానాన్ని సాధించిన ఒడిసా ఆర్థిక ఆరోగ్య సూచిక స్కోరు 67.8 కాగా, తెలంగాణ 43.6, ఏపీ 20.9 స్కోరును పొందాయి. జీడీపీలో వాటా, జనాభా, మొత్తం ప్రభుత్వ వ్యయం, ఆదాయాలు, ఆర్థిక సుస్థిరత ఆధారంగా నీతిఆయోగ్ ఈ సూచికను రూపొందించింది. తెలంగాణ రెవెన్యూ బలంగా పెరుగుతుండడం ప్రోత్సాహకరంగా ఉన్నప్పటికీ మూల ధన వ్యయాన్ని పెంచడంపై అత్యధికంగా దృష్టి సారించాల్సి ఉందని నీతి ఆయోగ్ హితవు చెప్పింది. ముఖ్యంగా ఆరోగ్య, విద్యా రంగాలపై మూలధన వ్యయాన్ని పెంచాలని తెలిపింది. జీఎస్‌డీపీ శాతంతో పోలిస్తే మూలధన వ్యయం 2018-19లో 17.6% కాగా, 2022-23 నాటికి 9.3 శాతానికి తగ్గిపోయిందని తెలిపింది. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే ఆరోగ్య, విద్యా రంగాలలో తెలంగాణ అతి తక్కువ శాతం కేటాయించిందని తెలిపింది. తెలంగాణ ఆర్థిక లోటు లక్ష్యం జీఎస్‌డీపీలో 5శాతానికి నిర్ణయించగా, 2022-23లో అది కేవలం 2.48% రికార్డు చేసిందని తెలిపింది. అయితే ప్రభుత్వ రుణాలు మాత్రం గత అయిదేళ్లలో 11.9 నుంచి 19.1% మధ్య ఉందని తెలిపింది. తెలంగాణ ఖర్చును సమర్థవంతంగా నిర్వహించలేకపోయినప్పటికీ, రెవెన్యూ సమీకరణలో గోవా తర్వాత రెండో స్థానంలో ఉన్నట్లు ఈ నివేదిక పేర్కొంది.

ఏడాదిలోనే రూ. 2,19,182 కోట్లు

దావోస్ సదస్సు నుంచి తెలంగాణ రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులివి

- బీఆర్‌ఎస్ పదేళ్ల పాలనలో తెచ్చింది రూ.25,750కోట్లే
- చర్చకు సిద్ధమా?: మహేశ్‌గౌడ్



హైదరాబాద్/మోత్కూరు, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కేసీఆర్ పదేళ్ల పాలనలో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు కేవలం రూ.25,750 కోట్లు మాత్రమేనని టీపీసీసీ చీఫ్ మహే‌ష్‌కుమార్‌గౌడ్ అన్నారు. తమ ఏడాది పాలనలో ఏకంగా రూ.2,19,182 కోట్ల మేరకు పెట్టుబడులు వచ్చాయని చెప్పారు. దీనిపైన చర్చకు సిద్ధమా అంటూ బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌కు ఆయన సవాల్ విసిరారు. కాంగ్రెస్ నుంచి తాను, ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు వస్తామని, బీఆర్‌ఎస్ నుంచి కేసీఆర్‌ను తీసుకొచ్చుకుంటారో.. లేకుంటే ఇంకెవరైనా ఎక్స్‌పర్ట్‌ను తీసుకొచ్చుకుంటారో కేటీఆర్ ఇష్టమని అన్నారు. గాంధీభవన్‌లో శుక్రవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ పాలనలో 2019 వరకూ వచ్చిన పెట్టుబడులు సున్నా అని చెప్పారు. 2020లో రూ.500 కోట్లు, 2022లో రూ.4,250 కోట్లు, 2023లో రూ.21 వేల కోట్లు.. వెరసి పదేళ్లలో కేవలం రూ.25,750 కోట్ల మేరకు పెట్టుబడులు వచ్చాయన్నారు. అదే కాంగ్రెస్ ఏడాది పాలనలో.. 2024 జనవరిలో జరిగిన దావోస్ సదస్సులో రూ.40,232 కోట్లు, తాజా సదస్సులో రూ.1,78,950 కోట్ల మేరకు వివిధ కంపెనీలతో పెట్టుబడి ఒప్పందాలు జరిగాయని వివరించారు. రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చిన వారితో దావోస్‌లోని తెలంగాణ పెవిలియన్ వద్ద రద్దీ ఏర్పడిందని చెప్పారు. దావోస్‌లో కుదిరిన ఒప్పందాలతో రాష్ట్రంలో దాదాపు 75 వేల మందికి ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. రానున్న రోజుల్లో హైదరాబాద్ సహా రాష్ట్రంలో రియల్ బూమ్ కూడా వచ్చే అవకాశం ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులకు కాంగ్రెస్ పార్టీ అభినందనలు తెలుపుతోందని ఈ సందర్భంగా మహేశ్‌కుమార్ గౌడ్ అన్నారు. గ్రామ సభల్లో అర్హులైన లబ్ధిదారులను పార్టీలకు అతీతంగా ఎంపిక చేస్తున్నారని ఆయన చెప్పారు. బీఆర్‌ఎస్ హయాంలో లబ్ధిదారుల ఎంపికను ఎమ్మెల్యేలే చేసేవారని ఆరోపించారు. ఇదిలా ఉండగా, పటాన్ చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి వ్యాఖ్యలపై తాను నియమించిన ద్విసభ్య కమిటీ పరిశీలన చేస్తోందని, కమిటీ నివేదిక ఇచ్చిన తర్వాత చర్యలు ఉంటాయని వెల్లడించారు. కాగా, సీఎం రేవంత్ రాష్ట్రానికి రూ.1,78,950 కోట్ల పెట్టుబడులు తెచ్చినందుకు కేటీఆర్‌కు, ఇతర బీఆర్‌ఎస్ నాయకులకు కడుపు మంటగా ఉంటే ఈనో తాగాలని, ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయొద్దని భువనగిరి ఎంపీ చామల కిరణ్‌కుమార్‌రెడ్డి ఎద్దేవా చేశారు. బీఆర్‌ఎస్ పదేళ్ల కాలంలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని విమర్శించారు. కాగా, కేసీఆర్, కేటీఆర్ కడుపు మంట తగ్గాలని ఆకాంక్షిస్తూ కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరు వెంకట్ ఈనో ప్యాకెట్లను కొరియర్ చేశారు. కాగా, గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ నేతల ఘర్షణ నేపథ్యంలో కొత్తగూడెం జిల్లాకు చెందిన ఐదుగురు నాయకులకు షోకాజ్ నోటీసు జారీ అయింది. అలాగే, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి క్యాంపు కార్యాలయంపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలతో 42 మందిపై పోలీసులు కేసులు నమోదు చేశారు.

హౌసింగ్ బోర్డు వేలంలో గజం 1.85 లక్షలు

- ఉద్రిక్తతల మధ్య వేలం కొనసాగించిన అధికారులు
- ఉదయం కోర్టు స్టే.. మధ్యాహ్నం గ్రీన్ సిగ్నల్
- రోడ్ల వెంట స్థలాలకు యమా గిరాకి

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి హౌసింగ్‌బోర్డులో శుక్రవారం టీజీహెచ్‌బీ వెస్టర్న్ డివిజన్ పరిధిలో 23 స్థలాలకు వేలం వేయగా రోడ్ల వెంట 12 స్థలాలు హాట్ కేకుల్లా అమ్ముడుపోయాయి. మొత్తం 1696.62 గజాలను అమ్మగా రూ.25.63 కోట్లు వచ్చినట్లు తెలిసింది. ఒకింత ఉద్రిక్తత మధ్యే వేలం కొనసాగింది. వేలం ఆపాలని కేపీహెచ్‌బీ 15వ ఫేజ్ అసోసియేషన్ కోర్టును ఆశ్రయించడంతో ఉదయం 11.30 గంటలకు జరగాల్సిన వేలానికి బ్రేక్ పడింది. అయితే మధ్యాహ్నం 2 గంటల తర్వాత అదే కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో వేలం జరిగింది. జీవో నంబరు-6 ప్రకారం 100 గజాలలోపు ఉన్న స్థలాలు పక్క వారికే ఇవ్వాలని, వేలం వేయడానికి లేదని న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కాకపోతే ఇక్కడ లబ్ధిదారుడు అయితే వేలం ప్రక్రియ ఆగేదేమో కానీ అసోసియేషన్‌కు ఏం సంబంధం అంటూ కోర్టు కొట్టేసినట్లు తెలిసింది. కాగా వేలంలో 15వ ఫేజ్‌లోని రోడ్ల వెంట ఉన్న స్థలాలు హాట్ కేకుల్లా అమ్ముడు పోయాయి. అక్కడ గజం 1.25లక్షలుగా అధికారులు నిర్ణయించగా 33.33 గజాలు, 200 గజాల బిట్లకు.. గజం రూ.1.85లక్షల చొప్పున, 110 గజాలను గజం రూ.1.80లక్షల చొప్పున, 206.66 గజాలను రూ.1.70లక్షల చొప్పున, 66.66, 190 గజాలను రూ.1.55లక్షల చొప్పున, 160 గజాలను రూ.1.45లక్షల చొప్పున, 272.22 గజాలను రూ.1.35లక్షల చొప్పున సొంతం చేసుకున్నారు. ఐదో ఫేజ్‌లో.. 136.27 గజాలను రూ.1.45లక్షల చొప్పున వేలంలో దక్కించుకున్నారు. ఏడో ఫేజ్‌లో.. 146.66 గజాలను 1.20లక్షల చొప్పున, 78.82 గజాలను రూ.1.05లక్షల చొప్పున దక్కించుకున్నారు. తొమ్మిదో ఫేజ్‌లో 99గజాలను రూ.1.10లక్షల చొప్పున వేలంలో సొంతం చేసుకున్నారు. వేలంలో స్థలాలను దక్కించుకున్న వారు ఈనెల 27వ తేదీలోపు పాడుకున్న మొత్తంలో కనీసం 25శాతం హౌసింగ్‌బోర్డుకు చెల్లించాలని చెప్పారు. మిగతాది ఎప్పుడు అనేది కోర్టు నిర్ణయించిన తర్వాత చెబుతామని అధికారులు తెలిపారు.

కేపీహెచ్‌బీ ప్లాట్ల అమ్మకాలు ఖరారు చేయొద్దు

- లేఅవుట్‌లో చూపెట్టకుండా మిగిలిన పాట్లు అనడం తగదు
- ఇష్టానుసారం వ్యవహరిస్తామంటే చెల్లదు: హైకోర్టు

హైదరాబాద్, జనవరి 24 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ) కాలనీలోని వివిధ ఫేజ్‌ల్లో మిగిలిపోయిన 24 ఓపెన్ ప్లాట్ల వేలం బిడ్లను ఖరారు చేయరాదని రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ హౌసింగ్ బోర్డు, జీహెచ్‌ఎంసీ, ఇతర అధికారులకు హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. వేలాన్ని సవాలు చేస్తూ చివరి నిమిషంలో దాఖలైన వ్యాజ్యంపై విచారణ జరిపిన ధర్మాసనం ఈ ఉత్తర్వులు ఇచ్చింది. కేపీహెచ్‌బీలోని వివిధ ఫేజ్‌లలో విగిలిపోయిన ప్లాట్ల విక్రయానికి జారీ చేసిన నోటిఫికేషన్‌ను కొట్టివేయాలని కోరుతూ కేపీహెచ్‌బీ ఫేజ్ 15 వెంకటరమణ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పిటిషన్ దాఖలు చేసింది. పిటిషనర్ తరఫున న్యాయవాది ఎం.రూపేందర్ వాదిస్తూ.. ఇప్పటికే ఆమోదం పొందిన లేఅవుట్‌కు, 2011 నాటి జీవో 6కు విరుద్ధంగా ప్రభుత్వం ప్లాట్లను విక్రయించాలని చూస్తోందని ఆరోపించారు. ఇది లేఅవుట్ షరతులను ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం, ఇతర ప్రతివాదుల తరఫున అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి వాదిస్తూ వేలం నిర్వహణపై ఈనెల 9న నోటిఫికేషన్ జారీచేశామని, శుక్రవారం బహిరంగ వేలం షెడ్యూల్ ఉండగా చిట్టచివరి నిమిషంలో పిటిషన్ వేయడంలో దురుద్దేశం ఉందని ఆరోపించారు. కాలనీ అసోసియేషన్‌కు పిటిషన్ వేసే అర్హత లేదని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. తమకు సమర్పించిన సాంక్షన్డ్ లేఅవుట్‌లో 24 స్థలాలను ప్లాట్లుగా గుర్తించలేదని, నెంబర్ కేటాయించలేదని తెలిపింది. అలాంటప్పుడు ఆ జాగాలను మిగిలిపోయిన ప్లాట్లుగా ఎలా పేర్కొంటారని ప్రశ్నించింది. ప్రభుత్వమే ప్రైవేటు డెవలపర్ తరహాలో వ్యవహరిస్తామంటే కుదరదని తెలిపింది. ఆ ఓపెన్‌ప్లాట్లను స్థానిక సంస్థకు బదిలీ చేసినట్లు ఆధారాలు చూపించలేదని పేర్కొంది. అందువల్ల వాటి విక్రయాన్ని ఖరారు చేయకూడదని ఆదేశించింది. తదుపరి విచారణ 30కి వాయిదా పడింది.

డబ్బుల కోసం కిడ్నాప్ చేసి.. దొరికిపోతామని చంపేసి

పాన్‌మసాలా వ్యాపారి దారుణ హత్య

కూసుమంచి, జనవరి24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ నగరానికి చెందిన పాన్‌మసాలా బడావ్యాపారి బొల్లు రమేశ్(51) దారుణ హత్యకు గురయ్యారు. హైదరాబాద్‌లో ఆయనను కిడ్నాప్ చేసిన నలుగురు నిందితులు కారులో కూసుమంచి తీసుకొచ్చి హత్య చేశారు. డబ్బుల కోసం కిడ్నాప్ చేసిన నిందితులు.. రూ. 15 లక్షలిచ్చినా రమేశ్‌ని వదిలిపెట్టలేదు. ఖమ్మం-సూర్యాపేట జాతీయ రహదారిపై కూసుమంచి మండలం లింగారంతండా సమీపంలో రహదారి పక్కన మిర్చితోటలో ఈ ఘటన జరిగింది. హత్య ఈనెల 19వ తేదీ తెల్లవారుజామునే జరిగింది. శుక్రవారం ఉదయం దుర్వాసన వస్తుండటంతో స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్‌లోని కార్ఖానా పోలీసులు మృతుడి ఫోన్ సిగ్నల్స్ ఆధారంగా కూసుమంచి చేరుకున్నారు. మృతదేహం రమేశ్‌దిగా గుర్తించారు. కార్ఖానా పోలీస్ ఇన్‌స్పెక్టర్ కథనం ప్రకారం.. హైదరాబాద్‌లోని బండ్లగూడకు చెందిన బొల్లు రమేశ్ తెలుగు రాష్ట్రాల్లో పాన్‌మసాలా వ్యాపారం చేస్తున్నారు. ఆయన సబ్‌డీలర్లకు సరుకు విక్రయిస్తుంటారు. కార్ఖానాలో సబ్ డీలర్‌గా ఉన్న సాజిద్.. రమేశ్ వద్ద భారీగా డబ్బులున్నట్లు గుర్తించాడు. రమేశ్‌ను కిడ్నాప్ చేసి డబ్బు గుంజాలని పథకం పన్నాడు. అదే ప్రాంతానికి చెందిన మరో ముగ్గురిని రమేశ్ వద్దకు తీసుకుని వెళ్లాడు. వాళ్లకు కూడా గుట్కాలు కావాలని నమ్మబలికాడు. అనంతరం.. రమేశ్‌ను కారులో ఎక్కించుకుని కాళ్లు చేతులు కట్టేశారు. డబ్బులివ్వాలని, లేదంటే చంపేస్తామని బెదిరించారు. దీంతో రమేశ్.. రూ. 15లక్షలను వారి అకౌంట్‌లోకి బదిలీ చేశారు. రమేశ్‌ను వదిలేస్తే తమ గురించి పోలీసులకు సమాచారం ఇస్తాడని భావించి అతడిని చంపేయాలని నిందితులు నిర్ణయించుకున్నారు. కారును హైదరాబాద్ నుంచి ఖమ్మం వైపు తీసుకొచ్చారు. ఖమ్మం జిల్లా కూసుమంచి మండలం లింగారంతండా సమీపంలో జాతీయ రహదారి పక్కనే మిర్చితోటలోకి తీసుకెళ్లారు. ఊపిరి ఆడకుండా తాళ్లతో, కండువాతో గట్టిగా గొంతునులిమి చంపేశారు. బండరాయితో మోదారు. చనిపోయాడని నిర్ధారించుకుని వెళ్లారు.


బొల్లు రమేశ్(ఫైల్)

ఈ నెల 19వ తేదీనే మిస్సింగ్ కేసు

బొల్లు రమేశ్ ఈ నెల 18వ తేదీన ఇంట్లోనుంచి వెళ్లి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చిన అతడి భార్య జనని ఫిర్యాదు చేయడంతో కార్ఖానా పోలీసులు మిస్సింగ్ కేసునమోదు చేశారు. ఈక్రమంలో అతడి ఫోన్ సిగ్నల్స్‌ను ట్రాక్ చేశారు. అనుమానితుడుగా ఉన్న సాజిద్‌ను గుర్తించి తమదైన శైలిలో విచారించారు. మరో ముగ్గురితో కలిసి హత్య చేసినట్లు సాజిద్ ఒప్పుకున్నాడని పోలీసులు తెలిపారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు. రమేశ్‌ను చంపేసి సుమారు ఆరు రోజులు కావడంతో మృతదేహం కుళ్లిపోయి దుర్వాసన వస్తోంది. ఈక్రమంలో మృతదేహం తరలించేందుకు ఇబ్బందిగా ఉండటంతో వైద్యులను ఇక్కడికే తీసుకవచ్చి పోస్టుమార్టం నిర్వహించారు. కుటుంబసభ్యుల అభ్యర్థన మేరకు ఖమ్మానికి చెందిన అన్నం శ్రీనివాసరావు ద్వారా ఇక్కడే అంత్యక్రియలు నిర్వహించారు.

పార్ట్‌టైం చేస్తే ఇంటికే!

(మొదటిపేజీ తరువాయి)

వెళ్తున్నారు? ఏం చేస్తున్నారన్న దానిపై మూడు రోజులపాటు నిఘా పెట్టి మరీ పట్టుకున్నారు. అనంతరం వారి సెవిస్ (విద్యార్థికి అమెరికాలో ఇచ్చే గుర్తింపు సంఖ్య)ను రద్దు చేశారు. ఆపై ఫిబ్రవరి 15లోగా దేశం విడిచి వెళ్లాలని ఆదేశించారు. దీంతో ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లి.. ఖర్చుల కోసం పార్ట్ టైం జాబ్ చేస్తున్న ఈ విద్యార్థుల పరిస్థితి అగమ్య గోచరంగా తయారైంది.

మిషిగన్‌లో మాత్రమే కాకుండా అమెరికా వ్యాప్తంగా ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. అక్కడ పార్ట్ టైం ఉద్యోగాలు చేసే విద్యార్థులందరిలోనూ ఆందోళన మొదలైంది. అంతేకాదు.. వీరితో పని చేయించుకుంటున్న భారత్‌కు చెందిన వ్యాపారవేత్తల పరిస్థితి కూడా ఇబ్బందికరంగా మారింది. అమెరికా అధ్యక్షుడిగా డొనాల్డ్ ట్రంప్ తిరిగి ఎన్నికయ్యాక తీసుకుంటున్న నిర్ణయాలే ఇందుకు కారణం. ట్రంప్ బాధ్యతలు చేపట్టగానే అక్రమ వలసదారులపై కఠినంగా వ్యవహరించాలని నిర్ణయించారు. ఇది.. అమెరికాలో అధిక సంఖ్యలో ఉన్న భారతీయుల్లో, తెలుగు రాష్ట్రాలకు చెందిన వారిలో గుబులు రేపుతోంది. ముఖ్యంగా ఉన్నత చదువుల కోసం ఎఫ్-1 వీసాపై అక్కడ ఉంటూ నిబంధనలకు విరుద్ధంగా పార్ట్ టైం ఉద్యోగాలు చేసుకుంటున్న వారు, మాస్టర్స్ పూర్తయి ఓపీటీ సమయంలో ఉన్న వారి పరిస్థితి ఎటూ తోచకుండా ఉంది.

ఎఫ్-1 వీసాదారుల్లో గుబులు..

ఉన్నత చదువుల కోసం తమ దేశానికి వచ్చేవారికి అమెరికా ప్రతి ఏటా దాదాపు 2లక్షల ఎఫ్-1 వీసాలు జారీ చేస్తుంది. ఇందులో దాదాపు 40 శాతం భారతీయులకే కేటాయిస్తోంది. 2024లోనూ అమెరికా దాదాపు 84 వేల మంది భారతీయులకు



ఎఫ్-1 వీసాలు జారీ చేసింది. ఇందులో తెలుగు రాష్ట్రాలకు చెందినవారి సంఖ్య దాదాపు 25 వేల వరకు ఉంటుంది. ఇలా ప్రతి ఏటా ఇక్కడి నుంచి 25-30 వేల మంది తెలుగువారు ఉన్నత చదువుల పేరుతో అగ్రరాజ్యానికి వెళ్తున్నారు. అయితే చాలా మంది విద్యార్థులు ఫుల్ టైం చదువుల పేరుతో వీసాలు దక్కించుకుని.. విద్యను పక్కనబెట్టి అక్కడ పార్ట్ టైం ఉద్యోగాలు చేస్తున్నారు. ఇలా ఎఫ్-1 వీసాపై వచ్చి పార్ట్ టైం ఉద్యోగం చేయడం కూడా అమెరికా చట్టాల ప్రకారం నేరమే. దీంతో తాజాగా ఇలాంటి ఉద్యోగాలపై అక్కడి అధికారులు దృష్టి సారించారు. వీరిని గుర్తించేందుకు అధికారులు తనిఖీలు నిర్వహిస్తారన్న వార్తలతో పార్ట్‌టైం, ఫుల్ టైం ఉద్యోగాలు చేస్తున్న ఎఫ్-1 వీసాదారుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. అక్కడి రెస్టారెంట్లు, సూపర్ మార్కెట్లు, పెట్రోల్ బంకుల్లో పనిచేసే వారంతా గత వారం రోజులుగా విధులకు డుమ్మా కొడుతున్నారు.

ఉద్యోగం చేస్తూ పట్టుబడితే ఇంటికే..

ఉన్నత చదువు కోసం అమెరికా వెళ్లిన ప్రతి ఒక్కరూ అక్కడ ఏదో ఒక ఉద్యోగం చేయడం సాధారణంగా మారింది. కానీ, ప్రస్తుత పరిస్థితుల్లో విద్యార్థులు పార్ట్ టైం, ఫుల్ టైం ఉద్యోగాలు చేస్తూ తనిఖీల్లో పట్టుబడితే తమ చదువును మధ్యలోనే ఆపేసి స్వదేశానికి వెళ్లిపోవాల్సి ఉంటుంది. ఇలాంటి వారికి ఇక భవిష్యత్తులోనూ అమెరికా వచ్చే అవకాశాలు సన్నగిల్లుతాయి. దీంతో ఈ భయం ఎఫ్-1 వీసాదారుల్లో ఎక్కువగా నెలకొంది. అలాగే అమెరికాలో ఉన్నత చదువులు పూర్తయ్యాక.. ఆప్షనల్ ప్రాక్టికల్ ట్రైనింగ్ (ఓపీటీ)కు అవకాశం ఇస్తారు. ఇది కోర్సులను బట్టి 12-36 నెలల వరకు ఉంటుంది. ఆ తర్వాత అక్కడ ఉద్యోగాలు చేసేందుకు హెచ్-1బీకి అర్హత లభిస్తుంది. ఓపీటీ గడువు పూర్తయ్యాక ఐ-140 వీసా జారీ చేస్తారు. ఇది వస్తే గ్రీన్ కార్డ్ వచ్చేందుకు మార్గం సుగమం అవుతుంది. ఇలా.. ఓపీటీలో అక్కడ తెలుగు రాష్ట్రాలకు చెందినవారు దాదాపు 2లక్షల మందికిపైగా ఉంటారని అంచనా. కానీ, ప్రస్తుత పరిణామాల నేపథ్యంలో గ్రీన్ కార్డ్ రావడం అసాధ్యంగా కనిపిస్తోంది. దీనికోసమే అక్కడ ఓపీటీ చేస్తున్న వేలాది మంది విద్యార్థుల్లో తాజా పరిణామాలు నిరాశకు గురి చేస్తున్నాయి.

భారతీయ వ్యాపారులపైనా ప్రభావం..

ట్రంప్ సర్కారు నిర్ణయం.. ఇటు విద్యార్థులతో పాటు అక్కడ వ్యాపారాలు చేసుకుంటున్న భారతీయుల పైనా తీవ్ర ప్రభావం చూపనుంది. ఇక్కడి నుంచి వెళ్లే విద్యార్థులు తమ ఖర్చుల కోసం ఏదో ఒక పనిని తక్కువ వేతనానికే చేసేందుకు సిద్ధంగా ఉంటారు. పైగా ఎన్ని గంటలైనా అభ్యంతరం చెప్పకుండా పనిచేస్తారు. దీంతో అక్కడ వ్యాపారం చేసుకునే భారతీయులు ఎక్కువగా వీరినే తమ పనిలో పెట్టుకుంటుంటారు. కానీ, పని చేస్తూ పట్టుబడితే మొదటికే మోసం జరిగే ప్రమాదం నెలకొనడంతో వ్యాపారులు కూడా ఆ విద్యార్థులను పనిలోకి పిలవడంలేదు. ఫలితంగా అమెరికాలో భారతీయ వ్యాపారాలు కూడా దెబ్బతినవచ్చన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఇప్పుడు అమెరికా-ఇండియా ఒక్కటే

- అశోక్‌బాబు కొల్ల, మాజీ కోశాధికారి, తానా

ఎన్నో ఆశలతో అమెరికాలో అడుగుపెట్టిన వారికి తాజా పరిణామాలు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. అనేక మంది నిపుణులు ఇక్కడికి వచ్చి అమెరికా ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేస్తున్నారు. కానీ, ట్రంప్ ప్రభుత్వం తీరుతో భవిష్యత్తుపై అనిశ్చితి నెలకొంది. జన్మతః పౌరసత్వం రద్దుతో ఇప్పటికే అనేక మంది తీవ్ర నిరాశలో ఉన్నారు. ఇప్పుడు అమెరికాలో ఉన్నా, భారత్‌లో ఉన్నా ఒకటే అనిపిస్తోంది. అనేక మంది స్వదేశానికి తిరిగి వచ్చేస్తారు. భారత్‌లోనూ అవకాశాలు పెరిగినందున స్వదేశంలో ఉండేందుకే ప్రాధాన్యం ఇస్తారు. భారత్‌కు సంబంధించి ఇది మంచి పరిణామమే.

పౌరసత్వం మరింత కష్టం

- తోటకూర ప్రసాద్, అధ్యక్షుడు, ఇండియన్ అమెరికన్ ఫ్రెండ్‌షిప్ కౌన్సిల్

అమెరికా వెళ్లిన ప్రతి ఒక్కరూ గ్రీన్‌కార్డు కోసం కలలు కంటారు. ఉన్నత చదువులు చదివి, ఓపీటీ పూర్తి చేసి, హెచ్-1బీ, ఐ-140 వీసాల తర్వాత దశాబ్దాలుగా అమెరికాలో ఉన్నా గ్రీన్ కార్డు ఇవ్వడం కష్టంగా ఉంది. ఇక తాజా పరిణామాలతో ఇప్పుడు అమెరికా పౌరసత్వం దాదాపు అసాధ్యం. అయితే అక్రమ వలసదారులు, గడువు పూర్తయినా ఉంటున్నవారి సంఖ్య అమెరికాల్లో కోటిన్నర వరకు ఉంటుందని అంచనా. కానీ, వీరంతా ఆర్థిక వ్యవస్థలో కీలకమైనందున.. అందరినీ ఒకేసారి దేశం నుంచి పంపించేయడం అసాధ్యం. అందుకే దీని గురించి పెద్దగా ఆందోళన చెందాల్సిన అవసరంలేదు.

అమెరికా ఆర్థిక వ్యవస్థకే నష్టం

- గన్నె వెంకటరమణ, తానా ప్రతినిధి

అమెరికా ఆర్థిక వ్యవస్థలో విదేశీ మానవ వనరుల పాత్ర అత్యంత కీలకం. అక్కడ ఐటీ, ఆరోగ్యం, విద్య.. ఇలా ఏ రంగంలో తీసుకున్నా భారతీయుల పాత్ర కీలకం. కానీ, తాజాగా ట్రంప్ ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు తీవ్ర నిరుత్సాహానికి గురి చేస్తున్నాయి. ఇవి అమల్లోకి వస్తే ఎక్కువ నష్టం అమెరికాకే జరుగుతుంది.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: N.Rahul Kumar. Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, Managing Director : Vemuri Radha Krishna Founder: K.L.N.Prasad.